

కీ. శే. శ్రీ గొబ్బూరు వేంకటానంద రాఘవరావు

# జ్యోతిర్వేదం

గొబ్బూరి వెంకటానంద రాఘవరావు

# ముందు మాట

బోధన, పరిశోధన, ప్రచురణ అనే త్రివేణి సంగమం లక్ష్యంగా తెలుగు భాషా సాహిత్యాలు, చరిత్ర, కళ, సంస్కృతి మొదలైన రంగాలలో కృషి సల్పడానికి 11 సంవత్సరాలు క్రితం ఆవిర్భవించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గణనీయమైన ప్రగతిని సాధిస్తోంది. అంతకు పూర్వం ఉన్న పలు అకాడమీలు, తెలుగు భాషాసమితి, అంతర్జాతీయ తెలుగు సంస్థ విశ్వవిద్యాలయంలో విలీనం కావడంతో పైన పేర్కొన్న లక్ష్యాలతో పాటు మరిన్ని బాధ్యతలు విశ్వవిద్యాలయానికి సంక్రమించాయి. బహుముఖీన కార్యక్రమాలతో విశ్వవిద్యాలయం తన ఆశయం, ఆదర్శాల సిద్ధి కోసం నిర్విరామ కృషి చేస్తున్నది.

పైన పేర్కొన్న అన్ని రంగాలలోను కొత్త పుస్తకాల ప్రచురణలతో పాటు అలభ్య, అముద్రిత గ్రంథాల ప్రచురణను కూడా విశ్వవిద్యాలయం చేపట్టి ఇప్పటికి ఎన్నో ప్రముఖ గ్రంథాలను ప్రచురించింది. వాటికి పాఠకలోకం మంచి ఆదరం కూడా లభించింది. 'వ్యాఖ్యాస్రవంతి' శీర్షికన సుప్రసిద్ధ పండితులచే క్లిష్టమైన ప్రాచీన కావ్య ప్రబంధాలకు వ్యాఖ్యానాలు రాయించి ప్రకటించే ప్రణాళిక కూడా కొనసాగుతున్నది. ఇప్పటివరకు ఈ ప్రణాళికలో కుమారసంభవం, కాశీఖండం, శివరాత్రి మహాత్మ్యం కావ్యాలను వ్యాఖ్యాసహితంగా ప్రచురించడం జరిగింది. ఇవి సాహితీప్రియులకెంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

తెలుగులో 'విజ్ఞాన సర్వస్వ' సంపుటాలను తయారు చేయించి కొత్తగా వెలువరించడం జరిగింది. ఆ వరుసలో 'విశ్వసాహితి'ని, ఆంగ్లంలో 'హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఆంధ్రాస్' అనే పేరుతో ఒక సంపుటాన్ని ప్రచురించడమైంది. భాషాభివృద్ధి కృషిలో భాగంగా 'తెలుగు భాషాచరిత్ర', 'ద్రావిడ భాషలు' గ్రంథాలను పునర్ముద్రించడమైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వారి సహకారంతో డా॥ బి.ఆర్. అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు 10 సంపుటాలుగా ప్రచురించడం జరిగింది.

శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావు వేదాలను కేవలం సాహిత్య సౌందర్య దృష్టితో కాకుండా శాస్త్రజ్ఞానం దృష్టితో అధ్యయనం చేశారు. 'వేదవిజ్ఞానంలో సైన్స్‌కి సంబంధించిన అంశాలను తీసుకొని ఆంగ్లంలోను, తెలుగులోను ఎన్నో గ్రంథాలను రాశారు. 'జ్యోతిర్వేదం' గ్రంథం లోగడ అచ్చయింది. కానీ నేడిది అలభ్యం. జ్యోతిష్య రంగంలో అధ్యయనం చేసే విద్యార్థులకి, పండితులకి ఈ గ్రంథం చాలా ఉపయోగకరం.

శ్రీ రాఘవరావుగారు రచించిన 'స్క్రిప్చర్ ఆఫ్ ది హెవెన్స్' ఆంగ్ల గ్రంథాన్ని కూడా విశ్వవిద్యాలయం ప్రచురించింది.

ఈ రెండు గ్రంథాలను అందించిన శ్రీమతి సి.హెచ్. స్వరాజ్యలక్ష్మిగారికి కృతజ్ఞతలు.

నాయని కృష్ణకుమారి
ఉపాధ్యక్షులు
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదు
తేది : 31-1-1997.

శ్రీ

# జ్యోతిర్వేదము

## మొదటి ప్రకరణము

**ఈ భూమి యేనాటిది ?**

మన మందరమును ఈ భూగోళము మీదనే పుట్టి పెరిగి పెద్ద వారమై కాలక్షేపము చేయుచున్నాము. ఈ భూమిపైనే నిలిచి ఊర్ధ్వ దృష్టికలవారమై ఖగోళమును పరిశీలింతము.

మన సమస్తమునకు నాధార భూతమైన యీ భూగోళ మేనాటిది? ఇది యేర్పడి యెంతకాలమైనది? దీనిపై నైదు మహా సముద్రములును, ఐదు ఖండములును ఎప్పుడేర్పడినవి? క్రిమి, కీటక, పశు, పక్షి, వృక్షాదులైన జీవకోటి ఎప్పటినుండి యీభూమి నాశ్ర యించుకొని యున్నవి? మనుష్యజాతి యెప్పటినుండి యీ భూమిపై నివసించుచున్నది? అసలు, ఈభూమి ఎంతకలదు? దీని పరిణామ మెంత? ఈ ప్రశ్నలకు సదుత్తరములు బడసి పిమ్మట జ్యోతిర్గోళ పరిశీలనమున కుపక్రమించుట మిక్కిలి ప్రయోజనకరము. విశ్వ పరి ణామ కథనములో మన ప్రపంచోత్పత్తియొక్క విధానము మిక్కిలి ఆకర్షణీయమైన విషయము. సమస్తమైన దేశములవారికిని, వివిధ తత్త్వవేత్తలకును, వైజ్ఞానిక పరిశోధకులకునుకూడ ఈ జిజ్ఞాస బహు ముఖ్యమైనది. వీరందరును ప్రత్యక్షముగానో పరోక్షముగానో ఈ ప్రశ్నలకన్నిటికి నుత్తరములుచెప్పి సమస్యలను సాధింప యత్నించిన వారే. ఒకరిమాట ఒకరికి నచ్చదు.

ఇప్పటి ప్రపంచ మతములన్నిటిలో క్రైస్తవ మతావలంబకులే బలవంతులు, ప్రతిభావంతులు, అధికారవంతులు, ఐశ్వర్యవంతులునై,

మాట చెల్లుబడికలిగి, తక్కిన మతస్థులను వెనుక నుంచుచున్నారు. క్రైస్తవులకు బైబిల్ (Bible) గ్రంథము పరమప్రమాణము. అందుగల జెనిసిస్ (genesis) అను మొదటి అధ్యాయము ఒక విధముగా సృష్టి క్రమమును తెలుపుచున్నది. భగవంతుడు తొలిరోజున భూమ్యాకాశము లను సృజించి తేజోంధకార విభజన చేసెననియు, మలిరోజున, భూమి మీద జలస్థల నిర్ణయము గావించెననియు, మూడవనాడు తృణౌషధు లను, బీజవ్యాప్తిచే వృద్ధినొందు వృక్షజాతులను సృజించెననియు, నాలు గవనాడు సూర్యచంద్ర నక్షత్రాదులను సృష్టిచేసెననియు, ఐదవనాడు తిమి తిమింగిల మీనజాతు లగు జలచరములను, క్రిమి, కీటక, సరీసృప, పశు, పక్ష్యాది భూచర ప్రాణికోట్ల నుత్పత్తి చేసెననియు, ఆరవనాడు దేవుడు తన ప్రతిభా స్వరూపములతో ఆదిమదంపతులైన ఏడమ్ (Adam) ప్రజాపతిని, అతనిభార్య ఈవ్ (Eve) ను జన్మింపజేసి, తొలి సృష్టిక్రమమును ముగించెననియు, ఇట్లా యారుదినములు కష్టపడి పని చేసినపిమ్మట 'సబ్బాతి' అనెడి సప్తమ దివసమున దైవరాయడు పూర్తిగా విశ్రాంతి గైకొనెననియు బైబిల్ నుడువుచున్నది. క్రైస్తవ మతప్రకారము సృష్టిక్రమమిది.

ఈ ప్రథమ మిథునము హాయిగా నివసించి జీవించుటకు సదు పాయముగా దేవుడు 'ఈడెన్' తోట తయారుచేసి ఇచ్చెను. ఆ తోటలో ఒకానొక చెట్టుపండు మాత్రము తినకూడదని మాత్రము ఆ యాలు మగలను శాసించి మరేమియు లోటురాకుండ వారికి దేవుడు సమస్త సదుపాయముల నమర్చిపెట్టెను. నిషిద్ధఫలముల నారగించి దైవశాసన ముల్లఘించినందుకు విశ్వప్రభు డా పెనిమిటి భార్యలను ఆ దివ్యా రామమునుండి వెడల నడిచెను. అర్చిబిషప్ ఉషర్ (Archbishop Usher) గారను క్రైస్తవమతాచార్యుని లెక్కప్రకారము ఈ దంప తులు ఈ తోటనుండి క్రీస్తు పూర్వము నాలుగువేల సంవత్సరముల క్రిందట గెంటివేయబడిరి. ఏసుక్రీస్తు అనంతరము ఇప్పటికి 1900

సంవత్సరముల క్రిందట ఏడమ్ దంపతులు ఈడెన్ తోటనుండి తొలగి పోయిరి. ఏబది సంవత్సరముల ప్రాయమపుడు దేవుడు వారలను తోట నుండి తరిమివై చెనముకొన్నను, ఈ సృష్టియై యిప్పటికి సుమారు ఆరువేల సంవత్సరములు మాత్రమయినది. బైబిల్ ప్రమాణము ననుస రించి భూగోళముయొక్క వయస్సు ఇప్పటికి ఆరు-ఏడువేల సంవత్స రములకు మించదు.

నవీన వైజ్ఞానికులు ఈ భూమివయస్సు ఇంత స్వల్పమనెడి బైబిల్ ప్రమాణము నెంతమాత్రమును అంగీకరించుటలేదు. జంతుశాస్త్ర భూ తత్త్వశాస్త్ర విషయములలో విశేషపరిశీలనము జరుగని దినములలో శాస్త్రజ్ఞులు భూమియేర్పడి కొన్నిలక్షల సంవత్సరములై యుండునను కొనిరి. ఆ విషయమైన పరిశీలన తీవ్రమై సాక్ష్యములు బలమైనకొలది భూమిపుట్టి - లక్షలు కాదు- కోట్లకొలది సంవత్సరములైనవని శాస్త్ర వేత్తలు నిర్ధారణచేసిరి. ధాతుశాస్త్ర, భౌతికశాస్త్ర, జ్యోతిశ్శాస్త్ర సంబంధమగు విజ్ఞానము విస్తరించినకొలది భూమి ఏర్పడి ఇప్పటికి - పదికోట్లు కాదు- పాతికకోట్లు కాదు- వందకోట్లును కాదు- రెండు వందలకోట్ల సంవత్సరములై యుండునని 'సర్ జేమ్స్ జీన్స్' (**Sir James Jeans**) అను వైజ్ఞానికోత్తముడు* అంచనా వేసియున్నాడు. మనము ఈ ప్రకరణారంభమున వేసికొనిన కొన్ని ప్రశ్నల కా మహా శయుడిచ్చిన యుత్తరము ఈ దిగువపట్టికలో స్పష్టముగా చూడగలము. మిగిలిన ప్రశ్నలకు కూడ క్రమముగా సదుత్తరములు ఈ గ్రంథమున తెలిసికొనగలము. జీన్సు దొరగారి అంచనాప్రకారము :—

* ఈ జీన్స్ దొరగారు 1938 సంవత్సరములో మన భరతఖండమున జరిగిన వైజ్ఞానిక రజతోత్సవ సభకు అధ్యక్షుడయ్యెను. ఈ నవీనయుగములో ముఖ్యులని గణింపదగిన మహాపురుషు లారుగురిలో ఈత డొకడని ప్రఖ్యాతిజెందినవాడు. జన సామాన్యమునకు బోధపడు సులభశైలిని పెక్కు వైజ్ఞానిక గ్రంథములు రచించినాడు. తే 16-9-1946 న దివంగతుడైనాడు.

1. భూమివయస్సు ఇప్పటికి ఉరమరగా రెండువందలకోట్ల సంవత్సరములు.

2. భూమిమీద ప్రాణికోటులేర్పడి ఇప్పటికి ఉరమరగా ముప్పది కోట్ల సంవత్సరములైనది.

3. భూమిమీద మనుష్యజాతి ఏర్పడి ఇప్పటికి ఉరమరగా మూడులక్షల సంవత్సరములైనది.

ఈ సందర్భములో మనము ముఖ్యముగా గమనించి తెలిసికోవలసిన విషయములు మూడుగలవు. ఈనాటి వైజ్ఞానికులు బైబిల్ ప్రారంభమునందున్న సృష్టికథను, సృష్టి క్రమమును, ఏమాత్రము నంగీకరింపజాలకున్నారు. మనమిపుడు చూచుచున్న విశాల విశ్వము క్రమ పరిణామ ఫలితము (**gradual evolution**); అంతేకాని ఒక ఆరురోజులలో నాకస్మికముగా నేర్పడజాలదు; ఏర్పడలేదనుట మొదటి ముఖ్యాంశము. రెండవది, సృష్టిక్రమములో తొలినాడు భూమ్యాకాశములును, రెండవనాడు జలస్థలములును, నాల్గవనాడు సూర్య, చంద్ర, నక్షత్రములును ఈ వరుసను ఉత్పత్తి కాబడెననుటకూడ నేటి వైజ్ఞానికులు అంగీకరింపరు. భూమి యేర్పడిన నాలుగవనాడు సూర్య, చంద్ర, నక్షత్రము లేర్పడెననుట శాస్త్రరీత్యా అసాధ్యము, అసంభవము, అసందర్భమునై యున్నది. పరిణామక్రమ కాలము బహుకోట్ల సంవత్సరములలో లెక్కింపవలసినది కాని ఆరురోజులలో పూర్తి యగునదికాదు.

మూడవది ఈ భూమివయస్సు ఉరమరగా రెండువందలకోట్ల సంవత్సరములని జీన్స్ దొరగారు అంచనా వేసినారు. మన భరతఖండములో పంచాంగకర్తలు భూగోళ విషయములలో "సృష్ట్యాదిగత సౌరాబ్దాః" నేటికి 195,58,85,048 నూటతొంబది యైదుకోట్ల ఏబది యెనిమిదిలక్షల ఎనుబదియైదువేల నలుబది యెనిమిది సంవత్సరములైనట్లు సౌరమానముచే స్థిరపరచి వ్రాయుచున్నారు. ఇది ఉరమర

లెక్క కాదు. పై మెట్టు సదునుచేయుటకు అంకెలను విడిచి, సున్నలు చుట్టి తేల్చిన (rough and round figure) గుండ్రవపు లెక్క కూడ కాదు. ఈ యంకె ఎట్లు తేలినదో వివరించి చెప్పుటకు చక్కని ఉపపత్తు లున్నవి. వానిని చర్చించుటకిది యదనుకాదు. సావకాశమునుబట్టి ముందునుంచి ఆ ప్రస్తావన మొనర్పగలము. మన పంచాంగకర్త లిచ్చిన భూమి వయస్సును నత్యప్రియులైన నవీన పాశ్చాత్య వైజ్ఞానికులు పూర్తిగా నామోదించి ధ్రువపరుచుచున్నారని మనము బాగుగా గమనించి మనస్సులో నిడుకొని మరువకుండినచో నిప్పటి చర్చకు చాలును.

## వే వెలుగు ; రే వెలుగు :

భూమిమీద మనుష్యజాతి యేర్పడి అధమపక్షము మూడులక్షల సంవత్సరములైన నైయుండునని జీన్స్ దొరగారి అభిప్రాయము. మానవుడంతకంటె చాల ప్రాచీనుడని మనపూర్వ గ్రంథములు తెలుపుచున్నవి. మూడులక్షల సంవత్సరములు మాత్రము తక్కువకాలమా? కాదు. వాదము నిమిత్తము మానవోత్పత్తియై మూడులక్షల సంవత్సరములే యైనదని ఊహింతము. మానవులు భూమిమీద నివసించుటాదిగా విశ్వములో స్వతస్సిద్ధమైన వెలుగులు-నరులు వెలిగించనివి, నరులార్పజాలనివి, బహువిధజ్యోతులు, బహుసంఖ్యాకము లున్నవి. పగటివేళ ప్రకాశించు పెద్దవెలుగు సూర్యుడు. రాత్రులు వెలుగునట్లు తోచు చిన్న వెలుగు చంద్రుడు. అంతకు చిన్నవైనట్లు సూదిబొట్లవలె కనబడుచు ముత్యములవలె మిలమిల లాడుచు, వజ్రపు కోడులవలె జిగజిగ మెఱయుచు నేత్రోత్సవముచేయు కాంతి పుంజములను నక్షత్రములనియు వ్యవహరించు చుందుము.

## మింటిరత్నములు (Gems of the Sky) :

పడమట సూర్యుడస్తమించగానే వినీల విశాల చక్రమువలె మింటతోచు నాకాశరంగమున తెరచాటునుండి బయల్పడుచున్నట్లు

నక్షత్రము లొకటొకటిగా కంటికి కానవచ్చుచుండును. చీకటి యలుము కొనుకొలది చుక్కల తేజస్సు వృద్ధియగుచుండును. కొన్ని చుక్కలు ముత్యముల లావణ్యముతో మిణుకు మిణుకు మనుచుండును; కొన్ని వజ్రపుపొడుల తళుకు బెళుకులతో మెఱయును. కొన్ని పగడముల యరుణకాంతులతో తేజరిల్లును. ఇంకను కొన్ని నక్షత్రములు మండుచున్న మెగ్నిసియమ్ తీగ విధమున దేదీప్యమానములగుచు నద్భుత మొదవించుచుండును. ఊసర వెల్లులట్లు రంగులుమార్చుచు ప్రకాశించు చుక్కలుగూడ కొన్ని గలవు. విశాలాకాశమను చాందినీలో పొదిగిన నవరత్నముల విధమున నానావిధ వర్ణములతో నభోరంగమున తేజరిల్లు నక్షత్రకాంతులను తలయెత్తి గమనించువారి కెవరికైనను ఆనందాశ్చర్యములు కలుగక మానవు. ప్రతిరాత్రి మనశిరస్సులపై నవి మెఱయుచు "మమ్ముల నొకసారి చూడుడు" అని యవి మనల నాహ్వానించుచునే యున్నవి. కార్లైల్ (Carlyle) అను నాంగ్లతత్త్వవేత్త ఈ చుక్కలనుగూర్చి యేమనెనో వింటిరా ? "అయ్యయ్యో ! నాశిరస్సుపై నిరంతరము మెఱయుచున్న యీ నక్షత్రములేవి యేవో నాకు సరిగా తెలియకున్నవి ! ఈనక్షత్రము ఫలానా అని నాకెవరైన తెలియచెప్పిన పక్షమున నెంత బాగుండును ? నక్షత్రములతో నిట్టి పరిచయభాగ్యము నాకు లభించిన పక్షమున నాకు తారామండల మధ్యాన్నముగాక స్వగృహమువలె నెంతో రమణీయమై తోచును గదా ?" అని వగచుచుండెడివాడు.

## ఖగోళ విశిష్టత :

వర్షాకాలమున వరదపొడిచి ఏళ్ళు గెడ్డలు నేకమై ప్రవహించు నప్పటి దృశ్యము సాధారణముగా మానవుల కాశ్చర్యము గొలుపును. అంతకంటె నాశ్చర్యకరమైనది అఖండ గౌతమీ ప్రవాహము. పదివేల యడుగుల పైబడిన వెడల్పుగలిగి బలవేగములతో నిండుగా ప్రవ

హించు తల్లి గోదావరిని సందర్శించినపుడు మన మనస్సు లెంతటి యానందాశ్చర్యములతో పొంగిపోవునో మన కందరకును తెలిసిన విషయము. అంతకంటె నాశ్చర్యకరమైనది సముద్ర సందర్శనము. అవతలి యొడ్డుకనపడక, కనుచూపుమేర పుట్టుచు, పెరుగుచు, వెలినురుగుల మందహాసముతో కెరటములు నృత్యము చేయుచుండగా, వినీలమై, విశాలమై, గంభీరమై వ్యాపించు నపార పారావారము చూపరులకు కలిగించు నాశ్చర్యమునకుకూడ మేఱలేదు. అంతకంటెను ఆనందాశ్చర్యముల గొలుపుచు దర్శకుల మనములలో భయభక్తులంగూడ ప్రేరేపించునది బహువిధ నక్షత్ర విరాజమానమైన విశాల నభోరంగము.

ఇందు గోచరించు చుక్కల మెఱవడి విచిత్రము. తారలును, తారాగణములును శ్రేణులుగట్టి తూర్పున నుదయమగుచు, క్రమము తప్పక, నభోవీథిమీదుగా, పడమటికి వెడలుచున్న ట్లగపడును. ఈ ఖగోళ సంచారులేవియు చుట్టుప్రక్కల చుక్కలమధ్య తమతమ నిర్ణీతస్థానముల నెన్నడును వీడి నిర్గమింపవు. ఒక క్షణాంశమైన నాగి నిలువవు. వాని గమన విధానములలో తొందరలు నడావిడులు నగపడవు. నిరంతర గమనశీలమైన నీ దివ్యవ్యూహమునందు అంతయు నిశ్శబ్దముగా జరుగుచున్నట్లు తోచును. ఈ నిత్యోత్సవము, నీ నిత్యకల్యాణము, నీ నిత్యమంగళము చూడజూడ 'మహనీయ వైభవోపేతుడై పరమేశ్వరుడు సపరివారముగా ప్రకృతి వెలుగులతోను, దివ్యులుగాల్చు బాణసంచాలతోను వెడలి జరిపించుకొను నూరేగింపుటుత్సవమా' అనిపించును. ఈ మహత్తమ దృశ్యమును చూచి చూచి, ఆనందాశ్చర్యావేశ వివశులై ప్రాచీనకవు లెందరెందరో అద్భుత కవనములతో గాథలల్లిరి; గాయకు లెలుగెత్తి దివ్యగీతము లాలాపించిరి. పెక్కుయుగములనుండి ఈ నక్షత్రము లిట్లే మెఱయుచు మన భూమిని తిలకించుచున్నవి. ఈ ప్రపంచమునం దన్నిదేశముల

వారును, అన్ని జాతులవారును బహుకాలమునుండి వీనిని గమనించు చున్నారు. కేంట్ (Kant) అను జెర్మనీ తత్త్వవేత్త యీ చిత్ర దృశ్యమును గూర్చి చెప్పిన వాక్యరత్నము లిట స్మరణార్హములు : "ఎప్పటికప్పుడే నాకు క్రొత్త ఆనందమును ఆశ్చర్యమును గూర్చుచు, నిరంతర ప్రవర్ధమానమగు నా ప్రశంసకు పాత్రములైనవి రెండే - రెండు అనంతకోటి నక్షత్రములతో నా శిరస్సుపై మెఱయు నీ నభోరంగ మొకటి; నిత్యము నాకు నైతిక ధర్మోపదేశము చేయుచు నా హృదయాంతరాళమున మెఱయు నంతరాత్మ యొకటి."

## విజ్ఞానాభివృద్ధి జ్యోతిర్విజ్ఞానముతో ప్రారంభమైనది :

గ్రహనక్షత్రాదులైన ఖగోళ సంచారులను చేతితో ముట్టలేము. పట్టలేము. భూమిమీద దొరుకు ధాతువస్తుచయమును చేతులతో పట్టి పరిశీలించునట్లు జ్యోతిర్గోళములను స్వహస్తములతో పట్టి పరిశీలింప జాలము. అయినను, మానవునిదృష్టి, వానియోచన, వాని జిజ్ఞాస ప్రప్రథమమున జ్యోతిశ్శాస్త్రాభివృద్ధికే వినియోగమైనవి. అన్ని శాస్త్రములలో జ్యోతిశ్శాస్త్రమే మొదటిది. మొదట పెంపొందినదనుట నిక్కువము. విశ్వములో ఏకార్య మెట్లు జరుగుచున్నదో సూక్ష్మముగా పరిశీలించి కనిపెట్టవలెను; చూచినదానివలన నేమేమి తెలిసికోవచ్చునో సహేతుకముగా చర్చించి తేల్చుకోవలెను. ఏశాఖకు చెందిన విజ్ఞానమైన నభివృద్ధి చెందుటకు ఈక్రమము నవలంబించి పనిచేసి పరిశోధనగావించుట ఆవశ్యకము. ఈ పరిశోధన ప్రక్రియ మానవవిజ్ఞానచరిత్రలో మొదట జ్యోతిశ్శాస్త్రాభివృద్ధికే వినియోగమైనది. ఇంతటి మహోవైభవో పేతములైన దృశ్యములను ప్రదర్శించుచు, మహోన్నత భావములను స్ఫురింపచేయగల శాస్త్రము మరొకటిలేదు. అద్భుత నిర్మాణ కౌశల్యములను, దివ్యప్రభావములను ప్రకటించు యంత్ర రాజములలో ఖగోళమువంటిది వేరొకటి విశ్వములోలేదు. దీని నడక గమనించు

వార లానందవివశులుగాక తప్పరు. ఈ మహాయంత్ర నిర్మాతయొక్క కళాకుశలత్వమును శ్లాఘించుటచే కలుగు నానందమునకుతోడు జ్యోతిశ్శాస్త్రజ్ఞులు తీవ్రము సక్రమమునైన పరిశోధనల సాగించి యెప్పటికప్పుడే క్రొత్తక్రొత్త సంగతులను కనుగొనుచు నెల్లవారిని యద్భుతరసమగ్నులం జేయుచున్నారు. జ్యోతిర్గోళముల పరిమితిని పట్టి చూచినను, అందు గోచరించు ననంత వైవిధ్యమును బట్టి చూచినను, అంరేఖాగమును పరిశీలించి చూచినను వ్యక్తమగు నద్భుత కార్యవిధానము గమనించినను, జ్యోతిర్విశ్వముకంటె మహనీయము మహత్తరమునైన విషయము, మనుష్యులు తెలిసికోతగినది మరొకటి లేదని ప్రాక్టరు (R. A. Proctor) దొరగారు చక్కగా తెలిపియున్నారు. కవులు. తత్త్వవేత్తలు, భగవద్భక్తులు, మతప్రవర్తకులు లోనగు మహామహులందరును జ్యోతిర్లోక విశేషములను గమనించి భయ భక్త్యావేశములతో నిశ్చేష్టులగుచున్నారు. "తారామండలమంతయు దేవతామయము" అని అరిస్టాటిల్ (Aristotle) అను గ్రీకుల యాచార్యుడు ప్రవచించియున్నాడు. బైరన్ (Byron) అను ఇంగ్లీషుకవి "ఓ నక్షత్రములారా! స్వర్గలోకముయొక్క ఉత్తమ కావ్యగీతములు మీరేసుమండీ" అని గట్టిగా నొక్కి పొలికేకవైచి తృప్తిపడినాడు!

శ్రీ

# జ్యోతిర్వేదము

## రెండవ ప్రకరణము

గాఢముగా యోజించి చూచుకొలది సంఖ్యాతీత నక్షత్ర విరాజమానమైన జ్యోతిర్లోక మొక మహాగ్రంథమన నొప్పుచున్నది. ఎన్నెన్నో సమస్యలా గ్రంథమునిండ నేర్పుతో నిముద్రబడి యున్నవి. 'దీనిభావ మేమి తిరుమలేశ' అన్నట్లు చిత్ర విచిత్రములు, చమత్కారములునైన పొడుపు కథలును, బహుక్లిష్టములైన సమస్యలును, అనేకము లిందు పొందుపరుపబడి యున్నవి. ప్రాగ్దేశవాసులైన మనపూర్వు లీ పొడుపుకథలను సరిగాపోల్చి చెప్పుకో కలిగినారా? ఈ కఠినసమస్యలను సాధింపగలిగినారా ? సాధించిరన్నచో నేవిధమున సాధింపగలిగినారు ? అను ప్రశ్నలు మనల నెదుర్కొనుచున్నవి.

### ఋగ్వేదము :

ఈ వేదమునుగూర్చి మనము రెండు విధములుగా యోజించ వలసియున్నది. (1) ప్రపంచ చరిత్రలో ఋగ్వేద ప్రాముఖ్యమేమి ? (2) భరతఖండ చరిత్రలో ఋగ్వేద ప్రాముఖ్యమేమి ? ఏ విధమున చూచినను ఋగ్వేదమే ప్రథమగణ్యమని మాక్సు ముల్లర్ (Max Muller) దొరగారు వ్రాసియున్నారు. "ఆర్యజాతులకు పితృక్రమాగతముగా నందినది, బహుప్రాచీనమైనది, మిక్కిలి పూజ్యమై శిరోధార్యమైనది, యీ ఋగ్వేదమే" నని గ్రిఫిత్ (Griffith) దొరగారు వక్కాణించి యున్నారు. మానవుల యోచనలు, అనుభవములు, మానవజాతి సాధించిన మహత్కార్య వివరములు తొలుత ఋగ్వేదము

నందే గ్రంథస్థము గావింపబడినవి. ఆర్యజాతుల తొలిపలుకు లిందే గలవు. అయినను ఈ వేదవాఙ్మయమును సరిగా అర్థముచేసికోజాలని పాశ్చాత్య విమర్శకులు కొందరు మన హిందువులను నిలబెట్టి ఈ క్రింది ప్రశ్నలకు సదుత్తరము లిమ్మని గట్టిగా 'సవాలు' చేయుచున్నారు. ఈ ప్రశ్నలు ఒక వ్యక్తిమీదను, ఒక రాష్ట్రముమీదను చేసిన సవాళ్లుకావు. భరతఖండ మంతటిమీద సవాళ్లు; భారతీయ నాగరకతపై సవాళ్లు; భారతీయుల సర్వంకషకృషి (culture) పై సవాళ్లు. వానికి సదుత్తరము లిచ్చుట ప్రతి భారతీయుని కనీసధర్మము. సదుత్తరములనగా సమగ్రములు, సప్రమాణములునై ఎదుటివారిని నిరుత్తరుల చేయగల సమాధానము లని మనము పూర్తిగా గ్రహించవలెను. ఆ ప్రశ్న లేవియనగా : (1) యాగదీక్షాపరులైన మీ పూర్వపు వేదఋషులు, యజ్ఞములు చేయు నపుడు హోమగుండములలో కట్టెలు కంపలు పడవైచి నేయిలోసి జ్వాల లెగయబెట్టి 'స్వాహా' శబ్దములతో నరచునపుడు వెడలు హోమ ధూమముతో నెట్టబడి నీరుకారు చీపికన్నులతో బాధపడుచేగాక కను లెత్తి వారెపుడైన ఖగోళ వైభవమును కాంచగలిగిరా? తేజో మయులై ప్రకాశించు సూర్యుని వా రెప్పుడైన సరిగా చూచినారా? చల్లని పండువెన్నెలలో సంచారముచేయు చంద్రుని వార లేనాడైన పరికించి చూచినారా? ద్వాదశ రాశ్యాత్మకమైన రాశిచక్ర ప్రశంస-మేషాది రాసుల వివరములు ఋగ్వేదములో నెచ్చటనైన కలవా? ఉన్నట్లు చూపగలరా?"

ఈ ప్రశ్నలు ప్లంకెట్ (**Plunket**) దొరగారు రచించిన ప్రాచీన పంచాంగములు, నక్షత్ర సమూహములు (**Ancient Calendars and Constellations**) అను గ్రంథములో వివరముగా నుటంకించి నారు. ఆ దొరగారికి సంస్కృతము రాదు; రాదని స్పష్టముగా తెలియచెప్పినారు. కొందరు పాశ్చాత్య విమర్శకులు వేసిన పైప్రశ్నల నెత్తి వ్రాయుచు ఆయన సత్యాన్వేషణము పొంలె నీదిగువ వాక్య

ములను వ్రాసిరి. "ఋగ్వేదము, నిగూఢములు నద్భుతములునగు పెక్కు సూక్తముల సంహితయై యున్నది. దానిలోతు తెలియగోరి నిరంతరము వేదపఠనము గావించువారుకూడ ఋగ్వేదమునకు అర్థము సరిగా తెలియలేదని ఒప్పుకోక తప్పదు. ప్రకృతి సిద్ధములైన శక్తులకును కార్యగతులకును రూపసిద్ధు లారోపించి వానినే దేవతలను పేరుతో వేదఋషులు వ్యవహరించిరని ఎల్లరు నంగీకరించియున్నను వేదగాథల అంతరార్థ మిదియని ఏకాభిప్రాయముతో నంగీకరింపక, వేదపండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. ఇదివఱకు నెందరెందరో ఎన్నివిధములనో పాటుపడి, కృషిచేసి వ్యాఖ్యానములు వ్రాసి అర్థముతీయ యత్నించిరి. అనేక విధములైన అర్థములు, తాత్పర్యములు టీకలు బయలుదేరినవి. వేదమంత్రము అర్థము చేసికొనుటలో ఊహాలపై ఊహాలల్లి టీకలపై టీక లెన్నియో రచింపబడినవి. ఇంతవరకు నెవరేమిచేసినను, ఏమి వ్రాసినను ఇప్పటికి తేలిన పర్యవసానము మాత్రము—ఒక్కటే. ఋగ్వేద సంహితలో చాల భాగములకు సరియైన యర్థము చెప్పినవారు లేరు. వేదము విశేష భాగ మజ్ఞేయమై యున్నది. వేదార్థ పేటిక తెరచి యర్థము చూపగల తాళముచెవి పోయినది. ఈనాటి వ్యాఖ్యాతల కది దొరకలేదు."

పోయిన ఆ తాళపుచెవి ఇప్పటికైన దొరికిన నెంత బాగుండును? వేదఋషులు మంత్రద్రష్టలు, "శ్రుతిం పశ్యంతి మునయః." వారికి అద్భుతశక్తులు రెండున్నవి. ఒకటి సహజమైన కవితాశక్తి; రెండవది, సూక్ష్మదృష్టితో నిశితముగా ప్రకృతి పరిశోధనలతో ఖగోళ వేధ చేయుచు, ముఖ్యాంశములను గమనించి ఆవేశముతో గ్రంథస్థము చేయగల వైజ్ఞానికశక్తి. ఈ దివ్యశక్తులు వారిలో పెనవైచుకొనినవి; అంతేకాదు; మేళవించుకొని ఒకదానిలో నొకటి లీనమై పోయినవి. మిణుకు మిణుకుమని మెఱయు నక్షత్రములతో నలంకరింపబడి మనోహరమైన నభోరంగము ఆ మహాఋషుల దృష్టిని మొదటనే ఆకర్షించి

నది. పరాత్పరుడు తేజోరూపములగు నక్షత్రాక్షరములతో స్వయముగా రచించి ఆకాశరంగమున వెలయించిన జ్యోతిర్వేద సంపుటములలోగల మహద్విషయములను వారు చక్కగాగ్రహించిరి. అందుచేర్పబడిన సమస్యలను వారు శ్లాఘాపాత్రముగా సాధించిరి. ఆప్రయత్నములలో కృతకృత్యులగు వఱకు ఆమహానీయులు చుక్కల గుంపులపై చక్కగాదృష్టినిలిపి పరిశీలించిరి. వాని గమనవిశేషములను తదేకదృష్టితో పరికించి మంత్రద్రష్టలై ఆవేశముతో వేదమంత్రములనియెడి చక్కని కావ్యములలో తాము చూచినది, గ్రహించినది, భావించినది, సాధించినది - ఈ సమస్తవిషయములను సాటిలేని శైలిలో శాశ్వతముగా గ్రంథస్థము గావించిరి. వారి దృష్టి ఎంత సూక్ష్మమో, వారి ఖగోళ పరిశీలన మెంత నిశితమో, భావాంబరవీథి విశ్రుతవిహారులైన వారి కవితాప్రాగల్భ్య మెంత యుత్కృష్టమో సరిగా గ్రహించుటకు స్థాలీపులాకన్యాయముగా కొన్ని ఋగ్వేదమంత్రములు చదివి అర్థము చేసికొనుటకు ప్రయత్నింతము.

1. అయాస్యఋషి. ఋగ్వేదము X. 68 11. "అభిశ్యావం నకృశనోభిరశ్వం నక్షత్రేభిః పితరోద్యామ పింశన్ । రాత్ర్యాంతమో అదధుర్జ్యోతి రహసి." పితరులు పగటివేళ సూర్యకాంతిని రాత్రి చీకటిని వ్యాపింపజేసిరి. నల్లగుఱ్ఱమునకు ముత్యాలజాలరువేసి అలంకరించినట్లు రాత్రి చీకటిలో నభోరంగమును చుక్కల కోవలతో నలంకరించిరి.

2. శునఃశ్శేపుడను ఋషి ఋగ్వేదము I. 24.10 లో ఇట్లు పృచ్ఛ చేసినాడు :—"అమీయఋక్షా నిహితాసఉచ్చా । నక్తం దదృశ్రేకుహచిద్దివేయుః?" మనపై నెంతో యెత్తున నాకాశరంగమున రాత్రులం దద్భుతతేజస్సుతో మెఱసెడి నక్షత్రములు పగలుకానరావే! ఎచటికి పోవుచున్నవి? అవి యేమగుచున్నవి?

3. ప్రస్కణ్వఋషి ఋగ్వేదము I. 50-2:- "అపత్యే తేతాయవో యథానక్షత్రాయంత్య క్తుభిః సూరాయ విశ్వచక్షుసే ?" రాత్రులందు దివ్యకిరణజాలముతో తళతళ మెఱయుచుండు నక్షత్రములు, విశ్వచక్షుస్సు సూర్యభగవాను డుదయించువేళకు ధొంగలవలె మాటు మణిగిపోవుచున్న వే ! ఏమిచిత్రము ?

4. పరాశరుడు ఋ I. 68-5 మంత్రములో, అగ్నిదేవుడు, నక్షత్రములనెడి భూషణములతో నభోరంగమును చక్కగా నలంకరించుచున్నాడని వర్ణించెను.

5. ఆ కా శ ము నక్షత్రములతో మెఱయునట్లు, మరుత్తుల శరీరములు ఉజ్జ్వలభూషణములతో మెఱయుచున్నవని గోతముడు ఋ I. 87-1 మంత్రములో వర్ణించెను.

6. ప్రాచీన వైజ్ఞానికులలో నుత్తమశ్రేణికి చెందిన దీర్ఘతమ ఋషి, సావయవరూపకాలంకారవిశిష్టమైన ఈ క్రింది మంత్రరాజములో సంవత్సరాత్మకమైన కాలచక్రము నిట్లు వర్ణించినాడు:- ఋ. I. 24-48. "ద్వాదశ ప్రధయఃచక్రమేకం త్రీణి నభ్యానిక ఉతిచ్చికేత తస్మిన్త్సాకం త్రిశతాన శంకవోర్పితాః షష్టిర్న చలాచలాసః" ఇందు వర్ణింపబడిన చక్రము సంవత్సరాత్మకమైన కాలచక్రము. ఈ చక్రపు ప్రధ - నేమి పన్నెండు భాగములు కలది చక్రము తిరుగునపుడు నేలకంటు నట్టి చక్రపుటంచును నేమియందురు. ఇది పన్నెండు భాగములు కలదనుట చేత క్రాంతి చక్రములో పన్నెండవభాగమైన రాశిక న్వయము. కాబట్టి ద్వాదశరాసుల ప్రమేయ మిందుగలదని నిశ్చయముగా చెప్పగలము. ఈ రాశిచక్రమునకు నాభులు మూడ ని తెలుపబడినది. వలయము కేవలము చక్రము (Circle) కాదు. అండవృత్తము (Ellipse). కనుక రెండు కేంద్రములను, అసలు నాభి (Centre) తో మూడు నాభులని చెప్పతగును. ఈ చక్రపురేకుల సంఖ్య మున్నూట అరువది. సంవత్సరమునకు మున్నూట అరువది దినములు. దినమున

కొక రేకు. అదే ఒక భాగ- ఒక డిగ్రీ (Degree). పనిలించుటకు వీలుగాని మున్నూట అరువది రేకులను డిగ్రీలు - దినములు గలది సంవత్సర చక్రము.

దీర్ఘతముడు స్పష్టముగా వర్ణించియున్నాడు :

"ద్వాదశారం నహితజ్జరాయ వర్వర్తి చక్రం పరిద్యామృతస్య।
ఆపుత్రాఽఅగ్నే మిథునాసోఽత్రిన ప్తశతాని వింశతిశ్చతస్థుః"

ఒకదానివెనుక నొకటిగా రాత్రింబవళ్లను మిథునము - మున్నూట అరువది జతలై సంవత్సర చక్రమునందు అమరియున్నవి. వ్యాసప్రణీత భారతమునం దీభావమే చక్కని ఆలంకారిక భాషలో వివరింపబడినది. చూ. ఆది. 3 - 22,23, 28 :

22. శ్లో. త్రీణ్యర్పితాన్యత్ర శతాని మధ్యే
షష్టిశ్చ నిత్యం చరతి ధ్రువేస్మిన్
చక్రే చతుర్వింశతి పర్వయోగే
షడ్వై కుమారాః పరివర్తయంతి.

23. శ్లో. తంత్రం చేదం విశ్వరూపే యువత్యౌ
వయతస్తంతూన్ సతతం వర్తయంత్యౌ
కృష్ణాన్ సితాంశ్చైవ వివర్తయంత్యౌ
భూతాన్యజస్రం భువనానిచైవ.

28. శ్లో. ఏ తే త్రియో ధాతా విధాతాచ యేచతే కృష్ణాస్సితా స్తంతవస్తేరాత్ర్యహాని, యదపి తచ్చక్రం ద్వాదశారంషడ్వై కుమారాః పరివర్తయంతి తేనేపిషడృతవః సంవత్సరశ్చక్రం

పైని వ్రాసిన వివరములను నన్నయ యిట్లు తెనిగించినాడు

సీ. పొలతు రిద్దరును ధాతయును వి
ధాతయు, వారియనువయించు

సితకృష్ణ తంతురాజిత తంత్రమది యహో
రాత్రము లీ ద్వాదశారములు గలుగు
చక్రంబు మాసాత్మ సంవత్సరంబు, గు
మారు లయ్యార్యువరు మఱియు ఋతువులు,

ఇచ్చట మనము గమనించవలసిన ముఖ్యాంశము మరొక్కటి గలదు. సంవత్సర చక్రములో మున్నూట అరువది దినములను డిగ్రీలు ఉన్నవి. ఆ లెక్క వే, రేఖాగణితాత్మకమైన ప్రతిచక్రమునకును మున్నూట అరువది డిగ్రీలను భాగలున్నవి. చక్రమును రెండు సమ భాగములుగా విభజించినయెడల చాపములు రెండేర్పడును. **Bisect a circle; and you get two semi-circles;** చాపమును రెండు సమభాగములు చేసినయెడల తురీయములు రెండేర్పడును. **Bisect a semi-circle and you get two quadrants.** తురీయములో 90 డిగ్రీలు గల సరికోణము (**right angle**) ఉండును. ఈ యంశము లనుభాస్కరాచార్యులవారు ఈ దిగువ శ్లోకములో చక్కగా తెలిపి యున్నారు. "దళీకృతం చక్ర ముశంతిచాపం, కోదండఖండం ఖలు తుర్యగోళమ్." సరికోణమునకు తొంబది భాగలనుట త్రికోణ గణితాది గణిత శాఖలకన్నింటికి ముఖ్యమైన పునాది. ఈ పునాది మొదట నిర్మించినవాడు వేదఋషి దీర్ఘతముడు. ప్రపంచము నందంతటను, ప్రాచీన నవీన గణకులకు అతడు పెట్టిన భిక్షయే యిది. చక్రమునకు మున్నూట అరువది భాగలనుటయు సంవత్సరములో దినమున కొక భాగ యని భావించుటయు, ఆ మూలముగా సరికోణమితి యేర్పరుచుటయు దీర్ఘతముడు వైచిన బీజములు. ఆ బీజములు కాలక్రమమున పెరిగి పెద్దవై, శాఖోపశాఖలుగా ప్రపంచమంతటను వ్యాపించి, నేటి గణిత, ప్రకృతి శాస్త్రాభివృద్ధికి ముఖ్యకారణములైనవని మనమెప్పటికిని మరువరాదు.

సౌరసంవత్సరమనగా భూమి సూర్యునిచుట్టు నొక్కసారి తిరిగి వచ్చుటకు పట్టుకాలము. మున్నూట అరువది యైదు రోజుల పైని సుమారు ఆరుగంటలకాలము. చంద్రుడు భూమినిచుట్టి ఒకసారి వచ్చుటకు సుమారు ఇరువదితొమ్మిది రోజులన్నర కాలముపట్టును. పండ్రెండు చాంద్రమానములకు $12 \times 29\frac{1}{2} = 354$ మున్నూట ఏబదినాలుగు దివసములు మాత్రమే పట్టును. కాబట్టి పండ్రెండు చాంద్రమానములకును ఒక సౌరసంవత్సరమునకును తేడా ఇంచుమించు పదునొకండు రోజులు కానవచ్చును. ఈ భేదము సవరించుకొనుటకును, ఋతువుల మితులు సంరక్షించు నిమిత్తమును సుమారు మూడేండ్లకొక అధికమాసము చేర్చుకొని, సౌరచాంద్రమాసముల సరిచేసికొని పంచాంగములను సిద్ధాంతులు సవరణ చేయుచుందురు. అధిక మాసపుచేర్పాటు ఋగ్వేదము నందు స్పష్టముగా తెలుపబడినది. (ఋ I.25.8). వరుణసూక్తములో "వేదమాసో ధృతవ్రతో ద్వాదశః ప్రజావతః వేదాయ ఉపజాయతే" అని అధికమాసము ఉపజాతమైనట్లు ప్రశంసింపబడినది.

శాస్త్రవిజ్ఞానమునకు సరియైన కొలతలు అవసరము. చంద్రగమనము ననుసరించి నెలమానము ఏర్పడినది. మన తెనుగుదేశములో 'నెల' అనగా చంద్రుడని అర్థమున్నది. చంద్రోదయమైనపుడు తెనుగు ప్రజలు 'నెల పొడిచినది' అందురు. సంస్కృతభాషలో 'మాస' శబ్దమునకు 'కాలమానము' అని కూడ అర్థముకలదు. ఈ మానమున కాధారము చంద్రుడు కనుక, సంస్కృత 'మాస' శబ్దమను మూలమునుండి ఇంగ్లీషు 'మూన్' 'moon' శబ్దము పుట్టెనని వైజ్ఞానికులును, భాషావేత్తలును అభిప్రాయ పడుచున్నారు. ఇంగ్లీషులో Moon అనగా చంద్రుడు. చంద్రుడొకసారి భూమిచుట్టు తిరిగివచ్చు కాలము moonth; ఇందొక 'ఒకారము' జారిపోగా month అయినది. ఇప్పుడు ఇంగ్లీషులో month అనగా ఒక మాసము. భారతీయుల నిత్యవ్యవహారములో మూడువందల అరువది తిథులను మున్నూట

యేబదినాలుగు దినములలో కొన్ని నిబంధనలనుబట్టి సర్దుచు, మూడేండ్లకు తక్కువలో నొక అధికమాసమేర్పరచి సౌరసంవత్సర కాలగతితో చాంద్రమానములను సరిచేసి అధికమాసనిర్ణయముతో పంచాంగములను వవరించుచున్నారు. ఇట్లు ఋగ్వేదకాలమునుండి జరుగుచున్నది.

గ్రహణములు :

ఒక చక్రములో సగము చాపము (Semi - Circle) ; చాపములో సగము తురీయము (Quadrant). ఈ యంశములు దీర్ఘతముని సంవత్సరాత్మక చక్రమును గూర్చిన చర్చలో తెలిసికొంటిమి. వేద ఋషులు తురీయ యంత్రమును గ్రహణసమయమున నుపయోగించి, గ్రహణ సంబంధమైన వివరములను తెలిసికొనెడివారు. అత్రియను మహాఋషి, జ్యోతిశ్శాస్త్రవేత్త, తురీయ యంత్ర సాహాయ్యమున నొకానొక సూర్యగ్రహణ వివరములను తెలిసికొనెనని ఋగ్వేదము నందలి V.40.6 మంత్రము : ("స్వర్భానోరధయ......గూహ్ళం తమ సాపవ్రతేన తురీయేణ బ్రహ్మణా విందదత్రిః") స్పష్టముగా తెలుపుచున్నది. గణక చక్రవర్తి భాస్కరాచార్యులవారు తమ సిద్ధాంత శిరోమణి X-15 గోళాధ్యాయములో తురీయ యంత్రమును వర్ణించియున్నారు. తెనుగునాట సుప్రసిద్ధ దైవజ్ఞులని పేరువడసిన పిడపర్తి వారు, శ్రీపాదవారు మొదలగు సిద్ధాంతుల గృహములలో తర తరములనుండి తురీయ యంత్రములు ఉండుచున్నవి.

పైని వివరింపబడిన హేతువులచేత తురీయమనునది ఒక గణిత యంత్రమనియు వేదకాలమునుండి మన దేశములో ఖగోళవేధకై వాడబడుచున్నదనియు, సాంకేతిక యంత్రశాస్త్రములో గణకులీ పదమును వాడుచుండురనియు పాఠకులకు స్పష్టమై యుండును.

భాస్కరాచార్యులవారి యనంతరము మూడు నాలుగు శతాబ్దములనాడు సాయన విద్యారణ్యులు వేదములకు వ్యాఖ్యానముచేసి

భాష్యము వ్రాసిరి. వారికి గణితయంత్ర, జ్యోతిశ్శాస్త్రములతో పరిచయము విశేషముగా లేకపోవుట మనదేశ దౌర్భాగ్యము. ఆకాలము నాటికి తురుష్కులు తండోపతండములుగా మన తెనుగుదేశముపై బడి అత్యాచారములు గావించుచుండిరి. వారిధాటకు తట్టుకోలేక వేద మతము కూకటివేళ్ళతో కూలిపోవునేమోయని భయము కలిగినది. వేదమతము పునరుద్ధరింపబూని విద్యారణ్యస్వామి కర్మకాండ పరముగా, శబ్దార్థమాత్ర వివరణములతో వేదమునకు వ్యాఖ్యానము వ్రాసెను. విద్యారణ్యులొనరించిన మహాకార్యమునకు వారికి నమస్కృతులు. కాని వారు శబ్దార్థ మాత్రమునే గైకొని వేదము లన్వయించుటచేత వేదఋషుల వైజ్ఞానిక మహాప్రతిభను, శాస్త్రీయకృషిని సరిగా మనము సమన్వయించుకొనుటకు అవకాశములు సన్నగిలినవి. అందువలన మిక్కిలి దుఃఖకరమైన దుస్థితి యేర్పడినది. (Technical sense) సాంకేతికార్థము విడిచి శబ్దార్థముమాత్రము చూచుకొంటిమేని, తురీయమనగా సంఖ్యావాచకార్థములో నాల్గవది యగును. నాటకములో నాలుగవ యంకమును తురీయాంక మందురు; బ్రహ్మచర్యాది యాశ్రమములలో నాల్గవది యగు సన్యాసి ఆశ్రమమును తురీయాశ్రమమందురు. తురీయశబ్దమునకుగల సాంకేతిక గణిత యంత్రార్థమును గ్రహింపక కేవల సంఖ్యావాచకముగా గ్రహించి, విద్యారణ్యులు ఋగ్వేదమునందలి V. 40·6 మంత్రమునకు అర్థము చెప్పిరి; ఈ యారవమంత్రమునకు నాలుగు కలపగా పదియగును. కాబట్టి దీని తరువాత పదవమంత్రమువలన అత్రికి గ్రహణ వివరములు తెలియవచ్చెనని విద్యారణ్యవ్యాఖ్య. ఈ భాష్యలు చదివినవారికి తురీయ మనబడు గణితయంత్రమున్నట్లు తెలియదు; అత్రి మహాఋషి ఆ యంత్రసాధనముచేత సూర్యగ్రహణ వివరములు తెలిసికొనిన విషయముకూడ తెలియరాదు; వేదఋషుల వైజ్ఞానిక ప్రతిభ ఇట్టి వ్యాఖ్యానములచేత నివురుగప్పిన నిప్పువలె మరుగునబడి ప్రకాశింప

కున్నది. జ్యోతిశ్శాస్త్ర విషయసమన్వయములోను, సాంకేతిక పద వివరణములోను విద్యారణ్యులు పొరబడిరనక తప్పదు. ఈ విషయ ములలో విద్యారణ్య భాష్యము ననుసరించి తృప్తిపడుట వేదపాఠ కులకు క్షేమకరముకాదు.

## నక్షత్రములు గొప్ప సూర్యగోళములు :

నభోరంగమున వెదజల్లిన ముత్యములవిధమున, నందు తాపించిన వజ్రపుతునకలట్లు నక్షత్రములు చూచుటకు మిక్కిలి చిన్నవై మిణుకుచుండును. సూదిబొట్ల చందమున చుక్కలు మిక్కిలి చిన్నవైనట్లు కనబడినంతమాత్రముచేత నిజముగా నవి చిన్నవేయని మనము భ్రమ పడకూడదు. ఒక్కసంగతి విచారింతము. ఉన్నతమైన పర్వతశిఖరముపై పెద్ద నెగడు మండుచున్నదనుకొందము. అమంట పది పాతికమైళ్ళ దూరమువఱకు కనబడవచ్చునుగాని అటుపైని కనబడదు. చుక్కల తళుకు భూమిమీద నన్నిదేశములలోను ఒకే విధమున నగపడుచున్నది. ఆ చుక్కలు ఎంత యెత్తున నెంతటి తేజస్సుతో గ్రాలుచుండినగాని ఇరువదియైదు వేల మైళ్ళు చుట్టుకొలత గల భూమిమీద నెక్కడనిలిచి చూచినను ఒకేవిధమున నగపడగలవో యోజించి చూడవలయును. ఇటీవలి యాంగ్లకవులు ఈ నక్షత్రములు బ్రహ్మాండ పరిమాణముగల సూర్యగోళములుగాని చుక్కబొట్లుకావని వర్ణించియున్నారు. ఈయంశము "సప్తదిశో నానా సూర్యాః" అను ఋగ్వేదమంత్రము మనకు చక్కగా పరిస్ఫుటము చేయుచున్నది. (ఋ IX. 114-3.)

## నక్షత్ర పరిమాణములు- అందలి తారతమ్యములు :

వేదఋషులలో ప్రఖ్యాతిగనిన 'మేధాతిథి' మన భూ పరిమాణ మును, సూర్యగోళపు పరిమాణమును, ఊర్ధ్వలోక పరిమితిని

ఇంద్రునితో పోల్చి తారతమ్యము వివరించినాడు. ఇంద్రుడనగా మన యిరువదేడు నక్షత్రములలో జ్యేష్ఠ నక్షత్రము. నక్షత్రఇష్టి "జ్యేష్ఠా నక్షత్ర మింద్రోదేవతా" అని తెలుపుచున్నది. ఈనాటి మహోద్యుత యంత్రయుక్తులతో విశేషపరిశ్రమ చేసి పరిశీలింపగా జ్యేష్ఠనక్షత్రము మన సూర్యగోళముకంటె పరిమాణ విషయమున తొమ్మిదికోట్లరెట్లు పెద్దదని నేటి వైజ్ఞానికులు నిర్ధారణ చేసియున్నారు. సరిగా తొమ్మిది కోట్లని ఖండించి సంఖ్యానిర్ణయముచేసి చెప్పలేదుకాని, 'సామాన్య భాషలో బహు సంఖ్యాయుతమను నర్థములో మేధాతిథి "వేయి సూర్యులైన నింద్రునితో సరిరారు" అని యీక్రింది మంత్రములో వక్కాణించియున్నాడు :- ఋ VIII. 59-5 "యద్యావ ఇంద్రతే శతం శతం భూమి రుతస్యుః । నత్వావజ్రిన్ సహస్రమ్ సూర్యా అను నజాత మష్టరోదసీ" జ్యేష్ఠ మన సూర్యగోళముకంటె తేజోవిషయమున నాలుగువేల రెట్లును, పరిమాణవిషయమున తొమ్మిదికోట్ల రెట్లును పెద్దదని సర్ జేమ్సు జీన్సు దొరగారు తెలిపినారు. అందుకే యీ నక్షత్రమునకు జ్యేష్ఠ యను పేరు సార్థకమైనది. జ్యేష్ఠయనగా పెద్దది, గొప్పది, మొదట చెప్పదగినది, ముఖ్యమైనది. సామాన్య నక్షత్రములు అన్నిటికంటె గొప్పదగు జ్యేష్ఠ కధిదేవతయై ఇంద్రుడా దేవతలకెల్ల రాజు కాగల్గినాడు. అంతేకాదు. ఇంద్రుడు వర్షప్రదాయకుడు. మాయా మృగమనియు, మృగశిరస్కుడనియు వేదములో వర్ణింపబడిన వృత్రాసురుని సంహరించి ఇంద్రుడు జలప్రదానము చేసి ప్రజలకును, కర్షకులకును పూజార్హుడైనాడు. వృత్రుడు ఆకాశగంగా ప్రవాహమున కడ్డుగా పడి, ఖగోళ భూగోళములకు నీరందకుండ జేసి కఱవు గలిగించి ప్రజల నవావృష్టి పాలుచేసి హాహాకారముల పుట్టించును. ఇంద్రు డీ రక్కసుని సంహరించి, ఖగోళపు టాకాశగంగా ప్రవాహమునకు వాని యాటంకమును తొలగించి, వేంద్రముడిపి, ఆకాశగంగను భూమిమీద కవతరింప జేసినట్లు వర్షము ప్రసాదించి, కర్షకులను పెంచి ఆర్యజనములకు ఇష్ట

దైవమైనాడు. జ్యోతిశ్శాస్త్రదృష్టిలో, జ్యేష్ఠనక్షత్ర స్వరూపుడగు ఇంద్రుడు జ్యేష్ఠమాసములో సూర్యాస్తమానము కాగానే తూర్పున నుదయించినపుడే మృగశిర అస్తమించును. మృగశిరకార్తె ప్రవేశమగును. మృగశిర 'భిందించుట'తో వర్షములుకురియ నారంభించును. వృత్రాసురుని యాటంకము తొలగి దివిజగంగా ప్రవాహము భూమి మీద నవతరించుచున్నదని యుత్ప్రేక్షించి చెప్పుటకు అవకాశమొదవును. ముందుగా ఆకాశగంగ యనగా నేమో చర్చించి తెలిసికోవలెను.

## ఆకాశగంగ - క్షీరోదము - పాలవెల్లి :

ఆకాశము నిర్మలముగా నున్నపుడు రాత్రివేళ భగోళమును పరిశీలించువారికి తెలతెల్లగా పుంతవలె తోచు చక్కని దృశ్యమొకటి కనబడును. అనాదికాలమునుండి అనేక దేశముల జనులు దీనిని చూచి బహువిధ భావనలు దీనినిగూర్చి చేసియున్నారు. ఇది స్వర్గలోక సంబంధముగల నదియని బహుదేశములవారి అభిప్రాయమై యున్నది. చీనా దేశస్థు లీ నదిని 'తీన్‌హో' అందురు. మానవుల మరణానంతరము వారి యాత్మలీమార్గమున బోయి యుత్తమలోకముల కరుగునని చీనావారి విశ్వాసము. జీవు లీ దారి నేపట్టి పోయి పోయి తుదకు విశ్వప్రభుని మందిరము చేరుకొనునని 'ఓవిడ్' నామకుడగు రోమకకవి వర్ణించెను. స్వర్గలోకములో పరాత్పరుని నివాసము చేరుకొనుటకీ బాట నిర్మింపబడెనని మానవులలో ననేక జాతులవారు తరతరములనుండి చెప్పుకొనుచున్నారు. సుదీర్ఘము, సువిశాలమునైన యీ వియద్వీథిని భగవంతుడు స్వర్ణరజముతో నిర్మించి చుక్కలతో చదునుచేసెనని మిల్టన్ మహాకవి వక్కాణించెను. ఈ వియన్మార్గము తీర్చి దిద్దినట్లు ఋజురేఖలమధ్య నిర్మింపబడలేదు. ఒకచోట చాల సన్నముగాను, మరొకచోట చాల లావుగాను, ఒకతావున పలుచగాను, మరొకతావున మిక్కిలి సాంద్రము

గాను తోచుచు నీ మిన్నేటివంకలు తిరుగుచు గొగ్గిగొగ్గిగా కనబడును సముద్రపు టుప్పుటేళ్ళమబోలు శాఖలతోను, కందపిలకలవంటి మడకల తోను కూడుకొని, అడ్డదిడ్డపు టంభోరాశివలె వస్తావక్రరూపముతో గోచరించును. చెదరిన యంచులతో చిత్రవిచిత్రముగా నగపడుచు నీ ధవళ దృశ్యము నభోరంగమునంతను చుట్టి పెనవైచుకొనిన తెల్లత్రాచు పామాయని భ్రాంతి గొల్పుచుండును. ధవళధవళమై తోచు నీ వింత దృశ్యమును రెండు భాగములుగా విడతీయవచ్చును. అందొకటి పలుచ పలుచగా తోచుభాగము; రెండవది దట్టముగా పొగమంచుకంటె సాంద్ర తరమై కనబడు శరన్మేఘమువంటి రూపముగలది. పాలపోలికమబట్టి యీ రెండవభాగముకు మన ఆర్యులు పాలసముద్రమని, క్షీరసాగర మని, క్షీరోదమని తెలిపిరి. మొదటిభాగమును దేవనది, ఆకాశగంగ అని యర్థమిచ్చు నామములతో వ్యవహరించిరి. ఇంద్రదైవత్యమైన జ్యేష్ఠనక్షత్ర మీ సాంద్రతరక్షీరోదప్రాంతమున నున్నది. ఈ యంశ ములు మనమున నిడుకొని, ఈ ప్రాంతపు టాకాశమును జాగ్రత్తగా పరిశీలించినపుడే ఋగ్వేదమునందలి యీక్రిందిమంత్రము(ఋIX.110.8 మనకు చక్కగా బోధపడగలదు: "దివఃపీయూషంపూర్వ్యం యదుక్థ్యమ్ మహోగహాద్దివ ఆనిరధుక్షత ఇంద్రమభిజాయమానం సమస్వరన్." ఈ మంత్రమున కర్థమిది : పురాతనమై, శ్లాఘాపాత్రమైన క్షీరోదమును, ఆకాశ గర్భమునుండి వెలికిదీసి, ఇంద్రు డావిర్భవించువేళకు వార లా దేవప్రభుని ఎలుగెత్తి స్తోత్రముచేసిరి. ఈ క్షీరోదమునకు ఉత్తర భాగ మున పలచనై తెలతెల్లగాతోచు దృశ్యమును మనవా రాకాశ గంగ యనిరి. ఆకాశ గంగాప్రవాహములు "చిమ్ములై చిదపలై జాలై తరంగంబులై" పోటెక్కుచు, పాయిగనుచు నుప్పతిల్లు నంభోఝరంబు లన నొప్పుచు చూపట్టుచుండును.

క్షీరోద, వియద్గంగా ప్రవాహములమధ్య నొక చక్కని చుక్కల గుంపున్నది. ఆ చుక్కలకూర్పు హంసయొక్క ఆకారమును

స్ఫురింప చేయుచున్నది. కావున వేదఋషులు ఈ చుక్కలను 'హంస' 'హగ్ంస' అనిరి. పిమ్మట మహాకవులు శ్రీహంసము రాజహంసయని వర్ణించిరి. పాశ్చాత్యులు ఈగుంపును సిగ్నస్ ('Cygnus') అనిరి. ఈ 'సిగ్నస్' శబ్దము 'హగ్ంస' శబ్దముయొక్క వికృతియని స్పష్టముగా తెలియుచునే యున్నది.

హంసయొక్క విశిష్ట లక్షణము నీరక్షీరవిభాగ నైపుణ్యమని మనదేశములో కవిసమయము. దానిననుసరించి భర్తృహరి "గుంభనమున దుగ్ధజీవనవిభాగవిధానవిరూఢ నైపుణీజనిత మహాయశస్సు" హంసకుగలదని వక్కాణించి యున్నాడు. బ్రహ్మకు వాహనము హంస. ఒకప్పుడు పక్షులన్నియు తెల్లబడిపోగా, బ్రహ్మదేవుడు తనహంస యేదో తెలిసికొనుటకు పాలును నీళ్ళును కలిపిన మిశ్రమమును ప్రతిపక్షి యొద్దకును తీసికొనివెళ్ళెనట! "నీరక్షీరే గృహీత్వా నిఖిల ఖగతతీ ర్యాతి నాళీకజన్మా" అని కాళిదాసు చాటువున్నది. మన దేశములో హంసక్షీరన్యాయమను నొక న్యాయమున్నది. ఒక గ్రంథములో మంచి సంగతులను గ్రహించి తదితరమును పరిహరింపుమని పాఠకులను వేడుకొనుచు గ్రంథకర్త హంసక్షీరన్యాయము నుగ్గడించును. అదే విధముగా నొక ఉపన్యాసములోని మంచి విషయములను మాత్రము గ్రహించి చెడ్డసంగతులను విడువుడని వక్తలు శ్రోతలను వేడుకొనుచుందురు. నీరక్షీర మిశ్రమంలో హంస పాలను గ్రహించి నీటిని పరిత్యజించును. భూగోళ ఖగోళములలో నిట్లు జరుగుట విశేషము. జ్యోతిర్గోళములో క్షీరోద దివిజగంగా ప్రవాహముల మధ్య నిలిచి హంస నక్షత్రములు నీరక్షీరముల వేర్పాటుగా విభజించుట మనోజ్ఞమైన దృశ్యము.

ఒకప్పుడు విష్ణుభగవానుడు త్రివిక్రముడై విశ్వమును మూడడుగులతో కొలచెను. అప్పుడు తెలిపిట్టరాతు—బ్రహ్మదేవుడు తన కమండలజలముతో విష్ణుపాదమును కడిగెనట! అప్పటినుండియు దివిజగంగ

విష్ణుపాదమున నుద్భవించి, దేవలోకమున ప్రవహించి, వళోరమా వక్షోజహారలతికనా నొప్పుచు తుదకు 'భోగి కంకణు' డగు నీశ్వరుని తలపై పూలదండవలె నొప్పుచున్నదని పురాణ వాఙ్మయము వర్ణించు చున్నది. "సీ. బ్రహ్మాండ భాండ సంపత్తి కుక్షినిగల్గు పద్మనాభుని పదాబ్జ మున బుట్టి" ఆ దేవదేవుని సత్పుత్రియైనది విజయగంగాభవాని. తొలుత సెలయేటివలె క్రింది కురికి హంసపదమును చేరుకొనుచున్న దివ్యదృశ్య మును చక్కగా పరికించి పాశ్చాత్య వైజ్ఞానికులు నేర్పుగా తీసిన తేజః పటము సింహాచల జలపాతములలో నాకాశ ధారను స్ఫురింపజేయ గలదు. ఎత్తునుండి జలధార దిగువ కురికినపుడు అల్లకల్లోలమై నురగలు గ్రక్కుట సహజము. కోపశీలురను శాంతింపజేయువారు కూడ కొందరుందురు. శాంతమునకు నిదానమునకు హంస పెట్టినది పేరు. కనుక మన ఖగోళ రాజహంస తన పదమునకు జారిపడినది విజయగంగా ప్రవాహము యొక్క కల్లోల భీభత్సరూపముడిపి, ద్యా జలములకు నెమ్మది చేకూర్చుచున్నది. హంసపద మంటినంతనే మిన్నేరు కల్లోల ముడిగి, శాంతి స్వరూపమును పొందుచున్నది. ఈ యంశమే ఋగ్వేదము X-124-9 లో కనులకు కట్టిన ట్లెంతో రమ్యముగా వర్ణింపబడియున్నది : "బీభత్సూనాం సయుజం హంసమాహు రపాం దివ్యానాం సఖే చరంతం" ఆకాశగంగా ప్రవాహమునకు ఉద్రేకముడిపి, మృదుస్పర్శ మాత్రముచేత శాంతి ప్రసాదించుచు చరించు మిత్రరూప మునే హంసయందురు.

ఇట్లు విష్ణుపాదోద్భవియైన త్రిదశేశ్వరి హంస పాదస్పర్శచే పరమశాంతమూర్తియై ప్రవహించుచు పోయిపోయి తుదకు "అఖిల లోకాధ్యక్షుడై మించి విహరించు శివు జటా జూటాగ్రసీమ"ను చేరు కొనినది. శివుడనగా రుద్రుడు. మన యిరువదేడు నక్షత్రములలో ఆర్ద్ర నక్షత్రము రుద్రదైవత్యము. కాబట్టి హంసపదము విడిచిన ఆకాశగంగ తుదకు ఈశ్వర జటాజూటమునే చేరుకొనినది.

## గంగోత్పత్తి - గంగావతరణము :

మన పంచాంగకర్తలు వైశాఖ శుద్ధ సప్తమినాడు గంగోత్పత్తి, గంగావతరణము నని వ్రాయుచుందురు. ఆనాటి సాయంకాలమున సూర్యాస్తమాన మైనపిదప, కొంతలో తూర్పున విష్ణుపాద నక్షత్రములును, అందు ప్రాదుర్భావము నొందినట్లగపడు నాకాశగంగా స్వరూపమును గోచరించును. దివిజగంగాప్రవాహము హంసపదమును అతిక్రమించి పడమటగా ప్రవహించి ప్రవహించి తుదకు ఆర్ద్ర నక్షత్రముపై నిలుచుచున్న దృశ్యము స్పష్టముగా ఖగోళమున చూడగలము. అంతకు ముందుదినములలో నా వేళకు చూతమన్న విష్ణుపాద ముదయింపదు. ఆ తరువాతి దినములలో నా వేళకు ఆర్ద్ర నక్షత్ర మస్తమించును. కాబట్టి విష్ణుపదమున ప్రభవించుట మొదలుగా, ఆకాశ గంగ శివుజటాజూటము చేరుకొనువరకు గల దివ్యదృశ్యము ఆనాడు మనకు చక్కగా పూర్తిగా దృగ్గోచరమగుచుండును గనుక మన పూర్వులు వైశాఖశుద్ధ సప్తమీ దినమున గంగోత్పత్తియని నిర్ణయించిరి. ఖగోళమునందలి విశేషదృశ్యముల యొక్క వివరము లెంత సూక్ష్మముగా పరిశీలించి సంవత్సరములో నొకొక్క దినమునకు ఒకొక్క ప్రాముఖ్యమును మన పూర్వు లిచ్చియుండిరో మనకు ఆకాశగంగ సంబంధమైన చర్చవలన కొంత తెలియవగుచున్నది. **Milky Way** అని పాశ్చాత్యులచే వ్యవహరింపబడు నీ పాలవెల్లిని మన పూర్వ ఋషివర్యులెంత సూక్ష్మముగా పరిశోధించి ఎంత చక్కటి వివరములను తెలిసికొని మన లాభమునిమిత్త మెంత దివ్యవాఙ్మయము గూర్చిరో యోచింపుడు. శివమహిమ్నస్తోత్రము నందలి ఈ క్రింది శ్లోకముల నీ సందర్భమున స్మరించుట మనవిధి :—

'వేదం నభోమండల మంబురాశి
ర్నైశాశ్చ తారా నవఫేనభంగాః'

'వియద్వ్యాపీ తారాగణ గుణిత ఫేనోద్గమరుచిః
ప్రవాహో వారమ్యః పృషతి లఘుదృష్టిః శిరసి తే
జగద్ద్వీపాకారం జగతి వలయం తేన కృతమి
త్యనన్యైవోన్నేయం ధృతమహిత దివ్యం తవ వపుః.

**నీహార ప్రాకృతతారలు (The Nebulae) :**

సృష్టికథన మనేక గ్రంథములలో ననేక విధములుగా తెలుప బడినది. ఏడు వేల సంవత్సరముల లోపుననే యీ సృష్టి ఆరుదినములలో పూర్తి యయినదనెడి బైబిల్ కథను నవీన వైజ్ఞానికు లంగీకరింపలేదని మన మీవఱకే తెలిసికొంటిమి. నవీన వైజ్ఞానికులలో మిక్కిలి ప్రాము ఖ్యమును గడించి ఈమధ్యనే దివంగతుడైన సర్ జేమ్సు జీన్స్ దొరగారు సృష్టి పరిణామక్రమమును నిట్లు వివరించెను.

అవ్యక్తసంకులస్థితి (Chaos); ఆస్థితినుండి నీహారసదృశావస్థ; ఆ యవస్థనుండి క్రమముగానక్షత్రోత్పత్తి; అటుపిమ్మట కొన్నినక్షత్రములు జంటలుగా నేర్పడును; జంటలనుండి మరికొన్ని చిన్నచుక్క లేర్పడును; వానినుండి గ్రహములు; గ్రహములనుండి యుపగ్రహములు గ్రహ కణములు నేర్పడును. మనభూమి సూర్యునిచుట్టు పరిభ్రమించు నొక యుపగ్రహము. సృష్టివికాసమును గూర్చి నవీన వైజ్ఞానికుల యభి ప్రాయమిది.

ఇందునుగూర్చి మన ప్రాచీనులేమి తెలిపిరి? ఆ తెలిపిన విషయ ములు నవీన వైజ్ఞానికు లామోదించి స్థిరపరుతురా? లేక పరిహ రింతురా ?

బైబిల్ గ్రంథము తెలిపినట్లు, భగవంతుని ఇచ్ఛా మాత్రముచేత భూమి యనగనే భూమి, ఆకాశమనగానే ఆకాశము, జలమనగానే జలము, స్థలమనగానే స్థలము, అని యీవిధముగా భగవంతుడు నోటితో వక్కాణించినంతలో నొకటొకటే ఆరుదినములకాలములో నట్టె పుట్టు కొని వచ్చెనని వేదఋషులు భావింపలేదు. విశ్వములోని వివిధాంత

ర్భాగములు ఆకస్మికసృష్టి ఫలితములుకావు. సక్రమ పరిణామ ఫలిత ములు: "ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యాఓషధయః, ఓషధీభ్యో (అ) న్నం, అన్నాత్పురుషః, అనునది సృష్టి పరిణామక్రమమును చక్కగా తెలుపుచున్నది.

(Chaos) ప్రళయానంతరము ఆకాశమునుండి వాయుపదార్థ ములు ప్రాదుర్భవించు సందర్భములో, పొగమంచుతో నుపమింపతగిన తెలతెల్లనివాయురూపములు, ధవళాకారములతో వెలువడి ఖగోళమున దృశ్యాదృశ్యములుగ నుండుచుండెను. ఆ వెలిమబ్బులు తమలోతామే పరిభ్రమించుచు నానావిధవస్తు జంతురూపములు గలిగి మింటనొప్పారు చున్నవి. అందుకొన్ని చక్రాకృతి (Ring-like appearance) గలవి; కొన్ని శంఖాకృతి గలవి. (Spiral Nebulae) ఒకటి కర్కాటకరూపము గలది. (Crab Nebula); మరొకటి గుడ్లగూబవంటిది. (Owl Nebula); ఇంకొకటి మనవారు వ్యాయామముచేయు (Dumb-bell) ముద్గర రూపముగలది. కొన్ని పత్తిబోజలను, కొన్ని ఉల్లిపాయలను కొన్ని చామగడ్డలు, దుంప పసుపులోనగు పదార్థ రూపములను కలిగి ఖగోళ మున తేలియాడుచున్నవి. జ్యోతిశ్శాస్త్రవేత్తలు ఇప్పటికొక ఇరువది లక్షల చుక్కమబ్బులను గుర్తించియున్నారు.

ఈ మబ్బులన్నింటిలో మిక్కిలి ప్రాముఖ్యము గనినది (Ring Nebula in Lyra) వీణామండల మనబడు నక్షత్రసమూహములో నడుగున గోచరించు వెలిమబ్బు. ఇది విభూదిబొట్టువలె తెల్లగ గుండ్రగ నగుపడును. గుండ్రగ నుండుటచేత పడమటివారు దీనిని ఉంగరముతో బోల్చి Ring Nebula అనిరి. దీనిని ఉంగరమనుటకంటె, శ్రీనాథమహా కవి తెలిపినట్లు "పొడవు మిగిలిన పొందమ్మిపూవు" అనుటఎంతయు ఒప్పియుండును. మన పురాణకథలలో బ్రహ్మదేవుడు పద్మాసనుడు; చతుర్ముఖుడు; వాణీపతి; 'చిరాయ దధతో ముఖ అన్నట్లు వాణిని బ్రహ్మ తన ముఖమందు ధరించినాడు. సరస్వతి వీణాపాణి, వాణీ

హిరణ్యగర్భులకు వాహనము హంస. పద్మాకృతిగల యీ చుక్క-మబ్బు పరిసరమున బ్రహ్మ సరస్వతీదంపతుల విశిష్ట లక్షణములును పరివారమును జ్యోతిశ్శాస్త్రదృష్ట్యా చక్కగా ఒప్పియుండుట గమనింపవలసిన విశేషము. ఎట్లనగా పద్మాకృతిగల వెలిమబ్బునుండ మొదట నొక చుక్క వెలువడి పిమ్మట రెండైనది. అందొకొక్కటి మరల రెండైనవి. ఒకజంటలోని చుక్కలు ఒకదాని చుట్టు నొకటి పరిభ్రమించుచున్నవి. అదేవిధమున రెండవ జంటలోని చుక్కలును ఒకదానిచుట్టును రెండవది పరిభ్రమించు చున్నది. మొదటి జంట రెంటవజంట చుట్టును, రెండవజంట మొదటిజంట చుట్టును పరిభ్రమించు చుండుటకూడ విచిత్రము. ఈయంశము లీనాటి యంత్రపరిశోధనముచే ధ్రువపరుప బడినవి. ఈనాలుగు చుక్కలును బ్రహ్మదేవుని నాలుగు ముఖములని మనవారు తెలిపిరి. చతుర్ముఖుడీ పద్మముపై నాసీనుడై యున్నాడు. అతని ముఖములందు సరస్వతి గలదు. సరస్వతి ధరించిన వీణనుబట్టియే యీ చుక్కల గుంపునకు వీణామండలమను నామము ప్రాక్పశ్చిమ జ్యోతిశ్శాస్త్రములందు రూఢమైనది. ఇక బ్రహ్మ సృష్టికర్తయను నంశము మిగిలియున్నది. ఈ యంశముకూడ ఈక్రింది వేదవాక్యములను నవీన శాస్త్రదృష్టితో నన్వయించుకొనినచో సర్వమును తేటతెల్లముకాగలదు. ఒకానొక ప్రత్యేకరూపముతో తయారు కాబడుచున్న నీహారతారా విషయము ఋగ్వేదములో నిట్లువర్ణితము (ఋ X-82-7.)

౧. నతం విదథాయ ఇమా జనా నాన్యద్యుష్మాక మంతరం బభూవ *నీహారేణ* ప్రావృతా జల్ప్యా చాసుతృప ఉక్థశాసశ్చరంతి.

౨. అన్యదన్యద సూర్యం వసానానిమాయినో మామిరే రూపమస్మిన్. (ఋగ్వేదము III-38-7.)

ఇందు తొలి మంత్రములో నీహార ప్రావృతమైన దొకటి మీమధ్య పొడచూపినదని తెలుపబడినది. తెలతెల్లగా దట్టమగు పొగ

మంచునుబోలి ధవళధవళమై గన్పట్టు నాచుక్కమబ్బును 'నీహార ప్రాకృత'మనుట ఎంతో ఒప్పియున్నది. తెలిమబ్బును వర్ణించుటకు 'నీహారము' కంటె మంచిమాట సంస్కృతభాషలో నేలేదు. కుశలురగు పనివాండ్రు కొత్తరూపముతో క్రొత్త తెల్లమబ్బు నొకదానిని జ్యోతిర్లోకమున తయారు చేయుచున్నారనియు నది నీహార ప్రావృతమైనట్లు కనబడుచున్నదనియు నామంత్రమున కర్థము. రెండవ మంత్రముకూడ క్రొత్త యాకృతిని దాల్చుచున్న మరొక చుక్క మబ్బును ప్రశంసించు చున్నది. కాబట్టి ప్రాచీన కాలములో వేదఋషులు దృశ్యాదృశ్యముగా నాకాశమున పొగమంచును బోలిన తెలిమబ్బులకు, ఆ మబ్బులచే నావరింపబడిన చుక్కలను, వానివాని యాకార భేదములను చక్కగా గమనించి శాశ్వతముగా వేదములో గ్రంథస్థము చేసినవై చిరని రూఢి యగుచున్నది. అంతేకాదు, ఈ చుక్క మబ్బులనుండియే విశ్వోత్పత్తి యగుచున్నదనికూడ వారు ఖండితముగా తెలిపిరి.

"అజస్యనాభా వధ్యేకమర్పితం యస్మిన్ విశ్వాని భువనాని తస్థు."
(ఋగ్వేదము X-82-6)

**"In that vast gaseous cloud, in that nebula, which once floated in the death-cold realms of speech, there were the elements of all that is. All that is, all that was, all that ever will be came from that gas."** అని మేక్మిలన్ దొరగారు మనభూమి పుట్టుపూర్వోత్తరములను గురించి వ్రాసిన గ్రంథము 58 పుటలో వ్రాసియున్నారు. ఈ వాక్యమున కర్థమేమనగా : "ఈనాటి ప్రాణికోట్లకు శీఘ్ర మృత్యుహేతువనదగు దారుణ శీతల పరిసరమధ్యమున నొకప్పుడు విశాలాకాశమున తేలియాడుచుండిన ఆమబ్బులోనే, అపారవ్యాప్తిగల ఆ తెల్లయావిరి మేఘములోనే ఈనాడు మన కగపడుచున్న సమస్తమునకు బీజములును, మూలపదార్థములును చేరియుండినవి. విశ్వములో ఇదివరకు

మండినవి, ఈవాడున్నవి, ఇటుపైమండబోవునవి— ఈ సమస్త వస్తుజాలములు ఆ తెల్లమబ్బునుండియే ఆవిర్భవించినవి; ఆవిర్భవించుచున్నవి; ఆవిర్భవింపగలవు."

ఈ వాక్యములు "యస్మిన్ విశ్వాని భువనాని తస్థు" అను పై వేదవాక్యమునకు ఎంత చక్కని వ్యాఖ్యానములై యొప్పుచున్నవి! వేదములో ప్రవచింపబడిన మహత్తర ప్రకృతి సత్యముల నివి యెట్లు ధ్రువపరచుచున్నవో పాఠకులు యోజించుకొగలరు.

శ్రీ

# జ్యోతిర్వేదము

## మూడవ ప్రకరణము

**దేవతలకు నక్షత్రములతోగల సంబంధము - జ్యోతిర్లోకము :**

అపారగభీర సంవ్యాప్తము ! అనంతము !
నిర్మేఘ సమున్నత మహాసౌధాగ్రము !
సువర్ణ తేజోవిభ్రాజమాన స్వర్గోద్యానము !
సర్వదేవతాలయము ! సమస్తదేవతాస్థానమండపము.

భయభక్త్యావేశములతో బహుతరముల మానవకోట్లు సాష్టాంగ దండప్రమాణములతో పూజించి సేవించు పుణ్యలోకవాసము నాటికి, నేటికి, నెప్పటికి నుండు నిర్జరనిలయము.

దివ్యధామము ! జ్యోతిర్లోకము ! (షెల్లీ మహాకవి.)

చూడండి ఒక్కొక్క నక్షత్రమునే ఓపికకొలది పట్టిపరికించిచూడండి! దురూహ్యమైనంత దూరమునందున్ననూ, మీ దృష్టి కందగలిగిన ప్రతి నక్షత్రమును బాగుగా పరిశీలించి చూడండి ! ఒకొక్క నక్షత్ర మొకొక్క లోకము సుమండీ ! బహు గొప్పలోకము ! ఎన్నివిధముల జీవరాసులెన్నెన్ని అందొకొక్కలోకమున నివసించుచున్నవో ? ఆ బ్రహ్మాండముల యెదుట మన భూగోళమనగా నెంత ? ఒక గోళీకాయ! మట్టి గొట్టికాయ ! సృష్టిలో మన సూర్యుడొక మిణుగురుపురుగు ! విస్తైజ భూగోళ మం దొక ప్రయుతాంశము ! మానవుడనగా నెంత ? సముద్రమున కాకిరెట్ట ! ఝంఝామారుతమున చిక్కి స్రుక్కుచున్న సూక్ష్మక్రిమి ! సూక్ష్మాతి సూక్ష్మక్రిమిమాత్రుడు. అంతే !

(కవయిత్రి హేమన్సుసతి.)

ఒక్క విషయము నిశ్చయముగా వక్కాణింపగలము. "ఉజ్జ్వల లసత్తర తారకహారపంక్తులతో" వెలుగొందు ఖగోళమును వేదకాలపు ఋషు లతినిశితదృష్టితో పరిశీలించుచుండిరి. ఋగ్వేదములో నే సూక్తమును శ్రద్ధగా చదివిచూచినను, ఆ సూక్తకారుడు సూక్ష్మముగా ఖగోళవిశేషముల నతిశ్రద్ధతో పరిశీలించుచుండిన నక్షత్రవిద్యావిశారదుడని తేటపడగలదు. వా రే దృష్టితో ఖగోళవేధ చేసిరో మనముకూడ నా దృష్టితోనే వేదవాక్య సమన్వయము చేసికోవలెను. లేనిపక్షమున వేదార్థ మస్పష్టము నగమ్యగోచరమును కాగలదు. ఇటీవల నింగ్లండు దేశమున జనించిన షెల్లీమహాకవివలె వారు ఖగోళము నిర్జర నిలయమనియు, దేవతుల దివ్యధామము, సమస్త దేవతల కాశ్రయమైన మహోజ్జ్వల దేవాలయమనియు భావించి, భయభక్త్యావేశములతో భజించుచుండిరి. ఇటీవలి ఇంగ్లీషు కవయిత్రి, హీమన్సు సతివలెనే వారు విశాల విశ్వమనంతమనియు, పంచఖండ, పంచమహాసముద్ర ముద్రితమైన యీభూగోళమంతయు గొట్టికాయంత మట్టియుండ మాత్రమేననియు, దానిపై నివసించి మిట్టిపడు మానవు డొక సూక్ష్మక్రిమిమాత్రుడేననియు చక్కగా గ్రహించిరి. గ్రహ, ఉపగ్రహ, గ్రహకణ, ధూమకేతు, ఉల్కా మహోల్కాదులు చేరి యేర్పడిన సూర్యకుటుంబమును వా రతిశ్రద్ధతో పరికించిరి; ఆపైని, ముత్యములు, వజ్రపుపొడులు లోనగు వానివలె లావణ్యముతోడను, తళుకుబెళుకుల తోడను మెఱయు నేకైక తారలను, తారాసముదయములను, దివిజ గంగా ప్రవాహమును (Milky way) గుండ్రగుత్తులు (Globe - clusters) గా నేర్పడు నక్షత్ర సహస్రములను, నీహార ప్రాకృతము లని వర్ణింపబడు చుక్కమబ్బులను (Nebulae) వార లతిచాకచక్యముతో పరికించి నిరూపించియున్నారు; అంతేకాదు వాని వివరములను కూడ స్పష్టముగా విశదము చేసియున్నారు. ఈ గ్రంథములో సందర్భానుసారముగా నా వివరముల నెత్తుకొని చర్చింతుము.

**తారాసముదయములు (Number of Constellations) :**

పాశ్చాత్యదేశములలో నవీనజ్యోతిశ్శాస్త్ర గ్రంథములందు తారాసముదయముల వివరములు గలవు. యంత్ర సాహాయ్యములేక, మానవనేత్రములకు కానవచ్చు నక్షత్రముల నన్నిటిని వారు నూటపది గుంపుల క్రింద విభజించినారు. విలియమ్ పెక్ (William Peck) దొరగారు రచించిన గ్రంథము తారా సముదయములు (Constellations and How to find them!), వానింబోల్చి తెలిసికొను క్రమము అను గ్రంథములో నీ నూటపదింటిని పేర్కొని వానినిమూడు తరగతులుగా విభజించినారు. (1) అతిప్రాచీన కాలమునుండి తెలిసిన చుక్కల గుంపులు - నలుబది యెనిమిది ఇందు ఇరువదియొక్క సంఖ్యగలవి ఉత్తరాకాశమున గానవచ్చినవి; ఆకాశమధ్యమున గానవచ్చు ద్వాదశ రాశ్యాత్మకమైన నక్షత్రముల గుంపులు పండ్రెండు; దక్షిణాకాశమున కనబడునవి పదునైదు గుంపులు. ఇవిగాక నవీనముగా తెలిసికొని పేరులుపెట్టిన గుంపులు అరువది రెండున్నవి. నవీనమనగా క్రీస్తు పూర్వము 200 సంవత్సరములనుండి అనంతరము 1800 సంవత్సరములు మొత్తము రెండువేల సంవత్సరములలో క్రొత్తగా పరిశోధకులు చేర్చుకొనినవని యర్థము. ఈ యరువది రెండింటిలో నిరువదియైదు వాడుకలో లేవు. వాడుకలోలేని గుంపుల నామములముందు చుక్క గుఱుతులు (asterisks) పెట్టి, వానికి ప్రాచుర్యములేదని పెక్ దొరగారు ఎఱుగజెప్పినారు. వాడుకలోలేని ఈ పాతిక గుంపులను మినహాయించగా, మిగిలిన ముప్పదియేడు నవీన తారాసముదయములును, ప్రాచీనములు నలుబదియెనిమిదియును మొత్తము ఎనుబదియైదు చుక్కల గుంపులు మాత్రము నవీనజ్యోతిశ్శాస్త్ర గ్రంథములలో పేర్కొనబడుచు, వివరింపబడుచున్నవి.

ఇట్లు ఎనుబదియైదు గుంపులుగా విభజింపబడిన తారాసముదయముల నామములన్నియు నించుమించుగా వేదమునందును, వేద పురాణ

వాఙ్మయమునందును స్పష్టముగా పేర్కొనబడియుండుట మహాశ్చర్య కారణము. ఈ నామములు కొన్ని పాశ్చాత్యదేశములవారి నోళ్లలో బడి, నలిగి, వికృతాకారముల నొందినవి. ఉదాహరణార్థము అట్టివి కొన్ని మనవిచేయుచున్నాను. విశాఖుడగు కుమారస్వామి పేర కట్ట బడిన విశాఖపట్టణము ఆ పేరు సరిగా నుచ్చరింపలేని పడమటిదొరల నోళ్లలోబడి Vizagapatam, Vizag అయినది. వారి ననుకరింపబోయి మన పామరులు 'వైజాగ్' అనుచున్నారు. ఇట్లే కాళీఘట్టము Calcutta అయినది. నగరనామములే యిట్లు నలిగి వికృతములై నపుడు నక్షత్రనామములమాట వేరె చెప్పవలెనా? మన 'భూతేశు'డగు శివుడు పడమట 'బూటీస్' (Bootes) అయినాడు. (ఇంకను బూట్లు అనబడు కాలిజోళ్ళు కాలేదు.) పూర్వశ్వానమని వేదము పేర్కొనిన చుక్కల గుంపులను పడమటి వారు 'ప్రొశ్యాన్' (Procyan) అను చున్నారు ఇట్లే 'పరివృత్త' బిలాట్రిక్స్ (Bellatrix) అయినది. 'పేద్వఘాశ్యము' 'పెగసస్' (Pegasus) అయిపోయినది. హరి. (యాదవ) కులేశుడు 'హెర్క్యులీస్' (Hercules) అయిపోయినాడు. ఇట్లే యెనుబదియైదు గుంపుల నామములను గూర్చి క్రమముగా తెలిసికోగలము.

మన కగపడుచున్న గమనవిధానములనుబట్టి సూర్య, చంద్ర, బుధ, గురు, శుక్ర, శనైశ్చరాది గ్రహములు తమ యిష్టమువచ్చినట్లు సంచరింపజాలవనుట నిశ్చయము ఈ గ్రహగణము ఉత్తరమున ధ్రువ, సప్తర్షి మండల ప్రాంతమున నెన్నడును కనబడదు. దక్షిణమున త్రిశంకు, దక్షిణధ్రువ ప్రాంతములను కనబడదు. ఆకాశమధ్యమున నిరువది యేడు నక్షత్రసముదాయముల మీదుగా నేర్పడిన రస్తాననుసరించుచు, తూర్పున పొడమి, పడమట నస్తమించును. ఈ రస్తానే మనవారు క్రాంతి వృత్తమనియు, జ్యోతిశ్చక్రమనియు వ్యవహరింతురు. దీనినే పడమటివారు 'ఎక్లిప్టిక్' (Ecliptic) అనుచుందురు. చంద్రు డీ

చక్రమును సుమారు ఇరువదియేడు దినములలో నొకసారి తిరిగి రాగలడు. కనుక నీచక్రమును గణకు లిరువదియేడు భాగములక్రింద విభజించిరి. ఒకొక్క భాగమున కొకొక్క నామ ముంచిరి. ఈ యిరువ దేడు భాగముల నామములే అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి మొద లగునవి. చంద్రు డొకొక్కరాత్రి ఇం దొకొక్క నక్షత్రముచెంత కనబడుచుండును కావున జనసామాన్యమునకు బోధపడునట్లు చంద్రుని కిరువదేడుగురు భార్యలనియు, నత డొకొక్కరాత్రి యొకొక్క నక్షత్రముతో కూడియుండుననియు పౌరాణికులు గాథ లల్లిరి. నిజమున కీ యశ్విన్యాదులు మైలురాళ్లు వంటివి. గ్రహములే మార్గము ననుసరించుచున్నట్లు మన కగపడునో ఆమార్గ వివరములం జూపు చిహ్నములివి. గ్రహముల ననుసరించు మార్గమును రైలు పట్టాలతో నుపమించితిమేని, ఆ మార్గమున నటునిటు కనపడు అశ్విన్యాది నక్షత్రములకు రైలు పరిభాషలో స్టేషనులన తగియుండును. పడమటి ఖండములవారును ఆ దేశములలో సుప్రసిద్ధులైన మానవమాత్రుల పేర కొన్ని నెలలపేర్లు పెట్టుకున్నారు. మన పూర్వు లట్లుగాక శాశ్వతము లైన మాసనామములు అనిత్యమగు మానవుల నామములతో గుది గ్రుచ్చలేదు. మనదేశమునం దంతటను నిత్యమును వాడుకలోనున్న చైత్ర వైశాఖాది మాసనామము లీ నక్షత్రములనుబట్టి యేర్పడినవి.

**నక్షత్రములనుబట్టి మాసనామములు :**

కృత్తికానక్షత్రములు పున్నమచంద్రునితో కూడియుండిన మాసము కార్తికము.

మృగశిరా నక్షత్రములు పున్నమచంద్రునితో కూడియుండిన మాసము మార్గశిరము.

పుష్యమీ నక్షత్రములు పున్నమచంద్రునితో కూడియుండిన మాసము పుష్యమాసము.

మఘా నక్షత్రములు పున్నమచంద్రునితో కూడియుండిన మాసము మాఘమాసము.

ఫల్గునీ నక్షత్రములు పున్నమచంద్రునితో కూడియుండిన మాసము ఫాల్గునము.

చిత్రా నక్షత్రములు పున్నమచంద్రునితో కూడియుండిన మాసము చైత్రము.

విశాఖానక్షత్రములు పున్నమచంద్రునితో కూడిన మాసము వైశాఖమాసము.

జ్యేష్ఠా నక్షత్రములు పున్నమచంద్రునితో కూడిన మాసము జ్యేష్ఠమాసము.

ఆషాఢా నక్షత్రములు పున్నమచంద్రునితో కూడిన మాసము ఆషాఢమాసము.

శ్రవణ నక్షత్రములు పున్నమచంద్రునితో కూడిన మాసము శ్రావణమాసము.

భాద్రపదా నక్షత్రములు పున్నమచంద్రునితో కూడిన మాసము భాద్రపదమాసము.

అశ్వినీ నక్షత్రములు పున్నమచంద్రునితో కూడిన మాసము ఆశ్వయుజమాసము.

ఈ యిరువదేడు నక్షత్రములును, మేషము, వృషభము, మిథునము, కర్కాటము మొదలగు పంద్రెండు రాసులుగా విభజింప బడినవి. కాబట్టి ఒకొక్క రాశి $\frac{27}{12}=\frac{9}{4}=2\frac{1}{4}$ రెండు నక్షత్రములపై నొక పాదమగును. ఈ రాసులనంతకుమును దేశ్యాకరనియు, గ్రీకుల నుండి క్రొత్తగా దిగుమతిచేసి నేర్చుకొనిరనియు మిథ్యాపవాదము ప్రబలియున్నది. ఈ యపవాదము కేవలము నిరాధారమైనదని యీ తరువాతి ప్రకరణములలో సప్రమాణముగా నిరూపించు చున్నాను. ఆ విషయము నందుకొని చర్చింపక పూర్వము కొన్ని

విశేషములను - నక్షత్రగమనములతో సంబంధించిన విశిష్టవిషయములను చర్చించి తెలిసికొనుట యావశ్యకము గావున వందు కుపక్రమించుచున్నాను.

**సూర్యనక్షత్ర సంగమముకార్తె ;**
**సూర్యోదయాత్పూర్వమును సూర్యాస్తమయానంతరమును**
**నక్షత్రోదయమునగల విశిష్టత :**

చుక్కలు తూర్పున నుదయమగును; పడమట నస్తమించును. కాని ప్రతిదినమును తూర్పున నుదయించి చుక్కలన్నియు నొక్కసారి యస్తమింపవు. భూమి తనలోతాను తిరుగుకొనుచు సూర్యుని చుట్టు ప్రదక్షిణముచేయుచున్నది. అందువలన కొన్ని చుక్కలు సూర్యునితో నుదయమై పగలెల్ల కానరాకయే సాయంకాలము సూర్యునితో నస్తమించును. కాబట్టి రాత్రి యేవేళను ఆ నక్షత్రములు అసలు కానరావు. ఈ సూర్యనక్షత్ర సంగమమునకే కార్తెయని పేరు. ఒక తారగాని, తారాసముదయముకాని సుమారు పదమూడురోజులు కార్తెలోనుండి, పిమ్మట సూర్యుడు తరువాతి నక్షత్రముతో సంగమించినంతనే, అనగా తరువాతి కార్తెలో ప్రవేశించినంతనే సూర్యోదయాత్పూర్వము తూర్పున నుదయించును. ఈ నక్షత్రోదయమును పడమటివారు (Heliacal rising) 'ప్రొద్దు పొడుపునకు ముందు పొడుచుట'యందురు. ఈ వేళ సూర్యోదయమునకు ముందు తూర్పున నుదయమైన నక్షత్రము రేపు ఆవేళకు నాలుగు మినిట్లకు ముందు ఉదయించును. తొలినాటికంటె మరునాడు నాల్గుమినిట్లు ముందు అచుక్క ఉదయించుటకు భూభ్రమణమే కారణము. మూడవనాడు ఎనిమిది మినిట్లు ముందుగా నుదయించుచు క్రమముగా పదునైదు దినములనాటికి అరువది మినిట్లు అనగా ఒక గంట సూర్యోదయాత్పూర్వ మా తార తూర్పున పొడుచును. నెలనాటికి ఆ తారయే

సూర్యోదయమునకు రెండు గంటలు ముందుగా నుదయమగును. ఆరు నెలలనాడా చుక్కయే సూర్యోదయమునకు ముందు పండ్రెండు గంటలప్పుడు అనగా సూర్యాస్తమానము కాగానే తూర్పున నుదయము కాగలదు. ప్రొద్దుపోవు వేళ కా నక్షత్రము తూర్పున పొడుచుటను పడమటివారు ఎక్రానికల్ రైజింగ్ (Acronycol rising) అందురు. ఒక్కొక్క నక్షత్రము సూర్యునితో సంగమమున నుండినపుడు, ఆ కాలైలో భూమిమీది భౌతిక పరిస్థితులెట్లుండును ? అచుక్క తొలిసారి ప్రొద్దుపొడుపుకుముందు తూర్పున నుదయించుటచే కలుగు ప్రయోజనమేమి ? ఆచుక్కయే మరి యారు నెలలనాడు ప్రొద్దు క్రుంకినవేళ తూర్పున నుదయమైనపుడు భూమిమీది భౌతిక పరిస్థితులు వర్షాగమన శీతోష్ణ ప్రజామనస్సంచలనాది విషయము లెట్లుండును ? అనునవి యానాటి వేదఋషుల దృష్టి నాకర్షించి, వారిచే జాగ్రతగా పరిశీలింపబడినవి. ఆ పరిశీలనా ఫలితముగా ప్రజల మత సాంఘిక ఆచార వ్యవహార జీవనమంతయు నిర్ణీతమైనది.

## వేదకాలమున ఖగోళ వేధ :

సంవత్సరము పొడుగునను జాగ్రతగా చూచిన యెడల జ్యోతిశ్చక్రములోనున్న ఏదేని యొక నక్షత్రముగాని తారా సముదయముగాని సంవత్సరములో నొక్క దినమందే ప్రొద్దు పొడుపునకుముం దతి సన్నిహితముగా నవ్యవధానముగా నుదయించగలదు. అదే (Heliacal rising) తొలి పొడుపు దినము. ఆ మరునా డీ చుక్క తొలినాటికంటె సుమారు నాలుగు మినిట్లు ముందే ఉదయించును. తొలిపొడుపు దినమే గణ్యము. మరునాడు, మూడవనాడు - ఇవియంత లెక్కలోనికి రాజాలవు. ఒక్కొక్క నక్షత్రముయొక్క తొలిపొడుపు దినము కొఱకు వేదఋషు లెంతో శ్రద్ధతో సూర్యోదయాత్పూర్వము వేధించి వెదుకుచుండిరి. బ్రహ్మముహూర్తమున వారీ వేధ తప్పక చేయుచుండుట

మూలముగా జ్యోతిశ్చక్రమున సూర్యుడే నా దెచ్చుట నుండినట్లు కన బడువను విషయము స్పష్టముగా తెలుచుండెను. ఈ సందర్భములను చర్చించుచు లోకమాన్యులు బాలగంగాధర తిలకుగారు, 'తైత్తిరీయ బ్రాహ్మణము' నందలి యీ క్రింది రచన ముదాహరించుట యెంతయు సమంజసము. (చూ. తై. బ్రాహ్మ. I. 5. 2.1; ఓరియన్. 18, 38 పుటలు) "యత్పుణ్యం నక్షత్రం తద్వదకుర్వీతోప వ్యుషమ్। యదా వై సూర్య ఉదేతి అథనక్షత్రం నైతి। యావతి తత్ర సూర్యోగచ్ఛేత్ యత్ర జఘన్యం పశ్యేత్। తావత్కుర్వీత యత్రకారీస్యాత్ పుణ్యాహ ఏవ కురుతే." ఈనాడుకూడ పుణ్యాహవాచన సందర్భమున మన పురో హితు లీ మంత్రమును చదువుచున్నారు.

ఒక్కొక్క నక్షత్రముయొక్క కార్తె దినములలో భూమి మీది పరిస్థితులెట్లుండినవి? ప్రొద్దుపొడుపునకు ముందుగాని ప్రొద్దు గ్రుంకిన పిమ్మటగాని సన్నిహితముగా నా చుక్క తూర్పున తొలిసారి ఉదయించినప్పటి పరిస్థితు లెట్లున్నవి? అను విషయములను చాలకాలము పరిశీలించి, వేదఋషు లీ పరిస్థితు లేర్పడుట కా నక్షత్రోదయమే కారణ మని ఈ పరిస్థితుల కా నక్షత్రముతో సంబంధమున్నట్లు భావించిరి. అంతేకాదు; ఈ నక్షత్రములకు దేవత్వమారోపించి, ఈ నక్షత్రాధి దేవతయే యీ పరిస్థితులు భూమిమీద కలిగించెనని నిర్ణయించిరి. ఈ క్రింది యుదాహరణములను జాగ్రతగా పరిశీలించినచో పై వాక్యార్థములు స్పష్టము కాగలవు.

## కృత్తికా నక్షత్రము అగ్నిదైవత్యము:

సూర్యభగవానుడు కృత్తికలతో సంగమమున నున్న దినము లలో—ననగా కృత్తికకార్తె దినములలో మనదేశమున వేడిగాడ్పులు వీచుచుండుటచేత మన మందరము దుర్భరతాపముతో బాధ పడు చుందుము. సంవత్సరము పొడుగున నింతటి వేండ్రము సాధారణ

ముగా మరేమానమునందును చూడము. మామూలుగా మన మిత్రుడైన సూర్యుడీ యున్నతరంగములతో ప్రజలనువేచి, మంగలమునబడవైచినట్లు మాడ్చిపీడించుటకు హేతువేమై యుండవలెను? సహవాసదోషము! సూర్యునికీ కృత్తిక నక్షత్రములతో కలిగిన సహవాసదోషము చేతనే లోకమున నుష్ణబాధ చెలరేగినది. కృత్తికలతో సహవాస మాత్రమున నింత దారుణోష్ణబాధ లోకమున వ్యాపింపగల్గినచో, నసలు కృత్తిక లెట్టివై యుండవలెను? అగ్నిదేవతాస్వరూపములు! కేవలము అగ్నిమూర్తులై యుండవలెను! వేదవాక్య మీ సంగతే విశదము చేయుచున్నది. (చూ. తై. సం. 4. కాండ. నక్షత్ర ఇష్టి భాగము.) ప్రారంభమునందే, "కృత్తికానక్షత్ర మగ్నిర్దేవతా" అని యున్నది. అట్లే "స్వాతీనక్షత్రమ్ వాయుర్దేవతా" అని శ్రుతి.

### స్వాతి వాయుదైవత్యము :

'స్వాతీప్రవాళమేకమ్'. స్వాతీనక్షత్రము పగడమువంటి ఎరుపు రంగు గలిగి మిక్కిలి ప్రకాశించు నక్షత్రములలో నొకటి. దీనియెదుట దక్షిణముగా ముత్యమువంటి లావణ్యముతో చిత్రానక్షత్రము మెఱయుచుండును. స్వాతిచిత్రలు తోరణస్తంభములవలె వైశాఖ మాసము తొలిదినములలో ప్రొద్దుగ్రుంకిన తరువాత తూర్పున మెఱయుచుండును. స్వాతీ సూర్యసంగమము ఆశ్వయుజ కార్తికములలో సంభవించును. ప్రతి సంవత్సరము అక్టోబరు నెల మూడవ వారములో సుమారు 20 వ తేదీనుండి నవంబరు తొలివారము వరకును స్వాతి కార్తె దినములు. ఆ దినములలో వాయుదేవుని బలమెట్టిదో మనకు ప్రత్యక్షానుభవము వలన ప్రతియేడును విదితమగుచునే యుండును. వాయువునకు మహాబలుడని నామమున్నది. ఆ రోజులలో వీచు గాలి వానలు, చెలరేగు తుపానులు, ప్రాప్తమగు నుప్పెనలును 'మహాబల' నామమును సార్థకము చేయుచుండును. 1864 సంవత్సరము నవంబరు

నెల 1 వ తేదిని సంభవించిన బందరు ఉప్పెన భరిత్రాత్మకమైనది. ఆ జలప్రళయములో ప్రాతబందరు పట్టణము పూర్తిగా తుడిచిపెట్టుకొని పోయినది ముక్కుటకు మూల్గుటకు గూడ నవకాశములేక ముప్పదివేల జనులు నాటిరాత్రి మృత్యుదేవత వాతబడిరి. గాలితో వానలేకమై, గెడ్డలు నేల్లను పొంగినట్లు తెగి, గండ్లుపడి రైళ్లు రాకపోకల కత్యంత రము గలిగి మన మతి బాధలబడు దినము శ్రీ స్వాతికార్తె దినములే. వేద, పురాణ, జోస్య, జ్యోతిషగ్రంథములలో స్వాతికిని వాయుదేవు నకును అభేదమాపాదింపబడినది. వాయువెప్పుడును విష్ణు నాశ్ర యించి గొలుచుననుట జ్యోతిశ్శాస్త్రసిద్ధమని మన మీ గ్రంథమున చక్కగా తెలిసికోగలము. విశేషించి, రామాయణార్థములో హను మంతుడును, భారతార్థములో భీముడును గూడ స్వాతినక్షత్రమేయని యిందు సప్రమాణముగా నిరూపింపగలము. ఇంకను, ఏయే నక్షత్ర ముల కేయే దేవతలతో సంబంధమేర్పడెనో స్థాలీపులాక న్యాయమున నీ క్రింద సంగ్రహముగా చర్చింతము.

జ్యేష్ఠానక్షత్ర మింద్రుడు ;

మూల ఆషాఢా నక్షత్రములు మన్మథుడు :

నిప్పులు చెరుగుచున్నట్లు అగ్నికర్తెర దినము లతిదారుణముగా సెగ వెలువుచుండును. రోహిణియెండలకు రోళ్ళు పగులునని లోకోక్తి. రోళ్ళేకాదు-రాళ్ళు పగులును. అటుపిమ్మట మృగశిరా ప్రవేశమగును. అనగా మృగశిరకార్తె చొరబడును. మృగశిర నక్షత్రములు పడమట నస్తమించును. అటుపై నొక పక్షము దినములు సుమారు మృగశిర సూర్యునితోనే ఉదయించి, సూర్యునితోనే అస్తమించుచు రాత్రిం బవళ్ళెప్పుడును ఖగోళమున కానరాదు. ఆ దినములలో ప్రొద్దు గ్రుంకినపుడే తూర్పున జ్యేష్ఠానక్షత్ర ముదయించును. మృగశిర యదృశ్యమైనప్పటినుండి తొలి వర్షములు కురియును. ఈ ఖగోళ

భూగోళాంశములను మేళవించుకొని ఇంద్రవృత్రులను గూర్చిన గాథలను వేదఋషులు రచించిరి. వృత్రాసురుడు మాయామృగ శిరస్కుడు. వాడు ఖగోళమున దివిజగంగాప్రవాహమునకును, భూగోళ వర్షపాతమునకును నడ్డుగాపడి, వఱపువెంచి లోకమును వేంద్రము పాలు చేయును. వానికి ప్రతిస్పర్థి ఇంద్రుడు. ఇంద్రదైవత్యమైన జ్యేష్ఠ తూర్పున పొడుచుటతో ఎదుటిచుక్క వృత్రరూపమై మృగశిర అస్తమించి మరునాడు మరికనబడకపోవును. ఈ యంశమే అలంకారిక భాషలో ఇంద్రుడు వృత్రాసురుని సంహరించి, వాని యాటంకముడిపి వర్షప్రదేశముచే కర్షకులనేగాక, వేంద్రముడిపి, తాప ముపశమింప చేసి జగము రక్షించెనని వర్ణింపబడినది. వర్షకాల మారంభమగు నప్పటికి, ప్రొద్దుగ్రుంకు వేళకు జ్యేష్ఠ తొలిపొడుపును (acronycal rising) జ్యేష్ఠకు ఎట్టయెదుట మృగశిర అస్తమించి అదృశ్యమగుటయు నీ వేదగాథలకు మూలకారణము. ఆ హేతువుచేతనే జ్యేష్ఠ ఇంద్రదైవత్యమును ఇంద్రుడు వర్షప్రదాయకుడనుటయు జరుగుచున్నది.

జ్యేష్ఠ పున్నమినాడు ప్రొద్దుగ్రుంకినంతలో జ్యేష్ఠ తొలిపొడుపు (acronycal rising) సంభవించును. ఉత్తర దేశస్థులకు పున్నమ నుండి పున్నమకు నెల. వారికి ఆ పున్నమ తరువాతి రోజు ఆషాఢ మాసపు తొలిదినమగును. ఆనాడు వర్ష మేఘములు కొండలమీద వగవడును. జ్యేష్ఠ వెనుకనే మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢా నక్షత్రములు తూర్పున నుదయమగుచుండును. ఈ తారా సముదాయమే ధనస్సు రాశి. ధన్వికే మన్మథుడని పేరు. మన్మథ తాపమునకు హేతుభూతుడగు నీ ధన్వినే ఋగ్వేదము 'కృశాను' డని వర్ణించుచున్నది. ఈ ధనుర్ధారి కలుకుటమ్ములను మానవులపై ప్రయోగించునని ఋగ్వేదము I-155-2 లో కలదు. ఈ యంశము ఋగ్వేదమునందలి IV-27-3, VI-3-5 లో గూడ ప్రశంసింపబడియున్నది. మహాకవి

కాళిదాసు రచించిన మేఘసందేశ మీ యంశమును మిగుల మనో హారముగా వర్ణించుచున్నది. ఒకానొక యక్షు డతి కాముకుడై ఉద్యోగ ధర్మములందు ప్రమత్తుడయ్యెను. అందుకు కోపించి యక్షరాజు, కుబేరుడు, వానికొక సంవత్సరము ఏకాంతావాస శిక్ష విధించెను. యక్షు డా శిక్ష యనుభవించుచు రామగిరి మీద నుండి ఎనిమిది మాసములు గడిపెను. ఆషాఢ ప్రథమ దివసమున మేఘ చ్ఛన్నములైన పర్వతసానువుల జూచినంతనే వానికి భార్యపై ధ్యానము పోయినది. భర్తకొరకు దిన మొక యేడుగా గడుపుచు కుబేరుని యలకాపురమున కాలక్షేపముచేయుచున్న భార్యకు ఈ వర్ష మేఘము ద్వారా సందేశమంపిన వృత్తాంతమే మేఘసందేశ కావ్యము.

వృత్రాసుర సంహారముతో మృగశిరా ప్రవేశమును, మృగశిరా ప్రవేశముతో వర్షాగమమును, వర్షాగమ ఫలితముగ గ్రీష్మతాపోప శమనమును కలుగుచుండును. వాతావరణమందు వేడి మందగించి చల్లబడిన తరువాత స్త్రీ పురుష మిధునములకు అన్యోన్యసమాగమ వాంఛ కలుగుట సహజము. ఆ దినములలో ప్రొద్దు గ్రుంకినంతనే తూర్పు దిక్చక్రముపై ధనస్సురాశిలోని ఆషాఢానక్షత్రము లుదయిం చుట కారణముగా శృంగారభావముల యుత్పత్తికి కారణము ధనుర్ధారి కారోపింపబడుచున్నది. వర్షము కురిసిననాటిరాత్రి హోరు మనుచు కప్పలు చేసెడి రొద మండూక స్త్రీ పురుషజీవు లన్యోన్యము వరించుకొనునపుడు జరిగెడి సందడి యని జీవశాస్త్రవేత్తలు తెలుపు చున్నారు. కప్ప మొదలు కమలగర్భునివఱకును సమస్తజీవులును దాంపత్యధర్మనిర్వహణమునకు తడుముకొను దినములవి. "ఆబ్రహ్మ కీటాంత మిదం నిబద్ధమ్ । స్త్రీపుంప్రయోగేన జగత్సమస్తమ్" అను ప్రకృతి సత్య మాషాఢ మాసములో చక్కగా ఋజువగుచుండును. బాదరాయణ సూత్రములో విరాట్పురుషుని ఊరు ప్రదేశము ధనుస్సు

రాశియని వక్కాణింపబడినది. "ధన్వీచ ఊరుయుగమ్" అని యందు గలదు. ఈ యంశములన్నియు భావించి ఆషాఢా నక్షత్రములకు మన్మధునితో సమన్వయము చేయనైనది.

## తొలిపొడుపునాడే నక్షత్రాధిదేవతకు ముందు పూజతో ఉత్సవము :

పగటివేళ చుక్కలగపడవు. ఏకా రైరోజులలో నానక్షత్రములు పగలేగాక రాత్రులందును ఏవేళను కనపడవు. సుమారు రెండు వార ముల వఱకు నా కా ర్తె దినములలో కనబడక యుండియుండి పిమ్మట నొక దినమున నుషఃకాలమున సూర్యోదయాత్పూర్వము తూర్పున నా నక్షత్ర ముదయమగును. ఆ దినమే ఆచుక్క తూర్పున తొలిపొడుపు దినము. ఎక్కడకోపోయి బహుదినములు కానరాక దూరముగా నుండియుండి పిమ్మట నా నక్షత్రము యొక్క తొలిపొడుపు దిన మున పునర్దర్శన మగుటచేత, నా దినమున నా నక్షత్రాధి దేవతకు ముఖ్యపూజతో నుత్సవము చేయవలెనని శ్రుతి విధించుచున్నది. భార్యా భర్తలుగాని, బంధుమిత్రులుగాని, పరిచితులుగాని నిత్యము నొకరి నొకరు చూచుకొనుచుండుటలో గమనింపతగిన విశేషము లుండవు. కొంతకాలము ఏకారణము చేతనైనను ఎడబాటు కలిగినపుడు, ఒకరి నొకరు మరల నెప్పుడు చూడగలుగుదుమా, ఎప్పుడు కలుసుకొని మరల కరువుదీర మాటలాడుకొందమా యని కాంక్షతో నువ్విళు లూరుచు, పునర్దర్శనము కొఱకు తహతహ లాడుట అందరి యనుభవములోని విషయము. గాఢ మిత్రులును, అన్యోన్య ప్రేమ పాశ బద్ధులు నైనవారికి పునర్దర్శన సమయ మత్యంత ప్రీతికరమైన శుభసమయము. "ప్రియః ప్రియాయా ఇవ దీర్ఘదర్శనః" అని భాగవ తము తెలిపినట్లు, ప్రేమాభిమాన చోదితులైన వ్యక్తులమధ్య నెడబాటు కలిగి కలిగి పిమ్మట వార లొకరినొకరు కలిసికొనుట పెద్ద పండుగంత

సంతోషము కలిగించును. దూరముచే మైత్రి దృఢమగును. పరోక్ష మందు ప్రేమ పెరుగుచుండ మాధుర్య మతిశయించును. వేదఋషు లత్యంత భయభక్తులతో నారాధించుచుండిన నక్షత్రాధిదేవతలు ఏకారణముచేతనైనను దూరమై బహుదినములు వారి దర్శన లాభము దొరకక యుండియుండి పిమ్మట నొకనాటి యుషఃకాలమున పునర్దర్శన లాభము గలిగినపుడా నక్షత్రాధిదేవత నానాడు ముఖ్యముగా పూజించి పండుగ చేయవలెనని శాసించిరి. చూ. ఋ. V 77-1 "ప్రాతర్యావాణా ప్రథమాయజధ్వమ్."

ఒకనాటి యుషఃకాలమున తొలిపొడుపున కానవచ్చిన చుక్క మరి యారునెలలనాడు సాయంకాలమున ప్రొద్దు పోగానే తూర్పున తొలిపొడుపు పొడుచునని లెక్కించి తెలిసికొంటిమి. సాయంకాలమున తొలిపొడుపు చుక్కల దేవతలకు కూడ రెండవ పక్షమున నానాడు పూజ యంగీకరింపబడినది. "నోతన సాయమస్తి దేవాయా అజుష్టమ్" (ఋ. V 77-1.)

ఈ రెండు సూత్రముల ననుసరించియే, మనదేశములో సంవత్సరము పొడుగునను ఒక్కొక్క దినమున ఒక్కొక్క దేవతకు పూజలు, సేవలు, ఉత్సవములు మొదలగునవి జరుపుచున్నాము.

ఈ సందర్భమున ప్లంకెట్ (**Plunket**) దొరగారు రచించిన ప్రాచీనపంచాంగములు, నక్షత్ర సముదాయములు — (**Ancient Calendars and Constellations**) అను గ్రంథములో నుగ్గడింపబడిన యీ క్రింది వాక్యములు మనము ముఖ్యముగా స్మరించ తగియున్నవి. "కొన్ని నక్షత్ర సముదాయములలోని ముఖ్యనక్షత్రము అర్ధరాత్రమున కానవచ్చు స్థానముబట్టిగాని, అవి మధ్యాహ్నరేఖపై మెఱయువేళ బట్టికాని పండుగలు పర్వదినములు ఏర్పడలేదు. అర్ధరాత్రి ఉదయించుట అస్తమించుటతో కూడ వీనికి సంబంధములేదు. ప్రాయశః అయాఋతువులలో కొన్ని చుక్కల గుంపులలోని శేషో

వంతములైన నక్షత్రములు సూర్యోదయాత్పూర్వము తూర్పున నుదయించుటే ముఖ్యమని తోచుచున్నది. అట్లుదయమగు చుక్కల యధి దేవతల కా తొలి పొడుపుదినమే పూజార్హమైన ముఖ్యదినముగా భావింపబడుచుండెను. సంవత్సరము వృషభమాసముతో నారంభమైన యుగములో, అశ్వముఖాకృతిగల అశ్వినిచుక్కలలో మొదటిరెండు చుక్కలు—అనగా అశ్వినీదేవతలు సూర్యోదయాత్పూర్వము మొదట తూర్పున తోచినదినమే ఉగాదిగా భావించి ఆ కాలపువారు అశ్విని దేవతల స్తోత్రమంత్రములతో సంవత్సరాదిపండుగ చేసికొనెడివారు. భారతీయులకు సంవత్సరమనగా నక్షత్రాబ్దమేనని మనము మరువ కూడదు.

## నక్షత్రములు, నక్షత్రగణములు – వాని స్థానవిశిష్టత :

ఒకొక్క నక్షత్రముతో నొకానొక దేవతకు సంబంధ మేర్పడి నది సంబంధముమాత్రమే కాదు— ఆ నక్షత్రమే యీదేవత; యీ దేవతయే ఆ నక్షత్రము నను నద్వైతభావమును రూపమయినది. దేవ తలకు అహోరాత్రములు పార్శ్వములు; రూపము నక్షత్రరూపము. "అహోరాత్రే పార్శ్వే నక్షత్రాణి రూపమ్" అని శ్రుతి. నక్షత్రములు సూర్యోదయమునకు ముందు తూర్పున తొలిసారి పొడుచుటను బట్టియు, సూర్యాస్తమానము కాగానే తూర్పున నుదయించుటను బట్టియు, ఆ నక్షత్రాధిదేవతలకు పూజలని పండగ లేర్పడెను. అంతే కాదు. ఖగోళములో నొక నక్షత్రముగాని, నక్షత్రసముదాయము గాని ఆక్రమించిన స్థానమునుబట్టియు దాని పరిసరమునగల నక్షత్ర రూపవిశేషములను బట్టియు ఆయా నక్షత్రాధిదేవతల వాహనములు, ధ్వజములు, రూపవిశేషములు, వారుసాధించిన మహాకార్యములు, సంహరించిన రాక్షసులు, మరియు చేసినట్లు పురాణములలో వర్ణింప

బడిన ప్రతివీరులు, ఈదృశములైన వేద పౌరాణిక గాథలన్నియు నిర్ణయింపబడుచున్నవి.

## ప్రతిస్పర్థులు (Diametrically opposite stars) :

ఖగోళ మొక మహాకోదండమువలె ఒక దిక్కునుండి ఎదుటి దిక్కునకు వ్యాపించిన ట్లగపడును. దిక్చక్రముయొక్క మీది సగమే మనము చూడగలము. తక్కిన సగమునకు భూమి యడ్డమగుటచేత మనకు కనపడదు. ప్రొద్దు గ్రుంకినతరువాత, ఖగోళవేధకు కడంగితి మేని, తూర్పున చుక్కలును, చుక్కల గుంపులును ఉదయించి క్రమముగా మీది కెగబడుచుండును. వాటి యెదుటి చుక్కలు—ప్రతిస్పర్థులు—పడమట నస్తమించుచుండును. ఒక చుక్క ఉదయమగునపుడు ప్రతిస్పర్థి యస్తమించి యదృశ్యమగుట హేతువగా, ఉదయించు నక్షత్రాధిదేవత, అస్తమించు నక్షత్రాధిదేవతను సంహరించినట్లు ఉత్ప్రేక్షించి ఆలంకారికభాషలో చమత్కారముగ వర్ణించుట వేదఋషులకును పురాణ కర్తలకును పరిపాటియైనది—నిజముగా ఒక నక్షత్రము తన ఎదుటి నక్షత్రమును చంపుటలేదు. ఆ చుక్క కెదుటి నక్షత్రము చచ్చుటయునులేదు. కృష్ణభగవానుడు స్పష్టముగా తెలిపినట్లు "నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" నిమిత్తమాత్రముగా ఖగోళమున వినోదముకొఱకు జరుగుచున్న యొక చమత్కార నాటకము—అంతే—అంతమాత్రమే. ఒకదాని కొకటి నూటయెనుబది డిగ్రీల దూరముననున్న చుక్కలు మాత్రము ఖగోళమున ప్రతిస్పర్థల నీ విరోధనాటక మాడగలవు. ఇంద్ర వృత్రులకు మహేశ్వర మన్మథులకు, రామరావణులకు, కర్ణార్జునులకు, గరుడసర్పములకు మధ్య జరిగినట్లు వేద పురాణ వాఙ్మయములలో వర్ణింపబడిన మహా ద్విరోధ సంహార గాథలకు మూలకారణ మీ రేఖాగణిత ప్రతిస్పర్థ మాత్రమే. ఖగోళనాటకము ననుసరించి భూమిమీద నాటకములు

జరుగుచుండుట మన యనుభవములోని విషయమే. **"As above so below, the Drama of the Earth runs parallel to the Drama of the Sky"** అని పెద్దలు తెలిపియే యున్నారు.

ఇంద్రవృత్తులు పరస్పర ప్రతిస్పర్థులు. ఇంద్రు డధిదేవతగాగల జ్యేష్ఠనక్షత్రము తూర్పున నుదయించునంతలో మాయామృగ శిరస్కుడు- వృత్రుడు - మృగశిర నక్షత్రము అస్తమించునని మన మీవఱకే తెలిసి కొంటిమి. జ్యేష్ఠ వృశ్చికరాశిలోనిది. పడమటిదేశముల గాథలలో మృగశిర చుక్కలు ఒక గొప్ప వేటకాని శిరస్సని చెప్పబడినది - ఈ యోధునిపేరు ఇంగ్లీషులో ఓరైయన్ (Orion) అందురు. ఈ వేట కాడు ఒక పెద్ద తేలుకుట్టి చచ్చెనని పడమటి గాథలున్నవి. ఓరియన్ యోధుడు వృశ్చికరాశి ఉదయించువేళకు సరిగా పడమట నస్త మించును. ఖగోళమున నిట్లు జరుగుట కారణముగా నా వేటకాడు తేలుచే చచ్చెనని గాథపుట్టినది.

మహేశ్వర మన్మథుల మహద్విరోధము :

ఆర్ద్రానక్షత్రము రుద్రదైవత్యమని యీవఱకు తెలిసికొంటిమి. ఆర్ద్రఉదయమగు వేళకు మూల పూర్వాషాఢ నక్షత్రములు అస్తమించు చుండును. మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢలో ఒకపాదము, ఇవన్నియు చేరి ధనుస్సు రాశియగుచున్నవి. ధనుస్సు రాశియే, మన పురాణ ప్రసిద్ధుడైన మన్మథుడు. ఈ మన్మథుడు మకరధ్వజుడు. ధనుస్సు రాశికి పైనున్న రాశి మకరము కనుక మన్మథుడు మకరకేతనుడని వర్ణింపబడుచున్నాడు. ఇకముందు తెలిసికొనగల మరికొన్ని విశేష ములచేతకూడ మన్మథుడు స్త్రీ పురుషులమధ్య కామోత్కంఠత ప్రేరే పింపగలవాడని నిర్ణయింపవచ్చును. మన్మథుడు ధనుర్ధారి. వాని చేతి లోని విల్లు పూవిల్లు. ఈ పూవిలుకాడు 'ఆర్ద్ర - రుద్రుడు - ఉదయము కాగానే అస్తమించును'—అనగా ఆలంకారిక భాషలో చచ్చును.

మన్మథునిపై పట్టరాని కోపముచే రౌద్రాకారుడగుటచేత ఈశ్వరుడు రుద్రుడనబరిగినాడు. ఆర్ద్ర నక్షత్రము 'కుంకుమారుణము' కుంకుమ, పగడము, పద్మరాగము మొదలగువానివలె వెఱ్ఱని కాంతితో తేజరిల్లుచుండును. మన్మథునిపై కోపముచేత వెఱ్ఱబడిన ముఖముగల రుద్రుని యాకార మీ యార్ద్రానక్షత్రపు టరుణిమలో పరిస్ఫుటమగు చుండును. ఈశ్వరుని ముఖ మెఱ్ఱబడుటయేగాదు, అతని కన్ను 'విస్ఫులిఙ్గ్నకన్ను' ఆ కంటియెదుట నేమియున్నను భగ్గునమండి భస్మీభూతము కావలసినదే - మన్మథుడొక లెక్కయా ?

మన్మథదహన వృత్తాంతము మనకవు లద్భుతముగా వర్ణించినారు. కొన్ని పద్యపాదములను మచ్చునకు చదివిచూతము.

"సాహంకారత శంకరుండలిగి వ్రేల్మాగ్నిన్ బయిన్ వంపినన్"
"తొడబడ జాటి, పైకుఱికి ధూర్జటి కంటికడింది మంటలో
నడపొడ గానరాక తెగటాఱియు కాలినయట్టి మోడుకైవడి"
మనుచరిత్ర — III 46.

"పుష్పబాణుని మేను బూది చేసిన నీకు కంటిసెగలు"
"హరుని కోపాగ్ని పొగచూరి మరునిచాప
మసిత కేవర పరివేషమైనవాడు" శ్రీనాథ, శృం. నై. III. 161
"క్రూరహర కోప కటాక్ష శిఖస్వరూపమున" బడి మ్రగ్గి."
శృం. నై. —III—185.

శ్లో॥ సంవర్తాగ్నితటిత్ప్రదీప్తకనకప్రస్పర్థితేజోమయమ్."

ఈ కడపటిశ్లోకములో ఆర్ద్రానక్షత్రజ్వాగ్ని సొగసుగా వర్ణింపబడినది. ఈ నాటి జ్యోతిశ్శాస్త్రవేత్తలు ఆర్ద్రానక్షత్ర పరిమాణము ను గూర్చియు, నందు ప్రజ్జ్వలితమగు మహాగ్నినిగూర్చియు వ్రాసిన సంగతులు సంగ్రహముగా వివరింతము.

1948 సంవత్సరపు **Whitaker's Almanac** 164 పుటయందు ఆర్ద్రానక్షత్ర వ్యాసము ఇరువదియొక్క కోట్ల అరువదిలక్షలమైళ్ళని తెల్పబడినది. దీనినిబట్టి గణితరీత్యా గుణింపగా, ఆర్ద్రానక్షత్రము సూర్య

గోళమునకంటె ఒక కోటి యేబదియారు లక్షల ఇరువది తొమ్మిది వేల నూట యెనుబది రెట్లు పెద్దదని తేలుచున్నది. ఇక సూర్యుడన్ననో మన భూగోళముకంటె — పంచఖండ పంచ మహాసముద్ర ముద్రిత మైన యీ భూగోళమున కంటె—పదమూడులక్షల రెట్లు పెద్దగోళ మని యిదివఱకే తెలిసికొంటిమి. గుణించిచూడగా ఆర్ద్ర మన భూమికంటె ఇరువదిలక్షల కోట్ల రెట్లకు పైగా పెద్దదని స్పష్టమగు చున్నది. పరిమాణ మాత్రము చేతనే మహేశ్వరు డెంత గొప్పవాడు! ఇంక జాజ్వల్యమానమైన ఈశ్వర తేజోవిశేష మెట్టిదో 1948 సంవ త్సరపు జనవరి సంచిక ('Astrological Magazine') పత్రిక 25-28 పుటలలో ప్రకటింపబడినది. అమెరికాఖండమునందలి విల్సన్ పర్వ తాగ్రముపై ప్రతిష్ఠింపబడిన టెలిస్కోపులో—నూఱు అంగుళములు వ్యాసముగల మహత్తర యంత్ర సాధనములో ఆర్ద్ర నక్షత్ర మును సందర్శించిన పరిశోధకుడు అయ్యద్భుత దృశ్యము నిట్లు వర్ణించెను. "జ్వాలలు! అగ్నిజ్వాలలు! దేదీప్యమానమైన కాంతులతో నెగయు మహోన్నత జ్వాలలు! ఎన్ని కోట్ల సూర్యగోళము లీ యాఖిల తేజోమూర్తిలో కుప్పబడినవో? వాకన్నులను నేనునమ్మలేదు. నా దృష్టి మిఱుమిట్లు గొనినది. అదేమి కొలిమి! అదెక్కడి యగ్ని గుండము! ఆ పావక విజృంభణ విధానము అవాచ్యము. అమ్మహాగ్ని శిఖల యాఘాత ధ్వనులుకూడ నాకర్ణగోచరమైనట్లు తోచెను. రేయెల్ల నత్యంతోజ్జ్వల వైభవోపేతములై యార్ద్రిదహావార్చు లేపురేగుచునే యున్నవి." ఒక్కరేయియనవేల? సృష్ట్యాది యనంత కాలము నుగ్రార్చులతో నాగోళ మట్లుండవలసినదే!

ఒకపారి చూచినతరువాత నిట్టి దృశ్యవిశేషము లెన్నటికిని మఱుపునకు రావు. "హరు నయనాగ్ని కొలిమి" అని వేములవాడ భీమకవి చేసిన వర్ణనయొక్క ప్రాముఖ్యము మన మిపుడు కొంత యర్థము చేసికోగలము.

భూగోళముపై చెలరేగిన కొన్నిదహన వృత్తాంతములు చరిత్రాత్మకములు. హనుమత్కృతమైన లంకాదహనము, అర్జునుడొనర్చిన ఖాండవదహనము, 1666 సంవత్సరములో లండను దహనము, 1812లో మాస్కోపుర దహనము ఇవన్నియు చరిత్ర ప్రసిద్ధములు. వీరశేఖరుడు నెపోలియన్ (Napolean) 1812 లో రష్యనులను *బొరోడినో* మహా యుద్ధములో నోడించి మాస్కో నగరమును పట్టుకొనెను. ఆ వెంటనే వచ్చు *పిండువంటి* చలికాలములో నెపోలియన్ యోధునకును, అతని సేనలకును నిలువ నీడలేకుండ చేయదలచి రష్యనులు తమ పట్టణమునకు తామే నిప్పంటించిరి. ఎంత ప్రయత్నించినను ఎవ్వరును ఆ మంట లార్పలేకపోయిరి. నెపోలియన్ నిర్విణ్ణుడై చేతులు కట్టుకొని భయంకర పావకమూర్తిం జూచి జూచి "ఇంత భీకరము, ఇంత ఘోరము, ఇంత మహోత్కృష్టమునైన దృశ్యము లోకములో నింతవరకు నెవ్వరును ఎన్నడును చూడలేదు" అని వక్కాణించెను. ఇంతటి యపూర్వ దహన విజృంభణమని నెపోలియన్ ప్రశంసించిన యీ మాస్కోనగర దహన జ్వాలలు నాలుగైదువందల చదరపుమైళ్ళ లోపు పరిమితి మాత్రము కలవి. ఆర్ద్రాగ్ని సమ్ముఖమున నీమంటలు మిణుగురు పురుగు వెలుగు కాదుకదా, కణలేశమైనను కాజాలవు. భూపరిమాణమంతయు చూతము. ఆరుద్ర నక్షత్రపు బ్రహ్మాండ పరిమితి యెదుట యెంతకలదు? సముద్రములో కాకిరెట్ట!

### దేవతల వాహనములు, ధ్వజములు :

దేవతలకు రాక్షసులకును, దేవతలకు దేవతలకును మధ్య విరోధములు జ్యోతిశ్శాస్త్రరీత్యా ఎట్లు గోచరించుచున్నవో మచ్చునకు రెండు ఉదాహరణములు చూచితిమి. ఇక వారి వారి వాహన ధ్వజాది చిహ్నములనుగూర్చి సంగ్రహముగా తెలిసికొన యత్నింతము.

చంద్రుడును, బుధ, శుక్ర, కుజ, గురు, శనైశ్చరులును, సూర్యుడును ఏ మార్గము వెంబడి పోవుచున్నట్లు మన కగుపడుచున్నారో ఆ మార్గమునకే క్రాంతిచక్రమని పేరు. ఆ చక్రమార్గమున కటు నిటు తోచు స్టేషనులవలెను, అందు పాతబడిన మైలురాళ్ళవలెను, యోగతార లిరువదియేడున్నవి. వీనికి అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి అని క్రమముగా నిరువదియేడు పేళ్ళున్నవి. ఈ యిరువదేడు నక్షత్రములను పంద్రెండు రాసులుగా విభజించిరి. అశ్వన్యాది రెండుంబాతిక నక్షత్రములు ఒక్కొక్క రాశి. అశ్వని + భరణి + $\frac{1}{4}$ కృత్తిక—ఇవి మేషరాశి; $\frac{3}{4}$ కృత్తిక + రోహిణి + $\frac{1}{2}$ మృగశిర—ఇవి వృషభరాశి. $\frac{1}{2}$ మృగశిర + ఆర్ద్ర + $\frac{3}{4}$ పునర్వసు, ఇవి మిధునరాశి.

ఇందు కృత్తిక అగ్నిదైవత్యముకదా ? కృత్తిక దిగువ నున్నవి (అశ్వని + భరణి + $\frac{1}{4}$ కృత్తిక) అనగా మేషరాశి. కృత్తికాగ్నికి దిగువ మేషరాశి యుండుటచేత అగ్నికి మేషము వాహనమని జ్యోతిస్సంజ్ఞగా తెలుపబడినది. కావున నగ్నిదేవుడు "మేషారూఢు"డని శ్రుతి తెలుపుచున్నది. అగ్ని ఎక్కడనున్న ధూమ మా మీద నక్కడనే యుండును; కావున "యత్ర ధూమ స్తత్ర వహ్నిః" అని చెప్పుదురు. ఒకప్పు డగ్ని కనపడక మరుగుననున్నను ధూమము అగ్నియునికిని వెల్లడి చేయకమానదు. ఈ సందర్భముల ననుసరించి యగ్నిదేవుడు "ధూమధ్వజు"డని "మేషారూఢు"డని వేదవాఙ్మయము వాకొనుచున్నది.

మేషము తరువాత పేర్కొనబడునది వృషభరాశి. ఇందు కృత్తిక మూడుపాదములును, రోహిణి చుక్కలును, మృగశిరలోని రెండుపాదములును కలవు. వృషభరాశిపైని మిధునరాశి కలదు. మిధునరాశియనగా వీణ వాయించుచున్న ఇద్దరుబాలికల బొమ్మలు చూపుచున్నారు కొందరు జ్యోతిష్కులు; పాశ్చాత్యులు ఇద్దరు మగవాండ్ర బొమ్మలు వేయుచున్నారు. ఈ రెండును శుద్ధతప్పులని మా విన్నపము. మిధునమనగా పురాతనులైన పార్వతీ పరమేశ్వర మిధు

నముగాని మఱియొకటి కానేరదు. మన శివాలయములలో గనపడు రాతినంది విగ్రహములన్నియు వృషభరాశిసంజ్ఞికములే. వారికిధ్వజము కూడ ఈ వృషభమే. తూర్పున నుదయమగునపుడు ముందు వృషభ రాశియు పిమ్మట మిధునమును మనకు దృష్టిగోచరమగును. అప్పుడు మీద వృషభమును ఆ క్రింద మిధునము నుండుటచేత పార్వతీ పరమే శ్వరులకు వృషభమే ధ్వజమన నొప్పును. తరువాత మిధునరాశి పడమ టకు వ్రాలి అస్తమింపనై యున్నప్పుడు వృషభ మడుగునబడును. అపైన మిధునముగపడును. ఈ సందర్భమున మిధునమునకు వృషభము వాహనమన చెల్లును. ఇట్లే సింహము కన్యారాశికి వాహనము ధ్వజమున నొప్పుచున్నది; మకరము మన్మథునికి ధ్వజమును, వరుణునకు (కుంభ మునకు) వాహనము నగుచున్నది. విష్ణువునకు గరుత్మంతుడుకూడ ధ్వజము వాహనము నగునని ముందు ముందు తెలిసికొనగలము.

## మేషాది రాసులు మన పూర్వులకు గ్రీకులు నేర్పిరా?

స్వతంత్రముగా మన పూర్వుల కి మేషాది రాసులనుగూర్చిన ఖగోళ విజ్ఞానము ఏమాత్రము లేదనియు, గ్రీకులనుండి వార లీ రాశి విభాగమునుగూర్చి నేర్చుకొనిరనియు నొక యపనింద ప్రబలియున్నది. విదేశ విమర్శకులేగాక భారతీయులగు విద్వాంసులును, విమర్శకులును కూడ చాలమంది యీ పిలి వార్తలను చెవియొగ్గి వినుటయేగాక అగునగునని తలలూచి యంగీకరించువారును కలరు. అంతటితో నాగక మరికొందరు మహానుభావులు "ఈ విజ్ఞానం మనవాళ్ళు గ్రీకులనుండి నేర్చుకోకపోతే స్వంతంగాచూసి యీరాసుల్ని తెలుసుకొనేపాటి తెలివితేటలు ఎక్కడ యేడిసినాయి?" అని గురజాడవారి గిరీశం పంథానుబట్టి తిట్టుటకూడ కలదు. ఈ యజ్ఞానమునకు మనమేమనుకో వలెనో తెలియక నేనొక దీర్ఘ నిశ్వాసము విడిచి ఖేదము నొందు చున్నాను. ఈ వ్రాతలు, కోతలు, అపనిందలు, దూషణలు—అన్నియు

నిరాధారములైన నీలివార్తలు. వేదార్థ జ్ఞానశూన్యు లనవలసిన మాటలుగాని యిందు సత్యము లేశమైనలేదు. అద్వితీయమైన భారతీయ విజ్ఞానమును, వేదఋషుల యఖండ ప్రతిభను మాటునబెట్టి దిగద్రొక్కి భారతీయులంత పనికిమాలిన జాతి ప్రపంచమున లేదని స్వార్థము కొఱకు మిస్ మేయోవలె యసత్యములు కల్పించిన కల్పన కర్తల కల్లవార్తలుగాని ఈ నిందా వాక్యము లొక్కటియు నిజముగావు చరిత్ర పరిశోధకులేగాక, విజ్ఞాన విషయ పరిశోధకులకుగూడ 'సత్యమ్ పరమ్ ధీమహి' అను మకుటముతో సత్యము నన్వేషించుటే కర్తవ్యము. సత్యాన్వేషకులకు జాతి గర్వములతోగాని, వ్యక్తులతోగాని పనియుండ కూడదు. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నుండిన సర్ విలియమ్ జోన్సు (Sir William Jones), మొదలగు పండితోత్తములును సద్విమర్శకులును రాశివిజ్ఞానము భారతీయులు స్వతంత్రముగా నెఱిగినదేనని యొప్పుకొన్నారు. ప్లంకెట్ (Plunket) మొదలగు పాశ్చాత్య పరిశోధకులు తమకు సంస్కృత విజ్ఞానమంతగా లేదనియు, ఆ భాషాసంస్కృతులు బాగుగా నెఱిగిన వారివిషయములను గూర్చి తఱచిచూచి సత్యము ప్రకటించవలెనని కోరినారు. అంతవఱకు బాగుగానే ఉన్నది.

కాని వేదమూలము చదువక, దాని యర్థమేమో తెలిసికొనుటకు అత్యవసరమైన ప్రయత్నములు చేయక, నిర్జీవ పిరసానువాదములం బట్టి ప్రాకులాడితి మనుకొని, మన పూర్వులం దిట్టిపోయు భారతీయులనేమనవలెనో మాకు దెలియకున్నది. వ్యక్తులైనను, జాతులైనను తమకు తెలియని యంశముల నితరులయొద్ద తెలిసికొనుట తప్పుగాదు పాశ్చాత్యులు నేర్పినదంతయు వారివలన మనము నేర్చికొనినదంతయు విశ్వాసముతో నొప్పుకుని, కృతజ్ఞతతో వందనములాచరించి గైకొందము. అట్లొనరించుటచేత నేర్పినవారికిని, నేర్చుకొనిన వారికినిగూడ గౌరవ ప్రతిష్ఠ లేర్పడగలవు.

కాని మన పూర్వులను మనము గ్రీకులనుండియు, ఇతర పడమటి దేశములనుండియు నేర్చుకొంటిమని భ్రాంతిపడు విజ్ఞాన విషయములు నిజముగా మన పూర్వులేవారో తెలిసికొనినవై మనకు పూర్వార్జితమైన విజ్ఞానమై, ప్రియమైనవైనపుడు అది మనకు కేవలము పాశ్చాత్యులచేత సమగ్రహింపబడిన దనుకొనుట యెంతటి అవివేకమో యోజించి చూడవలసియున్నది. మన పూర్వ గ్రంథములను సమూలము నోపికతో చదివి, తత్కర్తలే యర్థము మనమున నిడికొని వాని రచించిరో విమర్శించి తెలిసికొని పిమ్మట వానిపై వ్యాఖ్యానములు, వ్యాసములు మొదలగునవి వ్రాయుట కనీసధర్మము. ఏ పాశ్చాత్యగ్రంథకారుడో, వ్రాసిన తప్పుటనువాదములను, అనర్థపు విమర్శనలను ఆధారము చేసికొని, వేదవాఙ్మయమునం దిదిలేదు, అదిలేదని యధిక్షేపించుట గొప్ప యపచారము; అతి సాహసము వని చెప్పక తప్పదు. మనదేశములో ప్రాచీన విజ్ఞాన వాఙ్మయములను గూర్చి చదువ నుత్సాహముగలవారి సంఖ్య చాలతక్కువ; వానిం జదువు కుతూహలముగలవారిలో కూడ పైపై చదువులతో తృప్తిపడి, "కరితలంగిసర్వముఙ్ దెలిసితిమంచు గర్వితమతిన్ విహరించు" వారలధిక సంఖ్యాకులు. ఈ దురవస్థకు మిక్కిలి ఖేదము గలుగుచున్నది. ఇట్టి వారినిగూర్చి శ్రీనాథ మహాకవి వ్రాసిన వాక్యము—"బోధమల్పంబు గర్వమభ్యున్నతంబు" అను సత్యము ఎదుట తాండవించుచున్నది. వారు పొరపడుటయేగాక వారి యాశ్రితుల సమయాయులంగూడ వారు పెడదారుల బెట్టుచున్నారు. గుల్ల చదువులవలన దేశమున కెంతో అనర్థము వాటిల్లుచున్నది. ఇకనైన భగవంతు డీ దేశమును బూటకపు చదువులనుండియు బొందవిమర్శకులనుండియు సంరక్షించు గాక యని ప్రార్థించుచున్నాము.

పాశ్చాత్య విద్వాంసులు వేద సమన్వయము నిమిత్త మద్భుత కృషిచేసినమాట వాస్తవము. వేదవాఙ్మయమునకు జన్మస్థానమైన

భరతఖండ వాస్తవ్యులకు లేని యభిమాన మీ పాశ్చాత్య విద్వాంసుల కా వాఙ్మయముపట్ల కలుగుట శ్లాఘాపాత్రమైన విషయము. కాని భారతీయ జీవనము, వైదిక సాంఘిక సాంప్రదాయములు, సంస్కృత పదప్రయోగ సరణిలోగల సూక్ష్మభేదములు లోనగునవి ఎంతకృషి చేసినను పాశ్చాత్యులకు పట్టుబడలేదు. బహిరర్థములేగాని యంత స్సారము వారికి తెలియలేదు. వ్యంగ్యార్థములతో కూడి రసాత్మకము లైన సంస్కృతరచనల రమణీయార్థ సౌరభములను వా రాస్వాదించ లేకపోయిరి. అది వారి తప్పిదముకూడ కాదు. నిఘంటు సహాయ సాధ్యమైన శబ్దార్థపాండిత్యము మాత్రమే వారికలవడినది. తదితరము నవగాహన చేసికొనుటకు వారికన్నియు నవరోధములే యయినవి. అట్టివారి యనువాదముల నాధారము చేసికొని భారతీయులు వేద విమర్శకు దిగుట మిగుల ననర్థదాయకము, హాస్యాస్పద మగుట సహజము. నా భావము తేటపడుటకు కొన్ని యుదాహరణము లిచ్చెదను.

దినము - Day ; వారము Week ; దినవారములు అనునప్పు డర్థము భేదించినది; మృతులైనవారికి చేయు నుత్తర క్రియలు అవి అపరకర్మ పరమైన విపరీతార్థము మన దేశీయులకే బోధపడును. ఈ మాటలను ఇల్లే ఇంగ్లీషులోనికి తర్జుమా చేసినప్పుడు Day - Weeks అని చెప్పవలసి యున్నది. దీనికి సరియైన సాంప్రదాయ సిద్ధమైన యర్థము ఏ పాశ్చాత్యునికి బోధపడును ? మూలము దినవారములని తెలిసినగాని మనకు మాత్రము నిజము బోధపడునా ? అందుకొఱకే తర్జుమాలను పట్టి విమర్శకూడదు, మూలము చదివిచూడుడని మన వారిని నేను వినయముతో హెచ్చరించుచున్నాను. మరొక ఉదాహరణము చూతము. బమ్మెఱ పోతరాజు భాగవతము వ్రాయునాటికి 'సాని' శబ్దమున కిప్పటి విపరీతార్థములేదు. ఏలికసాని, దొరసాని మొదలగు పదములలో నిప్పటికిని ఉన్నట్లే సానియనగా పూజ్యురా

లైన యిలాలనియే యర్థముండెను. కావుననే భాగవత పీఠికలో వామహాకవి తనతల్లిని ఇట్లు ప్రశంసించినారు. భాగ I-25, 26.

కం. నడవదు నిలయము వెలువడి
తడవదు పరపురుషు గుణము తనపతి నుడువుం
గడవదు వితరణ గుణములు
విడువదు లక్కాంబ విబుధవినయము వొగడన్.

ఉ. మానిను లీడుగారు బహుమాన నివారిత దీనమానవ
గ్లానికి దాన ధర్మమతి గౌరవ మంజులతా గభీరతా
స్థానికి, ముద్దుసానికి, సదాశివ పాదయుగార్చనామకం
పానయ వాగ్భవానికిని బమ్మెర కేసయ లక్కసానికిన్.

ఈపద్యములు సరిగా చదువక, ముందు వెనుక లారయక, పాపభీతి లేక, ఒకానొక మహామ్మదీయ విమర్శకుడు —శివశివా! పోతరాజు గారితల్లి 'వేశ్య'యని యర్థము చెప్పినాడు! వాని నిఘంటుపాండిత్యము నేమనవలె?"

నా స్వానుభవసిద్ధమైన యీ క్రింది యుదాహరణతో నీచర్చ ముగించుచున్నాను: అమధ్య నొకనాడు పడమటి యాకాశమున గొప్ప విద్యుద్దీపమువలె శుక్రగ్రహము ఉజ్జ్వలముగా మెఱయుచుండెను. అప్రక్కనే రమ్యముగా చంద్రవంక కాననగుచుండెను. ఆ మనోహరదృశ్యమును జోడుదుర్భిణిలోనుండి తనివిసనక చూచుచు నానందించుచుంటిని. అంతలో నెటనుండియో వచ్చుచు, నాకు అపరిచితుడైన క్రైస్తవ మిషనరీదొర యొకడు "ఓ! అమావాస చూస్తున్నారూ?" అని పలుకరించెను. ఆమాటలు నాకు అర్థము కాలేదు. అమావాస్యను చూచుట అనగా నేమో నాకు బోధపడలేదు. చిమ్మచీకట్లుగల అమావాస్య మనకెట్లు కనబడును? ఆ తరువాత రెండుమూడు రోజులకు బాలచంద్రుని సందర్శింతుము. వంక కొమ్ములతో పడమట క్రొత్తగాతోచు నీచంద్రరేఖను ఇంగ్లీషు భాషలో

**(New moon)** అందురు. 'అమావాశ్య' అర్థములోకూడ ఈపదము వాడబడునని నిఘంటు ప్రమాణము లేకపోలేదు. కాని బాలచంద్ర రేఖకు నమావాస్యపదము నంటగట్టించిన యాదొరగారి నిఘంటు పాండిత్య ప్రభావమునకు నివ్వెఱపడితిని. ఇట్టి నిఘంటు పాండిత్యముతో వేదము సమన్వయించి, మాక్సుముల్లర్ **(Max Muller)** దొరగారు "వేదమంతయు ఊకదంపు, మూట వాట నెక్కడనైన నొకటి రెండు గింజలుండవచ్చు"నని నుడువ సాహసించినారు. ఇట్టి శుద్ధాబద్ధములే మనపట్టభద్రులకు పరమ ప్రమాణమగుటకంటె దౌర్భాగ్యమేమికలదు ?

ఇట్లు తెలిసియు తెలియని పడమటి పండితుల పాదుప్రాతల వలన కలుగుచున్న యనర్థచర్య నింతటితో చాలించి మరికొన్ని ముఖ్యాంశముల చర్చింపబోదము.

గ్రీకులు తమకు పూర్వము పదునైదువందల యేండ్ల క్రిందట నుండిన చాల్డియనుల **(Chaldeans)** గ్రంథములనుండి తమ జ్యోతిర్విజ్ఞానమును బడసిరి. గ్రీకులకు తెలిసినవి పదునొకండు రాసులే. తులారాశినిగూర్చి వారికి తెలియనే తెలియదు. పైయంశములన్నియు మాండరు **(Maunder)** దొరగారు **'Astronomy without a Telescope'** అను గ్రంథములో సహేతుకముగా నుగ్గడించి యున్నారు. వేదవాఙ్మయములో మేషాది రాసులనుగురించి చేయబడిన వక్కాణల నీ క్రింద క్రమముగా చర్చించిచూతము. కాని అంతకుముందు అశ్విన్యాది నక్షత్రము లిరువదేడింటికి పాశ్చాత్యు లిడిన నామములు అక్షర సంజ్ఞలను తెలుపుచు నొకపట్టిక తయారుచేసి యుంచుకొనుట మిక్కిలి సదుపాయకరము. ఇకముందు వ్రాయబోవు నంశములను చక్కగా బోధపఱుచుకొనుటకు ఇట్టి పట్టిక మిక్కిలి యవసరము. కారణాంతరములచేత వేదములో నక్షత్ర ఇష్టి కృత్తికతో నారంభమగుటను మనము కూడ కృత్తికతోనే ప్రారంభింతము.

| నక్షత్రనామము | అధిదేవత | దీనికి పాశ్చాత్యనామ, గ్రీకుఅక్షర సంజ్ఞలు |
|---|---|---|
| 1. కృత్తిక | అగ్ని | ప్లీయేడ్సు (పిల్లలకోడి) |
| 2. రోహిణి | ప్రజాపతి | హైయేడ్సు ; టారస్‌లోని ఆల్ఫా, తీటా, గామా, డెల్టా. ఎప్సిలాన్ అక్షరసంజ్ఞలు గల 5. |
| 3. మృగశిర | సోమ | ఓరియన్‌లోని లాంబ్డా, ఫై 1-2. |
| 4. ఆర్ద్ర | రుద్ర | బీటల్జ్యూ ; ఆల్ఫా ఓరియన్. |
| 5. పునర్వసు | అదితి | కేస్టరీ, పోలక్సు, ప్రోశ్యాను. |
| 6. పుష్యమి | బృహస్పతి | కేన్సర్ రాశిలోని గామా, డెల్టా, తీటా సంజ్ఞగల చుక్కలు. |
| 7. ఆశ్లేష | సర్ప | హైడ్రాగుంపులోని డెల్టా, ఎప్సిలన్, ఈటా, రో, జీటా అను గ్రీకు అక్షరసంజ్ఞలు గల చుక్కలు. |
| 8. మఘ | పితరులు | లియో అను సింహరాశిలోని ఆల్ఫా, ఈటా, గామా, జీటా, మ్యు, ఎప్సిలాన్ గుర్తులు గల చుక్కలు. |
| 9. పూర్వఫల్గుని | అర్యముడు | డిటో రాశిలో డెల్టా, తీటా ,, ,, |
| 0. ఉత్తరఫల్గుని | భగుడు | డెనిబాలా అను బీటా చుక్క, 93 సంఖ్య గల సింహరాశి చుక్క. |
| 1. హస్త | సవిత | కన్యరాశిలోని డెల్టా, గామా, ఈటా చుక్క. |
| 2. చిత్ర | త్వష్ట | కన్యరాశిలోని ఆల్ఫాచుక్క. నామాంతరము స్పైకా. |
| 3. స్వాతి | వాయు | ఆర్క్‌చూరస్ లేక ఆల్ఫాబూటిస్. |

| | | |
|---|---|---|
| 14. విశాఖ (రాధ) | ఇంద్రాగ్నులు | తులారాశి త్రైక్రాలో ఆల్ఫాబీటా. |
| 15. అనూరాధ | మిత్ర | వృశ్చికము. స్కార్పియోరాశిలోని టా, డెల్టా, పై గుర్తులు గల చుక్కలు. |
| 16. జ్యేష్ఠ | ఇంద్ర | అంటారిస్ - స్కార్పియోలోని ఆల్ఫా, సిగ్మా, టౌచుక్కలు. |
| 17. మూల | పితృలు - నైఋతి | వృశ్చికముతోకలోని చుక్కలు. |
| 18. పూర్వాషాఢ | ఆప - జల దైవత్యము | ధనుస్సురాశి. సగిటేరియస్‌లోని డెల్టా, ఎప్సిలాన్ చుక్కలు. |
| 19. ఉత్తరాషాఢ | విశ్వేదేవతలు | డిటో రాశిలోని జీటా, ఒమిక్రాన్ చుక్కలు. |
| 20. శ్రవణము (శ్రోణి) | విష్ణు | ఆలీటేర్ ఆక్విలాగుంపులోని ఆల్ఫాచుక్క. |
| 21. ధనిష్ఠ (శ్రవిష్ఠ) | వసువులు | డెల్ఫినస్. |
| 22. శతభిషమ్ | వరుణుడు | కుంభరాశి, ఎక్వేరియస్‌లోని లాంబ్డాచుక్క. |
| 23. పూర్వాభాద్ర | అజైకపాదీ | పెగసస్‌గుంపులోని ఆల్ఫా, బీటాగుర్తు గల నక్షత్రములు. |
| 24. ఉత్తరాభాద్ర | అహిర్ బుధ్న్య | పెగసస్ గుంపులోని గామానక్షత్రము, **Andromeda.** ఇంద్రమదలోని తొలిచుక్క. |
| 25. రేవతి | పూషుడు | జీటా పిస్కమ్. |
| 26. అశ్విని | అశ్వినీదేవతలు | ఏరీస్ - మేషరాశిలోని ఆల్ఫా, బీటా చుక్కలు. |
| 27. భరణి. అపభరణి | యమ | టారస్ అను వృషభరాశిలోని నెం 28, 29, 41 సంఖ్యలు గల చుక్కలు. |

## ద్వాదశరాసులను గూర్చి వేదవిజ్ఞానము :

సంవత్సరాత్మకమైన కాలచక్రపు ప్రధ తేక నేమి యమదాని నమసరించి క్రాంతివృత్తము ఏర్పడియున్నది. అది పంద్రెండు భాగములు గలదను ఋగ్వేదమంత్రము I. 164.48 మనమీవలనె పఠించితిమి. భగోళమున నీ క్రాంతిచక్రము మార్పులేక యుండువనియు, వా వృత్తము త్రినాభియుతమైన యండవృత్తము (Ellipse) అనికూడ మనము ద్వాదశార మంత్రము ఋ I. 164.11 వలనను, సప్తయుం జంతి మంత్రము ఋ I. 164-2 వలనను తెలిసికొంటిమి.

ఇక ద్వాదశరాసు లేవేవో, వాని ప్రశంస ఎచ్చటెచ్చట కలదో సంగ్రహముగా పరికించి చూతము.

## మేషము :

'క్రతూత్సవ' సంధాయకుడును, 'స్వాహావధూ వల్లభుడు'నని ప్రవరాఖ్యునిచే స్తుతింపబడిన యగ్నిదేవుడు ధూమధ్వజుడు, మేషవాహనుడునని పలుతావుల బ్రశంసింపబడి యున్నాడు. దేవప్రీతిగా మానవు లర్పించు హవ్యకవ్యాదులను అగ్నిదేవుడే గొంపోయి వారల కందిచ్చునని భారతీయుల దృఢవిశ్వాసము. కావుననే వేదచోదితము లైన సమస్త శ్రౌత స్మార్తకర్మలలో ముందు అగ్ని నావాహ్వానించి యారాధించి పిమ్మట తక్కిన దేవతల పూజచేయుట పురాతనము నుండి యాచారమై యున్నది. అగ్ని నావాహ్వానించునపుడే "మేషారూఢ-ధూమధ్వజ—సప్తజిహ్వా" అను నీ మొదలైన గుణవిశేషణ సూచకము లైన నామములుగల మంత్రములు మున్ముందు పఠింపబడుచున్నవి. అశ్విని + భరణి + ఏకపాద కృత్తికలు చేరి మేషరాశి యగుననియు, అగ్నిదైవత్యమైన కృత్తిక దిగువ నది యుండుటచేత అగ్ని మేషవాహనుడయ్యెననియు మన మీవలకు తెలిసికొంటిమి. వేద ఋషులకు మేషరాశియునికి తెలియనిచో వారగ్నిదేవుడు మేషా

రూఢుడని ఎట్లు వర్ణింపగలిగిరి? అగ్ని కందరు దేవతలతో సంబంధ మెట్లేర్పడినది? మేష ప్రశంస ఋగ్వేదములో పెక్కుచోట్ల గలదు. చూ. I. 51-1. I. 52-2...

వృషభము :

ఖగోళమున గల ద్వాదశ రాసులలో వృషభమునకు కొమ్ములు నాలుగు; కాళ్ళుమూడు; శిరస్సులు రెండు. ఇట్టిరూపముతో నా యెద్దు ఎవరినైనో ఎగిరి కొమ్ములతో చిమ్మనుంకించుచున్నట్లు కనబడును. ఇప్పటికిని నక్షత్రరూపమైన యీ వృషభాకార మిట్లే యాకాశమునందు మన కగపడుచున్నది. అంతేకాదు. ప్రాచీనకాలము నందు ఆయాదేశములలో చిత్రింపబడిన వృషభరాశి చిత్రములు కూడ ఇట్లే చూపట్టుచున్నవి. ఋగ్వేదమునందుకూడ రాశి వృషభ రూప మీ విధముననే వర్ణింపబడి యున్నది. చూ. ఋ. IV-58-3 "చత్వారి శృంగా త్రయో అస్యపాదా ద్వే శీర్షే...వృషభోరోరవీతి". వేదచోదితములైన సమస్త శుభాశుభ శ్రౌత స్మార్త కర్మలలో ప్రారంభ మున నగ్నిదేవు నావాహనము చేయు సందర్భమున నీ మంత్రమును పురోహితులు తప్పక చదివెదరు. కారణ మేమనగా, కృత్తికాది దేవతలు. కృత్తిక రూపుడునైన యగ్ని వృషభరాశిలోనివాడు. కృత్తికలో నొక్క ¼ పాదము మాత్రమే మేషములోనిదికాని మిగిలిన మూడు పాదములు వృషభములోనివే. కాబట్టి అగ్ని వృషభరాశి స్థితుడు. పైని వ్రాసిన వేదమంత్రములో అగ్నిదేవు డెందులోనున్నాడో ఆరాశి వృషభముయొక్క రూపము కనులకు కట్టినట్లు వర్ణింపబడినది. ఈ వృషభరాశి ఋగ్వేదములో నింక ననేక సందర్భములలో వర్ణింప బడినది. అందు రెండు మంత్రములను మాత్రము ఈదిగువ వివరించెదము.

ఋ X—102—10. "నస్మై తృణంనోదక మాభరన్త్యుత్తరో ధురోవహతి ప్రదేదిశత్" ఈ వృషభము గడ్డి తినదు. నీరు త్రావదు

ధ్రువ నక్షత్రమునకు పైనగూడ జూపునది. దిక్కులను విశదము చేయు చున్నది.

గడ్డి తినక, నీళ్ళు త్రాగక ధ్రువాది నక్షత్రములం జూపు వృషభము ఖగోళ వృషభరాశిగాక మరేమి యర్థము చెప్పిన సార్థకమై యీ మంత్రార్థము వప్పునో స్పష్టము చేయగలరా ? అని నేను సవాలు చేయుచున్నాను. ఇంకొకటి ఋ. I. 116—18. "యువాం రథం వృషభశ్చ శింశుమారశ్చయుక్తా." ఇది అశ్విని దేవతలనుగూర్చి రచింప బడిన సూక్తములో నొక మంత్రభాగము. అశ్వినీ నక్షత్రమునకు అధి దేవతలు అశ్వినులు. అశ్వినీ నక్షత్రరూపులైన యీ దేవవైద్యులను గూర్చి ఖగోళవేధచేయుచు తదేక ధ్యానపరాయణుడైన మంత్ర ద్రష్టకు ఆ దేవత లిద్దరును వృషభ శింశుమారములును అశ్వనీ రథము నెక్కి పోవుచున్నట్లు భావాంబరవీథిం దోచుట సహజము. అశ్వినీ నక్షత్రముల యెదుట నున్నది రాశి వృషభము. ఆ పక్కనే శింశు మార మనెడి ఘోర జలచర జంతురూపముగల చుక్కలగుంపున్నది. దీనిని పాశ్చాత్యులు 'సీటస్' తిమింగిలము. 'Cetus the whale' అందురు. ఎద్దుచుక్కల గుంపు ప్రక్కనే శింశుమారపు .చుక్కలగుంపు ఆకాశమున కనబడుచుండుటచేతను, ఈ రెండింటి యెదుటను అశ్వినీ దేవత లుండుటచేతను ఈ సూక్తరచయిత భావములో అశ్వినులీ జంతువులను పూన్చిన రథము నెక్కి వెళ్లినట్లు తోచుట సహజము. ఈ దృశ్యము అప్పటికి నిప్పటికి గూడ నొక్కతీరుననే ఆకాశమున నగ పడుచున్నది. ఇందువలన నేమి తేలుచున్నదనగా క్రాంతి వృత్తమున గల వృషభాది రాసులనేగాక, ఆ ప్రక్కలనున్న ఇతర చుక్కలగుంపు లను, అవి స్ఫురింపజేయు జంతురూపములనుగూడ వేదఋషులు సూక్ష్మముగా పరిశీలించి వానికి యథోచిత నామములిడిరని చక్కగా స్పష్టమగుచున్నది.

ఋగ్వేదము ఇట్టి ఖగోళవిశేషముల ననేకముగా పరిస్ఫుటము చేయుచుండగా, నవియెల్ల విస్మరించి, ఎన్నడును తలయెత్తి యాకాశము వంక చూడనొల్లని మన పండితులు, 'చత్వారిశృంగా'దులైన దివ్య వేదమంత్రములను చిలుకలవలె చదువు మన పండితులు కొందరు, వానికి వ్యాకరణార్థములు చెప్పుకొని తృప్తులగుచున్నారు. వేద ఋషులమహోత్తర జ్యోతిర్విజ్ఞానమునకు ఈనాడిట్టి దుస్థితి ప్రాప్తించెనని మిక్కిలి వగపుపుట్టెడిని.

**మిథునము :**

మృగశిరలో రెండు పాదములును, ఆర్ద్ర పూర్తిగాను, పునర్వసులో మూడు పాదములును చేరి మిథున మన బరగుచున్నది. పునర్వసు ధనురాకారముగల చుక్కలగుంపు. ఆ వింటి యుత్తరపుకొనను రెండు చుక్కల '*జంట*' ఉన్నది. తేజో విషయమున నా నక్షత్రములు అగ్రగణ్యములైనవి (**First Magnitude Stars**). ఆ చుక్కల జతను ఇటీవల రోమనుగాథల, నాటినుండి కేస్టర్ అండ్ పోలక్సు (**Castor and Pollux**) అని పడమటి దేశములవారు తెలుపుచున్నారు.

ఆదికాలములలో భరతఖండమున నీ చుక్కలజత కూడ అశ్వినీ దేవతలుగానే భావింపబడెను. అశ్వినులు త్రిషధస్థులని ఋగ్వేదములో పెక్కుచోట్ల తెలుపబడినది. అందొకటి అశ్విని చుక్కలజత. రెండవది యీ పునర్వసు గుంపులోని చుక్కల జత ; మూడవది చిత్రానక్షత్రమునకు దిగువ— దక్షిణముననున్న 'అశ్వతర' మండలములోని చుక్కల జత. కడపటి చుక్కలజతను పాశ్చాత్యులు ఆల్ఫా, బీటా, సెంటారస్ అందురు. పాశ్చాత్యదేశమున వాడుకలోనున్న యీ సెంటారస్ శబ్దము సంస్కృతమున 'అశ్వతర' శబ్ద వికృతియని స్పష్టమగుచున్నది కదా?

అశ్వినీ దేవతల రెండవస్థానమైన పునర్వసు గుంపులో తేజోవంతములైన రెండు చుక్కలు మిథున మనబడెను. పునర్వసు తరు

వాతమన్న, పుష్యమిచుక్క మబ్బున కటునిటుగల చుక్కలు గార్దభము లనబడుచుండెను. అశ్వినులకు రెండవస్థానమున నీగర్దభములే వాహనములని వేదమునందు పెక్కుచోట్ల వర్ణనలున్నవి.

చూ॥ ఋగ్వేదము. I-34. 9. కదాయోగో వాజినో రాసభస్య-వాసత్యా.

తై. సం. IV-1-2 యుంజాథాగ్ం రాసభం యు మస్మిన్ యామో.

ఐ. బ్రా. IV-2-9 వగర్దభరథేనాశ్వినా.

యజూరారణ్యకము I-1-10-1 } తామశ్వినా రాసభాశ్వావహావంమే.

పొట్లపూవువంటి పుష్యమికి ఇటునటుగల రెండు చుక్కలను పడమటిదేశస్థులు 'ఎస్సెలి' (Asseli) అందురు. ఆ మాటకు రెండు గాడిదలని యర్థము. అప్పటికిని పాశ్చాత్యు లీచుక్కలను గాడిదలనియే తెలుపుచున్నారు. మన భరతఖండములో క్రమముగా పునర్వసు చుక్కలకు అశ్వినులతో సంబంధము విడిపోయినది. ఋ I-158 సూక్తమునకు దేవతలశ్వినులు. మంత్రద్రష్ట దీర్ఘతముడు. అందు మొదటి మంత్రములో నిట్లున్నది :

I-158-1 "వసూ రుద్రా, పురుమంతూ వృధంతా దశస్యతంనో వృషణావభిష్టౌ."

ఓ బంటవసువులారా ! విశేష బలదర్పములనొసంగి, మాప్రక్కతోడునీడలై నిలిచి మా కభీష్టసిద్ధిచేయు హితమతులారా ! రుద్రులారా ! అశ్వినులారా !

ఇందు అశ్వినులు రుద్రులని సంబోధింపబడిరి. క్రమముగా అశ్వినీ దేవతలను భావమంతరించి రుద్రదేవతాభావము ప్రబలినది. ఈనక్షత్రములు రుద్ర, రుద్రపత్ని మిధునము - పార్వతీ పరమేశ్వరులను భావము స్థిరపడినది. ఈ మిధునమునకు ప్రక్కనేడున్న వృషభరాశి ధ్వజము వాహనమునని కూడ స్థిరమైనది. కుమారసంభవ కావ్య పాఠకుల కీ క్రిందిశ్లోకములు చిఅపరిచితములు :

V-70. విలోక్య వృద్ధోక్ష మధిష్ఠితం త్వయా...
V-84. స్వరూప మాస్థాయ చ తం కృతస్మితః
సమాలలంబే వృషరాజకేతనః.

మరొక విచిత్రము గ్రీకులకు పూర్వము నరుసైదువందల సంవత్సరముల క్రితము: ఇప్పటికి నాలుగువేల సంవత్సరముల క్రిందట జ్యోతిర్విజ్ఞాన విరాజితులైన "అకేడియన్" జాతివారి పంచాంగపులెక్కలలో సంవత్సరమునందలి మూడవ మాసమునకు 'శివమ్' అని పేరున్నట్లు ఇటీవలి పరిశోధనల వలన తేటతెల్లమైనది. మన పంచాంగములలో మొదట మేషమాసము, తరువాత వృషభమాసము, మూడవది మిధునమాసము ననికదా వ్యవహరించుచున్నాము! మిధునమనగా సాంబశివ మిధునమని యన్వయించుకొనుచున్నాము. ఈ యర్థమునకును ఆనాటి అకేడియనుల 'శివ' మాసమునకును సరిపోవుట ఆశ్చర్యకరము. అవివాహభావదాంపత్య సంబంధముగల మిధునరాశి భావము గ్రీకులకు లేనేలేదు. వారికడనుండి మనమీభావము గ్రహించితిమను. కొనుట అసంభవము, నసందర్భమునై యున్నది.

కర్కాటకము :

పండ్రెండు రాసులలో నీకర్కటకరాశి నాలుగవది. గ్రీకుగాథలలో నిది బీటిల్ (Beetle) పురుగుగా వర్ణింపబడినది. మన తెనుగువారు పేడపురుగని, ఉరితిపురుగని, ఎన్నెమ్మ పురుగని చెప్పుకొను పురుగు జాతిలో చేరిన దీ బీటిల్ పురుగు. హెర్క్యులెస్ (Hercules) నామకుడగు నొక వీరుని ఈ పురుగు మిక్కిలి పీడించెనను పురాణకథ గలదు. ఋగ్వేదములో కర్కటమను పేరు నాకు కానరాలేదు. కాని ఇంద్రశత్రువై ఇంద్రునిచే వధింపబడిన శంబరుడను వాని పేరు ఋగ్వేదములో తఱచుగా కనబడుచున్నది. శంబరుడు కులితరుని పుత్రుడు. కౌలితరుడని వేదములో గలదు. చూ. ఋ IV-30-14 "ఉతదాసం

*కౌలీరం* బ్రువతే సర్వే భారతీ అహాహాన్మింద్ర *శంబరం* ఆ పై విషయంటువు 908 పుటలో శంబరశబ్దమునకు దేవపంటి అంతువు అని తెలుపబడినది. పైని వ్రాసిన కులీశర శబ్దములో కారణాంతరముల చేత 'శ' వర్ణము లోపించినపుడు అది 'కులీరము, కుళీరము' నగును. కుళీరమనగా యెండ్రి, కర్కటము. సంస్కృత మహాభారతము పంచమ వేదమని చెప్పుచున్నది. అందు భీష్మ మరణసందర్భములో నీ క్రింది శ్లోకము సుప్రసిద్ధము.

శ్లో॥ అర్జునస్య ఇమే బాణా నేమే బాణాః శిఖండినః
కృదంతి మమ గాత్రాణి మాఘమా సేగవా ఇవ.*

ఈ శ్లోక వ్యాఖ్యాత మాఘమా = కర్కటి, సేగవా = సంతానము అని యర్థము చెప్పెను. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి యీ శ్లోకము నిట్లు తెనిగించెను:— "సీ॥ అశనికల్పము లివి యర్జున బాణముల్ గాని శిఖండివి గావు సుమ్ము। కర్కటి గర్భంబు కరణి గాత్రము వ్రచ్చె......" ఇక్కడ జ్యోతిశ్శాస్త్ర దృష్ట్యా గమనించ వలసిన విశేషమేమనగా భీష్ము డష్టవసువులలో నొకని యంశమున జన్మించినాడు. ధనిష్ఠనక్షత్రము వసుదేవతాత్మకము. ధనిష్ఠ పడమటకు వ్రాలి యస్తమింపబోవు వేళకు తూర్పున కర్కటకరాశి ఉదయమగు చుండును. శరతల్పగతుడగు వేళకు భీష్మున (ధనిష్ఠ నక్షత్రమున) కెదుట తూర్పున పునర్వసు (నాలుగవ పాదము), పుష్యమి, ఆశ్లేష నక్షత్రము లుదయమగుచుండును. ఆ కారణముచేత భీష్ముని యెట్ట యెదుట తోచు కర్కట ప్రశంస అతడు అవసాన సమయమున చేయుట సమంజసము. కర్కటిగర్భ మమటలో నొక కవిసమయము గలదు. అరటిచెట్లు, వెదురు, యెండ్రి, తేలు లోనగు జీవులకు సంతానప్రాప్తితో

* ఈ శ్లోకములో నాలుగవపాదము "మాఘమాసే, గవామివ" అని యుండ వలెనని నా యభిప్రాయము.

నాత్మవినాశ మగునను భావము మనదేశములో ప్రబలియున్నది. జీవ శాస్త్రజ్ఞులీ సంగతులు విషయములో నిది యథార్థము కాదని తెలియుచున్నది. కర్కటి పిల్లల నీమనవుడు యమబాధపడుట నిజము. తిక్కన సోమయాజి 'కర్కటి గర్భంబు కరణి గాత్రము వ్రచ్చె' ననుటలో యొండ్రి వీపు భేదించుకొని పిల్లలు బైటపడునపుడు తల్లికి గల్గు దుర్భర యాతన వర్ణింపబడినది.

కాబట్టి ద్వాదశరాసులలో నాలుగవరాశి ఋగ్వేదకాలములో కులిశీరమని వ్యవహరింపబడెననియు, పిమ్మట కుళీర మయ్యెననియు భావింపతగియున్నది.

సింహరాశి :

దేవతా ప్రభుడగు నింద్రుడు అనన్య సామాన్యములైన యద్భుత కార్యములెన్నో సాధించినట్లు ఋగ్వేదము వర్ణించుచున్నది. అందొకటి సింహ సంహారము. మేకతో ఇంద్రుడు సింహమును పరిమార్చెనట! దుర్బల సాధనమైన మేకనుపట్టి దానితోనే ఇంద్రు డీ మహాఘన కార్యమును నిర్వహించెను. చూ.ఋ. VII 18.17 "అర్త్రేణ చిత్తద్వేకం చకార సింహ్యం చిత్యేత్వేనా జఘానా॥" ఈ మంత్రార్థము మనకు సరిగా బోధపడుటకు ముందుగా మనము కొన్ని సంగతులను తెలిసికోవలెను. ఇటీవల మకరమని వ్యవహరింపబడుచున్న రాశి పూర్వము అజమని తెలుపబడుచుండెను. అజమనగా మేక. ఈ మేకయే రేవతి కధిదేవతయగు పూషుని రథమునకు పూన్చబడుచుండెనని ఋగ్వేదములో పెక్కుచోట్లగలదు. పూషునిగూర్చి ప్రశంసించునపు డందు కొన్నింటిని చదువుదము. ప్రస్తుతము మనము గమనింపవలసిన యంశమిది. మకరరాశి వాడుకలోనికి రాకపూర్వము ప్రాచీను లా రాశిని అజమనియే వ్యవహరించిరి. అజమనగా మేక. ఈ మేకయొక్క విచిత్రమేమనగా, దీని ముఖము మేకముఖము, తోక చేపతోక. ఇది సముద్రపు మేకయనియే

వేటికిని పాశ్చాత్యులు తెలుపుచున్నారు. పడమటి దేశములలో దీనిని (Capricorn) కేప్రికారన్ అందురు. ఆ మాటకు సముద్రపు మేక, (Fish Goat) చేప మేక అని యర్థము. ధనుస్సునకు పై నుండుట చేతను, దీనితోక చేప యగుటచేతను మన్మథుడొకప్పుడు మీన కేతనుడు, ఝష కేతనుడు ననబడుచున్నాడు. సింహరాశి కిది ఇంచుమించు ప్రతిస్పర్థి. ఇది యుదయమైన కొలదికాలములోనే సింహరాశి యస్తమింపగలదు. ఈ ఖగోళచర్య నాధారముచేసికొనియే వశిష్ఠుడు పైని వ్రాసిన వేద మంత్రములో, ఇంద్రుడు మేకతో సింహమును చంపెనని చమత్కార ముగా వర్ణించియున్నాడు. ఖగోళచారులైన అజసింహరాసులను పూర్తిగా గుర్తెఱిగి, అందొకటి యుదయము కాగానే రెండవది యస్త మించునని గమనించుటచేత నే, ఇంద్రుడు మేకతో సింహమును చంపి, అనన్య సాధ్యమైన ఘనకార్యము నిర్వహించెననియు అయ్యది ఇంద్రు డొకలీలగా నొనరించిన విశేషమనియు నా వేదఋషి వర్ణింప గలిగెను. లేనిచో నట్టి రచనకు వేదములో తావుండదు. సింహరాశి యుటంకింప బడిన మరొక వేదమంత్రమును కూడ చదువుదము. ఋ. V-83 3 "దూరాత్సింహస్య స్తనథా ఉదీరతే యత్పర్జన్యః వృణుతే వర్ష్యంనభః." ఇందు పర్జన్యుడనగా వర్ష మేఘాధిదేవత. పర్జన్యు డాకాశమును వర్ష మేఘములతో నాచ్ఛాదించునప్పటికి దూరమున సింహము గర్జించు చున్నది. వర్షఋతు ప్రారంభమున మఘకార్తె రాకముందు సింహరాశి పడమట నస్తమింపనై యుండును. పర్జన్యవృష్టి ప్రారంభమున నుఱుము లుఱుముట పడమటకు వ్రాలి దూరమందున్న రాశిసింహము యొక్క గర్జన యని మంత్రద్రష్ట యుత్ప్రేక్షించి వర్ణించివాడు.

## కన్యారాశి :

ఋగ్వేదములో కన్యారాశి తఱుచుగా ప్రశంసింపబడినది. ఆ రాశి వర్ణన కూడ కనులకు కట్టిన ట్లింతో రమ్యముగా నున్నది.

మఱియొక విశేషమేమనగా ఈ రాశి యనేక నామములతో పెక్కు విధముల వర్ణింపబడినది. అందొక నామము అరమతి. ఋ. V-43.6. "ఆనోమహీమరమతిం సజోషాగ్నాం దేవీం నమసా రాతహవ్యాం మధోర్మదాయ బృహతీమృతజ్ఞా మాగ్నేవహ పథిభి ర్దేవయానైః॥" ఓ యగ్నిదేవుడా ! మమ్ము కటాక్షించి మాయం దనుకూలుడవై, మా వినతులతోను, మేము సమర్పించు కానుకలతోను, విఖ్యాతమూర్తి అరమతి మహాదేవిని మమ్మనుగ్రహింప దేవయాని మార్గమునకొనితెమ్ము.

*రెండవది-రోదసి :* ఈమె మరుత్తు లేడ్గురకు సామాన్య భార్య. మరుత్తులు స్వాతీనక్షత్ర ప్రాంతమువారు. వారికి ప్రక్కనే కన్యరోదసి కలదు. ఉత్తర మూడు పాదములును, హస్తపూర్తిగాను, చిత్త రెండు పాదములు ఇవి చేరి కన్యారాశి యగును. చిత్త ప్రక్కనే స్వాతి-వాయుదైవత్యము-మరుత్తులీ పరిసరముననే గలరు. కావుననే రోదసి కన్య మరుత్తు లేడ్గురకును సామాన్య భార్యయని వేదమునందు వర్ణన. ఋ I-167-4. "పరా, శుభ్రా౽అయాసోయవ్యా సాధారణ్యేవ మరుతో మిమిక్షుః॥" దూరమందు తేజోభ్రాజితులైన మరుత్తులు తమకు ఉమ్మడి భార్యయైన యీ యువతిని గట్టిగా నంటి పట్టుకొని యున్నారు.

| | | | |
|---|---|---|---|
| ఋ. VI | 50 | 4-5 | మిమ్యక్షయేషు రోదసీను దేవ. |
| ,, | 66 | 6 | అధస్మైషు రోదసీ స్వశోచిరామవత్సుతస్థౌ నరోకః. |
| ,, | 61 | 4 | పరావరాన ఏత నమర్యాసోభద్ర జానయః అగ్ని తపో యథానథ. |

ఇందు మొదటి మంత్రమునకు అర్థము—రోదసీదేవి యెవరిని గట్టిగా కౌగలించుకొనినదో ఆ మరుత్తులు ;

రెండవ మంత్రమునకు—దివ్యమైన తేజస్సు స్వతస్సిద్ధమైన మహోజ్జ్వల ప్రభలతో మెఱయుచున్నట్లే, ఆవరణబాధితము గాక

సముజ్జ్వల సంపూర్ణకాంతులతో వెలుగుచున్నట్లే, మరుత్తుల మధ్య నైసర్గిక రుచులతో తేజరిల్లుచున్నది రోదసీకన్య ;

మూడవదానికి—మనోహారిణియైన మీ భార్యతోకూడ దూరముగా వరిగి యగ్నివేదికకడ చలి కాపుకొనుడు. చక్కని పెండ్లికొడుకులారా! మరుత్తులారా! వీరులారా! పొండు.

ఇక్కడి యగ్నివేదికకు జ్యోతిశ్శాస్త్రరీత్యా విశిష్టార్థమున్నది. చిత్రస్వాతుల తరువాతి నక్షత్రము విశాఖ. ఇయ్యది ఇంద్రాగ్ని దైవత్యము. *'కులాల చక్రం వంచ'* కుమ్మరి సారెవలె గుండ్రనైన విశాఖలో నైదు చుక్కలు గలవు. రూపమున గుండ్రని వేదికయై, ఇంద్రాగ్నిదైవత్య మగుటచేత విశాఖ అగ్నిగుండ మనియు, శీతలబాధితులై క్రొత్తపెండ్లికొడుకులైన మరుత్తులు రోదసీ వధువుతో దూర మరిగి, అగ్నిగుండము చేరి చలికాచుకొనిరని మంత్రద్రష్ట భావము.

మరొక గొప్ప విశేషము—కన్యారాశియందు పాండవ పత్ని ద్రౌపది లక్షణములు కనబడుచున్నవి. ద్రౌపది అగ్నికుండ సముద్భవ, అయోనిజ. కన్యారాశి ఉదయమైనపుడు అడుగున విశాఖ అగ్నిగుండము, పైన కన్యయు జ్యోతిశ్శాస్త్ర దృష్టిని కనబడుటచేత, కన్య అగ్నిగుండ సముద్భవ యనియు ఖగోళచారి యగుటచేత నయోనిజ యనియు చెప్ప నొప్పును. మఱియు నాకాశమున తిరుగు మత్స్య యంత్రమును భేదించినవానిని ద్రౌపది వరించునని ద్రుపదరాజు నిర్ణయించెను. ఈ మత్స్యయంత్రము ఖగోళ ద్వాదశ రాసులలో కడపటిదగు మీనరాశి. ఈ రాశికి ప్రతిస్పర్థి ఉత్తరఫల్గుని నక్షత్రము. ఋగ్వేదములో దీనికి అర్జుని యనియే పేరు. ఫాల్గునమాసమునం దష్టమినాడు రోహిణియందు ద్రౌపదీ స్వయంవరము. అప్పటికి అనగా నాటి సాయంకాలమున సూర్యాస్తమయము కాగానే తూర్పున నుత్తరఫల్గుని ఉదయించును ; పడమట మీనరాశి అస్తమించి

యదృశ్యమగును. మీనరాశి యస్తమించుటతో తూర్పున నర్జునుని వెనుక నే కన్య ద్రౌపది యారంగమున నావిర్భవించి పూలమాల నాతని కంఠమునవైచి అర్జునుని వరించినట్లు భావింపవగును. కాని యర్జునునికే గాక పాండవులైదుగురకును ఆమె పత్నియయ్యెను. కన్యారాశి చుట్టును గల ముఖ్యనక్షత్రములను పరిశీలించినచో ద్రౌపది పంచపాండవులకును సామాన్యభార్య యెట్లయ్యెనో స్పష్టమగును. కన్యారాశిని బరివేష్టించి యున్న ముఖ్యనక్షత్రము లేవేవియనగా (1) మఘ: దీని కధిదేవతలు పితరులు ; పితృదేవతలకు ప్రభువు యమధర్మరాజు. ఆ యంశమువాడు ధర్మరాజు ; (2) అర్జునీ నక్షత్రము, పూర్వ ఫల్గుని: అర్జునుడు ఫల్గునీ నక్షత్ర సంజాతుడు ; ఫల్గునుడు ; (3) స్వాతి : వాయుదైవత్యము ; భీమసేనుడు;(4, 5) అశ్వతర మండలములోని చుక్కలజత: అశ్వినీదేవతల మూడవ స్థానమునగల జంటచుక్కలు, అశ్వినులు. వీరియంశమున జన్మించినవారు నకుల సహదేవులు. ఇట్లు పంచపర్వతముల నడుమ నదియుంబోలె' కన్య, ద్రౌపది పాండవ ధర్మపత్నియని వర్ణింపబడినది. "పంచేంద్రియములు విషయరతిం బరిగ్రహించి" నట్లే పంచపాండవు లీమెను గ్రహించిరట !

ఈ సందర్భములో మరొక్కచిన్న విషయము గూడ మనము తెలిసికో తగియున్నది. ద్రౌపది స్వయంవరము 'పౌషమాసంబునం దష్టమియు రోహిణినాడు' అని భారత మాంధ్రీకరించిన నన్నయ్యభట్టు వ్రాసెను. మన పంచాంగకర్తలు మార్గశిరము తరువాతను, మాఘ మాసమునకు ముందును వచ్చు మాసముల "పౌష" మని వ్రాయు చున్నారు. ద్రౌపదీ స్వయంవర మీ మాసమున జరుగలేదు ; పుష్య మనబడు నీ మాసము తరువాత రెండునెలలకు వచ్చు ఫాల్గున మాసమున నష్టమితిథితో కూడిన రోహిణి నక్షత్రమున జరిగినది. ఫాల్గున మాసమున శుక్లపక్షమునందు అష్టమితిథితో రోహిణి రాగలదు, పుష్య మాసమున రాదు. అట్లయినచో ఫాల్గునమును 'పౌష' మనుటేల ? యని

పాఠకులకు సంశయముకలుగుట సహజము. చాంద్రమానముచేత చూడగా ద్రౌపదీ స్వయంవరము ఫాల్గునమాసముననే జరిగినది. కాని సౌరమానముచేత చూడగా నది పౌషమాసమే యగును. సూర్యుడు మేషములోనున్న మాసము మేషమాసము; వృషభస్థుడైన మాసము వృషభమాసము ; మిథునమునయున్న మాసము మిథునమాసము. ఇట్లే పండ్రెండు రాసులకుబట్టి పండ్రెండు మాసములు. సూర్యుడు మీన ములో నున్నమాసము మీనమాసము. మీనరాశిలో ముఖ్యమైన కడపటి చుక్క రేవతి. దీని కధిదేవత పూషుడు. పూషదేవత సూర్యునితోనున్న మాసము పూషుని సంబంధముగల మాసము. పౌష మాసము. పున్నమవాడు పుష్యమీనక్షత్రము కూడిన చాంద్రమాన పుష్యమాసము కాదని నేను నొక్కి వక్కాణించుచున్నాను. ఈ పుష్యమాసము ధను ర్మాసము. ఈ మాసము శూన్యమాసము. ఇందు వివాహములు నిషిద్ధ ములు. ఇట్టి నిషిద్ధపుష్యమాసమున ద్రౌపదీ స్వయంవరముగాని, ద్రౌపదీ వివాహముగాని జరిగెనమట ఆక్షేపణీయము.

ఇట్లు వేద ప్రసిద్ధములై పంచమ వేదమునందు ప్రశంసింపబడి, ఫాల్గున శుద్ధమున సూర్యుడస్తమించిన వెంటనే పడమట నస్తమించు మీనరాశిని, తూర్పున నుదయమగు సింహ కన్యారాశులను మనపూర్వ ఋషులు గ్రీకుల ధర్మమాయ్యని నేర్చుకొనిరనుట కంటె శోచనీయమైన యజ్ఞానమును, ఘోరము నబద్ధములైన వాదమును ఉండజాలవు.

**తులారాశి :**

చిత్తానక్షత్రపు కడపాదములు రెండును, స్వాతియు, విశాఖ మూడు పాదములును చేరి తులారాశి యగుచున్నది. గ్రీకులకు తుల యను రాశిగలదను జ్ఞానము లేనేలేదు. దాని తరువాతదగు వృశ్చిక రాశియొక్క కొక్కులుగా భావించి దానిని వృశ్చికరాశిలో నొక భాగ ముగానే వ్యవహరించిరి. గ్రీకు నాగరికతకు వారసులైన రోమనులలో

జ్యోతిర్విద్యావిదుడు వర్జిల్ (Virgil) మహాకవి ఈ తులారాశిని లైబ్రా (Libra) నామముతో పాశ్చాత్య వాఙ్మయమున తొలుత పేర్కొనినాడు. మహాపరిమాణయుతుడైన ఓరియన్ (Orion) యోధుడు వృశ్చిక హతుడైనట్లు తెలిపెడి గాథ, మీ సరికె వినియుంటిమి. అంత మహాకాయుని కుట్టి చంపు ప్రతిస్పర్థి వృశ్చికము అతికాయముగల పెద్ద తేలు కావలెనట! ఖగోళమున తులారాశిగల స్థలముకూడ వృశ్చిక రాశిలో చేర్చి, ఓరియన్ మహాయోధుని కుట్టి చంపగల మహావృశ్చిక; ముము తయారుచేసిరట!

గ్రీకులకుముందు పదునైదు వందల సంవత్సరములకు పూర్వము జ్యోతిర్జ్ఞానమున గొప్ప ప్రతిభచూపిన 'అకేతియన్', 'అస్సీరియన్' దేశముల సిద్ధాంతులు, సూర్యుడీరాశిలో నుండు మాసమును 'తుల్కు' మాసమని వ్యవహరించుచుండిరి. అకేతియన్ జాతివారి పవిత్రాగ్ని వేదిక ఈ రాశిలోనే ఉండెడిది. అంతకు పూర్వము బహు యుగముల క్రిందటనే వేదఋషులకు తులారాశి సంగతి తెలిసి యుండెను. సూర్యుడీ రాశిలో నుండు కాలము తులామాస మనుచుందుము. తులామాసములో దివారాత్రములు సరిసమముగా నుండు విషువత్పుణ్య కాలము సంప్రాప్తమగుచుండెను; అప్పటికి వేసవికాలపు వేండ్ర మణగిపోవును; కాని చలికాలము రాదు; తులామాసము సమశీతోష్ణ విశిష్టమైనమాసము. విశాఖతో వర్షమేఘము అంతరించును. వర్షకాలమునకును, వర్షాంతమును సూచించు శరత్కాలమునకును మధ్యకాలము తులామాసము. ఖగోళమున మఱియొక విశేషమేమనగా వంతవఱకు నుత్తర భాగమున వ్యాపించిన క్రాంతిచక్రము దిశమార్చి దక్షిణమునకు మరలును ఉత్తర శాఖనువదలి, వేరొకశాఖ నాశ్రయించి దక్షిణ దిగ్భాగము నమనరించి పోవును. విశాఖ అనగా వి-శాఖ అని విరిచి బెంట్లీ (Bentley) దొరగారు ఇక్కడ నుండి క్రాంతివృత్తము శాఖాంతరము నవలంబించి దక్షిణాపథము ద్రొక్కునని వ్యుత్పత్తి తెలిపినారు. ఈ సమాధానము

యుక్తియుక్తము. ఇట్లు విశాఖ ప్రాంతమందే క్రాంతిచక్రము దళీ కృతమై రెండు సమభాగములుగా విభజింప బడుచున్నది. లోకమువ తుల సమత్వసూచకము. త్రాసు రెండుప్రక్కలను సమముగా తూగవల యును. ఇటునటు సమముగా నుండునట్లు తూచుటే తులప్రయోజనము. తులామాసమున నహఃప్రమాణమును, శీతోష్ణపరిస్థితులును, వర్షవ్యాప్తి విధానములును, ఖగోళపు టుత్తర దక్షిణ దిశలును, క్రాంతి చక్ర వ్యాప్తియు సరిసమానముగా నుండును. పక్షపాతము లేని సమా నత్వము, సర్వసమత్వ భావమును సూచించు చక్కని మంత్రము ఋగ్వేదమునందు పెక్కుచోట్ల కనబడుచున్నది. అందొకటి ఋ X-59-10. "భరతా మపయ ద్రపో ద్యౌః పృథివి క్షమా రపో మోషుతే కించనామమత్" ఏ యకార్యకరణ దోషములకు పాపకర్ములు సిగ్గుపడి తలలు వంచుకొందురో, అసమ శీలములైన యే పక్షపాత దోషములు ప్రాణుల హింసించుచున్నవో అట్టి పాపసంచయమును దుంపతెంపి ద్యావాపృథ్వీ మిథునము తుడిచివేయును గాక! లోకములో నే ప్రాణియు పాపపీడితమై దుఃఖింపకుండును గాక! అను నీ మంత్రార్థము కరుణా సముద్రులు, పరమజీవ దయాపరులునైన శిబిచక్రవర్తి, బుద్ధ దేవుడు, యేసుక్రీస్తు, గాంధీమహాత్ముడు లోనగు మహనీయులకు మకుట ముగా దగియున్నది. తులారాశి యొక్క సౌమ్యశీలత అట్టివారికే చెల్లును. ఇందు మొదట పేర్కొనవలసినవాడు శిబి ; ఇతడు ఉశీనీరాణి పుత్రుడు. ఋగ్వేదములో నీమె పేర్కొనబడియున్నది. ఈ మంత్రార్థము శిబికి వర్తించునని నా విన్నపము. భువన రక్షకులైన ఇంద్రాగ్నులు శిబి చక్రవర్తి నగ్నిపరీక్ష గావించిరి. అగ్ని పావురమయ్యెను. ఇంద్రుడు డేగయై ఆ పావురమును తఱుముకొని వచ్చెను. పావురము శిబి చక్రవర్తి మరుగు సొచ్చి శరణము వేడెను. శిబి యంగీకరించి శరణ మిచ్చెను. ఆ పావురమును వదలి డేగ తన కిమ్మని తగువుచేయ శిబి నిరాకరించెను. "ఇది నాకు వేదవిహితమైన యాహారము. దీనిని భక్షింప

కున్నచో వాకటిచిచ్చున వేనును, వావెంట వా కుటుంబమును వళింప గలదు" అని డేగ వాదించెను. నీ యత్న మాహారార్థమే యైనపక్షమున, నీ పావురపు బరువునకు సరితూగునంత నా శరీరమాంసము తూచి యిచ్చెదనని శిబి ఖరారు చేసెను. డేగ యందు కంగీకరించెను. త్రాసు పన్ని యం దొక చిప్పలో పావురము నుంచిరి. రెండవ చిప్పలో శిబి మేని మాంసము కండలుగా కోసివేయుచు వచ్చిరి. ఎంత మాంసము కోసి పెట్టినను ఈ చిప్ప తేలిపోవుచుండెను. తుదకు, "కం. దానికి నచ్చెరువడి ధరణీనాథుడు తనువునందు నెత్తురు దొరగన్ తాన తుల యెక్క నంత న్వాని గుణోన్నతికి మెచ్చి వాసవదహనుల్ "నిజస్వరూప ములతో శిబికి ప్రత్యక్షమైరి.

ఈ పుణ్యకథను తులారాశి ఖగోళమున నక్షత్రాక్షరములతో శాశ్వతముగా చిత్రించినది. విశాఖానక్షత్రము ఇంద్రాగ్నిదైవత్యము. ఇంద్రాగ్నులు డేగ, పావుర రూపములతో శిబిని పరీక్షించిరి. "తనువున నెత్తురు దొరగగ" పావురముతో సరితూగవలయునని శిబియెక్కిన తుల ద్వాదశరాసులలో మధ్యరాశియై జ్యోతిర్లోకమున నేటికిని వెలుగు చున్నది. అతిప్రాచీనమైన యీ శిబిచక్రవర్తికథ పాండవులు తీర్థ యాత్రకు పోయినపుడు రోమశమహాముని వారలకు తెలిపినట్లు పంచమ వేదమైన భారతములో కలదు. మన తులామాసమును అకేడియన్ సిద్ధాంతులు 'తుల్కు'మాసమనిరి. దానిపూర్వోత్తరము లెరుగని గ్రీకులు, వృశ్చికరాశి శరీరమును పెంచుటకు దాని రెక్కలలో నేడవ రాశిం దూర్చిరి. పిమ్మట వర్జిల్ నామకుడగు రోమనుకవి మూలముగా నీ రాశికి లైబ్రా (Libra) నామముతో పడమటిదేశములో వ్యవహారము సిద్ధించినది. ఈ గొడవల నెఱుగక, ఈ రాశికూడ గ్రీకుల ధర్మమాయని మన పూర్వులు నేర్చుకొనిరని గంతులువేయు మనే విమర్శకుల చర్యల నేమనవలెనో తెలియకున్నది. విశాఖ, నక్షత్రముల కధిపతి. భాగ వతమతములో రాధ, కృష్ణ శక్తురాలు. వైశాఖము రాధామాసము.

**వృశ్చికరాశి :**

విశాఖ నాలుగవ పాదము, అనూరాధ, జ్యేష్ఠా నక్షత్రములు వృశ్చిక రాశి. వృశ్చికము వేదఋషులకు తెలియనిది కాదు. ఋగ్వేదము సప్తమ మండలములో నేబదియవ సూక్తము వృశ్చిక విషయకము. వృశ్చికరాశి చుక్కలన్నిటిలో ప్రథమ గణ్యము, జేష్ఠా నక్షత్రము. పాశ్చాత్యు లీ నక్షత్రమును 'ఎంటేరిస్' (Antares) అందురు. ఆ మాటకు అర్థమేమనగా అంగారక గ్రహము వలెనే ఎఱ్ఱని కాంతితో తేజరిల్లునది. జ్యేష్ఠ ఎఱ్ఱని నక్షత్రము. దీనికి ఆల్ఫాస్కార్పియో అని కూడ పడమటి జ్యోతిశ్శాస్త్రమునందు వ్యవహారనామ మున్నది. జ్యేష్ఠ ఇంద్రదైవత్యమని మన మీసరికే తెలిసికొంటిమి. ఇది వృశ్చిక రాశిలోనిది. కర్కటక వృశ్చికాది కీటకములకు సంతాన ప్రాప్తితో మరణమగునని యొక కవిసమయము మన ప్రాచీనకాలముల నుండి కలదు. జీవశాస్త్ర రీత్యా ఇది నిజముకాదు. అయినను కవులు నిరంకుశులు వారి రచనలు యథాశాస్త్రీయము కాక పోయినను ఏ భావముల మనమున నిడికొని వారు రచించిరో ఆ భావముల నట్లే యర్థము చేసికొనుట మన కర్తవ్యము. లేకున్న కవి తాత్పర్యము మనకు సరిగా తెలియరాదు.

"అయం పంథాఽ అనువిత్తః పురాణో యతో దేహిఉదజాయంతి విశ్వే అతశ్చిదా జనిషీష్ట ప్రవృద్ధో మామాతరమముయాపత్తివేకః" ఋ IV-18-1.

అతి ప్రాచీనమైన యీమార్గము నవలంబించియే దేవతలందరును ఉదయింప గలిగిరి. దీని నాశ్రయించియే, యే యొక్కడైనను పుట్టి గొప్పవాడు కావచ్చును. అట్లు గానిచో వా డేల మాతృమూర్తి రూపు మాపవలెను ? ఇందు దేవశాశ్రయమై, దేవతలందరు నవలంబించిన మార్గము క్రాంతిచక్రమే. తల్లిని రూపుమాపుట అనగా నేమో యీ క్రింద చర్చించి తెలిసికొందము.

"నాహమతో నిరయాదుర్గహైత త్తిరశ్చతా పార్శ్వాన్నిర్గమాణి" ఋ IV - 18 - 2. దారి చాలా ఇఱుకుగానున్నది. ఈ మార్గము వెంట నేను పోజాలను. ఈ ప్రక్క నుండి వక్రగతి నవలంబించి నిర్గమింతును.

"పరాయతీ మాతర మన్వచష్ట న నానుగాన్యను నూగమాని" ఋ IV - 18 3. అని చనిపోవుచున్న తల్లివైపు అతడు కనులుత్రిప్పి చూచెను.

ఈ మంత్రములు, "దీనికావ వేమి తిరుమలేశ?" అని ప్రశ్నవైచి కథ పొడిచినట్లున్నవి. వృశ్చికరాశి గర్భపార్శ్వమునుండి ఇంద్రుడు—జ్యేష్ఠనక్షత్రముదయించినది. ఇట్లుదయ మగుటలో, కొందువ దేవతల కాశ్రయమయి వారలందఱు నవలంబించిన క్రాంతివృత్తమార్గమునే యనుసరించి ఇంద్రుడు జనించినాడు. పైని వివరించిన కవిసమయము ననుసరించి వృశ్చికగర్భమున జనించుటచేత ఇంద్రుడు మాతృహంతకుడు కావలయునుకదా ? వృశ్చికరాశి చెడక, దక్షిణాకాశమున ప్రకాశించుచునే యున్నది. ఇక మరణావస్థలోనున్న ఇంద్రుని తల్లియెవరు ? అని ప్రశ్న బయలుదేరినది. దానికి ప్రత్యుత్తర మేమనగా :- ఇంద్రునితల్లి అదితిదేవి. ఆమె పునర్వసు నక్షత్రముల కధిదేవత. జ్యేష్ఠరూపుడగు నింద్రుని ప్రతిస్పర్ధి మృగశిర నక్షత్రములు. వానికావల ఆర్ద్ర, పునర్వసులున్నవి. ఇంద్రోదయవేళకు మృగశిర యస్తమించునుగాని, పునర్వసు అస్తమింపదు; పడమటకుప్రాలి అస్తమింపనై యుండును. అట్టి యవస్థలోనే పునర్వసు ఇంద్రుని కంటబడును. ఆలంకారిక భాషలో అస్తమింప ప్రాలియున్న పునర్వసురూపి-తల్లి అదితిదేవిపై ఇంద్రుడు దృష్టి మరల్చుట యనునది చావనై మరణావస్థలోనున్న తల్లిని, అపుడే తూర్పునకుదయించిన ఇంద్రుడు చూచెనని వర్ణింపబడినది. మంత్రద్రష్టయు, వాతాంబరవీథి విహారియునగు వామదేవ ఋషి తూర్పున జ్యేష్ఠయుదయించుటయు, పడమటకు పునర్వసు ప్రాలి యస్తమింపనై

యుండుటయు గమనించి, వృశ్చికవిషయమైన కవిసమయము ననుస రించుచు నుత్ప్రేక్షించి యాలంకారిక భాషలో పై మంత్రములు రచించి నాడు. విశాఖ మొదలు క్రాంతిచక్రమునందలి నక్షత్రములు దక్షిణ దిశకు వ్రాలి యుండుటచేత నిరుకుదారినుండి నైఋతి పార్శ్వమున నింద్రుడుదయించుట ఖగోళసత్యము. రుచియు, చలియు లేక పొడి దుమ్ములవంటి ప్రకృతి సత్యములకు కవితాచమత్కృతిచే చక్కని రూపురేఖా విలాసభావముల నాపాదించి రసవంతముగా వర్ణింపగల శక్తి వేదఋషుల కపారముగా గలదు. ఆ కవితారసగ్రహణ పారీ ణత లేక పడమటి పండితులు వేదపఠనము ఊకదంపనుచున్నారు. ఆ వాక్యములనే పట్టుకొని భారతీయులుకూడ 'మేలు భళాభళి' యని తాళమువైచుట మన దురదృష్టము.

ధనుస్సు :

వృశ్చికము తరువాత రాశి ధనుస్సు. ధనుస్సు అనగా విల్లు. ఈ విల్లు పూవిల్లు విలుకాడు మన్మథుడు కాముకీకాముకుల వాతడు పువ్వుటమ్ములతో కొట్టి పడవైచునట! కవి సమయప్రకారము అవి పువ్వుటమ్ములే గాని, నిజముగా లోహమయములై నిశితాగ్రములైన కణకుటమ్ములు. ఋగ్వేదములో నీ ధనుర్ధారికి కృశానుడను పేరు గలదు. కీ. శే. గురజాడ అప్పారావుగారు కన్యాశుల్క నాటకములో నీ పూవిలుకానిం గూర్చి గిరీశము నోట పలికించిన వాక్యములకు మూలము ఋగ్వేదములో కనబడుచున్నది.

| | | | |
|---|---|---|---|
| చూ. ఋ.I | 155 | 2 | యామర్త్యాయ ప్రతిధీయమాన మిత్ కృశానో రస్తు రసనా మురుష్యథ. |
| ,, IV | 27 | 3 | సృజద్యదస్మ అవహక్షిపజ్జ్యాం కృశాను రస్తా మనసా భురణ్యన్. |
| ,, VI | 8 | 5 | పఞ్చ స్తేవ ప్రతిభావ దశివ్యన్నిశిత తేజో యపోన భారం. |

ఇందు మొదటి మంత్రమునకు అర్థము—ధనుర్ధారి కృశానుడు గుఱిచూచి మానవులపై ప్రయోగించు బాణము; రెండవ మంత్రమునకు: మనస్సునరేగు నుద్రేకముతో ధన్వి, కృశానుడు వారిదిగిచి గుఱి చూచి, వానిని పడగొట్టువాడై బాణము విడిచెను; మూడవ మంత్రమునకు : వాడిగలిగి బిగబిగ మెఱయు ముక్కుమొనగల కోలను ఆ విలుకాడు ఎదుటవానింగొట్టి పడవైచుటకు కుతూహలముకలిగి వింట సంధించెను.

విశేషించి కృశానుడనునది అగ్నికిగల నామములలో నొకటి. కాముకీకాముకులమధ్య మన్మథుడు బాణప్రయోగముచేసి ప్రేరేపు దుస్సహతాపమునకు మన్మథాగ్నియని పేరుగలదు. కృశానుశబ్దమునకు ధనుర్ధారి యర్థముకలదు.

ధన్వి మీనకేతనుడు; ఈ రాశికెగువనున్న అజము మేకముఖమును చేపతోకయు కలదని ఈవఱకే తెలిసికొంటిమి. ధనువుపై నెగురు చేపతోకనుపట్టి మన్మథుడు మీనకేతనుడు, ఝషకేతనుడు ననబడుచున్నాడు. అజము మకరరాశిగా మారిన తరువాత మన్మథుడు మకరధ్వజుడని వ్యవహరింపబడుచున్నాడు.

## అజరాశి - మకరరాశి :

అఖండ ప్రతిభాశాలియు దేవతాప్రభువును నగు నింద్రుడు మేకతో సింహమును సంహరించి, అపూర్వఘనకార్యమొనర్చి శ్లాఘ్యుడయ్యెనని మనమింతకుముందు తెలిసికొంటిమి. ఋగ్వేదములో పలుతావుల నీ యజము పూషుని రథమునకు పూన్పబడి యతని రథాశ్వమయ్యెనని వర్ణింపబడినది. పూషుడు రేవతీనక్షత్రమున కధిదేవత, తూర్పున రేవతీనక్షత్ర ముదయమగునప్పటికి అజము ఉదయించుటే గాక, రేవతికి ముందు నడచుచున్నట్లు భావింపతగియుండును. కావున

మంత్రద్రష్టలగు వేదఋషులకు ఈ యజము పూషుని రథాశ్వమను భావము కలిగినది. కొన్నిమంత్రములను చదివి చూతము.

I-138-4 అజాశ్వఃశ్రవస్యతామ జాశ్వమి॥
VI-55-3 రథయోధారాస్యాఘృణోవసో రాశిరజాశ్వ.
,, ,, 4 పూషణాన్వ జాశ్వముపస్తో షామవాజినం.
IX-67-10 అవితానో అజాశ్వ పూషాయామనియామని.
X-26-8 ఆతేరథస్య పూషన్నజధురం వవృత్యుః.

ఇవిగాక, వేద్వభూశ్య, మీనరాసుల చర్చ సందర్భములో మరి కొన్ని ప్రమాణములను చదువగలము.

కొంతకాలము తరువాత నీ యజరాశి మకరరాశిగా మారినది. మకరము ఖగోళనాటకములో ననేకపాత్రలు ధరించినది. అందొకటి మన్మథుని ధ్వజపాత్ర ; రెండవది, ఈ తరువాతవచ్చు కుంభరాశి కధిపతి వరుణదేవునకు వాహనపాత్ర; మూడవది, జగత్ప్రసిద్ధమైన గజేంద్ర మోక్షణ కథలో గజరాజునుపట్టి పీడించిన ఘోర మకరపాత్ర.

## కుంభరాశి - జలప్రదాత వరుణుడు :

మకరము తరువాత మనము చర్చించవలసినది కుంభరాశి. ఇప్పటికి పదమూడు శతాబ్దములక్రిందనుండిన వరాహమిహిరుడు వ్రాసిన బృహజ్జాతకమునందు, ఈ రాశిని 'ఘటీ'అని తెల్పియున్నారు. అందు పేర్కొనబడిన యవనేశ్వరమతము ననుసరించియు, జీవశర్మవ్యాఖ్య ననుసరించియు 'ఘటీ' శబ్దమునకు 'రిక్తకుంభస్కంధధారి' యనియు, "స్కంధేతు రిక్తః పురుషస్య కుంభో॥" అని యర్థవ్యాఖ్యానములు వ్రాయబడినవి. ఆ కారణముచేత కుంభరాశి యనగా, సర్వశూన్యమగు వట్టికుండను భుజమున పెట్టికొనిన నరరూపమని స్పష్టమగుచున్నది. (ఈ వ్రాతలు వ్యాఖ్యానములు కేవలము నిరాధారములని నేను ఎలుగెత్తి చాటించిచెప్ప సాహసించుచున్నాను.) ఖగోళమున నక్షత్రరూపమును

పరిశీలించి చూచినచో వట్టికుండ మూపున బెట్టికొనిన నరునిరూపము గోచరింపదు. పాశ్చాత్య గ్రంథములలో నీ రాశి **Water-Power,** అనగా నీరుపోయువాని రూపమే వర్ణితము. ఋగ్వేదములో వరుణ దేవుడు జలప్రపూర్ణమైన కుంభమును పట్టుకొని దిగువకువంచి జలప్రదా నము చేయుచున్న రూపము కనులకు కట్టినట్లు ఎంతోచక్కగా వర్ణింప బడినది. శతభిషన్నక్షత్రము కుంభరాశిలోనిది. ఆ నక్షత్రమున కధిదేవత వరుణుడు. ఆ వరుణదేవుడు, వఱపుచే తపించుచున్న సస్యములకు, నరు లకు జలప్రదానము చేయుటకు నీళ్లకడవ ద్రిమ్మరించుచున్న రూపము దిగువ ఋగ్వేద మంత్రమున స్ఫుటముగా వర్ణింపబడినది.

ఋ V-85-3 "నీచీనబారం వరుణః కవంధః ప్రససర్జ రోదసీ అంతరిక్షం। తేనవిశ్వస్య భువనస్యరాజాయవం నవృష్టి ర్వ్యునత్తిభూమ॥" ఈ నాడు కూడ చంద్రుడు ధనిష్ఠా పంచకములో నున్నపుడు వర్ష యోగ మున్నదనిసిద్ధాంతులును, పామరజనములునుకూడ ఆపుణ్యాదినములకొఱకు ప్రతీక్షించు చుందురు. ధనిష్ఠా పంచకమనగా ధనిష్ఠ మొదలుగాగలయైదు నక్షత్రములుగల దినములు. ధనిష్ఠ, శతభిషము, పూర్వాభాద్ర, ఉత్తరా భాద్ర, రేవతులు క్రమముగా చంద్రునితో కూడియుండు దినములు. గొప్ప వర్షము కురిసినపుడు పండితులు కుంభవృష్టి కురిసెనందురు. అదే యర్థమిచ్చునట్లు అచ్చతెనుగు పదములలో జానపదులు కడవలు కుమ్మ రించినట్లు వాన కురిసినదందురు. ఈ జనవాక్యము నతిక్రమించి, ధనిష్ఠా పంచకవర్ష యోగమును విస్మరించి వరాహమిహిరుడును, అతని గ్రంథ వ్యాఖ్యాతలును, శూన్యఘటమును, వట్టికుండను భుజమున నెత్తికొనిన దరిద్ర మానవరూపము ఈ రాశి కేల యంటగట్టిరో నే నెఱుగజాల కున్నాను. వా రెవ్వరును జలప్రపూర్ణ కుంభహస్తుడగు వరుణదేవుని వర్ణించిచెప్పిన వేదమంత్రమును చదివియుండరు. చదివినను అర్థము చేసికొనియుండరు. భారతదేశము యొక్క పారతంత్ర్యము, భావి దరిద్రము నిట్లుండునని తెలుపుటకో యన రిక్తకుంభమును ఒక దరి

ద్రుని మూపున పెట్టినారు. వరాహమిహిరునినాటికే అంతరించిన వేద విజ్ఞానము ఈనా డిటను నామ రూపములు చెడియుండుట ఆశ్చర్య పడనక్కరలేదేమో ! ఈ దిగువ వ్రాసిన వివరములవలన, ఈ ప్రాంతపు ఖగోళమును ఋగ్వేద మంత్రద్రష్టలు ఎంత సూక్ష్మముగా పరిశీలనచేసి, ఎంత చక్కగా వర్ణించిచెప్పిరో పాఠకులకు స్పష్టముకాగలదు.

## పేద్వఘాశ్వము (Pegasus) :

ఇది యొక రాశి కాదు. కాకపోయినను వేదఋషుల జ్యోతిర్విజ్ఞాన మిట్టిదని తెలిసికొనుటకు ఈ యశ్వప్రశంస మిక్కిలి యవసరము. కుంభమీనముల మధ్య నుజ్జ్వలతేజముతో మెఱయు నక్షత్రసమూహము ఒక దివ్యాశ్వరూపముతో మింట తోచుచుండును. పేదు అను రాజఋషి అశ్వినుల నాశ్రయించి భక్తితో నారాధించినందు కా దేవతలా రాజర్షి కీ యశ్వము ననుగ్రహించిరి. ఇది శ్వేతాశ్వము (ఋ I-116 ౯); అహిహనము (I.117-9). ఈ తేజికి డేగ ఱెక్కలవంటి ఱెక్కలును, లేడి కాళ్ళవంటి కాళ్ళునుగలవు. ఋ-I.168-1:'శ్యేనస్య పక్షా హారిణస్య బాహూ'. ఈ యమాశ్వము అహిహనమనుటలో జ్యోతిశ్శాస్త్రదృష్ట్యా విశేషార్థమున్నది. ఆశ్లేష సర్పదైవత్యము. ఆశ్లేష చుక్కలు సాగి మహాహియైనట్లు ఖగోళమున ఘోరసర్పరూపము కానవచ్చుచున్నది. దానిని పాశ్చాత్యులు హైడ్రా (Hydra) చుక్కలగుంపందురు; ఇది స్వాతివఱకు సాగి అజగరమై భీముని పట్టుకొనినట్లు భారతములో నహుషునికథ గలదు. పేద్వఘాశ్వ ముదయమైనపుడు ఆ యశ్వమున కెట్టయెదుటనున్న యహిరూపము అస్తమించును కాబట్టి యీ యశ్వ మహిహనము. ఈ యశ్వ మీ ఱెక్కలతోను, లేడి పాదములతోను వేదమునకు బహుకాలము పిమ్మట గ్రీకుగాథలలో 'పెగసస్' గుఱ్ఱమై నిలిచినది. పేద్వఘాశ్వము యొక్క వికృతి పెగసస్. ఈ గుఱ్ఱముపై నెక్కి బెల్లెరిఫోన్ (Bellerephon) అను యోధుడు క్రూరసర్ప, త్రిశిర

పిశాచాదులను సంహారించెనని గ్రీకుగాథ లున్నవి. ఏవాటి ఋగ్వేదము ? పిమ్మట నెన్ని వేల సంవత్సరములకు గ్రీకుల నాగరికత ? పేద్వమూశ్వ వివరములను వేదఋషులు గ్రీకులనుండి నేర్చుకొనిరా ? అని నేను పవాలు చేయుచున్నాను. అది యటుండ, వేదచోదితములైన యజ్ఞ యాగాది క్రతువులలో దేవతలకు సమర్పింపబడు హవిర్భాగములు ఖగోళమున నక్షత్రముల గమనవిశేషముల ననుసరించి యేర్పఱుప బడుట మనము గుర్తెఱుగవలెను. జ్యోతిర్లోకములో తూర్పునుండి చూచితిమేని ముందు అజరాశియు, పిదప పేద్వమూశ్వమును కానవచ్చు చుండును. అజమునకు ఛాగమని కూడ పేరున్నది. పూషుని కర్పింపబడు హవిర్భాగములో ముందుఛాగమును,పిమ్మట అశ్వమును చేరియుండును. చూ. ఋ-I-168-8 "ఏషచ్ఛాగః పురో అశ్వేన వాజినా పూష్ణో భాగోః" క్రతుకర్మలో నేమి, ఇతర సందర్భములలో నేమి భూగోళ నాటకము ఖగోళ నాటకము ననుసరించియే జరుగుచుండును.

## మీనరాశి :

పంన్రెండు రాసులలో కడపటిది మీనరాశి. పూర్వాభాద్ర కడపటి పాదము, ఉత్తరాభాద్ర, రేవతీ నక్షత్రములు కూడి మీనమగు చున్నది. ఈ రాశిలో రెండు చేప లున్నవి. వీని తోకల మధ్య నొక చక్కని పాశమున్నది. ఈ చేప రూపములు పాశరూపమును గూడ ఇందలి నక్షత్రముల యాకారమును బట్టి నిర్ణయింపబడినవి. క్రాంతి చక్రమునందున్న ఇతర నక్షత్రములతో కూడ ఈ రాశిలోని చేపలు ఖగోళమున సంచరించుచు ఇట్లగపడును. ఈ చేపల కెదురుగా సింహ రాశి పుచ్ఛమున్నది. అందు రెండు చుక్కలగపడును ; ఒకటి అవ గింజవలె బహు చిన్నది ; రెండవది దానికి దక్షిణమున మంచి తేజస్సు గలిగి మెఱయుచుండును. ఈ రెండును ఉత్తరఫల్గునీ నక్షత్రములు. వేదములో నివి యర్జున నామముతోనే వర్ణింపబడినవి. ఈ యర్జునీ

నక్షత్రములు ఫాల్గున శుక్ల అష్టమినాడు సూర్యు డస్తమించగానే తూర్పున నుదయమగును. వానికెట్టయెదుట మీనరాశి య స్తమించును. ఈ యంశము మత్స్యయంత్రమని భారతమున వర్ణింపబడినది. అర్జునుడే ఆ చేపలను పడగొట్టి మత్స్యయంత్రమును భేదించెను. చేపలు పడి పోగానే సింహరాశి తోక దిగువనున్న కన్య - ద్రౌపది, యా రంగమున నావిర్భవించి, పూలమాల కంఠమున వైచి యతనిని వరించినట్లు, ద్రౌపదీ స్వయంవర కథ. అర్జునీమాసమునందే వరులు వధువుం బెండ్లాడుదురని ఋగ్వేదము X-85-18 తెల్పుచున్నది : "...అర్జున్యోః పర్యుహ్యతే।"ఒకప్పుడు మరుత్తులేడ్వురకును సామాన్య భార్య యని వర్ణింపబడిన కన్యారాశి పంచపాండవులకు సామాన్య పత్నియైనట్లు భారతము తెలుపుచున్నది. భారతము పంచమవేదమందురు భారతకథ కవసరమైన బీజములన్నియు ఋగ్వేదమున స్పష్టముగా గలవు. ఒక జూదరి దుర్వ్యసనాసక్తుడై భార్యను పణముగా నొడ్డి యోడిపోయెను. "దుశ్శాసను" డను పాపకర్ముడామె చీర లొలువ యత్నించుటయు, నగ్నత్వ భీతిచే నామె యాక్రందించుటయు, పెద్ద గోల యగుటయు, ఆ యువతి ఇంద్రుని సంరక్షింప వేడుటయు, జూద మాడుట వలన కలుగు ననర్థములును, వ్యసనాసక్తుల మనస్సులను జూదపు పాచికలకు కల భల్లూకపు పట్టును, జూదమున నోడినవారిని విరోధులుడికించుటయు లోనగు భారత కథాంశములు ఋగ్వేదము నందు X.33, 34 సూక్తములలో నెంతో చక్కగా వివరింప బడినవి. భారత కథాబీజము లన్నిటిని స్పష్టముగా చూపుచున్న ఋగ్వేదమూలమును చదువకయే ద్రౌపది వేషకత్తె-రంకుముండ, దుర్యోధన దుశ్శాసనులు బహుయోగ్యులని విమర్శించు మహానుభావుల యజ్ఞానము మిక్కిలి శోచనీయము. ఈ మహాభారత కథ సమస్త వివరములతో ఖగోళమున నెట్లు చిత్రింపబడినదో విస్తరముగా వేరొక గ్రంథమున వ్రాయదలచి యిపుడా యంశమునుండి విరమించుచున్నాను.

వరుణపాశము :

మీనరాశిని గూర్చిన చర్చ ముగింపక పూర్వము వరుణపాశమును గూర్చి యొకింత చెప్పవలసి యున్నది. ఈ రాశి చేపలపుచ్ఛముల మధ్య పాశబంధము వంటి దృశ్యము ఖగోళమున కానవచ్చునని పైన వ్రాసియుంటిని. ఈ పాశమును వరుణపాశ మని వేదము వర్ణించుచున్నది. వరుణపాశము ఋ I-24-15, I-25-2, VI-74-4, X-85-24 మొదలగు మంత్రములలో ప్రశంసింపబడినది. ఇందు పెద్ద మెలికెలు మూడును, చిన్నవి నాలుగును, మొత్తము ఏడు మెలికలు కలవని అథర్వవేదము తెల్పుచున్నదీ."ఏతే పాశా వరుణ వ్రత ప్త ్రేధాత్వి ప్తిః (IV 16-6.)అన్నృతవాదులీ పాశముతో బంధింపబడుదురు. సత్యవాదులా దేవుని కృపకు పాత్రులు. మీనరాశిలో వరుణ బలగము అర్జునుని ప్రతిస్పర్థులు. సైంధవవధ నాడు అర్జునుడు వరుణాంశజులను తెగటార్చెనని భారతము తెల్పుచున్నది. ఇక్కడి చిత్రములో, మీనరాశి చేప పుచ్ఛముల మధ్య మొత్తము ఏడు మెలికలతో ఖగోళమున గానవచ్చు వరుణపాశ దృశ్యమును చూడనగును.

ద్వాదశ రాసులంగూర్చి బాదరాయణ విరచిత శ్లోకము :

ద్వాదశ రాశ్యాత్మకమైన క్రాంతి చక్రము విధాతృని శరీరముగా భావన చేసుకొని, ఏ రాశి అతని కే యంగముగ నేర్పడెనో వివరించుచు బాదరాయణుల వారు రచించిన శ్లోక మీ దిగువ వ్రాయుచున్నాను.

శ్లో॥ మేషః శిరోథ వదనం వృషభో విధాతుః । వక్షోభవే
న్మృమిథునం హృదయం కుళీరం । సింహ స్తథోదర
మథోయువతిః బస్తి స్తులా భృదవమేహన మష్టమస్యాత్
మకరో జానుద్వయం భవతి జంఘాద్వితీయం కుంభః
పాదౌ మత్స్యద్వయంచేతి॥

ఈ క్రింది శ్లోకము ఎప్పుడెవరిచే రచింపబడెనో తెలియరాలేదు కాని పన్నెండు రాసుల ప్రశంసయు నిందు చమత్కారముగా నిముడ్చబడినది. పాఠకులను రంజింపజేయ గలదని దాని నిట వ్రాయుచున్నాము.

శ్లో॥ సంతప్తాదశమధ్వజాదిగతినా సమ్మూర్ఛితా నిర్జలా
తుర్యద్వాదశవ ద్వితీయమతిమన్ ఏకాదశాశస్తనీ
సా షష్ఠీ శరమధ్యమాచ నవమ భ్రూసప్తమీ వర్జితా
ప్రాప్నోత్యష్టమ వేదనాంత్య మధునా తూర్ణంతృతీయోభవా॥

తన ప్రియుని యాదరాభిమానములకు దూరమై ఒక యువతి దుస్సహ విరహవేదనచే తపించుచుండెను. ఆ యువతీ యువకుల క్షేమము కోరిన ఒక మధ్యవర్తి ప్రియుని కామె దురవస్థ యీ శ్లోకము ద్వారా తెలిపి, "ఓ సఖుడా! ఇకనైన నామె యభీష్టము నెరవేర్పు"మని మందలించి హితవు తెలిపిన సంగతి ఇందు గలదు. ఇందు ఒకొక్క సంఖ్య మేషమాదిగా ఒకొక్క రాశియని యన్వయించుకొననేల? దశమధ్వజ 10 వదియగు మకరము ధ్వజముగా గల మన్మథుడు; ఆదిగతి. మొదటిదగు మేషము వాహనముగా గల అగ్నిదేవుడు; కాబట్టి సంతప్తాదశమధ్వజాదిగతినా అనుతొలిపాద భాగమునకు అర్థము: ఆ యువతి మన్మథాగ్నిచేసంతప్తయై విరహవేదనం బొందుచున్నది. ఇంకను ఆమెమూర్ఛావస్థలో నున్నది. ఎట్టి మూర్ఛావస్థ? నిర్జలాతుర్యద్వాదశవత్— తుర్యమనగా నాలుగవదికర్కటకరాశి. ద్వాదశమనగా పన్నెండవదిమీనరాశి; జలమువదలి, చెరువు నుండి బయటపడిన చేపవలెను, ఎండ్రివలెను, ప్రతికూలావరణలో బడి కొట్టుకొనుచు మూర్ఛావస్థలో నున్నది. ఆ యువతి-సా షష్ఠీ-ఆరవది కన్యారాశి-ఆ కన్య ఎట్టిదనగా, ఆమె సౌందర్యము వర్ణించుచున్నాడు: శరమధ్యమా— శరమనగా అయిదు. అయిదవరాశి సింహము, సింహమువలె సన్నని నడుముగలది, నవమభ్రూ-తొమ్మిదవది ధనూరాశి, ధనువువలె చక్కగా వంగిన కను

బోములుకలది. నక్షత్రమీవర్తికా : పదవరాశి తుల, తులావర్తికా-ఆమెతో సౌందర్య విషయమున సరితూగగల వారెవ్వరునులేరు. ఆమె లోకైక సుందరి. అటువంటి సౌందర్యఖని నీకు దూరమై అష్టమ వేదనం బొందు చున్నది. ఎనిమిదవ రాశి వృశ్చికము. తేలుకుట్టినట్లు ఎంతోబాధ పడు చున్నది. కాబట్టి హే ద్వితీయ మతిమన్ - ద్వితీయరాశి వృషభము. ఓ యెద్దు ముద్దా ! పశువా ! అలస్యముచేయక, తృతీయోభవ-మూడవది యగు మిధునముకండు, వెంటనే నీ వామెను చేబట్టి మీ రుభయులు పుణ్యాదంపతులుకండు.

ఇంతటితో నా ద్వాదశరాసుల చర్చ ముగించి ఇక నక్షత్రఋషులం గూర్చి తెలిసికొందము.

## నక్షత్రఋషులు :

ఉత్తరాకాశమున నద్భుత తేజోరూపములతో వెలుగొందు నీ యేడు నక్షత్రములను చూడనివారుండరు. బహుప్రాచీన కాలముల నుండి యన్నిదేశములవారును ఈ చుక్కలను గమనించి యానందాశ్చ ర్యములను పొందుచువ్వారు. ఉత్తరాకాశమున బృహదృక్షము, లఘు ఋక్షమునని రెండు చుక్కల గుంపులున్నవి. ఋక్షమనగా భల్లూకము, ఎలుగుగొడ్డు ; ఋక్షమనగా ప్రకాశించు నక్షత్రమనికూడ అర్థము కలదు. రెండర్థములను జోడించి, శ్లేషగా నీ నక్షత్ర సమూహములకు ఋక్షద్వయమని పేరిడిరి. లఘుఋక్షము యొక్క తోకచివరను ఈ కల్పనమున ధ్రువనక్షత్రము మెఱయుచుండును. బృహదృక్షమునందు ముఖ్యముగా నక్షత్రఋషులనబడు నక్షత్రము లేడును మెఱయుచుండును. నక్షత్రఋషులలో పడమటి చివరనున్న రెండుచుక్కలును ఎప్పుడును ధ్రువుని చూపుచుండును. స్థూలదృష్ట్యా ధ్రువనక్షత్రమునకు చలనము లేదు. ఉదయాస్తమానములు లేవు. తక్కిన లఘుఋక్షపు చుక్కలకు చలనము గలదు. అవి ధ్రువునిచుట్టు ప్రదక్షిణము చేయుచుండును. కాని,

యీ చుక్కలకు ఉదయాస్తమానములు లేవు. ఏ రాత్రియైనను, ఏవేళ చూచినను అవి ధ్రువునిప్రక్క కనబడగలవు. సప్తఋషులుకూడ ధ్రువుని చుట్టు పరిభ్రమించుచుందురు; మనదేశములో సప్తఋషులనబడు చుక్కలకు ఉదయము, అస్తమానమును కలవు. భరతఖండముకంటె భూగోళపు టుత్తరధ్రువ ప్రాంతములకు సమీపమందున్న దేశములలో సప్తఋషి నక్షత్రములకు ఉదయాస్తమానము లుండవు. గానుగకు కట్టిన ఎద్దువలె సప్తఋషినక్షత్రములు ధ్రువునిచుట్టు పరిభ్రమించును. ఆ దేశములలో నెల్లయపుడును రాత్రులగపడుచుండును. మనదేశమందన్ననో, సప్తర్షి మండలమున మొదటి చుక్కలు రెండును మఘనక్షత్రముతో నించుమించుగా నుదయమగుచుండును. మఘ చుక్కలకువలెనే వీనికిని ఉదయాస్తమానము లున్నవి. భాద్రపద శుక్ల పంచమీ దినమున నీ సప్తఋషులు సూర్యోదయాత్పూర్వము తొలిసారి తూర్పున నుదయమగుదురు. అందుచేత నా రోజున మనదేశములో వృద్ధవనితలు సప్తఋషులం బూజించి ఋషిపంచమీవ్రతము చేయుదురు. వీర లొకప్పుడు భూమిమీద నందరుమానవులవలెనే మానవులై జన్మించి జీవించిరి. యీ పుణ్యమూర్తు లువిధివిహితకర్మములను యథావిధిగ నాచరించుచు, ఛందస్సుల నెఱిగిన విద్వాంసులై, మహాకవులై, మంత్రద్రష్టలై, ధర్మశాస్త్రకర్తలై తుదకు నక్షత్రరూపులును, దేవతామూర్తులునై ధర్మరథముం గడపు సారథులగుచు నూర్ధ్వలోకమున వెలుగొందుచున్నారు. ఈ యంశమును ఋగ్వేదము స్థిరపఱుచుచున్నది. చూ. X 180-7—"సహస్తోమాః సహఛందసఽఆవృతః సహప్రమా ఋషయః సప్తదైవ్యాః । పూర్వేషాం పంథామనుదృశ్య ధీరాఽఅన్వాలేభిరే రథ్యోనరశ్మీన్."

**వినాయకచతుర్థి :**

వృద్ధస్త్రీజనము సప్తఋషులం బూజించు పంచమికి తొలిదినము వినాయకచతుర్థి. ఆనాడు ఏనుగ "తుండము నేకదంతమును, తోరపు

బొజ్జయు వామహస్తముల్" గల విఘ్నేశ్వరుని మనదేశములో నెల్లరును పూజింతురు. భారతీయులు పూజించు దేవగణములో నెల్ల గజముఖుడును, మూషక వాహనుడునైన యీ వినాయకుని కంటె హాస్యనిలయు లింకొకరు లేరు. తోరపుబొజ్జ గల యీ విఘ్న-నాయకుడు పార్వతీ పరమేశ్వరుల ముద్దుబిడ్డడు. ఔరసుడు గాకున్న నభిమాన పుత్రుడు. దేవగణములలో నొకొక్కనికి గల సాధారణ, అసాధారణ శక్తులన్నింటిలో నొకొక్క యంశ యీ విఘ్నరాజునకు సమర్పింపబడినది. కావున నీతడు సమస్తదేవతామూర్తి యగుటయే కాక వారిలో నెల్ల ప్రథమ పూజార్హుడైనాడు. శ్రౌతస్మార్త శుభాశుభ కర్మతంత్రము విఘ్నేశ్వర పూజతో ప్రారంభమగును. పిమ్మట అగ్ని నావాహ్వానించి పూజింతురు. ఈత డెక్కు నెలుకతో కూడ నీతని తుండము, బొజ్జను, గజరూపమును స్ఫురింపజేయు నక్షత్రములు, ఋషిపంచమికి తొలిరోజుననే సప్తఋషులకు పడమటిప్రక్క తూర్పుటాకాశమున నుదయమగును. 'కావుననే ప్రాతర్వ్యావాణా' శ్రుతి ప్రమాణము ననుసరించి ఆనాడు విఘ్నేశ్వర చవుతియై గణేశ పూజ విధింపబడినది. ఆ మరునాడు వినాయక చుక్కలకు తూర్పు ప్రక్కనే సప్తఋషులలో మొదటి రెండు చుక్కలు నుదయమగును. కాబట్టి పై ప్రమాణము ననుసరించి యీ పంచమి ఋషిపంచమియైనది.

భరత భూమిలో సామాన్యముగా ప్రతి రాష్ట్రమందును గణేశ పూజ అత్యుత్సాహముతో చేయుదురు. అందును మహారాష్ట్రులకు గణపతి పూజ మఱియు ముఖ్యము. సామాన్య సంసారులు గణపతి నొక్క చవుతినాడే పూజింతురు; శ్రీమంతులును, గాణాపత్య సంఘములును తొమ్మిది రోజులు పూజించి, మహోల్లాసముతో నవరాత్రి ఉత్సవములు జరిపింతురు. ఆ దినములలో పాటకచ్చేరీలు, హరికథలు, దేవతా నివేదనలు, భారీ సంతర్పణలు మొదలగు వేడుకలను యథాశక్తిగా జరిపింతురు. ఈ యుత్సవములలో వీరు వారనక పిన్నలు,

పెద్దలు, స్త్రీలు, పురుషులు, పండితులు పామరులు— ఎల్లవారును పాల్గొనుచుందురు.

నక్షత్ర రూప నిర్ణయము :

తుల కుంభ ధనురాది వస్తురూపములును, సర్ప వృశ్చికాది సరీసృపరూపములును, మీన మకర కర్కాటకాది జలజంతు రూపములును, గరుడ మయూరాది* పక్షిరూపములును, మేష వృషభ సింహ గజ ఋక్షాది జంతురూపములును, కన్య మిథునాది నరనారీ రూపములును ఖగోళమున పెక్కు గలవని తెలిసికొంటిమి. చుక్కల గుంపుల కిట్టి రూపములు, ఆకారములు, పోలికలు కలవని యెట్లు తెలియవచ్చినది? మనము వీని నెట్లు గుర్తించి తెలిసికోగలము? అని ప్రశ్నించుట సహజము. దీనికి ప్రత్యుత్తర మీదిగువ వ్రాయుచున్నాను.

ప్రతి దినము ఉదయమున, మన యిండ్లలోను, వాకిండ్లలోను కళ్లాపు జల్లిన తరువాత స్త్రీలు ముగ్గులు పెట్టుచుందురు. పువ్వులు, కాయలు, పాములు, గుమ్మడిపండ్లు మొదలగు రూపములను స్త్రీ జనము ముగ్గు పిండితోనే రచింతురు. ఆయా రూపములు చిత్రించక ముందు, ముగ్గును చుక్కల వంటి చిన్న చిన్న బొట్లుక్రింద నేర్పుతో నేలబడునట్లు జారవిడుతురు. పిమ్మట ననేకములగు పిండి గీతలతో నీబొట్ల నొకదానితో నొకటి కలిపి, ఇష్టమైన వస్తురూపమును ముగ్గుతో తయారుచేయుదురు. నేర్పుగా ముగ్గులు పెట్టుటకు మంచి భావనాశక్తితో శిల్పనైపుణ్యము అవసరము

భూమిమీద స్త్రీజనము మొదట వేయు ముగ్గుబొట్లవంటివే ఆకాశమున నక్షత్రములు. అవి దైవనిర్మితములు. చుక్కలను చుక్కల గుంపులను దీక్షతో పరిశీలించి, భావనాశక్తి సాహాయ్యము గొని,

---

* మయూర మనగా నెమలి. ఇది షణ్ముఖుడు, కుమారస్వామి వాహనము; బాణాసురుని ధ్వజము. దీనిని గూర్చి ఇంకను చర్చింతము.

పిమ్మట మనస్సునందు వాని నొండొంటితో కలుపుకొని చూచునపుడు ఆ చుక్కల గుంపు మనకు పరిచయము గల ఒకానొక వస్తురూపమో; కీటకరూపమో, జలజంతురూపమో, పక్షిరూపమో, ఏదో రూపముతో మనమనోనేత్రమునకు గోచరింపగలదు. అట్లు గోచరించు రూపము ననుసరించియే, ఒకొక్క నక్షత్ర సమూహమున కా యాకార మాపాదింపబడుచున్నది. ప్రాచీన కాలములో ననేక జాతుల మానవుల పూర్వులు ఆకాశమున వెలుగు చుక్కలం జూచి చూచి, తోచినట్లు గుంపులుగా విభజించి, ఒకొక్క గుంపు యొక్క ఆకారమును గమనించి ఆ గుంపు లాయా రూపములుగ నట్లు నిశ్చయించిరి. ఈవిషయము ఋగ్వేదములో నెంతో చక్కగా తెలుపబడినది. చూ ఋ-X-124 7. "కవిః కవిత్వాది విరూపమాన" అనగా కవి తన భావనాశక్తి చేతను, కవితాప్రభావము చేతను ఖగోళ చారులైన నక్షత్ర సమూహముల రూపము లిట్టివని నిశ్చయింప గల్గుచున్నాడు.

తొలియుగములలో పెక్కు దేశముల వారి పూర్వులు ఈ చుక్కల గుంపులకు పెట్టిన నామరూపములు స్వల్పభేదములతో నించు మించుగా సరిపోవుచున్నవి. క్రాంతిచక్రమునందున్న చుక్కల గుంపులకును, ఆ యా రాసుల పరిసరములందున్న చుక్కల గుంపులకును ఏ యాకారములు గలట్లు పోల్చి యే నామరూపముల నాపాదించిరో, ఆ వివరములను దేశముల వారిగాను, జాతులవారిగాను, శతాబ్దముల వారిగాను వివరించుచు గ్రిమాల్డి (Grimaldi) దొరగారు ఒక చక్కని గ్రంథము వ్రాసినారు. ఆ గ్రంథ సాహాయ్యముచేత నింతవఱకు సరిగా అర్థముకాని వేదమంత్రము లెన్నో చక్కగా నన్వయింపనైనది తత్పూర్వము కారణము తెలియరాక మరుగుననుండిన మన మత సాంఘిక ఆచారవ్యవహారాదు లనేకములు సులభముగా బోధపడినవి-మచ్చున కొకటి రెండు మనవిచేయుచున్నాను.

గ్రిమాల్డీ దొరగారు రచించిన ఖగోళనక్షత్రరూప చిత్రపట్టికలలో 81 వ పుటలోనున్న చీనావారి చుక్కలగుంపులు వివరింపబడెను. అందు గల నెం 146 రు పద్దులో ఎలుకరూపము చేర్చబడినది ఆ తరువాతనే 147 వ సంఖ్యగల పద్దులో నెలుకరూపము సప్తఋషుల ప్రక్కనే పేర్కొనబడినది. ఆ గ్రంథముయొక్క 148 వ పుటలో గల 1176 వ సంఖ్యగల పద్దులో నొక రాగిరేకుపై ఖగోళచిత్రము లనేకము లున్నట్లు స్పష్టమైనది. అందొకప్రక్క నరరూపముతో నేనుగరూప మున్నది. దాని దిగువ కొంతలో సింహమును, కన్యయు గలవు. మఘ+పుబ్బ+ఉత్తరకే చేరి సింహరాశి కదా ? సప్తఋషిమండలము మఘతో నుదయమగును. ఆ ప్రక్క నరరూపముతో నేనుగు చిత్రింపబడుటచేత నందు విఘ్నేశ్వరస్వరూపము స్ఫుటమగుచున్నది. ఇట్లు భారతీయులే కాక, ఇతరదేశములవా రనేకు లీ ఖగోళ విశేషములను గమనించి గ్రంథస్థము చేసియుండుట గొప్ప ఆశ్చర్యము.

భాద్రపద శుక్ల చతుర్థినాడేగాక, చైత్ర శుక్ల చవుతినాడు కూడ మన పంచాంగములు గణేశపూజ విధించుచున్నవి. చైత్ర శుక్ల చవుతినాడు మనప్రాంతములలో నీ నాడు గణేశపూజ జరుగుటలేదు. కాని అస్సాముराష్ట్రములో మాత్రము చైత్ర శుక్ల చవుతినాడే నేటికిని గణేశపూజ జరుపుచున్నారు. భాద్రపద చవుతికి మనవారు చూపు నంత యుత్సాహమును అస్సాముప్రజలు చైత్ర శుక్ల చవుతినాడు ప్రదర్శించి, మహావైభవముతో గొప్ప యుత్సవము చేయుదురని ఆ ప్రాంతమున కొంతకాలము భూతత్త్వ పరిశోధకులుగా పనిచేసిన మా మిత్రులు డాక్టర్ సి. మహాదేవన్, M. A., D. Sc. గారు నాకు దయతో తెలిపినారు.

ఈవేళ సూర్యోదయాత్పూర్వ మొక నక్షత్రము తొలిసారి తూర్పున నుదయమైనచో, మరి యారునెలల కా నక్షత్రము సూర్యాస్తమానము కాగానే తూర్పున నగపడును. భాద్రపదమునకు చైత్ర

మూరుచెలల పిమ్మట రాగలదు. ఆ లెక్కను చూచినచో భాద్రపద శుక్ల చతుర్థినాడు సూర్యోదయాత్పూర్వము పటికి తొలిసారి యుద యించిన గణపతి నక్షత్రములు, చైత్రశుక్ల చవుతినాటి సాయంకాల మున సూర్యుడస్తమించగానే తూర్పున నుదయింపవలెనుగదా ? ఆ హేతువుచేతనే, 'నోతనపాయమస్తి దేవాయా అజుష్ట' మను శ్రుతి వాక్యానుసారముగా చైత్రశుక్ల చవుతినాడు రెండవపక్షముగా గణేశ పూజను అప్పాము ప్రజలు చేయుచున్నారు.

కాని ఇచట మనము తెలిసికొనవలసిన మరొక విశేషమున్నది. ఆయు నెలలు మాత్రము ఆకాశమధ్యమునమన్న ట్లగపడుచు క్రాంతివృత్త సమీప నక్షత్రములకు అన్వయించునే కాని ధ్రువతార సమీపమున గవడు చుక్కలకు అన్వయించదు స్థూలదృష్టికి ధ్రువనక్షత్రమునకు చలనమేలేదు. ఉత్తరాకాశమున గొట్టిన వజ్రపు మేకువలె నయ్యది ఉన్నచోట మార్పులేక సుస్థిరముగా నున్నట్లు కనబడును. ధ్రువతార కతి సమీపముననున్న లఘుఋక్షపు చుక్కలకు ఉదయాస్తమానములు లేవు. లఘుఋక్షమున కావల పరిభ్రమ్యమాణమగు సప్తర్షి మండలము నకు ఉదయాస్తమానములు కలవుకాని తూర్పున సూర్యోదయాత్పూ ర్వము ఉదయమమయినప్పటినుండి, సూర్యాస్తమయానంతరము తూర్పున నుదయమగుటకు ఆరునెలలు తడవు అక్కరలేదు. సప్త ఋషులు మఘతోనే ఉదయింతురు మాఘములో సూర్యుడస్త మించగానే మఘ తూర్పున నుదయము కాగలదు. సప్తఋషులు మఘతో నుదయింతురు. సప్తఋషులలో పడమటిచుక్కలు రెండింటికి ప్రక్కనున్న విఘ్నేశ్వర నక్షత్రములు మాఘ పున్నమకుముందే మాఘ శుక్ల చవుతినాడు సూర్యుడస్తమించగానే తూర్పున నుదయించి ప్రత్యక్షముగా కనబడును. ఆ కారణమును బట్టియే భరతఖండపు సిద్ధాంతులు మాఘశుక్ల చతుర్థినాడుకూడ విఘ్నేశ్వరపూజ నిర్ణయిం చిరి. "ఇండియన్ ఎఫిమెరిస్' (Indian Ephemeris) అను సద్గ్రంథ

రచయితలును, జ్యోతిశ్శాస్త్రవేత్తలునైన L. D స్వామికన్ను పిళ్ల గారు మనదేశపు పండగదినముల పట్టికలో మాఘశుక్ల చతుర్థినాడు గణేశపూజ జరగవలసిన దినమని స్పష్టముగా వ్రాసియున్నారు. మన దేశములో దేవతాపూజలు, ఉత్సవములు, పండుగలు, పర్వములు మొదలగునవన్నియు ఆయా దినములలో నక్షత్రస్థానములనుబట్టి నిర్ణ యింపబడినవి.

రాజధాని :

మహనీయులు, మంత్రద్రష్టలునగు వేద ఋషులు ఖగోళమునతి సూక్ష్మముగా పరిశీలించి, జ్యోతిశ్శాస్త్ర రహస్యముల నెన్నింటినో తెలిసి కొనిరని మనమింతవఱకు చదివితిమి. మున్నూట అరువదిభాగాలు గల సంవత్సరాత్మక చక్రము, చాంద్రమాన సౌరమాన సంవత్సర సమన్వయ క్రమము, తురీయ యంత్రసాధనముచే గ్రహణపరీక్ష, మింట చిఱుతలై తోచు చుక్కలు నిజముగా బ్రహ్మాండ సూర్యులను సత్యగ్రహణము, నక్షత్రముల పరిమాణభేదములు, ఆకాశగంగను చేరియున్న పాలవెల్లి వివరములు, నీహారప్రకృతములగు చుక్కమబ్బులు క్రమపరిమాణము నొందుచు భిన్నరూపములతో గోళములు భువనములగునను విజ్ఞానము, దేవతలకు నక్షత్రములతో గల సంబంధము, ఎదుటిచుక్కల పరస్పర విరోధములు, పరిసర నక్షత్ర సమూహము లాయా దేవతా తారలకు ధ్వజ వాహనము లగునను మాటి, రాశిచక్రము అజరము, అమరము నను పేరెఱుక, యోగతారలను రాశిచుక్కలనే గాక, వాని ప్రక్క రంగుల తారాగణ రూప, విశేష విజ్ఞానము, ధ్రువ బ్రహ్మర్షి గణేశతారల వివరములు, ఒకొక్క నక్షత్ర దేవత సూర్యో దయా త్పూర్వము తూర్పున తొలుత పొడుచుటం బట్టి ఆయా దేవతల కాయా దినముల పూజలు, పండుగలు, ఉత్సవములు నిర్ణయించు విధానమును, రెండవ పక్షమం దా చుక్కలు సూర్యాస్త

మయానంతరము తూర్పున పొడచు దినములు గూడ ఆదేవతా పూజల కేర్పాట్లును, ఇటువంటివి పెక్కు జ్యోతిర్విషయము లా దీర్ఘదర్శులకు కరతలామలకములని మనము నిస్సందేహముగా తెలిసికొంటిమి. ఈ విషయము లన్నింటికంటె మహత్తర విషయను మఱొకటి గలదు. అది విశ్వ సమస్య. ఈ విశాలవిశ్వము ఎటనుండి ప్రాదుర్భావము నొందినది ? మహోద్భుతమైన సృష్టిక్రమ మెట్లు నడచుచున్నది ? దీని నెవరు నడుపుచున్నారు ? ఆ నడుపు పరాత్పరు డెందున్నాడు ? తుద కిది యంతయు నెచటికి పోవును ? ఏమగును ? ఈ విశ్వమునకు ప్రధానకేంద్ర మున్నదా ? ఈ విశ్వకర్తకు, భర్తకు, హర్తకు నివాస స్థాన మొకటి కలదా ? ఉన్నదనుచో నా రాజధాని ఎచ్చట నున్నది ? విశ్వమున దినచర్య, యుగచర్య లెవ్వని సంకల్పము, ఎవనియానతి, ఎవని యాజ్ఞానుసారము క్రమముతప్పక, చక్రపరివర్తనము నట్లు సాగిపోవుచున్నవి ? భ్రమ పరిభ్రమణాది విశేషగమనశీలములైన గ్రహ, ఉపగ్రహ, గ్రహకణ, గోళ, మహాగోళముల స్థూల, సూక్ష్మ, గంభీర, ప్రచండోద్దండ వేగము లెట్లు కల్గుచున్నవి ? చిత్రవిచిత్రగతుల నానా ముఖముల పెక్కుత్రోవలంబోవు విభిన్నజగద్వస్తు శక్తుల నొక్కసూత్ర మున నడుపు పరాత్పరుని దివ్యపీఠము, దేవతాచక్రవర్తి నిజనివాసము ఎక్కడనున్నదని ప్రవచింపవచ్చును ? అనంతము, నగాధము వైవిధ్య శీలములై తోచు నీ విశాల విశ్వవ్యాపారములమధ్య పొందు పొసగించి, నిత్యము నేకముఖమున సుశ్రావ్యగతిని నడుపదక్షతగల పరాత్పరుని దివ్య ధామమునుగూర్చి వేదఋషివర్యులు జిజ్ఞాసచేసి యుండిరా ? విశ్వమునకు మూలకందమిది, గణన కతీతములైన గోళములకెల్ల నసలు దుంప యిచ్చట నున్నదని నిరూపించి వ్రేలితో చూపగల పరిశోధనా సామర్థ్యము వారి కలవడెనా? మహోన్నత వైభవాదుల యునికిపట్టిది, సమస్త మహత్త్వములకు మూలస్థానమిది, దీప్యమానములలో నెల్ల దేదీప్యమానమిది, అందచందములన్నిటికి నాలవాలమిది యని నిర్ధారణ

చేసి, యద్దాని సౌందర్య విభూతులిట్టివి యని వర్ణింపజాలిన భావనా శక్తి, కవిత్వపటుత్వము బుద్ధివికాసము, నిశితమనీష వారి కనుగ్రహింప బడెనా ?

ఈ ప్రశ్న పరంపరకు "ఔను" అనియే మా జవాబు. ఈక్రింది ప్రకరణములలో, ప్రశ్నల కొక్కొక్కదానికి, వేదమంత్రముల నెత్తి చూపుచు అదీర్ఘదర్శుల వాక్యములతోను, అదే జిజ్ఞాసతోను, అసమస్య లను సాధింప నిటీవలి ప్రాక్పశ్చిమ విద్వాంసుల కృషి ఫలితములుగా ప్రకాశితములైన గ్రంథవ్యాఖ్యాన వివరములతోచేర్చి, సంగ్రహముగ పాఠకులకు విన్నవింతుము. సందర్భమునుబట్టి పంచమ వేదమైన మహా భారతనుండియు, పురాణరత్నమనదగు భాగవతమునుండియు, ఇంక నిట్టి యుత్తమ గ్రంథములనుండి పద్యములు శ్లోకములు మొదలగు నవి ధారాళముగా నెత్తితీసి వ్రాయగలము. 'అదివేరు, ఇదివేరు' 'ఒక దానితో నొకటి పొందదు-హత్తదు'-అని భిన్నదృష్టులతో వైవిధ్యమును ప్రకటించుట అవాలోచితకార్యము. జాగ్రత్తగా పరిశీలించి చూచినచో సర్వము సమన్వయవిశిష్టము. సత్యమవగతముకాక భిన్నబుద్ధి పొడము చున్నది. ప్రాక్పశ్చిమ ప్రాచీన నవీన విజ్ఞానములమధ్య నెన్నదగిన విభేద విభిన్నతలులేవు. భేదబుద్ధి భ్రాంతిజనితము. సత్యముకాదు. వే నెలుగ గలిగిన సమన్వయ వివరములీ ప్రకరణములలో విన్నవింతుమ. విమర్శించి సత్యము నేర్పరించు బాధ్యత మీది.

★

శ్రీ

# జ్యోతిర్వేదము

## నాలుగవ ప్రకరణము

"ఈ చేతనానీకం బెందు జనించు నెందు నడగున్ ?
నిక్కంబు భాషింపుమా."
"కుత ఆజాతా ? కుత ఇయం విసృష్టిః ?
కో వేద యత ఆబభూవ."
మన మా పరాత్పరుని ధ్యానింతము.*

ఎవని వలన నీ విశ్వము సృష్టి, స్థితి, లయములం బడయుచున్నదో, సూక్ష్మాతి సూక్ష్మ వివరములతో ప్రతి విషయమును గూర్చి సమస్తము నెఱిగిన సర్వజ్ఞమూర్తి యెవడో, దేనికిని లోబడక ఏ బంధములును లేక సర్వతంత్ర స్వతంత్రుడై, స్వయంప్రకాశుడై, ఏ స్వరాట్టు విశ్వప్రభుడై వెలుగొందుచున్నాడో, అర్థసమన్వయ వివేకము లేక, యథార్థము తేటపడక, ఎటువంటి సూరిజనుల నైనను భ్రాంతి పెట్టి పెడత్రోవల కీడ్చు వేదములను ఎవడు బ్రహ్మాదులకు విశదము చేసెనో, పృథివ్యాపస్తేజముల నెడి భూతత్రయ సమ్మేళన చేత నెవడు లోలిసృష్టి కుపక్రమించెనో, ఎవడు సత్వరజస్తమముల కంకళ ఆ గుణ త్రయమును మృష గావించుచున్నాడో, ఏ మాయలకును అందక, ఎట్టి కుహకములకు లోబడక, ఏ దైవరాయుడు వానిని తిరస్కరించి, దూరముగా నెట్టివైచుచున్నాడో, దేశ కాల శక్తుల కవ్వల నెవ్వడు

---

" జన్మాద్యస్య యతోఒన్వయాదితరత శ్చార్థేష్వభిజ్ఞ స్వరాట్
తేనే బ్రహ్మ హృదాయ ఆదికవయే ముహ్యంతి యత్సూరయః
తేజోవారి మృదాం యథా వినిమయో యత్ర త్రిసర్గో మృషా
ధామ్నా స్వేన సదా నిరస్త కుహకం సత్యం పరమ్ ధీమహి"

మహోన్నతుడై వెలుగొందుచున్నాడో, ఎవడు సర్వశక్తుడు- సర్వ వ్యాపి- సర్వాంతర్యామి- షడ్గుణైశ్వర్య సంపూర్ణుడు- సకల కల్యాణ గుణ సంపన్నుడునై, శుద్ధ సత్యస్వరూపముతో తేజరిల్లుచున్నాడో ఆ పరాత్పరుని మనము మనఃపూర్వకముగా ధ్యానింతము.

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందు పరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు సర్వము తానయైనవా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

(భాగవతము - గజేంద్ర మోక్షము)

ఖగోళమునంతను వేదఋషులు అతిసూక్ష్మముగా పరిశోధించి చూచిరని మన మింతకుముందు తెలిసికొంటిమి. పరిశోధన మాత్రమే కాదు; ఖగోళవేధచే వారు తెలిసికొనిన సంగతులన్నియు నెంతో చక్కగా గ్రంథస్థముచేసి పెట్టిరి. ఈ పరిశోధనల ఫలితముగా వార లీ విశ్వజన్మస్థానమేదో నిర్ధారణచేసి చెప్పగలిగిరా? చెప్పగలిగిరని మనము నిరూపింపగలమా? వారు తేల్చి నిశ్చయించిన సంగతులను నవీన వైజ్ఞానికు లంగీకరించి ధ్రువపఱిచిరా? లేక నిరాకరించిరా? బైబిల్ సిద్ధాంతమును పరిశీలించిరా? అను ప్రశ్నలకు మనము ప్రత్యుత్తరము బడయవలసియున్నది. ఈ చర్చ ప్రారంభింపక పూర్వము మరొకసారి మన మా సవితృవరేణ్యుని ధ్యానింతము. విశ్వసమస్య యొక్క సత్యమునుగూర్చి మననము చేయుదము. దృశ్యాదృశ్య విశ్వమును ఒకపరి వెలినిడి ప్రకాశింపజేయుచు, నొకపరి లోపలికి గొనుచు, నుభయముదానై సకలార్థసాక్షియగు నవ్యాకలంకుని, నాత్మ మూలుని గూర్చి యోజింతము. ఆ పరాత్పరుని పరమపదముం జేర బోవు నవసరమున మనబుద్ధి వివేకములు పెడత్రోవల బట్టక, సరియైన మార్గమున సూటిగ నడిపి తన సమ్ముఖమును చేర్చుకొనుమని భక్తి పూర్వకముగా ప్రార్థింతము.

విశ్వోత్పత్తి జిజ్ఞాస :

విశ్వోత్పత్తిక్రమము యొక్క యథార్థమేమో తెలిసికోవలెనని జిజ్ఞాసతో మహాఋషులు గొప్పపరిశోధనల గావించిరి ; ఎంతో ఓపికతో వారు బహుకాలము పట్టువదలక పరిశీలించిరి. ఋగ్వేదమునందలి మూడవ మండలమునకు ఋషియు, గాయత్రీ మహామంత్రమునకు జనకుడు నని ప్రసిద్ధివడసిన విశ్వామిత్రమహాఋషి విశ్వసమస్య సాధించుటకు నిరుపమానమైన కృషిసల్పెను. నిరంతర సత్యధ్యానశీలుడగు నమ్మహాఋషి చేసిన యుగ్రతపస్సు ఫలించెను. ఫలప్రాప్తికి పూర్వమా మహామహుడు కావించిన కృషిక్రమ మెట్టిదో మన మవగతము చేసికొనుటకు ఈ ప్రశ్నార్థకములైన ఋగ్వేద మంత్రములను చదివి చూతము.

ఋ III-54-5—"కో అద్ధా వేద క ఇహ ప్రవోచ ద్దేవా
అచ్ఛా పథ్యా కా సమేతి ?
దదృశ్ర ఏషా మవమా సదాంసి
పరేషు యా గుహ్యేషు వ్రతేషు."

దేవతాసన్నిధానమును చేర్చు మార్గ మేది ? అది నిజముగా తెలిసినవా రెవరు ? తెలిసినను దానిని బహిరంగముగా ప్రవచింపగల సమర్థు డెవరు ? దిగువాట్లుమాత్రమే కాననగుచున్నవి. కాని అసలు దేవతానివాసము లెక్కడనో దూరముగా రహస్యముగా నున్నవి. అవి తెలియరావు.

ఋ-X 82-3 యో నః పితా జనితా యో విధాతా ।
ధామాని వేద భువనాని విశ్వా ।
యో దేవానాం నామధా ఏకఏవ ।
తం సంప్రశ్నం భువనా యంత్యన్యా॥

మమ్ముకన్నతండ్రీ ! విశ్వమునగల అన్నిజాతుల ప్రాణికోట్లను సమస్త వస్తుచయమును లెస్సగా నెఱిగిన విధాతవునీవు ! ఆయా

దేవతల కాయా నామము లిడి యేలు ఏకైక విశ్వప్రభువుడవునీవే!
ఇతరు లెవ్వ రేమి తెలియగోరినను ఆవిశ్వనాథునే ఆశ్రయించవలయును.

ఋ-X 129-64 కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్ ?
కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః ?
అర్వాగ్దేవా అస్యవిసర్జనేన థా ।
కో వేదయత ఆబభూవ ?

ఈ విశ్వ మెటునుండి జనించెనో ? ఎవనికెఱుక ? ఎఱిగినను ఎలుగెత్తి చాటిచెప్పు ధీమంతుడేడీ ? ఈ సృష్టియంతయు నెట్లు సంభవమైనది? దేవత లీ సృష్టికి పిమ్మటివారు. ఈ చేతనానీక మెందు జనించెనో వారు తెలియజెప్పజాలరు.

ఋగ్వేద సంహితలోనివగు నీ ప్రశ్నలును ఇంకను ఇటువంటి ప్రశ్నలును వైదుష్య వివేకహీనులు వేయజాలినవికావు. స్వామి అభేదానందులు* వివేచించినట్లు, ప్రపంచమున నితరజాతుల మనుష్యులు అజ్ఞానావస్థలో బడియున్నప్పుడు, వారలకు అక్షరజ్ఞానమైన లేని ప్రాచీనకాలములోనే వేదఋషులు విశ్వప్రాదుర్భావ విజ్ఞానము కలవారైరి. ఈనాటివలె ఆనాడు విద్యాశాలలు, కళాశాలలు, యంత్ర సాధనములతో పరిశోధకశాలలు ఏమియులేవు. మహా తపోధనులు, విశిష్టధ్యానపరాయణులు, విజ్ఞాననిరతులు నైన యమ్మహాత్ముల యమాయిక హృదయములకు మెఱపు మెఱసినట్లు దైవికముగా సత్యము స్ఫురించెను.

## పరిశోధనల ఫలితము :

ఆ మహనీయులు బహు ప్రయాసపడి చిరకాల మొనర్చిన తపస్సు తుదకు ఫలించెనంటిమి. అది యెట్లు ఫలించెను ? నూటడెబ్బది యేండ్ల

*Cosmic Evolution and its purpose. Page-3.

క్రిందట సర్ విలియమ్ హెర్షల్ దొరవలెనే ఆ మహాత్ములు నిద్రాహారములుమాని, తదేకదీక్షతో ననేక దశాబ్దములకాలము ఖగోళవేధ చేసిచేసి తుదకు సఫలమనోరథులు కాగల్గిరి. ఆశ్చర్యచకితమైన లోకమునకు ఖగోళమున నొకానొక సాధనమును వ్రేలితోచూపి "చూడండి! ఇదుగో! ఇక్కడ విశ్వమర్మ మున్నది; ఇదే విశ్వ రక్షకుని నెలవు! సమస్త భువనములకు రాజధాని యిదే" అని యెలుగెత్తి చాటి చెప్పిరి.

"ఇతో విశ్వస్య భువనస్య గోపాః ?" ఋ I. 164-21 ఎంతకాలమెంత తపస్సుచేసి వారీ పరమరహస్యముల కనుగొనిరోకదా ? ఇందునుగూర్చి అనుమానములేదు. సంశయమేమియులేదు. విశ్వమంతటకు రాజధాని యిదియే ; ఖగోళమున కంతకును కన్నని చెప్పవలసిన సీమ యిదియే. చూ॥ ఋ-I-22-20.

"తద్విష్ణోః పరమంపదం సదా పశ్యంతి సూరయః దివీవ చక్షు రాతతమ్."

"ఇతడే మింటికన్ను" అనునట్లు విష్ణుభగవానుడు ఖగోళమున మెఱయుచున్నాడు. సూరిజను లీ "మింటికంటి" పై ఎల్లప్పుడు కన్ను వేసి చూచుచుందురు. ఇదే విష్ణుదేవుని పరమపదము. భండార్కరు పండితుడు 'దివీవ చక్షు రాతతమ్" అనగా "మింటస్థిరముగా స్థాపింపబడిన నేత్రమో యగునట్లు" అని అర్థము చెప్పిరి. అట్లేకానిండు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్." శరీరమునందుగల సమస్త అవయవములలో కన్ను ప్రధానమైనదికదా ? అట్లే విష్ణుభగవానుని పరమపదము ఖగోళమునకు నేత్రమై, ముఖ్యస్థానమై యొప్పుచున్నది. గణన కతీతములైన జ్యోతిర్గోళములతో వెలుగొందు నభోరంగమంతటిలో ఈ పరమపద సీమకుగల ప్రాముఖ్యము ఇతర ప్రాంతములకు వేటికిని లేదని నొక్కి. వక్కాణింపబడుచున్నది.

**విష్ణువిగూర్చి ఋగ్వేదభావన :**

ఇతర దేవతలను సంబోధించి రచించిన సూక్త సంఖ్యకంటే ఋగ్వేదములో విష్ణుదేవతాత్మకములైన సూక్తసంఖ్య బహుస్వల్పము. అయినను సంఖ్యతో పనిలేదు. సంఖ్యకు స్వల్పమైనను విష్ణుదేవతా సూక్తములు విశేష ప్రతిభావంతములు; గొప్ప మహత్తుతో కూడు కొని యున్నవి. విశ్వరక్షకుడు దేవతాచక్రవర్తియైన ఆ దేవదేవుని మాహాత్మ్యమున కనుగుణ్యముగా నా సూక్తములు వీర్యవంతములై, జవముగలిగి. శ్రోతల హృదయములందు దృఢముగా నాటుకొనునట్టి పటిమగలవై యున్నవి. విష్ణువు మూడడుగులతో ఈ విశ్వమును కొలిచి యాక్రమించినట్లు ఋగ్వేదము వర్ణించుచున్నది ఋ I 22, 17, 18:—

> ఇదం విష్ణు ర్విచక్రమే త్రేధానిదధేపదం సమూహ్ళ
> మస్యపాంగ్ సురే.
> త్రీణి పదా విచక్రమే, విష్ణుర్గోపా అదాభ్యః అతో ధర్మాణి
> ధారయన్.

విష్ణుభగవాను డీ విశ్వమున నడుగులు వైచెను. అతడు వైచినవి మూడడుగులే కాని అతని పాదధూళి విశ్వవ్యాప్తి చెందెను. విశ్వ గోపుడు, జగద్రక్షకుడు విష్ణుభగవానుడే! అతనిని మోసపుచ్చగలవా డేడీ? మూడడుగులతో విశ్వము నాక్రమించి యా ప్రభువు ధర్మము లను ప్రతిష్ఠించెను— అని మేధాతిథి యను వేదఋషి విష్ణుని స్తుతిం చెను గోతమ ఋషి "శంనో విష్ణు రురుక్రమః- గొప్ప అడుగులు వేయు దేవుడు- ఉరుక్రముడగు విష్ణుదేవుడు మమ్ము కటాక్షించి రక్షించుగాక" యని యా దేవుని స్తోత్రముచేసెను. (I-90.) మూడడుగులతో విశ్వము నాక్రమించిన విష్ణుని వృత్తాంతము ఋగ్వేదములో నింకను పెక్కు చోట్ల గలదు. ఆ మంత్రములను ముందునుండి చదువగలము.

ఈ వేద గాథల ననుసరించి భాగవతాది పురాణములలో బలి చక్రవర్తి కథ వ్రాయబడినది. బలిచక్రవర్తి ఇంద్రునిపై దండెత్తి ఓడించి, స్వర్గము నుండి వెడలనడచి, ముల్లోకములకు తానే రాజై యేలదొడగెను. ఇంద్రుని దురవస్థకు వగచి, అతని తల్లి అదితిదేవి పుణ్య వ్రతోపవాసములు చేసి విష్ణుని పూజించెను. అతడు ప్రత్యక్షమై వరము కోరుకోమనగా, 'నీవంటి పుత్రుని దయచేయుమని ఆమె అర్థించెను. విష్ణు డామె గర్భమున వామనుడై జన్మించి, వదాన్యుడగు బలిని మూడడుగుల మేర దానమిమ్మనెను. బలి అంగీకరించి మూడడుగుల మేర దానపూర్వకముగా ధారవోసెను. ఈ మూడడుగులతో విశ్వ మాక్రమించి, బలిని స్వర్గమునుండి తరిమి స్వారాజ్య మింద్రునికి తిరిగి అప్పగించెను. కావున వామనుడు త్రివిక్రము డనబడెను.

ఋగ్వేదములో ఇంద్రుని పరాజయము గాని, బలిచక్రవర్తి ప్రశంస గాని, వామనుని పేరు గాని కానరాదు. శతపథబ్రాహ్మణములో పొట్టివాడగు విష్ణుని గూర్చి యొక కథ గలదు. (I-2, 5) తేజోవృద్ధి, యశోవృద్ధి, ఆహారసమృద్ధి కోరి దేవతలు ఒకసారి గొప్ప యజ్ఞము చేసిరి. అపుడు వారందరు నొక నిశ్చయము చేసికొనిరి. దేవతలందరిలో నెవడు మహాశ్చర్యాచరణదక్షుడై యథావిధిగ యజ్ఞము పొంతముగా నిలపగలడో ఆ దేవోత్తమునకు దేవత లందరిలో నగ్రస్థానమిచ్చి అత్యధిక గౌరవముతో పూజింపవలెనని తీర్మానించుకొనిరి. ఉరుబలుడగు విష్ణువు అందరిని మించి ఘనకార్యనిర్వాహకుడై యజ్ఞసమాప్తి గావించెను. కాబట్టి విష్ణువు సర్వోత్తముడని కీర్తింపబడుచున్నాడు.

ఐతరేయ బ్రాహ్మణ ప్రారంభమునందే ఈ క్రింది వాక్యము కనబడుచున్నది—"అగ్నిర్వై దేవానా మవమో విష్ణుః పరమోస్తదంతరేణ సర్వా (అ) న్య దేవతా." దేవతలందరిలో తక్కువవాడు అగ్ని; ఎక్కువవాడు విష్ణుమూర్తి. ఈ మధ్యవారు తక్కిన దేవత లందఱును;

మఱియు కఠోపనిషత్తునందు విష్ణుదేవుని పరమపద మిట్లు ప్రశంసింప బడినది.

చూ. III-9—"విజ్ఞాన సారథి ర్యస్తు మనః ప్రగ్రహావా న్నరః
సోధ్వనః పదమాప్నోతి తద్విష్ణోః పరమం పదం."

మానవుని జీవయాత్ర ఒక పుణ్యతీర్థయాత్రతో నుపమింపబడినది. ఈ యాత్రయొక్క గమ్యస్థానము విష్ణుని పరమపదము. పరమ సుఖదము, బ్రహ్మానందమునగు నీ మహోన్నత పదప్రాప్తి శాశ్వతము నొందుటచే జీవి ధన్యుడగును. ఈ పరమపదప్రాప్తి ఎవనికి లభించును? దేహరథస్థుడగు నే నరునకు విజ్ఞానము సారథియగునో మనోనిగ్రహము పగ్గమగునో నిశ్చలచిత్తముతో సూటిగా నెవడు యాత్ర సాగించునో వాడే అంతమందు శ్రీ విష్ణుని పరమపదప్రాప్తి నొందగలడు.

వివాహవిధిలో సప్తపది యని యొక తంతు నడుపుదురు. అందు వరుడు నూత్నవధువును చేయిపట్టి ఈక్రింది మంత్రము చెప్పుచు నేడడుగులు వేయించు నాచార మిప్పటికిని కలదు. అడుగులు వేయునపుడు దంపతులు విష్ణుని స్మరించుచు, నడుగులు లెక్కించుచు కదలుచుందురు. ఆ మంత్ర మిది: ఏక మిషే విష్ణుస్త్వాన్వేతు, ద్వే ఊర్జే విష్ణుస్త్వాన్వేతు, త్రీణిపదాయ విష్ణుస్త్వాన్వేతు, చత్వారి మాయో విష్ణుస్త్వాన్వేతు, పంచపశుభ్యో విష్ణుస్త్వాన్వేతు, షడృతుభ్యో విష్ణుస్త్వాన్వేతు, సప్త సప్తభ్యో హోతృభ్యో విష్ణుస్త్వాన్వేతు॥

ఇందువలన నేమి తెలుచున్నదనగా: భారతీయులకర్మ కాండలోగాని, వేదపురాణ వాఙ్మయ రచనలలోగాని, ఎవరైన నేసందర్భమున నైన నడుగులు వేసిరని చెప్పవలసినచోట విష్ణుభగవానుని మూడడుగులును తప్పక విధిగా స్మరింపబడుచున్నవి.

ఈ మూడడుగుల ముచ్చటేగాక, విష్ణుని ఘనతయు, ఆదేవుని పరమపద నిర్ణయమును గూర్చిన గుఱుతులను మహర్షి దీర్ఘతముడు ప్రథమ మండలమునందలి నూటయేబది నాల్గవ సూక్తమున నారు.

మంత్రములలో వివరించియున్నాడు. ఆ మహామంత్రముల పఠించి యర్థము తెలుసుకొనుట మన కత్యావసరముగావున వానిం జదువుదము:

ఋ-I-154 1. విష్ణోర్నుకం వీర్యాణి ప్రవోచం
యః పార్థివానివిమమే రజాంసి
యో ఽ అస్కభాయ దుత్తరం సదస్థం
విచక్రమాణ స్త్రేధోరుగాయః.

2. ప్రతద్విష్ణుః స్తవతోవీర్యేణ
మృగేన భీమః కుచరోగిరిష్ఠాః
యస్యోరుషు త్రిషు విక్రమణే
ష్వధిక్షయంతి భువనాని విశ్వా.

3. ప్రవిష్ణవే శుష మేతు మన్మ గిరి
క్షిత ఉరుగాయాయ వృష్ణే
య ఇదం దీర్ఘం ప్రయతం
సదస్థ మేకో విమమే త్రిభిరిత్పదేభిః.

4. యస్యత్రీ పూర్ణమధునా
పదాన్యక్షీయమాణాః స్వధయా
మదంతి య ఉత్రిధాతు పృథివీ
ముతద్యా మేకోదాధార భువనాని విశ్వా.

5. తదస్య ప్రియమభిపాథో
అస్యాం నరో యత్ర దేవాయ
వోమదంతి ఉరుక్రమస్య సహిబంధు
రిత్థా విష్ణోః పదే పరమే మధ్వఉత్సః.

6. తావాం వాస్తున్యు శ్మసిగమధ్యై
యత్ర గావో భూరిశృంగా అయాసః

అత్రాహ తదురుగాయస్య వృష్ణః
పరమంపద మవభాతి భూరి.

పైనివ్రాసిన మంత్రములారును విష్ణుదేవతాకములు. వాని తాత్పర్య మీ క్రింద వ్రాయుచున్నాను.

1. విష్ణుభగవాను డొనర్చిన మహాత్కార్యముల నే నిందు చాటి చెప్పుదును. విశాలమగు నీ భూమండలమంతయు నతడొక్క యడుగులో కొల్చినాడు. పెద్ద పెద్దవి మూడడుగులు మాత్రమే వేసి విశ్వమంతయు నతడాక్రమించి ఉత్తర దిక్కున దేవ సభలో మహోన్నతమూర్తియై యతడు తేజరిల్లుచున్నాడు.

2. మహాపర్వతముపై భయంకరముగా తన యిష్టమువచ్చినట్లు సంచారము సల్పు భీమమృగమో యన నద్భుత పరాక్రమముతో నెవడు విజృంభించునో, విస్తరించిన ఎవని యడుగుల మధ్య సమస్త భువనస్థములగు ప్రాణికోట్లు నివాసము చేయుచున్నవో, ఆ త్రివిక్రమ దేవుని బలవీర్యములను కీర్తింతును.

3. అంగలువైచికొనుచు పోవు నద్భుత గిరిచరుడనదగు దేవ వృషభుడు విష్ణుమూర్తి అతడొక్కడే సుదీర్ఘము, సువిశాలమునైన యీ నివాస స్థానమును మూడడుగులతో నాక్రమింప గలిగినాడు. అతని బలవీర్యముల నుద్రేకింపజాలినదై యీ సూక్త మా మహోన్నత మూర్తిని చేరుకొనుటకు పై కెగయునుగాక.

4. అమరములును అక్షయమాధుర్య ప్రపూర్ణములునైన భువనత్రయ వ్యాప్తిగల త్రిపదవిన్యాస మహత్త్వ విశిష్టుడై తన్మధ్యమున జీవించు సమస్త ప్రాణికోట్ల రక్షింప దక్షుడై, విశ్వభువనముల కన్నిటికిని ఏకాధారభూతుడైన విష్ణుభగవానుని ప్రశంసింతును.

5. ఏ మహోన్నత స్థానమున విష్ణుభగవానుని మూడవయడుగు ప్రతిష్ఠితమయ్యెనో అచ్చటనే అక్షయమధుప్రదాయకమగు గొప్ప తేనె పెలుగలదు. అదే విష్ణుదేవుని పరమపదము. పుణ్యశీలురగు భగవద్భక్తు

లీ పరమపద ప్రాప్తులై నిరతిశయ సౌఖ్యానందము లొందుచుందురు. ఆ పుణ్యపదమే నాకుకూడ ప్రాప్తించుగాక !

6. పైనివ్రాసిన మంత్ర తంత్రార్థములలో నుత్తరాకాశమున విష్ణుదేవుని పరమపదముగలదనియు, నందు నక్షయ మధుప్రదాయక మగు తేనెపట్టున్నదనియు, ఆ సమీపముననే భూరిశృంగ సహితమగు గోబృందము గలదనియు స్పష్టముగా తెలుపబడినది ఈ వివరములను ఈ దిగువ ఖగోళ చిత్రములలో చక్కగా చూడగలము. ఈ సూక్తము తరువాతనున్న 155 వ సూక్తము ఐదవ మంత్రమున నీ పరమపదము దిగువగల పక్షుల ప్రశంసగలదు. ఆ మంత్రముకూడ పరిశీలించిన పిమ్మట నిచట ఖగోళ చిత్రపటమును మనము సరిగా అర్థముచేసికో గలము. ఋ I. 155.5 : ద్వే ఇదస్యక్రమణే స్వర్దృశోభిఖ్యాయ మర్త్యో భురణ్యతి । తృతీయ మస్య నకిరా దధర్షతి వయశ్చన పతయన్తః పతత్రిణః॥ విష్ణుదేవా ? రెండడుగులలో నీ వాక్రమించినదంతయు చూచినంతనే, మనుష్యమాత్రుడెవడైన దిగ్భ్రమచెంది పోవును. ఇక నీ మూడవయడుగన్ననో - దురవలోకము. దానిని సమీపింప నెవరితరము. మనుష్యులకేకాదు. చక్కని రెక్కలతో జవమున మింటికెగసిన పక్షులకుకూడ తృతీయమగు నీ పరమపదము పతత్రికులమున కతీతము దుష్ప్రాప్యము నగుచున్నది.

ఈ మంత్రమునందు పతత్రిణములనగా నీ భూమిపై నెగురు కాకులు, కొంగలు మొదలగునవి కావు. ఖగోళ వేధచేయుచున్న యీ మంత్రద్రష్ట దృష్టిలో నుత్తరాకాశమున విష్ణుపదము దిగువ నక్షత్ర రూపమున వెలుగొందు గరుడియు, హంసయునని సమన్వయించుకో వలెను. అపుడే యీ మంత్రార్థము మనకు తేటతెల్లమగును. పాశ్చాత్య ఖగోళ చిత్రపటములో గరుడి Aquila అనియు, హంస Cygnus అనియు నిరూపింపబడినవి. ఇందు మొదటిది విష్ణుదేవుని వాహనము ; రెండవది బ్రహ్మ వాహనమునని మన మిదివరకే తెలిసికొంటిమి.

ఇచ్చటి చిత్రపటములో మీదిభాగమున నొక పాము యొక్క శిరస్సు తలక్రిందుగా నున్నది. ఆ శిరముపై పాదముంచి పెద్ద అంగ వేయుచు తలక్రిందుగా నిలిచి యేదో కష్టకార్యము నిర్వహించుచున్న ఒక వ్యక్తి రూప మున్నది. ఆ దిగువ నొక పాముతో పెనగుచున్న సర్పధారి రూపమును, ఇంకను దిగువ వృశ్చికరూపము కానవచ్చు చున్నవి. అది వృశ్చిక రాశియే. ప్రక్కనే పాశ్చాత్యభావన కనుగుణ్య ముగా ధనుర్ధారియు, వాతని ప్రక్కన చేపతోకతో మేక గలవు. వీనికి మీదుగా గరుడపక్షి యున్నది. గరుడుని కైమూలగా హంస కలదు. ఉత్తరాకాశమున ఖగోళవేధ చేయు మంత్రద్రష్ట దృష్టికి ఉరుక్రము డగు విష్ణుని మూడవ పథము ఆ దివ్య ఖగోళములకు గూడ దుష్ప్రాప్యమని తోచుట సహజము. ఆ సంగతులే దీర్ఘతమ ఋషి ఈ మంత్ర ములో వివరించినాడు.

అంగచాచి భుజగమును త్రొక్కుచు తలక్రిందుగా వ్రేలు నక్షత్ర రూపుని పాశ్చాత్య జ్యోతిర్విదులు మోకరించినవాడు అని యర్థమిచ్చు నట్లు "Engonasis" అను పదమువాడుచువచ్చిరి. క్రీస్తుపూర్వము సుమారు రెండువేల సంవత్సరముల క్రిందటచాల్డియాదేశపు జ్యోతిష్కులు ప్రతి నక్షత్ర సమూహ వర్ణనల నాధారము చేసికొని, మరి పదునైదు వందల సంవత్సరములకు పిమ్మట నవగా క్రీస్తుపూర్వము నాలుగు వందల ఏండ్ల క్రిందట గ్రీసుదేశములో 'సోలి' (Soli) మండల నివాసి 'యూడోక్సస్' అను జ్యోతిర్వేత్త ఖగోళ చిత్రములను చక్కగా వర్ణించుచు నొక వచనగ్రంథము రచించెను. అతని తరువాత మరి నూటేండ్ల లోపున 'అరెటస్' (Aratus) అను గ్రీకు కవి జ్యోతి ర్విద్యాభిమానచోదితుడై యూడొక్ససు రచించిన గద్యగ్రంథము పద్య రూపమున రచించెను. ఆకావ్యము పేరు 'ఫైనామినా' (Phainamena) ఆ పదమునకు ఖగోళ ప్రదర్శనము (Heavenly Display) అని యర్థము. జ్యోతిర్లోకమున గానవగు చుక్కల గుంపుల రూపములిం

రెంతో చక్కగా కనులకు కట్టినట్లు వర్ణింపబడినవి. ఈ గ్రంథము నవేకులు ఇంగ్లీషుభాషలోని కనువదించిరి. అందీ మోకరిలిన నరరూపము ఇట్లు వివరింపబడినది- "జ్యోతిర్లోకమున భుజగశిరముపై నొక పాద ముంచి కష్ట కార్యాచరణమున బడలి, పరిశ్రమించునొక యమానుష రూపము ఉత్తరాకాశమున మనకు దృష్టి గోచరమగును. అతని పేరు ఫలానా అని ఎవ్వరును చెప్పజాలరు. అత డెందు కట్లు ప్రయాసపడు చున్నాడో అది కూడ ఎవరికిని తెలియదు. వానిని 'మోకరించిన మనుష్యు' డని మాత్రము తెలుపుదురు."

ఆరెటస్ గ్రంథమునకు బ్రౌన్ (Brown) దొరగారి ఇంగ్లీషు అనువాదమునం దిట్లు గలదు—"విశేష ప్రయాసపడుచు పరిశ్రమించు నరరూప మున్నది. దానిని గూర్చి యెవ్వరును ఏమియు స్పష్టముగా తెలుపజాలరు...... మోకాళ్ళ బడినాడనిమాత్రమే తెలుపగలరు. ఆ రూపము వీణకు అనతిదూరమున గలదు...... పూర్వోత్తరము లేమియు తెలియరాని యీ పరాయివా డెవ్వడో......"

మోకరిలిన నరరూపము 'వీణ' కు సమీపముగా నున్నట్లు గ్రీకు కవి వర్ణించియున్నాడు. హంసచిత్రమునకును వాని మోకాలునకును మధ్య తంత్రులతో కూడిన సంగీతసాధనరూప మున్నది. దీనినే పడమటి వారు లైర్ (Lyre) అందురు. అనగా వీణయని యర్థము. దీనినే మనవారు సరస్వతిచేతిలో వీణయని బహుయుగములనుండి వర్ణించు చున్నారు. బ్రహ్మముఖమున సరస్వతి ఉన్నది; వాణీ హిరణ్యగర్భు లకు వాహనము హంస. ఈ యంశములు భారతీయ వాఙ్మయమున సుప్రసిద్ధములు. దీనిని గూర్చిన వివరము ఇంకను తెలిసికోగలము.

కాబట్టి క్రీస్తుపూర్వము నాలుగువందల యేండ్లనాడు గ్రీకు దేశమున సుప్రసిద్ధుడగు యూడొక్సను సిద్ధాంతికిగాని, అతని యనంతర మొక శతాబ్దమువాడు 'ఖగోళప్రదర్శన' నామక కావ్యకర్త, సుప్ర సిద్ధ జ్యోతిశ్శాస్త్రవేత్త ఆరెటస్‌కుగాని, తల్క్రిందుగ మోకరిలిన

ట్లగపడు నరరూపమనితప్ప మరేమియు దీనినిగూర్చి తెలియరాలేదనుట స్పష్టము. అంతకుపూర్వము రెండువేల యేండ్ల క్రిందట చాల్డియనుల వ్రాతల వల్లే యనువదించుట తప్ప నీ గ్రీకులకు స్వయముగా తెలిసినది ఏమియులేదు. వారికి తెలియనిది, వీరికిని తెలియదు. అదేదో పరాయివాని రూపము, వాని పూర్వోత్తరము లేమియు నా దేశములలో ఎవనికి తెలియవు. వాడెవడో-తలక్రిందుగ మోకాళ్లబడి గింజుకొనుచున్నాడు. అంతే - అంతమాత్రమే చాల్డియనులకును గ్రీకులకు వానింగూర్చి తెలియును. గ్రీసు పతనానంతరము ప్రసిద్ధులైన రోమను లీ ఖగోళదృశ్యము నేమనిరి ? అదికూడ చూడవలసి యున్నది.

"ఏదోగొప్ప దోషమొనర్చి అది తెలిసికొని, లజ్జితుడై, మోకాళ్లబడిన యనామకుని రూప మీ చుక్కలగుంపు" అని వర్ణించినాడు, మెనీలియస్ నామకుడగు రోమనుకవి. కాబట్టి క్రీస్తుపూర్వము 1-2 శతాబ్దములవఱకు పడమటి దేశములలో ఖగోళమున నీ జంఘావిష్ట రూపమునకు పేరులేక అనామకమై యుండెనని చాటిచెప్పెదము. పిమ్మట నీ నక్షత్ర సమూహమునకు హెర్క్యులిస్ (Hercules) అను పేరు కనబడుచున్నది.

స్వర్గప్రభునకు ద్యుఃపిత యను నామముగలదు. గ్రీకుభాషలో నా దేవునికి జ్యూస్అని పేరు. ఈ దేవునికి అల్క్మెన్నయను థీబన్ యువతివలన హెర్క్యులిస్ అను యోధుడు జన్మించెనట. అతడు మహాబలశాలి. అనన్య సామాన్యములైన ఘనకార్యములను పండ్రెంటిని నిర్వహించి తుదకు విషప్రయోగముచే దుర్మరణమునొంది, అంతవఱకు ననామకముగా నుండిపోయిన ఉత్తరదిశా నక్షత్ర సమూహమునకు తనపేరు అమర్చెనట! నాటినుండియు జంఘావిష్ట నక్షత్ర సమూహమునకు హెర్క్యులిస్ నామము చెల్లుబడి కాజొచ్చినది. ఇటలీలో వెసూవియస్ (Vesuvius) అను నగ్నిపర్వతమున్నది. దాని దిగువనేలపైన నీ యోధుని పేరున హెర్క్యులేనియమను గొప్ప పట్టణమొకటి

కట్టబడెను. కాని క్రీస్తుశక ఆరంభమున డెబ్బదితొమ్మిదవ సంవత్సరము ఆగస్టునెల ఇరువది నాలుగవ తేదీని ఆ యగ్ని పర్వతము ప్రళయముగా పెటిలి మహోపద్రవము కలిగించెను. కరిగి ద్రవమైన శిలలతో ఉప్పెనగా లావాప్రవాహము ముంచెత్తి గింజుకొనుట కెడము లేకుండ లక్షలకొలది జనముతో నా పట్టణమును పూడ్చిపెట్టెను.

## హెర్క్యులీస్ నామవ్యుత్పత్తి :

ఋగ్వేద ప్రసిద్ధుడగు విష్ణుదేవునకు హరియను నామము సుప్రసిద్ధము. అతడు ద్వాపరమున శ్రీకృష్ణుడై యదువంశమున జన్మించుట భారతీయుల కందరికిని తెలిసిన విషయము. ఆ కారణముచేత యదువంశమునకు హరివంశము, హరికులమనను నామములు కలిగినవి. రఘువంశమువలెనే యదువంశమును వర్ణించు పురాణ గ్రంథమునకు హరివంశము అనిపేరు. వంశమును సాధారణముగా కులమనుచుందురు. కాబట్టి హరివంశమునకు హరికులమని కూడ వ్యవహారముండుట అందఱకును తెలిసిన విషయము. కుల యజమానికి కులపతి కులేశుడు మొదలగు పేళ్ళుండుట సహజము. 'యజమాని' అను నర్థములో పతి, ఈశ శబ్దములు వ్యవహారసిద్ధములు. చూ. భాగ. II 4.20

శ్రియఃపతి ర్యజ్ఞపతిః ప్రజాపతి,
ర్ధియాంపతి ర్లోకపతి ర్ధరాపతిః
పతిర్గతిశ్చాంధకవృష్ణిసాత్వతాం,
ప్రసీదతాం మే భగవాన్ సతాం పతిః

ఇట్లే సురేశ, దేవేశ, మహేశ, ప్రాణేశ మొదలగు శబ్దములలో ఈశ శబ్దము యజమానార్థకము. కాబట్టి యాదవకులేశుడగు హరి, హరికులేశుడు. విష్ణ్వంశసంభూతుడు. హరికులేశ శబ్దము క్రమముగా పడమటకు ప్రాకి, వారి నోళ్ళలో నలిగి, వికృతమై హెర్క్యులీస్ రూపము దాల్చినది.

మరొక విశేషముగూడ గమనింపతగును. స్వార్థపరులగు చరిత్ర రచయితలు ఎంత రూపుమాపి ఎంతమాటునకు నెట్టినను యథార్థము మాత్రము దాగదు. పర్వతములు, నదులు మొదలగునవి నైసర్గికములు. ఎంతచెరిపినను వాని నామములు చెరగవు. హారికులేశుని పేరిట కట్టబడిన హెర్క్యులేనియమ్ నగర పరిసరమునగల వెసూవియస్ పర్వతమే యథార్థమును చాటుచున్నది. శ్రీకృష్ణుడు వసుదేవుని పుత్రుడు. ముద్దుగా 'వసు శిశువు' అనుకొందము. వసు శిశువు పేరిటి కొండ పడమటి నోళ్ళలో నలిగి 'వెసువియస్' అగుట ఆశ్చర్యముకాదు. ఇది నా అభిప్రాయము.

వెసూవియస్ శబ్ద వ్యుత్పత్తిని గూర్చి T. Nelson & Sons వారు ప్రకటించిన సృష్టి విచిత్రములు అను నర్థమిచ్చునట్టి Wonders of Creation అను గ్రంథమునందలి తృతీయ ప్రకరణము 30-వ పుటలో కొన్ని వివరము లిచ్చినారు. ఆ వివరములు కొన్ని పైని వ్రాసినాము. క్రైస్తవేతరుల దేవతయగు జ్యూస్ పుత్రుడగుటచేత హెర్క్యులీస్ యోధుడు యోసోవ్ వియోస్ అయ్యెనట! అది క్రమముగా వెసూవియస్ అయినదట! ఆ పేరా యగ్ని పర్వతమునకు స్థిరపడెనట! ఈ యంశమును, ఈ క్రింద వ్రాయబడిన తక్కిన సాక్ష్యమును చిత్తగించి, పాఠకులు రాజహంసలై క్షీరమునే గ్రహించి నీటిని పరిహరింతురుగాక!

1852 వ సంవత్సరములో ననగా నిప్పటికి సుమారు నూఱు సంవత్సరముల క్రిందట ఎడ్వర్డు పోకోక్ (Edward Pocock) అను చరిత్రకారుడు 'India in Greece' అను నుద్గ్రంథమును ప్రకటించెను. అందులో నీ హెర్క్యులిస్ శబ్ద విచారణ కలదు. ఈ శబ్దము ప్రాచీన సంస్కృతహారికులేశ శబ్దమునుండిజనించెనని కోల్ బ్రూక్ (Coalbrooke) మొదలగు విద్వాంసులు నిర్ధారణ చేసినట్లు అందు తెలుపబడినది. మూడడుగులతో విశ్వమాక్రమించిన త్రివిక్రముడు, వామనమూర్తి

యవతారము ముగిసి పెక్కుయుగములైనది. పిమ్మట హరికులేశుడు శ్రీకృష్ణు డవతారము చాలించి ఐదువేల సంవత్సరములుపైనైనది. ఇపుడు విష్ణువు క్షీరోదము (Milky way) లో శేషశాయియై మన కగపడుచున్నాడు. ఋగ్వేదములో వర్ణింపబడిన పరమపద చిహ్నము లన్నియు నేటికిని మనకు చక్కగా ఉత్తరాకాశమున శ్రీ విష్ణుమండల పరిసరముల కానవచ్చుచున్నవి. వీని నన్నిటిని లెస్సగా గుర్తించి యా విశ్వప్రభుని పరమపదము నిస్సంశయముగా పోల్చి తెలిసికొనుటకు గాను ఖగోళపు టుత్తరార్ధగోళమునగల యీ క్రింది చుక్కలగుంపులను గూర్చి విమర్శించి వీని విజ్ఞానము నవగతము చేసికొనుట ఇహపర సాధనమై మిక్కిలి యావశ్యక మగుచున్నది. (1) బృహదృతము (2) భూతేశమండలము (3) శేషమండలము (4) సర్పధారిమండలము (5) M-13 సంజ్ఞికమైన మధుమక్షిక మండలము (6) కిరీటమండలము (7) వీణామండలము (8) రాజహంస మండలము (9) గరుడ మండలము (10) ధనిష్ఠాత్మకమగు గోబృంద మండలము.

ఇందైదవది M 13 సంజ్ఞికమైన మధుమక్షిక మండలమంటిమి. ఆ సంజ్ఞకు అర్థమేమో తెలిసికొందము. అయ్యది బృహదృతాదులవలె ప్రసిద్ధమైన చుక్కలగుంపుకాదు. యంత్రసాహాయ్యములేక వట్టి కన్నులతో పరిశీలించి చూచినపుడు అది విబూదిబొట్టువలె తెలతెల్లగ తోచుచున్నది. అదియొక ధూమకేతువు తోకచుక్క కాబోలుననుకొని మెస్సియ్యర్ (Messier) అను ఫ్రెంచి జ్యోతిశ్శాస్త్రజ్ఞుడు తోకచుక్కల జాబితాలో దానిని నెం. 13 సంఖ్యగా నమోదు చేసెను. యంత్ర సాహాయ్యముతో పరిశీలించి చూడగా నది తోకచుక్క కాదని స్పష్టమయ్యెను. అదియొక గుత్తి-చుక్కల గుత్తి-గుండ్రగుత్తి (Globe-cluster) తోకచుక్క కాకున్నను, మెస్సియ్యర్ జాబితా ననుసరించి నేటికిని M 13 గుండ్రగుత్తి యనియే వాడుకలో నున్నది. వివరములు పై ప్రకరణములో తెలిసికొందము.

శ్రీ

# జ్యోతిర్వేదము

## ఐదవ ప్రకరణము

"ఇనో విశ్వస్య భువనస్య గోపాః" ఋ. I-164, 21.

"అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః." భగ. X-8.

"మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరం
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతిచ రమంతిచ." ,, X-9.

"విశ్వమునందలి సమస్త భువనముల గోపుడు - విశ్వరక్షకు డక్కడ నున్నాడు ;

ఎల్ల సృష్టికి కారకుడను ప్రభుడను నేను. నా శక్తిచేతనే విశ్వ పరివర్తనము జరుగుచున్నది. ఈ సత్య మవగతముచేసికొనినవారై భావ సమన్వితులగు బుధులు నన్నే సేవించుచున్నారు. చిత్తములు మదాయత్తముచేసి ప్రాణములు నాయందే నిలిపి ఆ బుధు సత్తములు నన్ను గూర్చి తెలిసికొనిన విశేషములు ఒండొరులకు బోధించుకొనుచు, నా కథలనే నిత్యము చెప్పుకొనుచు సంతుష్టాంతరంగులై బ్రహ్మానంద భరితులగుచున్నారు."

మన మిపుడు జ్యోతిర్లోక యాత్ర ప్రారంభింతము. ముందుగా నుత్తరాకాశమున గానవచ్చు నక్షత్ర సమూహముల గమనించుచు పోవుదము. ఎడమ పార్శ్వపు మీది నుండి యొకొక్కటే చూచు కొనుచుపోవుదము. ముందుగా మూషకవాహనుడు, గజముఖుడు, లంబోదరుడు, విఘ్నరాజు రూపము పొడకట్టుచున్నది. ఆ ప్రక్కనే సప్తఋషులు కానవచ్చుచున్నారు. ఈ సప్త తారా సముదాయ ప్రశంస ప్రతి జాతి యొక్క వాఙ్మయమునందును కనబడుచున్నది.

క్రైస్తవ మతస్థుల బైబిల్ గ్రంథములో **Amos** ప్రకరణమునందున్న యీ క్రింటి వాక్యము మనకిచట స్మరణీయము. చూ. 5, 8. **"Seek Him that maketh the Seven Stars".** సప్తతారా సముదయ మును పర్పాటుగా సృష్టించిన సృష్టికర్త ఎక్కడ నున్నాడో వెతికి తెలిసికొనుడు. ఈభావమే ఋగ్వేదములో నెంతో చక్కగా నిర్వచింప బడి మన కిప్పు డవశ్యము స్మరణీయమగుచున్నది. ఋగ్వేదములో సప్తఋషుల ప్రశంస పెక్కుచోట్ల గలదని మన మీవఱకే చూచియుం టిమి. కాని సృష్టికర్త యొక్క నిజనివాసస్థానమేదో నిర్ణయించి తెలిసికోవలెనని మన మిపుడు యత్నించుచున్నాము గనుక నీ చర్చ సందర్భమున నీ క్రింది వేదమంత్రమును పఠించుట అత్యావసరము :—

ఋ. X-82, 2. "విశ్వకర్మా విమనా ఆద్విహాయా, ధాతా విధాతా పరమోత సంద్రుక్ । తేషామిష్టాని సమసానుదంతి । యత్రా సప్తఋషీనీ పర ఏకమాహుః॥"

సృష్టి రచయిత యగు విశ్వశిల్పి మహోద్భుత మనోబలయుతుడు, అనంతశక్తిసంపన్నుడు. అతడే ధాత ; అతడే విధాత ; పరమోన్నత పదమునందు సందర్శనీయుడు. క్రతువులలో యాగభాగ సమర్పణ, మధుర సోమరస ప్రదానాదులలో సదస్యులు సప్తఋషులకు పరుడైన యా దేవోత్తము నొక్కనినే ఎంచి పూజింతురు.

విశ్వశిల్పి స్థానము నభోరంగమునకు నేత్రమువంటి ప్రాముఖ్య స్థానమని తెలిసికొంటిమి. అది యెక్కడ నున్నదో నిర్ధారణచేయుటకు యత్నించుచున్న మనకు ఒక సరిహద్దు దొరికినది. ఆ స్థానము సప్త ఋషులనబడు నక్షత్రములకు సమీపమున నొక ప్రక్కగా నున్నది. ఆ పరమపదమును సూరులు సదా చూచుచుందురు. "సదా పశ్యంతి సూరయః" అని శ్రుతి. పరమపదము సప్తఋషులకు సమీపమున ఆ ప్రక్కనే ఉండుటచేత నా ఋషిసత్తము లెప్పుడును ఆ పరమపదస్థు డగు విష్ణుదేవుని సదా సందర్శించుచుందురు. ఇది ఖగోళమున ఋజు

వగుచున్న ప్రత్యక్ష జ్యోతిశ్శాస్త్రార్థము. ఈ పరమపదమునకు సప్త ఋషులు ఎప్పుడును పశ్చిమమున గానవత్తురు. సప్తఋషులకు విష్ణుపద మెప్పుడును తూర్పున నగపడుచుండును.

**మారుతస్య వేధసః :**

మన పరమపద పటములో నెడమప్రక్క సప్తఋషి నక్షత్రముల దిగువ నొకానొక వానరరూపము కానవచ్చుచున్నది. వానర శరీర మధ్యభాగమున మిక్కిలి మెఱయుచున్న మేటి నక్షత్రమున్నది. అది మన స్వాతి నక్షత్రము. స్వాతి వాయుదైవత్యము కదా ? స్వాతి ప్రక్కను తూర్పుగా విష్ణుభగవానుని సందర్శనము లభింపగలదు. వాయుదేవునకు పతియు, గతియు, విష్ణుదేవుడే. విష్ణుసేవాశీలుడు వాయువు ; వాయుదేవుని యజమాని, కర్తవ్యోపదేశకుడు, మార్గదర్శి, పలిక, సమస్తమును విష్ణుదేవుడే. వాయువునకు విష్ణునితో నవినాభావ సంబంధమున్నది. విష్ణుభృత్యుడై విష్ణుని యాజ్ఞానుసారము నడుచు కొనుటే వాయుదేవుని కర్తవ్యము. విష్ణు వాయువుల మధ్య భర్త, భృత్యభావము నిరుపమానము "మారుతస్య వేధసః" అనగా మరు ద్గణమున కేలికయై కార్యనిర్వహణార్థము వారిని నియోగించి వారిచే పనిగొను ప్రభుడని యర్థము.

ఋగ్వేదములో కొన్నిచోట్ల వాయుదేవుడు కొడవలింబోలిన ఇనుపకత్తి చేబట్టి ఝళిపించుచున్నట్లు వర్ణనలున్నవి.

ఋ IV 20.5. సృణ్యో౯న జేతా ; క్రుణిని చేతపట్టుకొనినవాడు.

ఋ VIII 29-8 వాసీమేకో బిభర్తిహస్తా ఆయసీమంతర్దేవేషునిధ్రువిః; దేవమధ్యమున స్థిరుడై వాయుదేవుడు మహాయసమును పట్టి ఝళిపించుచున్నాడు.

ఈ వర్ణన కనుగుణ్యముగానే విష్ణువు ప్రక్కవాయువు ఇనుప కత్తిని చేపట్టి సాముచేయుచున్నట్లు ప్రాచీన చిత్రములు పాశ్చాత్య,

భగోళ పటములలో కానవచ్చుచున్నవి. మఱియు ప్రాచీనుల నక్షత్ర సమూహములను గూర్చియు, వారి పంచాంగములను గుఱించియు మద్గ్రంథమును రచించిన ప్లంకెట్ దొరగారి చిత్రపటములలో పదు నైదు మొదలు పందొమ్మిది వఱకు సంఖ్యలుగల వానిలో, త్రివిక్రమ విష్ణుని ప్రక్కగా నిట్టి మహోయనహస్తుడగు వాయువు చిత్రము చూడ నగును.

పిమ్మట కొంత కాలమునకు స్వాతినక్షత్ర పరిసరములలో పెక్కు దేశములవారు నక్షత్ర వానరరూపమును చూడసాగిరి. స్వాతి పరిసర ముల మర్కటరూపము ఉన్నట్లు బహుదేశముల గ్రంథకాలమునందు వివరింపబడినది. గ్రిమాల్డిదొరగారి జాబితా గ్రంథములో నిట్లుగలదు.

| పుట - | దేశము | నమోదుసంఖ్య - వివరములు. |
|---|---|---|
| 15 | ఈజిప్టు | 29 - సరిహద్దులు చూపు శిలాశాసనముపై వానర రూప చిత్రము దక్షిణాయనమును సూచించు చున్నది. |
| ,, | ,, | 30 - ఇదికూడ వానరచిత్రమే. |
| 21 | ,, | 82 - కన్యారాశి సమీపమున మర్కటము. |
| ,, | ,, | 92 ,, ,, ,, |
| 178 | ,, | 1404 అనుబంధమున ,, ,, |
| 81 | చీనా | 146 క్రోతితో కన్యారాశి |
| ,, | ,, | 147 ,, ,, |

అంతదూరము పోనేల ? వాల్మీకి, కిష్కింధాకాండ 67 సర్గ 20 వ శ్లోకములో నేమి వ్రాసెనో సరిగా అర్థముచేసికొనిన చాలును. సంపాతి లంకలో సీత ఉన్నదని అంగదాది వానరులకు తెలియచెప్పెను. సముద్రము లంఘించు విషయమున నెవరెంతదూరము పోగలరో వానరు లొకరొక్కరే తెలియజెప్పిరి. మొదట మౌనము వహించి

యూరకున్నను. జాంబవంతుడు శ్లాఘించిన యనంతరము హను మంతుడు వీరావేశమున నిట్లు పలికెను :

"అనుయాస్యన్తి మా మద్య ప్లవమానం విహాయసా ।
భవిష్యతి హి మే పన్థాః స్వాతేః పంథా ఇవామ్బరే !"

సీతాన్వేషణార్థము సముద్రము లంఘించి యాకాశమార్గమున నేను లంక కరుగుచున్నప్పుడు నా పంథా అంబరమున స్వాతీనక్షత్రపు పంథావలెనే దర్శనీయమొందగలదు.

అంజనేయుడు వానరుడు. విహాయసమార్గమున వాంజనేయుని పంథా స్వాతిపంథాతో నుపమించుట సాభిప్రాయము. స్వాతి వానర నక్షత్రరూప మధ్యమున మన్నది. స్వాతీనక్షత్రము తేజోవంతము, వేగవంతము, వానరరూపవిరాజితము నగుటచేత అంజనేయుని విహా యసయానము స్వాతీనక్షత్ర పంథాతో నుపమింపనైనది. ఈ శ్లోక రచనలో జ్యోతిశ్శాస్త్రవేత్త వాల్మీకి ప్రదర్శించిన జ్యోతిర్విజ్ఞానము మన పండితోత్తములును, కవులును గమనింపక విడచివైచుట మిక్కిలి శోచనీయము. కన్యారాశి చర్చ సందర్భములో 'సనస్య దహనా ప్లవగాచ కన్యా' అను శ్లోకమున కర్థము వివరించుపట్టునకూడ నీ యంశము వేరొకచోట చర్చించి ప్లవగమనగా మరల యర్థము చెప్పి యున్నాను. వరాహమిహిరుడు, వ్యాఖ్యాతలు, **Major B. D. Basu** గారు మొదలగు విమర్శకులు ప్లవగ శబ్దమునకు తెప్పయని యర్థము చెప్పుట అసందర్భము.

హనుమంతుడు వాయుపుత్రుడని రామాయణము చాటి చెప్పు చున్నది. తక్కిన పురాణములును ఆ యంశము స్థిరపఱచుచున్నవి. వాయు వెప్పుడును విష్ణుసన్నిధానవర్తి. విష్ణువు రాముడై యవత రించునపుడు వాయువు హనుమంతుడై యవతరించినాడు. కృష్ణుడై యవతరించునపుడు వాయువు భీముడై జన్మించినాడు. అరబ్బులు స్వాతీనక్షత్రమును స్వర్గద్వారపాలకుడని యెంతురు. ద్వైతమత

ప్రవర్తకులగు మధ్వాచార్యులవారు మోక్షసిద్ధికి విష్ణుపరమపద వ్యాప్తికి వాయుదేవుడే గతియనియు వాయువునిద్వారా తప్ప మోక్ష సిద్ధికి వేరుమార్గములేదనియు ప్రవచనము చేసెను. ఏమనగా పరమపద ద్వారపాలకుడు వాయుదేవుడు, అన్యులెవరును కారు కావున వాయువు పరమగురువు. అతనికటాక్షముద్వార మోక్షప్రాప్తియగు ననిసిద్ధాంతము.

సుప్రసిద్ధ రామభక్తుడును, హిందీ తులసీరామాయణ కర్తయు నగు తులసీదాసు హనుమంతునిగూర్చి వ్రాసిన స్తోత్రము నిట స్మరించుట యావశ్యకము.

రామ దు+ఆరే తుం రఖ్వారే [దు+ఆరే=ద్వారే - ద్వారపాలక
హోత్ న ఆజ్ఞా బిన్ పైసారే- {వినా - నీ ఆజ్ఞ లేనిదే - ప్రభు
అస్ వరదన్............... {దర్శనము లేదు.

మధ్వాచార్యమతము నవలంబించిన ద్వైతులకును, ఇతరులకును శ్రీరామ భక్తులకే కాక స్వాతి సమస్తమతములవారికి పూజ్యమగు చున్నది. సూర్యోదయాత్పూర్వము స్వాతి తూర్పున చక్కగా నుదయమగు దినములకును, సూర్యు డస్తమించిన వెంటనే స్వాతి తూర్పున నుదయమగు దినములకును ఒక విశిష్టత కనబడుచున్నది. అదేమనగా- జగత్ప్రసిద్ధులగు మత ప్రవర్తకుల జన్మదినములును, జగద్గురువుల జన్మ దినములును స్వాతి ఉదయించు దినములతో సంబంధముగల్గియున్నవి. వివరములు వేరొకచోట చర్చింతము.

## శేషమండలము :

పాశ్చాత్యు లీ మండలమును **Serpens** అనుచున్నారు. ఏ చుక్కల గుంపును మనవారు శేషుడనిరో నిశ్చయించుటకు పడమటివారి చుక్కల చిత్రపటములలో కొన్ని మార్పులు జరిగించిచూచుట ఆవశ్యకము. ఖగోళమున ముత్యములవలె మిణుకుమిణుకుమను చుక్కలు

ముగ్గుబొట్ల వంటివి. మన భావనలో వాని నొక్కొక్క విధమున కొన్ని కొన్ని గీతలతో కలుపుకొనిన నొక్కొక్క వస్తురూప మేర్పడును. ఇక్కడి చిత్రపటములో 1 అంకె చుట్టుగల చుక్కలు పాశ్చాత్యుల విభజన ప్రకారము భూతేశమండలములోనివి. వాని యడుగున మహోజ్జ్వలముగా మెఱయు పెద్దచుక్క స్వాతి. ఈ చుక్కలను పరికించి చూచుచో వంకరగా పాతిన వీథి దీప స్తంభము యొక్క ఆకారము స్ఫురించుచున్నది. దీనికి తూర్పున ఏటవాలుగా సరిహద్దు గీత నల్లని బొట్లతో చూపితిమి. సరిహద్దు గీతకు కుడితట్టున 2 అంకె దిగువ వంకరగా కనబడు చుక్కలగుంపు సర్పము. 3 అంకె దిగువ చంద్రవంక వంటి చుక్కలు కిరీటపు చుక్కలు. 4 హారికులేశుని స్థానమును, 5 అహిధారి స్థానమును చూపగలవు. ఇది పాశ్చాత్య విభజన విధానము. ఇందు శేషునికి తలయు తోకయు లేవు. ఇది కేవలము అసందర్భ విభాగము.

మన పూర్వు లీ చుక్కల నింకొక విధమున కలిపి యేడు పడగలతో శేషుని రూపము ప్రదర్శింపజేసిరి. ఆ మార్పులు కుడితట్టు చిత్రములో స్పష్టముగా చూపినాము. సరిహద్దు బొట్లగీత తీసివైచి, స్వాతి నక్షత్రమును అందు మీది చుక్కల ఆట్టును విడదీసి వేరుచేయవలెను. గాలిపడగ ఆకారముగల ఆ చుక్కల అడుగుభాగము, పడమటి వారి సర్పదేహమున కతకవలెను. అపుడు పడగవిప్పిన సర్పరూపము స్పష్టముగా నెవరికైన గోచరింపకమానదు. శేషస్వరూప మిది. చుట్టు ప్రక్కలగల చిన్నచుక్కలను సరిగా చేర్చుకొని పడగచుక్కలను పరిశీలించినచో సప్తఫణావృతమైన శేష స్వరూపము మనకు స్ఫురించును. ఆ స్వరూపమే శేషశాయి చిత్రమున చూపితిమి. ఇక్కడ కుడితట్టు చిత్రములో స్వాతిమీదుగా చూపబడిన చుక్కలు శేషుని మొదటి మడతలోనివి. శేషపామ్మున నెన్నో మడతలున్నవి. అవికూడ శేషశాయి చిత్రమున చూడవగును.

ప్రాచీన చిత్రములను సరిగా నర్థముచేసికోలేక మధ్యమధ్య "కమీషనర్లు" కొందరు ప్రయాసపడి చుక్కల గుంపులను మార్చి, ఇష్టమువచ్చినట్లు తారుమారుచేసి సకలభ్రష్టు చేసినారు. అందువల్ల కైస్తవ బైబిల్‌లోని ఖగోళగాథలు సమన్వయము కుదరక దురవగాహాములైనవి. అందుకు చాల చీకాకుపడి R. A. Proctor దొర గారు కమిషనర్ల నక్షత్రపటములను దిద్దితీర్చి ఎన్నెన్నో మార్పులుచేసి, బైబిల్ సమన్వయమున కనుకూలమైనట్లుచేసి **Myths and Marvels of Astronomy** (ఖగోళ గాథావిచిత్రములు) రచించినారు. బైబిల్ గతియే యిట్లయినపుడు అంతకంటె కడుప్రాచీనములైన వేదముల సమన్వయము మాటయేమి?

లేని చుక్కలను సృష్టించక, ఉన్నవానిం దీసివేయక, ఉన్న వానిని క్రమముగా సరిగా గుది్రగుచ్చి గుంపులు సరిగా వేర్పరచు కున్నచో గ్రిమల్డీదొర గ్రంథమును, మనవేద వాఙ్మయమును మనకు సరిగా నర్థముకాగలవు. అవకతవక విభాగములు విభజనలచే కుంటు వడిన వేదవిజ్ఞాన సమన్వయార్థము పడమటి నక్షత్రపటములను అవసర మునుబట్టి సవరించుకొనుట అత్యంతము నావశ్యకము. అట్లు చేసినగాని సపరివారుడగు విష్ణుభగవానుని పరమపదము మనకు చక్కగా అవగాహన కానేరదు.

పైని తెలిపిన మార్పులుచేసి ఖగోళపు టుత్తరార్థమును శ్రద్ధగా పరికించితిమేని, ప్రళయానంతరము జలార్ణవమున శేషునిపై పవ్వళించిన విష్ణుభగవానుని బ్రహ్మదేవుడెట్లు చూచెనో అట్లే మనముకూడ సందర్శింపగలము. చూ. భాగ III 8-28

"మృణాళగౌరాయత శేషభోగపర్యఙ్క మేత త్పురుషం శయానం। ఫణాతపత్రాయతమూర్ధరత్నద్యుభిర్హతధ్వాంత యుగాంత తోయే॥" ప్రళయకాలయుగాంతతోయముతపై గొడుగువలె విప్పారు శేషభోగీంద్రుని ఫణములదిగువ తెల్లచామరతూటివలె ధవ

శమై విశాలమైన శయనముపై పవ్వళించిన పురుషోత్తముని బ్రహ్మ సందర్శించెను. శేషుని ఫణములపై మెఱయు రత్నద్యుతులచే అచ్చటి యంధకార మంతరించెను. అట్టి తేజోమయాత్మకమైన శేషతల్పముపై సుఖనిద్ర చెందిన పరాత్పరుని పురుషోత్తముని బ్రహ్మ అవలోకించెను. ఆరూపమునట్లే భక్తు లనేకులు ఖగోళమున సందర్శింప గలిగిరి. పరమ భక్తుడును వైష్ణవకవియు ముకుందమాలరచయితయు నగు కులశేఖరాళ్వారు శేషశాయియగు కృష్ణభగవాను నిట్లు హృద్యముగా స్తుతించినాడు.

క్షీరసాగర తరంగశీకరా సారతారకితచారుమూర్తయే
భోగిభోగశయనీయ శాయినే మాధవాయ మధువిద్విషే నమః॥

క్షీరోదశీకరతరంగములమీద మడుగు పాన్పుగా నేర్పడిన శేషునిపై హాయిగ పవ్వళించిన మనోజ్ఞ నక్షత్రమూర్తికి, మాధవునకు, మధురాక్షసహంతకు నమస్కరింతును.

శ్రీనాథకవి సార్వభౌముడు శేషతల్ప సుఖశయనుని విష్ణు దేవుని రూపము శృంగారనైషధమున నిట్లు వర్ణించినాడు.

అమృత మధురంబులగు గాడ్పులానియాని
బొజ్జ పెంచిన పెనుపాప సెజ్జమీద
పాలమున్నీటిలో శౌరి పవ్వళించు.

పాములకు గాలి యాహారమని కవిసమయము. శేషభోగీంద్రుని ప్రక్కనే వాయుదైవత్యమైన స్వాతీనక్షత్రమున్నది. కావలసినంతగాలి-తనివిదీర పీల్చిపీల్చి పెద్దబొజ్జ పెంచిన శేషునిపై విష్ణువు పవ్వళించెనని సాభిప్రాయముగా ఖగోళ విజ్ఞానసూచకమైన రచన యీ పద్యరత్నమున నిమిడియున్నది. నైషధపాఠకు లీ మర్మముకూడ గ్రహించి యానందింపతగును.

## సర్పధారి మండలము :

ఖగోళమునందును, నక్షత్రపటములందును ఈ సర్పధారి మండలమునందుగల చుక్కలను పరిశీలించినవారికి అవి నిజముగా శేషుని మడతలలో చుక్కలేగాని, వానికి ప్రత్యేకత లేదని స్ఫురింపక మానదు. దురభిమానమువదలి సమదృష్టితో సత్యము నారయుచో శేషునిలోనివే గాని యీ చుక్క లన్యగణములో చేర్పవలసినవి కావని స్పష్టమగును. నక్షత్ర సమూహమును సులభముగా గుర్తించుటకు సాహాయ్యపడు చిత్రపట గ్రంథకారులగు జేమ్సుగాల్ (James Gall) దొరగారు ఆ గ్రంథము యొక్క 20 వ పుటలో నిట్లు వ్రాసిరి : "సర్పధారిగుంపు చుక్కలు మొదట శేషమండలములోనివే. శేషాహియొడ లిదియని యవి నిరూపించుచున్నవి. మధ్య మరొక చుక్కలగుంపు- సర్పధారి మండలమను పేరుతో ప్రత్యేకించబడినది. అసలులో అట్లులేదు."

దుర్భిణి వినా జ్యోతిశ్శాస్త్రము (Astronomy without a Telescope) అను చక్కని గ్రంథము రచించిన E. W. మాండరు దొరవారు అందలి 8 వ పుటలో నిట్లు వ్రాసిరి :

"కలగాపులగస్తు చుక్కల గుంపులలో సర్పధారి యొకటి. శేషుని యొడలి మడతలతోనే దీనికి సంబంధము."

మన ప్రాచీనులీ చుక్కల నిట్లే భావించిరి. కాని మధ్య గ్రీకులు మాత్రము మరొక గుంపుక్రింద నీ చుక్కలను విడదీసి వానికి సర్పధారి యని పేరిడిరి. మెనీలియస్ రోమకకవి కూడ ఈ చుక్కలను సర్పధారిగానే గ్రహించెను. ఒకానొక వృద్ధుడు అమ్మహాహితో కుస్తీపట్టుచు దారుణ ద్వంద్వయుద్ధము చేయుచున్నట్లు వర్ణించియున్నాడు. ఒకరికొకరు రిడుతీయక, సమ బలశాలులై సమరము సలుపునపుడు ఆ పోరాటము సాగవలసినదే కాని ఇంతంతలో నంత మొందజాలదు. గ్రీకు గాథలలో సర్పధారి పూజ్యపాదుడగు వృద్ధుడు. పాశమై బంధింపబూచు నా ఘోర సర్పమును అతడు రెండుచేతులతో బట్టి మెలికలు విప్పు

చున్నట్లు హారికులేశుని దిగువ చూడనగును. మిల్టను మహాకవి యీ ఘోరాహి యొక్క దీర్ఘదేహమును ప్రశంసించినాడు. **Statius** కవి చేసిన యీ దిగువ వర్ణనము **Mary Proctor** అను నామె రచించిన గ్రంథములో నుద్ధృతము.

"జ్యోతిర్లోకమున నభోరంగమును విభజించుచున్నదో యనునట్లు ఈ మహాహి ఉత్తరమునుండి దక్షిణమునకు మరలి చుట్టలుచుట్టుకొనుచు మెఱసెడి దేహములో మూలమూలలకు విక్షేపించుచున్నది"

## 5. 'విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః'

ఉరువిక్రముడగు త్రివిక్రమదేవుని తృతీయ విన్యస్త పద సమీపమున నక్షయమధు ప్రాప్తిస్థానమున్నది. విశ్వనేత్ర మనదగు విష్ణుని పరమపదము గుర్తించుకొనుటకు ఇది యొక చక్కని యానవాలు. ఋగ్వేదము I-154, 45 మంత్రములలో దీనిం గూర్చిన ప్రస్తావన మన మీవఱకే పఠించితిమి. అందు మధువు అక్షయముగా లభించు తావున్న దని స్పష్టముగా తెలుపబడినది. తరగకుండ తేనె దొరుకుటకు ఒక నుయ్యి అందున్నదని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసిరి. అచ్చట నూతులు గోతులు నేమియు లేవు. కాని తెల్లతెల్లగా తోచు మచ్చ- విఖాదిబొట్టు వంటి సూక్ష్మ ధవళచ్ఛాయ యొకటి స్థూలదృష్టికి మన కగపడును. అది యొక తోకచుక్క యను భ్రాంతితో మెస్సియర్ పరిశోధకుడు తన లెక్కలలో 13 సంఖ్యగా నమోదుచేసి పరిశీలనచేసిన సంగతి కూడ మనము తెలిసికొంటిమి. అది యెంతమాత్రము నొక తోకచుక్క కాదు. సర్ విలియమ్ హెర్షెల్ దొర తన దుర్భిణి యంత్రముతో చూచి తేజః పటము తీసినాడు. మధుప్రపూరితమగు చక్కని తేనెపెఱ నా చిత్రము స్ఫురింపజేయుచున్నది. విష్ణుమండలము కెలకులనున్న తంగెటి జున్ను అన నొప్పుచున్నది. హెర్షెల్ దొర గారి ప్రాత టెలిస్కోపు కంటె బహుశక్తిమంతములైన టెలిస్కోపులు అటుపిమ్మట నిర్మింప

బడినవి. వానిలో గూడ చూచి తేజఃపటములు తీసినారు. ఇట్టి చిత్ర మును సర్ జేమ్సు జీమ్సు దొరగారు చక్కగా వర్ణించి వ్రాసిన సంగతులు తెనిగించి ఈ దిగువ వ్రాయుచున్నాను.

ఒక తేనెతుట్ట - వాయు పథమున స్థిరపడినదని భావించు కొందము. తుట్ట మధ్యను మధుమక్షికములు గడ్డకట్టుకొని గోళాకారమున దట్టపు ముద్దవలె నగపడును. ఆ ముద్ద చుట్టు నున్న యావరణమున తేనెటీగలు జుమ్మనుచు ఎగురుచు చుట్టును పలుచపలుచగ వ్యాపించి ఝుంకారము చేయుచుండును. అందొ కొక్క తేనెటీగ నొకొక్క చుక్క క్రింద మార్చినపుడా దృశ్యమెట్లుం డునో ఊహించుకొందము. అపుడు గుండ్రగుత్తి చుక్కలగుంపు (Globe-cluster) అనగా నేమో మనకు విశదమగును. మధ్య సాంద్ర తరమై గుండ్రమైన చుక్కలగుంపు దానిచుట్టును కమ్ముకొనిన చుక్కల మధ్య కొంచెము ఎడముండును. ఇంతచక్కటి చుక్కలగుత్తి భగోళపు టుత్తరార్ధమున మరొకటిలేదు. అవి యెంతదూరమున నున్నవి? ఎన్ని యున్నవి? ఎన్నియున్నవో సరిగా చెప్పుట ఎవరితరము? సాధ్యము గాదు. కాని ఒక తేజఃపటములో నైదువేల చుక్కలకు పైగానే ఇందు లెక్కింపబడినవి. ఫోటోగ్రాఫుకు చిక్కనివి ఎన్నిగలవో! ఏమో! మన సూర్యునివలన మనకు లభించు వెలుగుకంటె ఇరువదియైదులక్షల రెట్లు ఎక్కువ వెలుగు ఈ చుక్కల గుత్తినుండి వెడలుచున్నదని వైజ్ఞాని కులు లెక్కవేసినారు. ఒక సెకండు కాలములో నొక లక్ష యెనుబది యారువేల పైచిల్లర మైళ్లు త్వరలోబోవు వెలుగు అటనుండి వెడలి ముప్పది మూడు వేల సంవత్సరములకుగాని భూగోళము చేరదు? చేరి నపుడాగుంపు ఒకచిన్న మచ్చ. తెలతెల్లగా విభూతిబొట్టు మాత్రముగా మనము చూచుచున్నాము. జేమ్సుజీన్సు దొరగారు ఈ చుక్కల గుంపును మధుమక్షికములతో నుపమించి మనకన్నులకు గట్టినట్లు వర్ణిం చుట బహు ప్రయోజనకరము. ఏమనగా "విష్ణోః పదే పరమే మధ్వః

ఉత్సః" అను గొప్ప వేదమంత్రమునకు అర్థతాత్పర్య చిత్రపట సహితమై దివ్యమైన వ్యాఖ్యానమీ దొరగారి వలన లభించును. వేదమంత్ర ద్రష్టయొక్క మనోనేత్రమునకు గోచరించిన మధుమక్షికసాదృశ్యమే జీన్సు దొరగారికిగూడ స్ఫురించుటయు, ఆయుపమానమునే విపులీకరించి ఆ దొరగారు గుండ్రగుత్తి చుక్కల రూపమును వివరించుటయు మనకు మిక్కిలి ముదావహము. వేదఋషుల సత్యవాక్కులను నవీన వైజ్ఞానికులు చిత్రపట వాఖ్యలతో ధ్రువపఱుచుటచేత వాని నిజము తేటతెల్లమగుచున్నది. చలించి పోక యావత్కాలము నిలబడగల సత్తా, శాశ్వతమై వెలయుదార్ఢ్యము సత్యమునకే గలదు. నిత్యమైనది సత్యమొక్కటే. దుర్బల మానవ నేత్రములకు ఖగోళమంతటను నొకయెడ సుమారైదువేల చుక్కలు కనబడగలవు. ఆ సంఖ్యగల చుక్కలీ గుత్తిలోనే కలవని లెక్కవలన తేలినది. ఏమి యాశ్చర్యము ?

ఈ గుత్తినిగూర్చి జేమ్సు బెయికీ (Jamer Baikie) దొరగారు వ్రాసిన ప్రశస్తి వాక్యములు ఈ దిగువ వ్రాయుచున్నాను. "మహాపరిమాణయుతములగు తారాసముదాయములు వేనవేలు ఒక్కచో గోళాకారమునచేరి తేజరిల్లు దృశ్యము లత్యద్భుతములు. అట్టి గుండ్ర గుత్తి చుక్కల గుంపులన్నిటిలో M 13 గుంపే ప్రథమగణ్యము. ఇంత రమ్యమైన దృశ్యము ఖగోళమున వేరొకటి కానరాదు పెద్ద టెలిస్కోపులో నొకమారు చూచినచో మరెన్నడును మఱువరానిది. అంతటి మహనీయ సౌందర్య దృశ్యము మరొకటిలేదు.

విల్సన్ పర్వతస్థమగు గొప్ప టెలిస్కోపులో దీనింజూచిన యొక వ్యక్తి ఇట్లు వ్రాసెను :

"కంటి అద్దము (Eye-piece) మీద వెలుగు ప్రసరించినదే తడవుగ నల్ల మొఖ్మల్‌పై తళతళ మెఱయు వజ్రపుపొడుల చందమున నీ గుంపులోని చుక్కలు తేజరిల్లెను. చిన్న చుక్కలమాట యటుంచి పెద్ద చుక్కలను లెక్కింపగా వాని సంఖ్య పంఽడెండు వందలకు

పై నున్నది. ఈ గుత్తి ముప్పదివేల వెలుగు వత్సరముల (Light years) దూరమున నున్నది."

ఇట్టి జ్యోతిశ్శాస్త్రార్థములో వేదమంత్ర ద్రష్ట మధుమక్షికము లతో నుపమించి మనోజ్ఞ నక్షత్ర సమూహాముతో గోళాకారమున నేర్పడిన యీ గుంపును తెలిపియుండెను. కఠోపనిషత్తు II-4 లో "తద్యథా మక్షికామధుకర" అని ఈ ప్రశంస గలదు. విష్ణుని పరమ పదమును స్మరించు సందర్భములో ఖగోళార్థము మఱచి తరువాతి గ్రంథములలో మధువును గ్రోలు తేనెటీగల ప్రశంస మాత్రము తఱుచుగా కనబడుచున్నది.

భాగ III-8 31 నివీత మామ్నాయ మధువ్రతశ్రియాః । స్వకీర్తి ......శ్రీహరిని పరివేష్టించినవై వేదములు మధుకరములట్లు ఆ దేవుని కీర్తించుచుండుట బ్రహ్మ చూచెను.

భాగ. V-25-7 తులసికామోద మధ్వాసవేన మాద్యన్మధుకర వ్రాత మధురగీతశ్రియం, *వైజయంతీం.*

విష్ణుభగవానుడు వైజయంతీమాల ధరించుట పురాణప్రసిద్ధము. ఆ మాలికలోని తులసిదళములు ఎన్నటికిని వాడవు. అవి నిత్యమును నవ్యములే. వాని మాధుర్యముచే నాకర్షితములై మధుకర వ్రాతములు మహాహ్లాదముతో ఝంఝమ్మని మధురగీతములు శ్రోత్రపేయముగా గానము చేయుచున్నవి. అట్టి తేటులతో కూడుకొనిన వైజయంతీమాలను శ్రీవిష్ణు భగవానుడు ధరించుచున్నాడు.

**మకుటము :**

పడమటిదేశము జ్యోతిర్విదు లీ నక్షత్ర సమూహామును కొరోనా బోరియాలిస్ (Corona Borealis) అందురు. ఆ మాటకు 'ఉత్తర మకుటము' అని యర్థము. ఖగోళమున నక్షత్రరూపమున వెలయు కిరీటములు రెండున్నవి. ఒకటి ఉత్తరార్ధగోళమున గనపడుచున్నది.

అదే యీ మకుటము. రెండవది దక్షిణార్ధగోళమున మెఱయుచున్నది. దానికి (Corona Australis) దక్షిణ మకుటమని పేరున్నది. మన మిపుడు చర్చించి తెలిసికోవలసిన దీ దక్షిణమకుటము కాదు. ప్రత్యేక ముగా నుత్తరాకాశమున వెలయుచు విష్ణుమండలస్థమైన మకుటమును గూర్చియే చర్చింతము.

ఈ మకుటము అర్ధచంద్రాకారముగల ఆఱు చుక్కల గుంపు. వానిలో నత్యుజ్జ్వలమైన నక్షత్రమును పడమటివారు ఆల్ ఫెక్కా (Alphecca) అందురు. ఈ కిరీటమును గూర్చి పడమటిదేశములలో వ్యాప్తమైన గాథలనుగూర్చి ముందు తెలిసికొందము.

రోమనుల దేవతలలో వల్కాన్ (Vulcan) ఒకడు. అతని భార్య వీనస్ (Venus) అను నామె. ఆ దేశస్థుల కామె ప్రేమదేవత; శృంగార దేవత. ఒక మహారాణి, అరియడ్ని (Ariadne) నామ్ని, ఆమె యనుగ్రహమునకు విశేషపాత్రురాలైనది. రత్నఖచిత స్వర్ణకిరీటము నీ భక్తురాలికి ఆ దేవత కటాక్షించి ఇచ్చినది. పిమ్మట దైవసంకల్ప బలమున నా కిరీటము ఖగోళమున నక్షత్రరూపమున వెలుగొందు చున్నది. క్రీస్తుపూర్వము మూడవశతాబ్దమున నుండిన రోమకకవి అపోలోనియస్ రోడ్సు (Appolonius Rhodes) ఈ కిరీటమును ఇట్లు వర్ణించెను---

"ఆ మహారాజ్ఞి ధరించిన మేటికిరీటము ఈనాటికి కూడ నక్షత్ర మండలమున ప్రకాశించుచు కానవచ్చుచున్నది."

స్పెన్సరు నామకుడగు నాంగ్లకవి ఈ కిరీటము నిట్లు ప్రశంసించెను—

"అరియడ్ని మహారాణి శిరమున ధరించిన దివ్యమకుటము నేడు నభోరంగమున నెంత చక్కగా తేజరిల్లుచున్నది! నక్షత్రమండలము నకే ఆ కిరీట మొక చక్కని భూషణమై యొప్పారుచున్నది."

మెనీలియస్ అను రోమకకవి దీని నిట్లు వివరించెను—

"భూతేశమండలము ప్రక్క నీ కిరీటము భాసిల్లుచున్నది. ఇందున్న చుక్కలన్నియు నొక్కవిధమైన తేజస్సుతో మెఱయుట లేదు. కొన్ని తక్కువకాంతి గలవి. అన్నిటినిమించి యొక చుక్క మహాద్భుత కాంతిసంపద గల్గి ధగధగ మెఱయుచున్నది."

రోమనులకు ముందు నాగరకత గ్రీకులది. గ్రీసుదేశపు వైజ్ఞానికు లీ చుక్కలను కిరీటమని భావించలేదు. ఒక చక్కని పూలదండయని భావనచేసిరి హెర్టెలీ దొరగారు ఈ కిరీటపు చుక్కలను రత్నఖచితమై, దివ్యమై, విచిత్రమై తోచు స్వర్ణాభరణముతో పోల్చిరనియు నది ఎంతో హృద్యముగా నున్నదనియు జెయికీదొరగారు వర్ణించి చెప్పిరి.

ఇక మనప్రాచీనులు వీని నెట్లు వర్ణించిరో తెలిసికొందము. విష్ణు భగవానుని శిరస్సుపై నొక చక్కని కిరీటము మెఱయుచున్నదని మన పురాణములు తెలుపుచున్నవి. ఆ కిరీటముయొక్క ఘనతనుబట్టి చూచినను, అందు పొదిగిన యమూల్య రత్నద్యుతులనుబట్టి చూచినను ఆ కిరీటమును ధరింపగల తాహతు మరెవ్వరికిని లేదు. ఈ కిరీటమును "అన్యైరధార్యైః శిరసి పరిసరద్రశ్మికోటీరకోటి" అని త్రివిక్రమ పండితాచార్యు లుద్ఘాటించెను.

హిరణ్యాక్షునకు విష్ణుదేవునితోనైన గదాయుద్ధములో నా రక్కసుడు విష్ణుని చెంపపై గదతో పగులగొట్టెను. అపుడా కిరీటము తూలి దొప్పవలె నాప్రక్క బడెను కిరీటమునందలి గుల్లభాగము మీద కును శిఖరమడుగునకును పడుటచే ఖగోళమున నదేవిధముగా నీమకు టము మనకు కనబడుచున్నది. విష్ణునకు నాడుతగిలిన గదా మాతముచేత రక్తము స్రవించుచున్నదట! స్రవించు రక్తముతోనే యాతడు సింహా చలముపై వెలసినాడట! రక్తస్రావ మరికట్టుటకు అచటి భక్తులు నేటికిని ప్రతిదినమును ఆ విగ్రహామునకు చందనము పూత పెట్టుదురు. ఒక సంవత్సర మిట్లు పెరిగిన చందనపు పూతలను అక్షయతృతీయ -

వైశాఖశుక్ల తృతీయ దినమున నర్చకులు త్రవ్వుదురు. నిజరూపదర్శనాధికమగుటచేసి నాడు గొప్పగొప్ప ఉత్సవములు చేయుదురు. ఆ నాడు పడమట సూర్యుడు గ్రుంకినంతలో నీ కిరీటపు నక్షత్రములు సాయంకాలమున తూర్పున నుదయించును. మహాభుజుడు, గదాధారి హిరణ్యాక్షయోధుని హస్తగతమైన గద యదృశ్యమగును. ఈ ఖగోళ నాటకమునననుసరించియే అక్షయతృతీయోత్సవము ఏర్పడినది. హిరణ్యాక్షునిచే నిట్లు నొచ్చియు వానిని పిమ్మటసంహరించిన యజ్ఞవరాహ మూర్తిని బ్రహ్మాదులు భక్తితో స్తుతించినట్లు భాగవతము తెలుపుచున్నది. బ్రహ్మను గూర్చియు నతని పద్మాసనము నతని చతుర్ముఖములు నతని సృష్టిక్రమమును నతని ముఖమున వెలయు వీణాపాణి సరస్వతిని గూర్చియు వారి యాసనపద్మమును గూర్చియు ఖగోళ సమన్వయము ఈ క్రింద చర్చించి తెలిసికొందము.

## వీణామండలము (The Lyre) :

వీణ యనునది ఒకానొక సంగీతయంత్ర వాద్యవిశేషము. ఇందలి తంత్రులను వ్రేళ్ళతో మీటుచు పలికించుచుందురు. వీణకు లాటిన్ భాషలో 'లైరా' యనియు, ఇంగ్లీషులో 'లైర్' అనియు నామము లున్నవి. ఉత్తర ఖగోళములో నీ ప్రాంతమున నక్షత్ర రూపముగల వీణను బహుదేశములలో ప్రాచీనులు చూచిరి. దానిని గూర్చి ఎన్నెన్నో కథలు గాథలు మొదలగునవి ప్రచురించిరి.

వీణెలరూపము లనేకవిధములుగా నుండును. ఏప్రాంతములో నెట్టివీణ వాడుకలోనుండునో ఆ రూపముగల వీణ చిత్రములనే అచటి వారు ఖగోళ దృశ్యములలో చిత్రించి గ్రంథస్థము చేసిరి. ఇంగ్లీషు వారి వీణె రూపము త్రివిక్రమ చిత్రములలో హంసకును, విష్ణునికిని మధ్య చూడనగును. నక్షత్రాత్మకమైన యీ వీణను ప్రశంసించునపుడు మన మీ దిగువ వ్రాసిన యంశముల నొక్కొక్కటిగా చర్చించి వివర

ములు తెలిసికోవలసియున్నది. అవేవియనగా: 1. తమ్మిపూవు వెలిమబ్బు (Ring Nebula), 2. చతుర్ముఖ బ్రహ్మ, 3. వీణ-సరస్వతి, 4. అభిజిత్-నక్షత్రము, 5. మింటిరొద (Cosmic Hiss), 6. వాణీ హిరణ్యగర్భుల వాహనము రాజహంస.

**తమ్మిపూ వెలిమబ్బు :**

మంత్రద్రష్టలగు వేదఋషులకు నీహారప్రావృతములట్లు మింట దోచు వెలిమబ్బులను గూర్చియు, విశ్వజగత్పరిణామ క్రమమున వాని ప్రాముఖ్యమును గూర్చియు బాగుగా తెలిసియుండెనని మనము చదివి యుంటిమి. విశ్వోత్పత్తివిధానమును పరిశీలించినపుడు ఆ వేధకులు ఉత్తరాకాశమున కానవచ్చు వెల్లమబ్బులలో ముఖ్యమైన యీ తమ్మిపూమబ్బును శ్రద్ధతో చూచిరి. ఇటీవల మెస్సయ్యరు కూడ యీ మబ్బును జాగ్రతగా శోధించియుండెను. అతడు తయారుచేసిన ఖగోళ దృశ్యము పట్టికలో యీ మబ్బు నెం 57 రు గా నమోదు చేసెను. దీని యాకారము గుండ్రమని యాతనికి స్ఫురించెను. గుండ్రముగా నున్నవాటిని ఉంగరముతో పోల్చుట సామాన్యము. కావున దీని కాతడు ఉంగరపు మబ్బు అని యర్థమువచ్చునట్లు Ring Nebula అని పేరు పెట్టెను. అప్పటినుండి దీనిని ఉంగరమబ్బు అనుటయే పరిపాటి యైనది. మెస్సయ్యర్ తరువాత జ్యోతిర్విద్యావిదులు పలువురు దీనిని శోధించి పెక్కు తేజఃపటములు తీసియుండిరి. ఈ చిత్రములలో మొదటిది సర్ జాన్ హెర్షెల్ దొరగారు తీసినది. నాలుగు అంగుళముల చిన్న టెలిస్కోపులో కనబడిన చిత్ర మగుటచేత ఇందు గుండ్రనిరూపమున చిన్నచిన్న చుక్కలు మాత్రము కనబడి యుండెను. తరువాత రాస్ (Rosse) ప్రభువు వారి పెద్ద టెలిస్కోపులో కనబడిన చిత్రములో అంగుళీయాకారము కనబడ లేదు. చిన్న టెలిస్కోపులో చూచినపుడు అందలి మధ్యభాగము

శ్యామలమైనట్లగపడును. రాస్‌గారి పెద్ద టెలిస్కోపులో చూచి నపుడు దీని మధ్య నలుపున్నట్లు గాక, తెల్లమబ్బునందలి ద్రవ్యము నిడుద చారలవలె మధ్యమధ్య కనపడుటచేత దృశ్య మొక్కటీరున గాక మెఱపుగల తెలుపు చారలతో కూడికొని యున్నట్లు తోచెను. మఱియు నీ దృశ్యపు వెలుపలి యంచును మించి ఏవేవో పైకి త్రోసి కొని వచ్చినట్లు కూడ కనబడెను. ఇక ఈ మధ్య ప్లాస్కెట్ (Plasket) దొరగారు తీసిన తేజఃపట ప్రతిబింబములో చూచినయెడల ఇందులో తేజస్సు అంతటను ఒకేవిధమున ప్రసరించినదనజనదు గుండ్రని దృశ్యము లనేకములు ఒకదానిపై నొకటి యెగయుచుమూసినట్లును, ఒకదానిపై నొకటియొడిసి క్రమ్ముకొనినట్లును కనబడును. మధ్య వ్యాసపు టంచుల కడ నీయుంగరము వల్చబడినట్లు గోచరించును. లోపలి భాగపు మధ్యలో గుల్లగాను, తేజస్సు మందముగాను కనబడును; కాని వెలుపలి యంచులు మాత్రము అంతకంటె తేజోవంతము లనక తప్పదు. తేజోమయమైన వాయుపదార్థ మిందు వ్యాపించియున్నదని భావింపనగును. కాంతి విభాజక యంత్రములో నీ మబ్బును పరిశీలించినపుడు కాంతిమంతము లైన రేఖలతో కూడిన చిత్రవర్ణ మగపడును గాన తేజోమయములైన వాయుపదార్థము లిందు చేరియున్నవని నిశ్చయింపవచ్చునని Bale దొరగారు వ్రాసిరి.

ఉత్తరాంశముల చర్చ ప్రారంభింపకపూర్వము నవీన వైజ్ఞానికులు సృష్టిపరిణామమును గూర్చి చేసిన సిద్ధాంతములను మరొకసారి స్మరింతము : ప్రళయము→అవ్యక్తావస్థ→చుక్కమబ్బు→చుక్క→జంటచుక్కలు→పెక్కుచుక్కలు→గ్రహాదులు. ఈ క్రమము మనమున నిడుకొని, శేషశాయిచిత్రమును పరిశీలింతము.

విష్ణుభగవానునికి పద్మనాభుడను నామము కలదు. పద్మనాభు డనగా నాభియందు పద్మము కలవాడు. పడమటివారు ఉంగరమువలె గుండ్రనైన యాకారముగల వెలిమబ్బు (Ring Nebula) అని దేనిని

తెలుపుచున్నారో ఆ గుండ్రని వెలిమబ్బురూపమునే మనవారు పద్మ మనిరి. ఈ దృశ్యమును ఉంగరమనుట కంటె పద్మమనుటే ఎంతో ఒప్పియుండును. అండవృత్తములట్లు పొడవు మిగిలిన వ్యాసముకల దగుటచేత "పొడవు మిగిలిన పొందమ్మిపూవు" అని శ్రీనాథుడు చేసిన వర్ణన దీనికి చక్కగా సరిపోవును. దీనిని "ఉద్దండ పద్మాతపత్రము" అనిగూడ శ్రీనాథుడు ప్రశంసించియున్నాడు. అనగా పెద్ద పద్మాకారముగల గొడుగని యర్థము. దీనినిగూర్చి ఋగ్వేదమేమి తెలుపు చున్నదో చూతము.

ఋ X 82-5, "పరో దివా పరఏవపృథివ్యా
పరోదేవేభి రసురై ర్య ద స్తి । కంస్విద్గర్భం ప్రథమం
దధ్ర ఆపో । యత్ర దేవాః సమపశ్యంతి విశ్వే ।"
X 82-6 తమిద్గర్భం ప్రథమం దధ్ర ఆపో
యత్ర దేవాః సమగచ్ఛంతి విశ్వే
అజస్య నాభా వధ్యేక మర్పితం
యస్మి న్విశ్వాని భువనాని తస్థుః॥

ఈ భూమ్యాకాశములకంటె ముందు, దేవాసురుల జన్మలకు పూర్వము ప్రళయ జలార్ణవముపై మొదట సృష్ట్యాదిని అంకురించిన మూలబీజమేది ? దేవతలందరు నొక్కచో నెందు చూడబడిరి ?

దేవతలందరు నెందు కూడియుండిరో ఆ బీజాంకురమును మొదట జలములు గ్రహించినవి. ఎవనికి జన్మము లేదో ఆ మహాత్ముని నాభికమలముపై నది నిలిచి స్థిరపడినది. విశ్వమునందలి భువనము లన్నియు నా మూలబీజాంకురమునుండియే ప్రాదుర్భవించినవి.

సృష్టినిగూర్చి ఋగ్వేదము తెలిపిన సంగతులివి. దేవతల నక్షత్ర రూపము లేర్పడక పూర్వమే, భూమ్యాకాశముల పుట్టుకకు పూర్వమే పరాత్పరుడగు విష్ణుభగవానుని నాభికమలమునుండి నీహారప్రావృతమా యనదగు తెల్ల మబ్బొకటి వెలువడి జలములపై తేలెను. అట్లు తేలి

యది స్థైర్యముగలిగి నిలిచెను. ఖగోళస్థలములగు విశ్వభువనముల బీజాంకురములం దిమిడియుండెను. పిమ్మట క్రమక్రమ పరిణామమునకులోనై చుక్కమబ్బులనుండి చుక్కలును, వానినుండి జంటచుక్కలును, జంట చుక్కలనుండి ఇతర భువనములు, గోళములు, గ్రహ ఉపగ్రహ, గ్రహ కణ, ధూమకేతు, మహోల్కాదులు ఒకదాని వెంబడి మరొకటియు నుత్పత్తి నొందినవి. ఇటీవల మహాద్భుతయంత్ర సాధనములతో బహు కాలము కృషి చేసిచేసి నవీనవైజ్ఞానికులు తెలిసికోగలిగిన సృష్టి పరిణామ క్రమమును, ఏ సాధనములచేతనో మహాఋషు లానాడు తెలిసికొన గలిగిరని స్థాపించుటకు పై మంత్రములు ప్రబల ప్రమాణములు.

## ఎప్సిలాన్‌లైరా :

పాశ్చాత్యదేశములలో జ్యోతిర్విజ్ఞానము పెంపొందుచుండునపుడు ఒక చుక్కల గుంపులో వేర్వేరు నక్షత్రములను ప్రత్యేక ప్రత్యేకముగా పోల్చి తెలిసికొనుటకుగాను, ఒకొక్క చుక్కకు గ్రీకు అక్షరములలో నొకొక్క అక్షరము గురుతుపెట్టి, ఆ యక్షరసంజ్ఞతో నా చుక్కను గూర్చి తెలుపుట పద్ధతియయ్యెను. గ్రీకు అక్షరముల సంఖ్య ఇరువదియారు. అందు మొదటిది ఆల్ఫా, రెండవది బీటా, మూడవది గామా, నాలుగవది డెల్టా, అయిదవది ఎప్సిలాన్. ఇవి నేటి ఇంగ్లీషు అక్షరములలో ఎ **A**, బి **B**, సి **C**, డి **D**, ఇ **E** లతో పోల్చదగినవి. ఒక గుంపులో మిక్కిలి తేజోవంతమైన నక్షత్రమును పడమటివారు 'ఆల్ఫా' యనియు, తరువాత తేజోవంతమని చెప్పదగిన దానిని 'బీటా' యనియు, ఆ తరువాతి దానిని 'గామా' యనియు ఇట్లు ఆ యా చుక్కలు వెలువఱచు తేజఃప్రమాణమునుబట్టి అక్షర సంజ్ఞ లేర్పఱచిరి. **Lyra** వీణామండలమునగల చుక్కలన్నిటిలో తేజో విషయమున నగ్రగణ్యమైన ఆల్ఫా చుక్కనే మనవారు 'అభిజిత్' అను

చున్నారు. దానిని గూర్చిన వివరములును ఆ నక్షత్రముయొక్క ఖగోళప్రాముఖ్యమును ఈ దిగువ చదువగలము.

తేజోవిషయమున వీణామండలములో నైదవదనదగు 'ఎప్సిలాన్' చుక్కనుగూర్చి మన మిపుడు తెలిసికోవలసియున్నది. ఈ తార ఆల్ఫాచుక్కకు పడమట కానవచ్చును. స్థూలదృష్టి కిది ఒక్క చుక్క వలెనే కనబడును. ఆవగింజవలె ఉత్తరాకాశమున మిణుకు మిణుకు మనుచుండును. మంచి శక్తిగల మానవ నేత్రమునకు సూక్ష్మముగా చూచినపు డిందు రెండు చుక్కలు కానరాగలవు. చిన్న టెలిస్కోపులో చూచినపు డిం దొక్కొక్క చుక్కలో రెండేసి జంటచుక్క లున్నవని స్పష్టమగును. జంటచుక్కల జతలని చెప్పతగిన యీనాల్గు చుక్కలును నవీన జ్యోతిర్విజ్ఞానమున మిక్కిలి ప్రాముఖ్యత గడించినవి. ఈ జాతి చుక్కలలో నివి బహు రమ్యమైనవి. **Woodward** దొరగారు వీని నిట్లు ప్రశంసించినారు : **"The celebrated double-double the finest object of its kind in all the Heavens——** ఈ జంట జతల చుక్కలు మిక్కిలి ప్రఖ్యాతములు. చుక్కల జతలలో నింత సొగసైన జతలు ఖగోళమంతట కలయవెదకినను కానరావు."

జంటతారలనగా నేమో మనము బాగుగా తెలిసికొనుటముఖ్యము. చంద్రుడు భూమిచుట్టు తిరుగునుగాని భూమి చంద్రునిచుట్టు తిరుగదు. చంద్రగోళము ఒక ఉపగ్రహమై భూమిచుట్టు తిరుగును. జంటతారలట్లుకాదు. అందున్న రెండు చుక్కలును ఒకదానిచుట్టు నొకటి తిరుగుచుండును. జంటతారల జతలో నంతకంటె విశేష మున్నది. ఆ విశేషమును కూడ ఇపుడే తెలిసికోగలము.

చతుర్ముఖ బ్రహ్మ :

ఉంగరమువలె గుండ్రనై, పద్మాకృతి గలిగిన తెల్లమబ్బొకటి ఖగోళ వీణామండలమున కలదనియు దానిపైని జంటచుక్కల జతలు

రెండున్నవనియు విశదమైనంతలో మన భావములు చతుర్ముఖుడును, పద్మాసనుడు నగు బ్రహ్మపై బోవుట సహజము. బ్రహ్మ సృష్టికర్త, చతుర్ముఖుడు. ఇతనికి ముఖములు నాలు గెట్లయ్యెనో భాగవతమున నిట్లు తెలుపబడినది : (చూ. భాగ-III 8-16).

"తస్యాం సచాంభోరుహకర్ణికాయా మేవస్థితో లోక మపశ్యమానః।పరిక్రమన్వ్యోమ్ని వివృత్తనేత్రః చత్వారిలేభేనుదిశమ్ముఖానిః"

పరాత్పరుని నాభీకమలమునుండి వెలువడినవాడై బ్రహ్మ చుట్టును ఎక్కడను ఏలోకమును కనబడక నలుదిక్కులను పరికించునప్పుడు నాలుగు దిక్కులను నాలుగు ముఖములు మొలిచెను బ్రహ్మ చతుర్ముఖుడగుటకు భాగవతపురాణము తెలిపిన కారణ మిది. నాలుగు ముఖము లెట్లయిన నేర్పడి యుండవచ్చును. కాని ఈ ముఖము లెప్పుడును తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తరములనెడి నాలుగు దిక్కులను చూపుచు నట్లే యున్నవా ? లేక మారుచున్నవా ? అనునది ప్రశ్న. దివంగతులైన రావుబహద్దర్ కందుకూరి వీరేశలింగం పంతులుగారు మన దేవతలను, వారొనర్చినట్లు పురాణములలో వర్ణింపబడిన కార్యములను విమర్శించుచు హేళనగా నెన్నో ఫార్సులు రచించిరి. అందు నారద సందర్శన మొకటి బ్రహ్మలోకమునుండి నారదులవారి వేషముతో ముప్పది సంవత్సరముల వయస్సుగల యువకు డొకడు దిగినాడట ! అతనిం జుట్టుముట్టి పౌరులు పలువురు బ్రహ్మగారి నాలుగుముఖము లే తీరుననున్నవో ప్రశ్నించిరి. ఆత డేవో అవకతవక జవాబులు చెప్పుచు, తుదకు అవెట్లున్నవో తనకు జ్ఞాపకము రాలేదనియు, ఈమారు బ్రహ్మలోకమునకు వెళ్ళినపుడు జాగ్రతగా కనిపెట్టి చెప్పెదననియు తెలియపలికి చల్లగా దాటిపోవును. ఆ శిరములు నాలుగు నొక్కవరుస నున్నవా లేక రెం డొక ప్రక్క, మరి రెండు మరొక ప్రక్క నున్నవా, లేక మూడు ఒకప్రక్క నాల్గవది మరొకప్రక్క నున్నదా ? లేక కొన్ని మీదను కొన్ని క్రిందను ఉన్నవా ? అని కొంటెగా ప్రశ్నింప వచ్చును. దానికి జావాబు G. F.

Chambers దొరగారు వ్రాసిన (Story of the stars) నక్షత్ర కథనగ్రంథము 71 పుటలో కనబడ గలదు. ఆ దొరగారికి వీరేశలింగము గారెవరో తెలియదు. వారు చేసిన పృచ్ఛలు కూడ అతనికి తెలియవు. కాని ఎప్సిలాన్ లైరా చుక్కలను గూర్చి ఆయన వ్రాసిన వివరము లలో బ్రహ్మదేవుని చతుర్ముఖములు నెట్లుండుట సాధ్యమో తెలుప బడినది. వీణామండలములో 'ఎప్సిలాన్' అక్షర సంజ్ఞగల చుక్కలో నాలుగు చుక్కలున్నవి. అవి రెండు జతలు. ఒకొక్క జతలో రెండేసి జంటచుక్క లున్నవి. ఒక జంటలో రెండు చుక్కలును ఒకదాని చుట్టు మరొకటి పరిభ్రమించుచుండును. ఒక జతలో ప్రతి చుక్క చుట్టును రెండవచుక్క తిరిగి వచ్చుచుండును. అంతేకాదు. జంటలుకూడ నొక దానిచుట్టు నొకటి తిరిగివచ్చుచుండును. ఏ చుక్కకును స్థిరత్వములేదు. దానిచుట్టు నిది దీనిచుట్టు నది తిరుగుచుండుటేగాక, ప్రతిజతయు రెండవ జతచుట్టు పరిభ్రమించుచుండును. ఏ క్షణములోనైన నే చుక్క యొక్క స్థానమైనను తక్కిన మూడు చుక్కల స్థానమును బట్టి నిర్ణ యింపవలసియుండును. ఒకప్పుడు నాలుగును ఒక పంక్తిలో నుండ తటస్థించును. ఒకప్పుడు మూడు ఒకప్రక్కను, ఒకచుక్క ఒకప్రక్కను ఉండవచ్చును, ఒకప్పుడు రెండొక ప్రక్కను, మరిరెండు మరొక ప్రక్కను ఉండవచ్చును; ఒకప్పుడు ఒకటి మీదను తక్కినవి క్రిందను నుండవచ్చును. ఎన్నివిధములైన శిరస్సమ్మేళనములైనను సాధ్యము కాగలవు. ఇది హేళన చేయవలసిన విషయముకాదు. జ్యోతిశ్శాస్త్ర సత్యములను గ్రహించి, జన సామాన్యమునకు బోధపడునట్లు కథలు గాథలు గూర్చి పురాణములు రచించిన పురాణ కర్తలు వంద్యులుగాని నింద్యులుగారు. వారి నవమానింపనెంచుట మన కవమానకరము గాని గౌరవహేతువు కాజాలదని నా విన్నపము.

## విశ్వోత్పత్తి వివరములు :

మనకును, మనతో పాటు జీవించుచున్న కోటానకోట్లు ఇతర ప్రాణులకును నివాసస్థానమైన యీ భూగోళమును, భూగోళమే గాక బుధ, శుక్ర, కుజ, గురు, శనైశ్చరాదులగు ననేక గ్రహగోళయుతమైన సూర్య కుటుంబమును ఇప్పుడున్న స్థితికి వచ్చుటకు ముందు వీని కన్నిటికిని మూలబీజమైన ఒకానొక ఆవిరిమబ్బు, బహుయుగముల కాలము తనలో తాను తిరుగుకొనుచు, ఎన్నెన్నో మార్పులు బొందుచు, వాయువు ద్రవమై, ద్రవము ఘనీభవించి గట్టిపడుచు నిప్పటి పరిణత స్థితికి వచ్చియున్నది.

నీహారప్రాకృతమని తోచు తెల్లమబ్బులో నేమున్నది? పరిమితి నిర్ణయింపరానంత మబ్బు! అందున్నది ఆవిరివంటి పదార్థము; వాయు పదార్థము. ఆ వాయువు వెలుపల చల్లగా నున్నను, లోపలమాత్ర మతి వేడిగా మండును. అది నిశ్చలము కాదు. గిర్రుమని తనలో తాను దిరుగుకొనుచుండును. భ్రమించుచున్నకొలది వేడి యెక్కువగును. వేడి ఎక్కువగు కొలది యుద్రేకము హెచ్చుచుండును. ఇట్లు ఉష్ణము నుద్రేకమును క్రమక్రమ విజృంభమాణములగుచు రాగా ఘోష గర్జారావములతో తీవ్రత దీపించుచుండును. భ్రమణ వేగముతో ఉష్ణోగ్రత అతిశయించును. వీనితో ఆవిరి సాంద్రత వృద్ధిపొందుచుండును. ఇట్లు కొన్నికోట్ల సంవత్సరములు జరుగుచు రాగా రాగా తుదకు మహోజ్జ్వల ప్రభలతో జ్వాలారూపమై మండుచున్న సాంద్ర వాయు పదార్థముగా తయారగును. ఒకప్పుడు ఆవిరిరూపమున పలుచగా పొగ మంచువలె నుండిన వాయుపదార్థము ఉగ్రార్చులతో మెఱయు నక్షత్రమగును. సృష్టిలో ఒక సూర్యుని జన్మక్రమమిట్లుండును. శ్వేతోష్ణ భ్రాజితమై జ్వాలాజాజ్వల్యమాన బహువిధ వాయుపదార్థ ప్రపూరితమై మహాపరిమాణముగలిగి దుర్నిరీక్ష్య తేజోరాశియై నభమున వెలుగొందు నొక సూర్యగోళమిట్లుద్భవమగుచున్నది. ఇట్టి సూర్యగోళమేర్పడుటకు

అవసరమైన పదార్థజాలము యొక్క బీజాంకురములన్నియు తొలి యుగములలో పొగమంచువలె మింట తేలియాడిన యావిరి మబ్బులో నుండినవి. "యస్మిన్విశ్వాని భువనానితస్థుః" అనుఋగ్వేదమంత్రముపైని వ్రాసిన సంగతులనే సంగ్రహముగా తెలుపుచున్నది. పదునొకం డక్షరములు మాత్రము గల్గి చూచుటకు చిన్నదైనను ఈ వేదమంత్రములో బ్రహ్మాండసృష్టి యిమిడియున్నది. సృష్టిక్రమము వేదములో పలుతావులందు ఉగ్గడింపబడినది. ఈ జిజ్ఞాసతో కాలము గడిపిన వైజ్ఞానికులనేకులు బహుగ్రంథములు రచించినారు. భూమి యొక్క పుట్టుపూర్వోత్తరము లనుగూర్చి చక్కటి గ్రంథము రచించిన మేక్మిల్లన్ (Macmillan) దొరగారు ఈ మంత్రభావమును స్వతంత్రముగా పెంపొందించి యిట్లు వ్రాసినారు :- ఇట్లుద్భవించిన సూర్యగోళ మట్లే యుండిపోక కొన్ని శకలములైనది. ఆ శకలములు కూడా గోళాకారముగలవై తమలో తాము భ్రమించుచు సూర్యుని చుట్టు పరిభ్రమించుచున్నవి. ఇట్లు పరిభ్రమించుటలో వాని యుష్ణోగ్రత మందము కాజొచ్చినది. ఉష్ణము మందమగుటతో నందు చేరియున్న ధాతువుల స్వభావము కూడ మారుచు వచ్చెను. తొలియుగముల వాయుపదార్థము చల్లబడుచు కొంత గాలియైనది ; కొంత నీరైనది. నీటిలో లీనమైయుండిన పదార్థజాలము క్రమముగాగట్టిపడి స్ఫటికీభవించి, చెఱుకురసమునుండి కలకండ గడ్డలు వేరైనట్లు మన భూగోళ ఘనపదార్థములు వెలువడి వేరైనవి. క్రమముగా చాల వస్తువులు గట్టిపడినవి. భూమి. రాళ్లు, శిలామయములైన కొండలు, ఓషధులు, చెట్లు చేమలు, మహావృక్షములు- ఇవన్నియు నొకప్పు డాకాశమున మంచు టావిరివలె తేలిపోయిన తొలిమబ్బు నుండి యేర్పడినవే. అగాధసలిలములతో సముద్రములు, ఉన్నతశిఖరములతో మహాపర్వతములు నేర్పడి యట్లే నిలిచినవి. వానలు రేగినవి, ఉప్పెనలు ఉద్రేకించినవి. తీరభూములను కోసివైచి జలము నేలకొక వికృత రూపమును తెచ్చిపెట్టెను. హిమపాత, వర్ష పాత, వాయు

ప్రచార, జలచారములచేత రమ్యములగు పీఠభూములు, చక్కని పర్వతసీమలు, సౌందర్యమున కాలవాలములవదగు లోయలు, చూడ సొంపగు వగ్రభూములు. ఇవి యవి యననేల? మనము చూచి యానందింపతగిన ప్రకృతి సౌందర్య విశేషములతో నొప్పు సమస్త భూగోళ వైచిత్ర్యములను చాలకాలము క్రిందట భూమి గట్టిపడినప్పటి నుండియు నేర్పడ నారంభించినవి.

ఈనాటి రాజకీయ పరిస్థితులను అల్లకల్లోలము చేయుచున్న రాజ్యాంగవేత్తలు, జగన్నిర్మూలనమునకు కారణములగు మారణసాధనములతో మహాసైన్యములు, శ్రీమంతుల యార్భాటములకు ప్రతిక్రియగా నమ్మెలసాగించు కష్టజీవుల నాయకులు, ఎట్టి కష్టములనైనను ఓపికతో భరించు నమాయిక స్త్రీరత్నములు, గొఱ్ఱెలు, మేకలు, అవులు, గేదెలు, దుక్కిటి పశువులు, వ్యవసాయపు భూములు, భూములలో పండెడు నవధాన్యములు, ఉక్కుకీములవంటి యోధులు సముద్రములపై తేలుచున్న పట్టణములవంటి గొప్పయోడలు ఆ యోడలంగట్టి యిట్టె ముంచివైచు టార్పెడో బోట్లు, అధికారుల స్వార్థము, వారొనరించు పాపములు, పాపబాధలకోర్వక ఉసూరుమనుచున్న జనసామాన్యము, లోకమున రేగుచున్న దౌర్జన్యము, కన్నీళ్లు, మన కనుల యెదుట కానవచ్చు నీ పాపిష్టి లోకమంతయు నొకప్పుడాకాశమున తేలియాడుచుండిన ఆవిరిమబ్బునుండియే పుట్టుకొనివచ్చినవి. వెనుక నుండినది, ఇటనున్నది, ఇటుపై నుండబోవునది సమస్తమును, ఆ యావిరి మేఘమునుండియే సంభవించినవి, సంభవించుచున్నవి, సంభవింపగలవు.

"యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః" అనెడి వేదమంత్రమునకు పై వాక్యములు సోదాహరణమైన వ్యాఖ్యానము. ఈ సృష్టి పరిణామమునుగూర్చిన కొన్ని వేదవాక్కులను, బ్రాహ్మణారణ్యకాది వాఙ్మయ వాక్యములను సంగ్రహముగా తెలిసికొందము (చూ. వేదభూమి.

అ॥ వేం॥ చలపతిరావుగారు 4-5 పు.) తై-సం. 7-1-5-1. ఆపోవా ఇద మగ్రే సలిలమాసీత్. మున్ముందు ఇదియంతయు జలమయమై యుండెను. వాయు పురాణము. ౬-౧౧ ఆపోహ్యగ్రే సమౌభవన్ నష్టేగ్నే పృథివీతలే.

తై॥ బ్రా॥ 2-2-9-1-4 : తస్మాత్తపవాద్ధూమో అజాయత— అగ్నిరజాయత—జ్యోతిరజాయత—తదభ్రమివ సమహన్యత। తద్వస్తి మభినత్ । స సముద్రో అభవత్ యదప్స్వవాపద్యత సా పృథివ్యభవత్.

ఋ. X 97-1: యా ఓషధీః పూర్వా జాతా దేవేభ్యస్త్రియుగం పురా ॥ ఓషధులు దేవతలకు మూడుయుగములు మున్ముందే ప్రభ వించినవి మనదేశమున నాటాలగోపాలమునకు తెలిసిన దశావతార క్రమము సృష్టివికాస విధానమునే సూచించుచున్నది. భూమి జల మయమై యున్నవాడు అందు మత్స్యాదులగు సలిలజీవులే ఉండినవి. జలములనుండి స్థలభాగము లేర్పడునంతలో జలమందేగాక స్థలమందు గూడ మసలుచు జీవింపగల కూర్మజాతి జీవు లేర్పడినవి. పిమ్మట కేవ లము స్థలముమీదనే బ్రదుకగల వరాహాదిజీవులు పుట్టి పెరుగజొచ్చినవి.

తై. ఆరణ్యకము 1-23 3.4 యో రసః సో అపాం అంతరతః కూర్మం భూతగ్ం సర్పంతం.

తై. బ్రా॥ 1-1- 3 5 స వరాహం రూపం కృత్వోపన్య మజ్జత్.

భూగోళ మిట్లు జలార్ణవమైయున్న తటి మున్నెందు మునిగి యుండిన పర్వతములు తమ కుదుళ్లు గట్టిపడనందున కదలుచుండి తరువాత నీ రింకుకొలది పైకి తలెత్తి క్రమముగా భూమిలో బిగింపబడి కదలక స్థిరముగా నిలిచినవి. ఇందుకు వేదప్రమాణములు ఈ దిగువ తెలియనగును.

ఋ-II-17-5 "ప్రాచీనాన్ పర్వతా నదృంహత్"

ఋ-II-12-2 "యః పృథివీం వ్యథమానామదృంహత్
యః పర్వతాన్ ప్రకుపితా నరమ్ణాత్."

కదలుచున్న కొండల విరిచెను ; పొరలుచున్న భూమిని గట్టి పఱచెను ; వడకుచున్న కొండలను శాంతపఱచెను.

ఇట్లు ప్రళయానంతరమున తేలియాడుచుండిన తొలిమబ్బులలో విశ్వమండలి సమస్త భువనోత్పత్తికిని, పరిణామమునకును కారణములైన బీజాంకురములుండి, కాలగతితో సక్రమముగా మార్పులనెందుచు నీ నాడున్న స్థితికి వచ్చెనని నిరూపించుటకు ప్రాచీన నవీన రచనల నుండియు, వైజ్ఞానికజిజ్ఞాసువుల వ్రాతలనుండియు ప్రమాణములను గ్రహించి సంగ్రహముగా చర్చించి తెలిసికొంటిమి. పరాత్పరుని నాభి నుండి వెడలిన తమ్మిపూరూపమునుండి అన్యోన్యాశ్రయముగల నక్షత్ర చతుష్టయము వెడలెనని కూడ తెలిసికొంటిమి. ఈ నాల్గు నక్షత్రములను మనపూర్వులు బ్రహ్మదేవుని నాలుగు శిరస్సు లనిరి. బ్రహ్మ పద్మాసనుడు ; చతుర్ముఖుడు ; సృష్టికర్త యనుటకు ప్రమాణము లమరినవి. భాగ-II-221 ఆంధ్ర భాగవతము :

సీ. ఎవ్వని నాభియం దెల్లలోకాంగ
సంస్థానకారణ పంకజంబు పొడమె
అం దుదయించి సర్వావయవస్ఫూర్తి
దనరారునట్టి పితామహుండు గడగి

ఖగోళదృశ్యముల ననుసరించి బ్రహ్మకు పద్మాసనము, చతుర్ముఖములు గలవని వర్ణించిన ప్రాచీన కవిరాజులు. ఆ సృష్టికర్తకు సర్వావయ సంపూర్తితో, వీణాపాణి, వాణిని రాణింపజేయుటయు, ఆ వాణీహిరణ్యగర్భ మిథునమునకు ప్రక్కనే ఉన్న హంసను వాహనము గావించుటయు మిగుల సులభసాధ్యము. మన మిపుడు బ్రహ్మ రాణి, వాణింగూర్చి ముందు చదువుదుము.

**వీణాపాణి, సరస్వతి :**

సృష్టికర్తయగు బ్రహ్మకు రాణియగు సరస్వతీదేవి ఎల్లలోకములకు మాత. సకలవిద్యాస్వరూపిణి, సంగీత, సాహిత్య, స్తన్యామృత

ప్రదానముచేసి మానవశిశువులం దనిపి పెంచు విశ్వజనని. సంగీతవిద్యా నిధి యగు సరస్వతిని కవిరాజులెందరో ఎన్నెన్ని విధములనో వర్ణించిరి. కాని శృంగారనైషధము (I-4) లో శ్రీనాథ కవిసార్వభౌముడు చేసిన సరస్వతి వర్ణనతో తదితరములు సాటి రాజాలవు.

సీ. సింహాసనము చారుసితపుండరీకంబు
చెలికత్తె చెలువారు పలుకు చిలుక
శృంగారకుసుమంబు చిన్ని చుక్కలరాజు
పసిడి కిన్నెర వీణ పలుకుతోడు
నలువ నెమ్మోము దమ్ములు కేళి గృహములు
తళుకు టద్దంబు సత్కవుల మనము
వేదాది విద్యలు విహారణస్థలములు
చక్కని రాయంచ యెక్కిరింత
యెపుడు నేదేవి కాదేవి యిందుకుంద
చంద్ర చందన మందార సారవర్ణ
శారదాదేవి మామక స్వాంతవీథి
నిండువేడుక విహరించుచుండుగాక !

ఖగోళదృష్ట్యా తమ్మిపూవెలిమబ్బు (Ring Nebula) బ్రహ్మకొక్కనికేగాక, అతని రాణి వాణీదేవికిగూడ సింహాసన మనతగి యున్నది. ఖగోళమున వీణామండలమన నొప్పు మేటిచుక్కల గుంపుమ ఆమెచేత నలరారెడి పసిడి కిన్నెర వీణ యని వర్ణించుట మిగుల హృద్యము. వేదములు నాలుగును బ్రహ్మముఖములని కవిసమయము. బ్రహ్మముఖములామె కేళికాగృహములు, విహారణస్థలములును నగును. రాజహంస వాహనము, ఆమె ఖావాంబరవీథి విశ్రుతవిహారిణి కావునను సత్కవుల హృదయములుకూడ నట్టివే కావునను, వారి హృదయ దర్పణములం దామె ప్రతిబింబపు తళుకులు గోచరించుటకూడ సమంజసమే. ఇక చిలుకను, చంద్రునికూడ ఖగోళదృష్ట్యా సరస్వతితో

మనము సందర్శించవలసియున్నది. అదికూడ సులభమే. ఉత్తరాకాశమున సరస్వతీ-వీణామండలము లే రేఖలపై కానవచ్చునో ఆ రేఖలపై నే దక్షిణాకాశమున ధనుస్సురాశి చుక్కలు గూడ కనబడును. మూల పూర్వాషాఢలను ఉత్తరాషాఢ ఒకపాదమును కూడిన నది ధనుస్సు రాశి. ధన్వి మన్మథుడు. మన్మథుని వాహనము చిలుక. సరస్వతి నక్షత్రములతోనే చిలుక చుక్కలుకూడ దక్షిణాకాశమున కానరాగలవు. కావున సరస్వతితో చిలుకకు అవినాభావ సంబంధము.

సరస్వతీపూజ ఆశ్వయుజ శుక్లపక్షములో మొదటి తొమ్మిది రోజులును మనదేశములో చేయుచుందురు. తొమ్మిదిరోజులు గాకున్న, చంద్రుడు మూలనక్షత్రముతో కూడియున్న సప్తమినుండి యైనను జరుపుట ఆచారమై యున్నది. ఆ దినములలో చంద్రుడు సరస్వతి చుక్కలతో మధ్యాహ్న సమరేఖలపై ధనుస్సు చుక్కలతో దక్షిణమున మెఱయుచు, పాలసముద్రము మీదుగా ప్రతిబింబించి సరస్వతితో కాన వచ్చును. కాబట్టి చుక్కల రాజగు చంద్రుని, మన్మథునికి వాహనమగు చిలుకనుకూడ సరస్వతితో వర్ణింపనై నది.

సంస్కృతాంధ్ర కవు లందరును సకలవిద్యా స్వరూపిణి యగు సరస్వతిని స్తుతించి కావ్యరచనకు గడంగుచుందురు. ఋగ్వేదమునందు సరస్వతి యిట్లు నుతించబడినది—

ఋ-I-3-11 : "చోదయిత్రీ సూనృతానాం చేతంతి
సుమతీనాం యజ్ఞం దధే సరస్వతీ."

హృద్యములు, సత్యభూషితములునైన గీతములను పలికించు నంబ! మనోజ్ఞరచనల ననుగ్రహించు తల్లి! సరస్వతీ! మా పూజల నంగీకరింపుము.

ఋ-I-3-12 : "ధియో విశ్వ విరాజతి."

ఉత్కృష్టభావవికాసముతో నా తల్లి తన కటాక్షదీప్తుల మాపై బఱపి యుత్తేజము నొందజేయును గాక!

శ్రీమద్రామాయణ రచన కుపక్రమించునపుడు వాల్మీకికి బ్రహ్మ ప్రత్యక్షమై ఇట్లనెను :

ఉ. "జానుగ నీ ముఖాబ్జమున శారద యున్నది నా యనుజ్ఞ వి
జ్ఞానముతోడ మున్ను సురసంయమి చెప్పిన వాక్యపద్ధతిన్
సూనృత భావనార్థముల శ్లోక నిబద్ధముగా కవిత్వను
శ్రీ నొగి విస్తరాంచితగ జెప్పుము రామకథాప్రపంచమున్."

ఇక భగవద్గీత శ్రద్ధాత్రయవిభాగ యోగమున వాఙ్మయ తపస్సు ఇట్లు నిర్వహింపబడినది.

"అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచ యత్। స్వాధ్యాయాభ్యసనంచైవ వాఙ్మయం తపఉచ్యతే." ఉద్వేగకరముగాని సత్యముతో కూడుకొని, ప్రియము హితమునై, వేదాభ్యాస సహితమైన తపస్సు వాఙ్మయ తపస్సు. ఈ లక్షణములుగల వాక్యరచనలతో సరస్వతిని పూజించుట వాఙ్మయ తపస్సు.

ఇటీవలి సంస్కృతకవులలో దండి మహాకవి సరస్వతిని "సర్వశుక్లా సరస్వతి" అని ప్రశంసించి యున్నాడు. సరస్వతీదేవికిని బ్రహ్మకును గూడ వాహనమైన రాజహంసనుగూర్చి చదువునపుడు సరస్వతీదేవిని గూర్చి మరికొన్ని వివరములను చదువుదము. ప్రస్తుతము పాశ్చాత్య దేశములవారు వీణనుగూర్చియు, వీణాపాణిని గూర్చియు వ్రాసిన సంగతులు కొన్ని తెలిసికొందము.

గ్రీకు లీనక్షత్ర వీణనుగూర్చి కొన్ని గాథలల్లిరి. ఆర్ఫియస్ (Orpheus) అను మహాగాయకుడు వీణెమీటుచు సంగీతము పాడినపుడు ఆ పాటకు మానవులును, మృగపక్షివృక్షాదులేగాక సముద్రపు కెరటములుగూడ స్తంభించి యచేతనములయ్యెడివట! ఈ వీణెను మీటి హెర్క్యులీస్ (Hercules) యోధుడచటి పక్షులను బెదరించెనట ! "ఈ వీణెకు తంత్రులంగూర్చి సరిచేసినంతలో".అది యద్భుతముగా పలుకును. కాని యా వీణానిక్వాణము పుణ్యాత్ముల చెవులకు మాత్రము

వినబడును. పాపుల చెవుల కా గానము వినరాదు." అని లోవెల్ కవి వివరించెను.

లాంగ్ ఫెల్లో (Longfellow) అను నమెరికాకవి ఈ వీణనిట్లు కీర్తించెను: "జ్యోతిర్లోకమున నీ వీణెను చూచినాను. వాయుసంపర్క మాత్రముచేత దాని తంత్రులు శ్రుతివేయును. దానిమెట్లు జ్యోతిర్మయములై హంసతాళను విధమున తేజరిల్లుచుండును. ఈజియన్ సముద్ర మధ్య సామియన్ ద్వీపమునందు మరుత్సంభవుడు ఈలియన్ చేతుల నుండి ఈ వీణె ఏడు ఆవరణములు దాటుకొని నక్షత్రమండలము చేరుట కనులార చూచినాను" అని వర్ణించెను.

టెన్నిసన్ (Tennyson) మహాకవి ఈ వీణెను గూర్చి యిట్లు వ్రాసెను : "నటరాజు, కాలపురుషుడు జగతిపై పాదము మోపినాడు. నాట్య మాడునపుడు ఆ పాద విన్యాసాఘాత గంభీర నినాద లయతాళ ములతో శ్రుతి మేళవించుచు, నిరంతర మఖిస్వరము గావించు వీణా రత్న మిది."

ఖగోళమునుండి వెలువడుచు విశ్వవ్యాప్తి గనుచున్న యీ దివ్యగానమును గూర్చి ఆంగ్ల కవిరాజు షేక్స్పియర్ మహాకవి రచించిన వాక్యములతో నీ చర్చ ముగింతము. "నవరత్నముల వలె ఖగోళ మున మెఱసెడి జ్యోతిర్గోళములు సంఖ్యాతీతములై యున్నవి. అం దొక్కదానికిని స్థైర్యములేదు. ప్రతిగోళమును చలించుచున్నది. తన మార్గము ననుసరించి పోవుచున్నను నిశ్శబ్ద సంచారముచేయు గోళము అందొక్కటియులేదు. విమల గాంధర్వ విద్యాప్రశావము గల దేవ కాంతలవలెనే ప్రతి గోళమును మధురగీతము లాలాపించుచు సంచ రించుచుండును. 'ఆ గోళముల నుండి వెలువడు సంగీతము మనకు వినబడదేమి' అని ప్రశ్నించుట సహజము. మట్టిలో బుట్టి, మట్టిలో బెరిగిన మానవుల చవుటి చెవుల కా దివ్యగీతములు శ్రోత్ర గోచరము కాజాలవు".

విశ్వమునందు గల వివిధ గోళముల నుండి వెడలు మధుర గీత
[redacted]

ముగా తెలియవచ్చినవి. 1. నక్షత్రములు గొప్ప సూర్యగోళములు, సూర్యుడొక చిన్న నక్షత్రము. 2. ప్రతినక్షత్రమునకు స్వకీయమైన గమనవిధానమొకటి ఏర్పడియున్నది. కాబట్టి మన సూర్యునకు గూడ ప్రత్యేకముగా గమనవిధానము ఉన్నది. తా నా మార్గమునబోవుచు, తన కుటుంబమునందున్న గ్రహగోళాదులను తనవెంట గొనుచు, మన సూర్యుడు సకుటుంబ సపరివారసహితముగా తరలిపోవుచున్నాడు. ఉత్తరాకాశమున వెలుగొందు నొకానొక లక్ష్యమును చేరవలయు ననియే సూర్యు డిట్లు సకుటుంబముగా సత్వరుడై పోవుచున్నాడు. ఆ లక్ష్యమేది ? సూర్యుడు తుదకు చేరుకోవలసిన గమ్యస్థానము ఖగోళ మున నెందున్నది ?

మనకు విష్ణుని పరమపదమునందును, ఆ పరమపద సన్నిధాన మునగల వీణామండలమునందును ఇహపరసాధనమైన గొప్ప ప్రయోజన మున్నది. వేద ఋషులును, పురాణకర్తలును, పోతనాదిమహాకవులును విష్ణునిగూర్చి గొప్పగా వర్ణించిరనుటయేకాదు; వాణీహిరణ్యగర్భులం గూర్చి ఘనముగా గాథ లల్లిరనుటేకాదు. ఆ కవనములును గాథలును వినుట కెంతో సొంపుగానుండి, ఆబాలగోపాలమునకు ననుదినము పఠింపతగిన ఆకర్షణ, రసోత్పత్తి, మాధుర్యము వానిలో తొణుకు చుండుట నిక్కువమనియే గాథ. ఆ గాథా చమత్కారముల కలరి, కావ్యరసాస్వాదనమున కొఱకు మాత్రము మనము వానిం జదువుట లేదు. ఇహపరసాధనముగా మనము వానిం జదువుచున్నాము. మనము భూగోళ వాస్తవ్యులము. మన భవిష్యత్తు, మన భావి గతులు భూగోళపుగతితోడివే. భూమి సూర్యునిచుట్టు పరిభ్రమించుచున్నది. సూర్యు డిచ్చు తేజోష్ణ విద్యుత్కాంత శక్తులతో మనలను పోషించి రక్షించుచున్నది. మనకు భూగోళము తల్లి; భూగోళము సూర్యుని కొలిచి తిరుగుచు మనల పోషించుచున్నది. మనకు భూగోళ సూర్య గోళములతో నవినాభావ సంబంధమున్నది. కావున భూగోళ సూర్య

గోళముల కే గతి కలదో మనకును తుద కదియే గతి. సూర్యునికి వీణామండలమే పరమగతి యని జ్యోతిర్విదులు నిశ్చయించినారు. అందున్న అభిజిన్నక్షత్రము చెంతకే సూర్యుడు వెడలుచున్నాడనియు అభిజిన్నక్షత్రమే ప్రస్తుతము సూర్యగోళమునకు అంత్యమైన గమ్యస్థానమనియు జ్యోతిశ్శాస్త్రవేత్తలు నిర్ధారణచేసినారు. అంతకుముందు సర్ విలియమ్ హెర్షెల్ దొరగారు అభిజిన్నక్షత్రమునకు దిగువనున్న తమ్మిపూమబ్బునకు ప్రాదుర్భవస్థానమైన విష్ణునాభిస్థానము (దీనినే పడమటివారు గ్రీకు అక్షర సంజ్ఞతో 'లాంబ్డా హెర్క్యులిస్' అందురు) సూర్యుని గమ్యస్థానమని తెలిపియుండెను. కాబట్టి భూగోళ సూర్య గోళములకే పరమగతియైన విష్ణు-వీణామండలము మనకుమతదృష్టిచేత కూడ పరమపవిత్రమై, పూజ్యమైన పుణ్యస్థానమై, ఇహపరములకు పరమగతి యగుట సహజము. ఇంతటి ప్రాముఖ్య మీ మండలమునకు ఉండుట కనిపెట్టి మహాధీయులగు వేదఋషులు విష్ణుని పరమపద విశేషములను గూర్చి ఆనాడే ఎలుగెత్తి ప్రవచించిరి.

ఇటీవలి వైజ్ఞానికు లీ మర్మము నెట్లు తెలిసికొనిరో ఛేంబర్సు (G F. Chambers) దొరగారు రచించిన 'నక్షత్ర కథన' మనెడి గ్రంథమునందలి 87 వ పుటలో వివరించిరి.

ఖగోళ వేధకులు నక్షత్రములను సూక్ష్మముగా పరిశీలించి చూచినకొలది నవి యొకచోట స్థిరముగా నుండునవి కావనియు, ప్రతి నక్షత్రమునకును స్వకీయము, స్వతస్సిద్ధమునైన యొక గమనము కలదనియు, ఆ గమన విధానము ననుసరించి యాచుక్క యేదో ఒక దిక్కునకు వెడలుచుండుననియు విస్పష్టమైనది.

ప్రతినక్షత్రమునకును స్వకీయగమనము (Proper motion) కలిగి యుండుటవలన మనకు ప్రయోజనకరమై ముఖ్యమైన పర్యవసానమేమైన తేలునా ? అను జిజ్ఞాసతో సర్ విలియమ్ హెర్షెల్ దొర 1788 సంవత్సరములో నక్షత్రముల స్వకీయగమన విధానమును సూక్ష్మ

ముగా పరిశీలించి ఈ గమన విధానములను వివిధవర్గములక్రింద విభజించవచ్చునేమో! విభజించి వీనింగూర్చి సూత్రప్రాయముగా నేమయిన నిర్వచింప వచ్చునేమో! యని యత్నించి చూచెను. ఇట్లు శోధించి చూచుచు రాగా (Hercules)హారి కులేశుడగు విష్ణుని పరమ పదమునగల ఒకానొక బిందువువైపు చుక్కలు జరుగుచున్నట్లు అతనికి విశదము కాజొచ్చెను. ఆ కారణముచేత సూర్యకుటుంబ మంతయు నా బిందువునే చేరబోవుచున్నదని అతడూహించెను. అట్లూహించుట యెట్లు సాధ్యమగునో విమర్శించి చూతము.

మనము మద్రాసు సెంట్రల్ స్టేషనులో మెయిలుబండి నెక్కి ఉత్తరాభిముఖులమై విశాఖపట్టణము వెళ్లుచున్నామనుకొందము. మొత్తముమీద నీ ప్రయాణము దక్షిదిశనుండి ఉత్తరదిశగా పోగలదు. మనము బండిలోనుండి దక్షిణమున నెట్లగపడుచున్నదో, ఉత్తరము నెట్లు కనబడుచున్నదో అటునిటు కూడ పరికించి చూతము. దక్షిణము గడిచి వచ్చినకొలది గతమయి ఆ దిక్కున నంతవరకు కనబడిన దృశ్యములు క్రమక్రమముగా కనబడకపోవును; అదృశ్యములగును. ఉత్తరమున కింక చేరబోవలసిన ప్రదేశములు క్రమక్రమముగా విడిపోవుచున్నట్లు స్పష్టమయి వికసించినట్లు కానవచ్చును. దక్షిణ దిక్ప్రదేశము లొకటొకటే క్రమముగా గడిచి, గతించి, అదృశ్యమగుచు రాగా, ఇకముందు చేరబోవలసిన ఉత్తరదిక్కు ప్రదేశము లొకొక్కటే సమీపించుకొలది స్ఫుటముగా కనబడుచుండును. వికాసములనొందుచు గతించిపోయినది దక్షిణము. కాబట్టి గతముతో దక్షిణమునకు సంబంధ మేర్పడినది. చని పోయినవారిని గతించిన వారందుము. గతించినవారి యాత్మలకు ప్రభుడు యముడు. యమధర్మరాజు దక్షిణదిక్కునకు అధిపతి. దక్షిణ దిశకు యముడధిపతియని తెలిపినపుడే సూర్యుడు సకుటుంబముగా నుత్తరాభిముఖుడై పోవుచున్నట్లుమనపూర్వులెరుగుదురు. సూర్యుడుత్త రాభిముఖుడై పోవుకొలది ఉత్తరాకాశమున విష్ణుని పరమపద నక్ష

త్రములును, వీణామండల నక్షత్రములును వికసించుచున్నట్లు క్రమ క్రమముగా స్పష్టముగా గానవచ్చుచున్నవి. వానికెదుట దక్షిణధ్రువ ప్రాంతపు ఖగోళదృశ్యములు మూసికొని పోవుచున్నవి. ఉత్తర దిక్కునను, దక్షిణ దిక్కునను గల చుక్కలను బహుకాలము సూక్ష్మముగా పరిశీలించి చూడగా ఈ విశేషములు స్పష్టము కాజొచ్చినవి. హెర్షెల్ మతమున హారికులేశ మండలములోని లాంబ్డా అక్షర సంజ్ఞగల చుక్క పరిసరములే సూర్యమండల గమ్యస్థానము. కాని తరువాతి పరిశోధకులు దీని నంగీకరింపలేదు. ఆ సమీపమున నున్న మరొక బిందువు సూర్యగోళ గమ్యస్థానమని (Struve) స్ట్రూవే పరిశోధకుని మతము. ఇంక నిరువదిమంది యీ గమ్యస్థానమును గూర్చి వివిధ బిందువులను సూచించిరి. ఇపుడు ఖగోళ పరిశోధకులలో పలువురు ఈ గమ్యస్థానము అభిజిన్నక్షత్రము చెంతగలదని నిర్ణయించినారు. అది తప్పు అని నిర్ధారణ కానంత కాలము మనము కూడ అభిజిన్నక్షత్రమే సూర్యగోళ గమ్యస్థానమని భావించుకొందము. అభిజిన్నక్షత్రమును పాశ్చాత్యులు 'వేగా' (Vega) అందురు. సూర్యుడు సకుటుంబముగా నీ 'వేగా' నక్షత్రమును గూర్చి సెకెండుకు పండ్రెండు మైళ్ల చొప్పున నుత్తరాభిముఖులై పోవుటను గూర్చి సైమన్ న్యూకూంబ్ (Simon Newcomb) అను అమెరికాఖండపు జ్యోతిశ్శాస్త్ర విశారదుడు చేసిన ప్రసంగము నీక్రింద తెనిగించుచున్నాను. ఈ యుపన్యాసము జరుగునాటికి పడమటివారికి విమానయానము తెలియదు.

## సైమన్ న్యూకూంబు దొరగారి ప్రసంగము :

భూమండలము మీద నున్న సముద్రముల నతి త్వరతో గడిచిపోగల గొప్ప యోడలేవియు నెక్కడను ఆగకుండ నిరంతర ప్రయాణములు సాగించుచుపోయినను, బహు కోట్ల సంవత్సరముల వాటికైనను సూర్యకుటుంబ గమ్యస్థానమగు వేగా ప్రాంతమును చేరుకోజాలవు.

భూగోళ నివాసులమైన మనము ఆ భూగోళ సూర్యగోళములతో పాటు అక్కడికే వెడలిపోవుచున్నాము. సూర్యకుటుంబము ఆ లక్ష్యమును చేరుటకు ఉద్దండవేగముతో ప్రయాణము సాగించుచున్నది. ఎంతో త్వరతో పోవునని మన మనుకొను నోడల వేగము ఆ ప్రచండ వేగముతో పోల్చినపు డీ యోడలు నత్తగుల్లలకంటె మెల్లగా పోవు ననిపించును. ఈ భూమి మీద మానవోత్పత్తి యైనదాదిగా ప్రతి యుగము, ప్రతి శతాబ్దము, ప్రతి సంవత్సరము, ప్రతి దినము, ప్రతి గంట, ప్రతి సెకెండును కూడ సూర్యగోళ భూగోళములు అఖండ మైన త్వరతో 'వేగా' చుక్కను శేరబోవుచున్నవి.

ఈజిప్టుదేశములో పిరమిడ్ (Pyramid) కట్టడములు కట్టి నపుడును, పిమ్మటి యుగములలో నిప్పటికిని ఈ ప్రయాణ మిట్లు సాగుచునేయున్నది. ఈ ప్రయాణ మెపుడు ప్రారంభమైనదో, ఎపుడు ముగియునో ఎవ్వరును నిశ్చయముగా చెప్పజాలరు. ఈ యువవ్యానము ప్రారంభమైనది మొదలు ఇంతవఱకు మన మెన్నెన్నో వేలమైళ్ళు గడిచిపోయితిమి. ఇటుపై ప్రతిక్షణమును కూడ అదేవిధమున కొన్ని లక్షల సంవత్సరములో, కోట్ల సంవత్సరములో ఈ ప్రయాణ మిట్లే పాగగలదు. ప్రకృతిసూత్ర, గతిసూత్రములలో మార్పు రావంత కాలము సకుటుంబముగా సూర్యుడు తన లక్ష్యమువంక నిరంతరము పోవు చుండవలసినదే. నక్షత్రలోకమును చేరవలయునని కొందరు భావించు చుండిరి. అంతరాయములు లేకున్నచో అప్రయత్నముగా మన కా కోరిక సిద్ధించగలదు. ఒక సెకండు కాలములో పండ్రెండు మైళ్ళకు తక్కువకాని వేగముతో సూర్యకుటుంబము 'వేగా' వంకకు తరలు చున్నది. మనవారు 'అభిజి'త్తనియు పాశ్చాత్యులు 'వేగా' అనియు తెలుపు నీ నక్షత్రము ఉత్తరాకాశమున వీణామండలములో వెన్న ముద్ద వంటి తెల్లని కాంతితో నుజ్జ్వలముగా మెఱయుచుండును. దీనిం జేరబోవుటకే సూర్యకుటుంబము సెకండుకు పండ్రెండు మైళ్ళకు తక్కువకాని త్వరలో పోవుచున్నదని అభిజ్ఞులు తేల్చి చెప్పిరి.

ఒక సెకండుకు 12 మైళ్ళు; 60 సెకండ్లకాలము ఒక 'మినిట్'టన బడును. మినిటులో సూర్యుడు 60×12 =720 మైళ్ళు పోగలడు. గంటకు 60 మినిట్లు. గంటలో 720×60=43,200 (నలుబదిమూడువేల రెండువందలు) మైళ్ళు పోగలడు. దినమునకు గంటలు ఇరువదినాలుగు. కాబట్టి, దినములో సూర్యుడు సకుటుంబముగా 24×43200= 10 లక్షల 36 వేల ఎనిమిదివందల మైళ్ళు పోవుచుండును. సూర్య కుటుంబముతో కూడ మనము దినమునకు పదిలక్షల మైళ్ళు మించిన యఖండత్వరతో అభిజిన్నక్షత్ర ప్రాంతమును సమీపించుచున్నాము.

## ఉత్తర ఖగోళ ప్రాముఖ్యము :

దేవసన్నిభులగు సప్తమహాఋషులు ఉత్తరమున మెఱయు చుందురు. ధ్రువుడు మేధిస్తంభమువలె ఉత్తరమున కదలకయున్నట్లు కనబడుచుండును. సృష్టికర్త బ్రహ్మ, బ్రహ్మదేవుని భార్య సరస్వతి, ఆమె చేతి వీణ, వారికి వాహనమైన హంస అన్నియు నుత్తరాకాశ మున వెలయుచున్నవి. బ్రహ్మ పద్మాసనుడు. ఆ పద్మ మెవ్వని నాభి యందు సముద్భూతమో ఆ పద్మనాభుడు విష్ణుభగవానుడు "ఉత్తరం సధస్తమ్" కుటుంబ పరివారసహితముగా ఉత్తరమునందున్నాడు. భూగోళాది జగత్తుల కాత్మయనదగిన సూర్యుడు మన స్థూల దృష్టికి ఉత్తర నిర్గమనము ప్రారంభించు సమయమును ఉత్తరాయణ పుణ్య కాలమందురు. ఆ పుణ్యకాలమునచేయు దానధర్మములు, దేవతా పూజలు, పితృదేవతారాధనలు లోనగునవి అనంత ఫలప్రదములని భారతీయులు విశ్వసించుచున్నారు. సూర్యుడు సకుటుంబముగా నెందు పోవుచున్నాడో ఆ యుత్తరదిక్కున ప్రవహించు నదులు అట్లు ప్రవ హించు మేరకు ఉత్తరవాహినులని ప్రశంసింపబడును. ఆ పవిత్ర దేశమున చేయబడు స్నానదానాదులకు విశేషఫలము గలదని ఆస్తికుల దృఢవిశ్వాసము భగవద్భక్తులైన గృహస్థుల యిండ్లలో దేవతాపీఠ

ములు తూర్పునకో, ఉత్తరమునకో యుండునట్లు నిర్మింపబడును. జగచ్చక్షుడును జగదాత్మయు నగు సూర్యు డుదయించు తూర్పుదిక్కు పవిత్రమైనది. సూర్యుడు సకుటుంబముగా తరలిపోవుచున్న ఉత్తరదిక్కు తూర్పుకంటెను పవిత్రతరము, పుణ్యప్రదము నగుటచేత మనదేశములో దైవభక్తిగల గృహస్థులు సంధ్యావందనము చేయునప్పుడు కూడ తూర్పుదిక్కునకో, ఉత్తరదిక్కునకో అభిముఖులై కూర్చుందురు.*

ఉత్తరమున కెదురుగానున్న దక్షిణమునకు గతముతో సంబంధము. గతించినవారికి దక్షిణదిక్కుతో సంబంధము. ప్రేతలోకము దక్షిణమున మున్నది. ఆ లోకమునకు అధిపతి యముడు. యమలోకము దక్షిణమున గలదు. శుభశోభనములకు దక్షిణము అప్రశస్తము.

## మింటిరొద (The Cosmic Hiss) :

బ్రహ్మదేవుని నాలుగు ముఖములందును నాలుగు వేదములు కలవని మనదేశములో కవిసమయ మున్నది. ఆ సమయము ననుసరించి కవితాప్రాగల్భ్యముగల ఘనమగు భావనాశక్తి రహితమైన యాంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దనామాత్యుడు తన కాశ్రయ మిచ్చి పోషించుచుండిన శ్రీకృష్ణదేవరాయల కభ్యుదయము గోరుచు మనుచరిత్ర ప్రారంభమున నీ క్రింది పద్యరత్నమును రచించినాడు—

ఉ. "నాలుగు మోములన్ నిగమనాదము లుప్పతిలన్ ప్రచండ వా
తూలహతిం జనించు రొదతోడ గుహావళి నొప్పు మేరువుం
బోలె సరోజపీఠి మునిముఖ్యులు గొల్వగ వాణిగూడి పే
రోలగ మున్న ధాత విభవోజ్జ్వలు జేయుత కృష్ణరాయనిన్."

ప్రచండ వాతూలహతిచే జనించు రొద నీను గుహలుగల మేరు పర్వతమువోలె, నాలుగు ముఖములనుండి జనించు వేదఘోష సంబంధ

---

* ప్రశ్నోపనిషత్-I-10 :. "అథోత్తరేణ తపసా బ్రహ్మచర్యేణ
శ్రద్ధయా విద్యయాఽఽత్మాన మన్విష్యా...

మగు ఝూంకార సహితుడై పద్మాసనముపై మునిముఖ్యులు సేవించు చుండగా సరస్వతితో నిండుకొలువున్న బ్రహ్మ శ్రీకృష్ణదేవరాయల వారిని విభవోజ్జ్వలుని చేయుగాక అని ఆశీస్సు. ఇక్కడి ముఖ్యవిశేషము 'రౌద' దేవతల కాశ్రయమగు మేరుపర్వత గుహాలలో వాయుహతిచే జనించిన రౌద కానిండు, చతుర్ముఖములనుండి వెలువడు వేద నినాద ఝూంకారము కానిండు, ఆ ప్రాంతమునుండి వెడలు నొకానొక శబ్ద వ్యాప్తి పెద్దన్న కవిశాఖావాంబర వీథిని శ్రుతిగోచరమైనది. ప్రత్యహ మును జ్యోతిర్లోకములనుండి యెన్నెన్నొ రహస్యములు వినవచ్చు చున్నవి. ప్రతి రాత్రియు నా లావణ్యసీమలనుండి నిర్గమించు దివ్య తేజస్సు మన ఆత్మలపై ప్రసరించుచు నుత్తేజము నొసంగుచున్నదని 'బర్డిక్' కవి చెప్పినది నిజము. 21-12-41 తేదీని 'హిందూ' - వార పత్రికలో శ్రీ M V. రామకృష్ణగారు వ్రాసిన వ్యాసము ఈ విషయము నెంతోచక్కగా వివరించుచున్నది కావున దాని నిట తెనిగించి వ్రాయు చున్నాను.

" 1933 సంవత్సరములో డాక్టరు కార్ల్ జాన్‌స్కీ దొరకు ఒక వింత ఝూంకారము వినవచ్చెను. ఆ దొరగారు బెల్ టెలిఫోను పరి శోధక శాలలో యంత్రజ్ఞుడు. అతడు పనిచేయుచున్నది శక్తివంతమైన శబ్దగ్రాహి-రేడియో రిసీవింగ్ సెట్. శబ్దగ్రహణమున కందు ప్రతిష్ఠింప బడిన ఏంటెన్నా (Antenna) మిడుతలు-రోనలు (feelers) సాధన ములు దీర్ఘములై దూరశ్రవణమునకు మిక్కిలి అనుకూలించునట్టివి. ఈ పరికరములతో పనిచేయుచుండ జాన్‌స్కీ దొరకు విచిత్రమైన ఝూంకారము వినవచ్చెను. ఈ రౌద కాస్తసేపు వినపడి ఆగిపోలేదు. విడువులేకుండ వినవచ్చుచునే యుండెను. మందముగాక ఆ శబ్దపు తలుచు ఉన్నతస్థాయినే వినపడుచుండెను. ఏంటెన్నా సాధనములను అన్ని దిక్కులను త్రిప్పిచూడగా ఒకానొక దిక్కునుండి శబ్దము ఉచ్చ స్థితిలో వినవచ్చెను. ఆ దిక్కులనుండియే యీ శబ్దము వెడలియుండ

పోవు! ప్రతిదినము ఆత డీ పరిశోధన సాగించుచుండెను. ఉచ్చస్థితిలో రొద వినవచ్చుదిశ ఎప్పటికప్పుడు మారుచుండెను గాని స్థిరముగా నొక దిక్కునుండి యీ సవ్వడి శ్రుతిగోచరమగుటలేదు. పట్టువిడువక ఒక సంవత్సర మిట్లనుదినము నీ శబ్దగ్రాహితో పనిచేయుచు రాగారాగా తొలినా డే దిక్కునుండి ఉచ్చస్వరమున శబ్దము వినవచ్చెనో ఏడాది నాటి కా దిక్కునుండియే మరల నీ శబ్దము సరిగా వినవయ్యెను.

ఈ శబ్దమునకు కారణము సూర్యగోళమేమో యని జాన్‌స్కీ మొదట అనుకొనెను గాని సూర్యోదయాదులతో నీ సవ్వడికి సంబంధము లేదని అల్పకాలములోనే స్పష్టమైనది. మాసములను, ఋతువులను అనుసరించి యీ రొద వినవచ్చు దిశ మారుచు వచ్చెను. తొలినాడు రొద వినవచ్చిన దిశకు ఎదుటి దిశనుండి ఆరునెలలనా డీ శబ్దము విన వయ్యెను. కాబట్టి ఈ శబ్దోత్పత్తికి కారకుడు సూర్యుడుకాడు. సూర్య కుటుంబమున కావలి, నక్షత్ర మండలములో నేదో యొక స్థానమునుండి ఈ రొద వెడలుచున్నదనుట నిక్కువము. ఆ స్థాన మేది?

అమెరికా ఖండమున హార్వర్డు (Harvard) యూనివర్శిటీలో సుప్రసిద్ధ ఖగోళ వేధకుడు డాక్టరు షాప్లీ పరిశోధనల ఫలితముగా క్షీరోదమధ్యము వీణామండలమని తేలినది. ఆ మండలమున గల 'వేగా' అభిజిన్నక్షత్ర ప్రాంతమే మన సూర్యకుటుంబ గమ్యస్థానమని కూడ తెలిసికొంటిమి. వీణామండలమునుండియే విశ్వమునకంతకును విద్యుత్తరంగాళి వెలువడుచున్నట్లు ఖగోళ పరిశోధకులు నిశ్చయించి యున్నారు. భూగోళము మీద చెన్నపట్టణము, బొంబాయి, లండను మొదలగు ముఖ్యస్థానముల నుండి రేడియోతరంగముల మూలముగా వార్తలు, పాటలు మొదలగునవి వ్యాప్తిచేయబడుచున్నవి. ఇది భూగోళమున ప్రతిష్ఠితములైన శబ్దవ్యాప్తి స్థానముల వృత్తాంతము. ఇట్లే ఖగోళమున క్షీరోద మధ్యమున వీణామండలము నుండి విశ్వ మంతకును రేడియో విద్యుత్తరంగముల ద్వారా శబ్దవ్యాప్తి జరుగు

చున్నది. చెన్నపట్టణము, బొంబాయి, లండను మొదలగు స్థానములు భూగోళపు శబ్దవ్యాపక స్థానములు (Terrestrial Broadcasting Stations), వీణామండలమన్ననో విశ్వమున కంతకును విద్యుత్తరంగముల ద్వారా శబ్దవ్యాపన గావించు స్థానము (Celestial Broadcasting Station) అన నొప్పును.

జాన్‌స్కీదొర వినిన రొద యీ వీణామండలమునుండి వెడలిన విద్యుత్తరంగ శబ్దఫలితము. ఈ రొద మూలముగా సూర్యుడు సకుటుంబముగా అభిజిన్నక్షత్రము చెంతకు అఖండ త్వరతో పోవుచున్నాడను వాదము స్థిరపడి సిద్ధాంతమగుచున్నది. శక్తివంతములైన రేడియో శబ్దగ్రాహక యంత్రములలో నిట్టి విద్యుత్సందేశార్థములగు రొదలు (Sagittarius) ధనుస్సు రాశి స్థితుడగు మన్మథ నక్షత్రముల నుండి గూడ వినవగుచున్నదని జ్యోతిశ్శాస్త్ర పరిశోధకులు తెలుపుచున్నారు. అల్లసాని పెద్దన్నగారు ఛాయాంబర వీధిలో విహరించుచు కవితా ప్రాగల్భ్యముచే వర్ణించిన రొద జ్యోతిశ్శాస్త్ర పరిశోధకుల నిరంతర కృషిచే యథార్థమని స్థిరపడుట మనకు ముదావహము మన విమర్శకులు "పోనీలెద్దురూ- అవన్నీ వట్టి పిచ్చి మాటలు, పిచ్చి వ్రాతలు" అని త్రోసివేయు ప్రాచీనుల భావము లెన్ని శాస్త్రసమ్మతములై సిద్ధాంతములు కాగలవో కాలగతి నిర్ణయించగలదు. ఎంత పరిశోధనచేసి, ఎన్ని సంగతులు తెలిసికొని విష్ణు వీణామండల ప్రాంతములు మనవారు 'పరమపదము' అని నిర్ణయించిరో. భావి పరిశోధనల మూలముగా స్పష్టమగును.

రాజహంస :

రమ్యక్షీర వాహినీమధ్యమున విభ్రాజమానములగు సప్తోత్తర శత నక్షత్ర సమూహముతో శృంగార దేవతవలె శోభిల్లు నిన్ను ప్రశంసింపక యెవరు మానగలరు ? రజితమూర్తి ! రాజహంసా ! విష్ణు

పాదోద్భవిరైన దివిజగంగ దిగువ కురుకునపుడు శిశత్సన్వయూపముతో నల్లకల్లోలమగుటయు, కల్లోల ముడిపి హంస యా సలిలములకు శాంతి చేకూర్చుటయు ఋగ్వేద మంత్రములలో మనము చదివి యున్నాము. హంసస్వరూపము ఖగోళమున వీణామండలపు తారలలో ఎప్సిలాన్ గుంపు నాలుగు చుక్కలకు తూర్పున కానవగును. ఆ తార చతుష్టయమును బ్రహ్మదేవుని చతుర్ముఖము లనుకొంటిమికదా? బ్రహ్మముఖములపై వీణపాణి సరస్వతియు, వా వాణీహిరణ్యగర్భ మిధువమునకు సమీపమున వారి వాహనమగు నీ హంసయు కలవు. అగ్నికి మేఘమును, పార్వతీపరమేశ్వర మిధునమునకు వృషభమును, కన్యారాశి దుర్గకు సింహమును, గణేశునికి ఎలుకయు వాహనము లైనట్లే బ్రాహ్మీ బ్రహ్మలకు హంస వాహనము ఇట్లే శ్రీవిష్ణునకు గరుడుడు వాహన మగునని తెలిసికోగలము.

ప్రాచీన సంప్రదాయానుసారముగ భారతీయ కవులందరును ముందు సరస్వతీస్తవముచేసి పిమ్మట కావ్యరచన మువక్రమించు చుందురు. సరస్వతిని స్తుతించు శ్లోకములును పద్యములును కడు హృద్యములై యొప్పుచుండును. దండి మహాకవి సరస్వతి 'సర్వశుక్ల' అంతయు తెలుపేనని చేసిన వర్ణన వెనుక చదివియుంటిమి. ఆంధ్ర భాగవత కర్త, మహాభక్తుడు బమ్మెర పోతరాజు నిర్మల ధావళ్యశోభిత యగు భారతీదేవి నీ క్రింది పద్యమున చక్కగా స్తుతిచేసి యున్నాడు.

ఉ. "శారదనీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సితాపయోధి సితతామరసామరవాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మది గానగ నెన్నడుగల్గు భారతీ!"

భూగోళ, ఖగోళ, అంతరిక్షములందు నిర్మల ధావళ్యశోభితము లని ప్రశంసింపబడిన యీ క్రింది వస్తుజాలముతో భారతీదేవి శుభ్ర ధావళ్యమును ఉపమించినాడు.

ఖగోళమున—పాలవెల్లియు, చంద్రుడును శుభ్రజ్యోత్స్నతో వెలుగుదురు.

అంతరిక్షమున—శరత్కాల మేఘము, హంసల గుంపు, శారదాభ్ర శకలచయమును బోలియున్నదని నన్నయభట్టు వర్ణన.

పుష్పములు—మల్లె, కుంద, తెల్ల తామర, తెల్ల మందారములు.

ఇతర వస్తువులు—శుద్ధ స్ఫటికము, శుద్ధిచేసిన కర్పూరము (ఘనసారము), చందనము, తెల్ల పట్టువంటి తెల్లు, వెండి కొండ, హిమము, హంసము, తెల్లసంద్రము, నురుగు, తెల్లగాచు.

పై విధమున నొకపట్టిక వ్రాసి తెల్లవస్తువులను స్మరించుకొనుటలో ప్రయోజనమున్నది. వీనినెల్ల దలంచుకొని వీణామండల ప్రాంతములను బాగుగా పరికించినపుడే ఆ మండలముయొక్క విశిష్టత మనము గ్రహించి యానందించగలము. శరదృతు దినములలో సూర్యాస్తమించిన పిదప తూర్పుటాకాశమునందు మొదట మనదృష్టి నాకర్షించునది శుభ్రమైన పాలసముద్రము ; ఆ క్షీరవాహిని మధ్యమున వెండి కొండవంటి హంసము, అటు మేటి వజ్రమువలె దేదీప్యమానముగా ధవళకాంతులతో తేజరిల్లు అభిజిన్నక్షత్రము, ఈ పరిసరముల మధ్య వీణపాణి సరస్వతి అక్షరములా సర్వశుక్లయై వెలయుచుండును. ఆశ్వయుజ కార్తిక మాసములలో నీ శారదాదేవి దర్శనము చేసిన వారు ధన్యులు. అప్పటికి ఇంచుమించుగా వర్షకాలము సమాప్తమగును, వాతావరణమున నీటియావిరి మెండుకొని యుండును. ఆ కారణముచేత చంద్రకాంతి యతిశయించి యపూర్వ శోభతో మెఱయుచుండును. శరచ్చంద్రచంద్రికాధావళ్యము వర్ణించుట మన కవుల కత్యంతాహ్లాదకారణము. వాగనుశాసనుడు మన నన్నయభట్టారకుడు హంసతోకూడ వాణీ హిరణ్యగర్భుల ను శరత్కాలముతో

వర్ణించుచు వ్రాసిన పద్యరత్నమును చక్కగా అర్థముచేసికొని ఆనం దించుట మన కవశ్యకర్తవ్యము.

ఉ. భూసతికిం దివంబునకు పొల్పెసగంగ శరత్సమాగమం
బాసకలప్రమోదకరమై విలసిల్లె మహర్షి మండలో
పాసిత రాజహంసగతి భాతి ప్రసన్న సరస్వతీక మ
బ్జాసన సదృశంబగుచు నబ్జజయానముతో సమానమై.

ద్యావాపృథివీ దంపతులకు శరత్సమాగమమైనందుకు లోక మంతయు హర్షించినది. అప్పటి శోభయెట్లున్నదనగా: మహర్షి మండల మనగా నక్షత్రమండలమునందు ప్రసన్నురాలైన సరస్వతీదేవితో కూడి హంసనెక్కి వెడలు బ్రహ్మదేవుని శోభను పోలియున్నది. ఇచట ద్యావాపృథివీ దంపతులకును బ్రహ్మ సరస్వతీ దంపతులకును ఉప మానము. బ్రహ్మ తెల్లనివాడు; అతని భార్య సరస్వతి 'సర్వశుక్ల'; వారి వాహనమైన హంసకూడ తెల్లనిదగుటచేత వారిశోభ యతిశయించు చున్నది. వాణీహిరణ్యగర్భదంపతులకు మరాళయానము శోభాకరమై నట్లు ద్యావాపృథివీ దంపతులకు శరదాగమనము శోభాకరమై విల సిల్లుచున్నది.

మహాభారత సంస్కృత మూలమునందీ యుపమానముల ప్రశంస లేదు. వర్షాధికమయి సరస్వతీనది రెండుగట్ల నొరసి పారుచున్నదని మాత్రము అందు తెలుపబడెను. ప్రతిభాశాలియు జ్యోతిర్విద్యావిదులలో నగ్రగణ్యుడు నగు నన్నయభట్టారకుడు శరత్కాలమున భూగోళ విశేష ములను గమనించి యీ పద్యరత్నమునుగూర్చి మనకు శాశ్వతముగా వంద్యుడగుచున్నాడు. మహనీయ ప్రకృతిశోభావిరాజమానమగు నీ దృశ్యమునందు ఈ క్రింది విశేషములను గ్రహింపవలయును :

1. హంస - తేజోమయమైనది; శాంతమునకు, నిదానమునకు, నహింసకు నాకరమైనది; నీర క్షీర విభాగములో యుక్తాయుక్త విచక్షణమును చేయగలది.

2. సరస్వతి - భావాంబరవీథివిశ్రుత విహారిణి ; సంగీత సాహిత్యాది సకలవిద్యాస్వరూపిణి ; సమస్త సత్కళలకు ఆశ్రయమైన దేవి.

3. బ్రహ్మ - పద్మాసనుడు, జగముల నిర్మించు నేర్పరి, సృష్టికర్త.

ఇట్టి విశిష్ట శక్తులు గల ముప్వురి సమావేశ మీ రంగమున వ్యక్తమగుట గొప్ప విశేషము.

ఈ సందర్భమున మనము ముఖ్యముగా తెలిసికోవలసిన రెండు మూడు విషయములను గూర్చి సంగ్రహ ప్రశంస అత్యావసరము.

**Goethe** (గెటి) అనునతడు జెర్మనీ దేశపు కవిరాజు ; గొప్ప విమర్శకుడు ; మహా విద్వాంసుడు. కాళిదాసుని శాకుంతల నాటకము చదివి సంతోషము పట్టజాలక అతడు ఉబ్బి గంతులు వైచి నాట్యము చేసెనట ! ద్యావాపృథివీ దాంపత్యముతో శకుంతల కథ నుపమించుచు నాత డిట్లు ప్రశంసించినాడు : "నూత్న సంవత్సర వసంత యౌవన వికాసములతో వార్ధక్య శరత్ఫలములం జేర్చి, తుష్టినిచ్చి, పుష్టిని పెంచి ఆత్మ నత్యంతము నలరింపగల సమస్తమును ఒక్క మాటలో చెప్పనా ? ద్యావా పృథివీ దాంపత్యమునకు ఒక పేరు పెట్టనా ? **శకుంతల!** చెప్పవలసినదంతయు నా పవిత్ర నామములో నిమిడిపోయినది."

శకుంతలను గూర్చి గెటీ విమర్శకుడు చెప్పినదాని కింకను వన్నె వెట్టుచు రవీంద్ర కవిచంద్రు డిట్లు వ్యాఖ్యానించెను : "శకుంతలలో వికాస విజృంభణముల వింత చరిత్ర కలదు. పువ్వు మెట్లు ఫలభరిత మగునో, మట్టిముద్ద భూమి యెట్లు స్వర్గముగా పరిణమించునో, స్థూల ద్రవ్యము ఆధ్యాత్మిక శక్తులం బడసి దేవతా ప్రభావ సంపన్నము గల దగునో, ఆ క్రమమంతయు శకుంతల చరిత్రలో విశదమగుచున్నది. సరిహద్దు నిర్ణయింపరాకుండ స్వతస్సిద్ధముగా భూమి స్వర్గమగుచున్నది. భౌమికము భౌతికమునై సౌందర్యము ఉన్నతినొంది, స్వర్లోకమున నిత్యమైన నైతిక సౌందర్యముగా పరిణమించును. స్వేచ్ఛానుసారమైన

నిర్బంధ మందు పొందుపొసగియున్నది. ఇట్లు పూజింపబడు సౌందర్య ములో నిరుపమానమైన శృంగారమున్నది; మనోజ్ఞమైన బిడియ మున్నది; ప్రశంసాపాత్రమైన సద్భావమున్నది. ఈ సౌందర్యము విశ్వ వ్యాప్తిగలది. ఎన్నడును వస చెడదు. నిత్యమును ఉత్తేజము గలిగి శాశ్వతముగా నుండునది."

## గరుడి (Aquila):

బహు ప్రాచీనకాలమునుండి నక్షత్రరూపముగల గరుడపక్షిని బహుదేశములవారు గమనించి గ్రంథస్థము చేసినట్లు ఋజువు కలదు. గ్రిమాల్డి దొరగారు తయారుచేసిన ఖగోళచిత్రముల పట్టికలో ఈ క్రింద వ్రాసినప్రకారము గరుడప్రశంస కలదు.

| పుట | దేశము | నమోదు సంఖ్య | వివరములు |
|---|---|---|---|
| 16 | ఈజిప్టు | 48 | డేగముఖముగల మనుజుడు |
| 20 | ,, | 92 | పక్షిశిరస్కుడగు మనుజుడు |
| 27 | ఫొనీష్యా | 181 | గరుడపాదుడగు మనుజుడు |
| 31 | చీనా | 146 | గరుడపక్షి |
| 75 | మిత్రవిషయము | 561 | పక్షిశిరస్కుడు - నరుడు |
| 81 | ,, | 636 | విషసర్పముతో గరుడి |
| 82 | ,, | 648 | గరుడి |

ఋగ్వేదములో మొదట I-164-21 సంఖ్యగల మంత్రములో గరుడ ప్రశంస కలదు: "స సుపర్ణో గరుత్మాన్".

ఇట్లు ఏష్యా, యూరపు, ఆఫ్రికాఖండస్థులగు బహుదేశముల వారు ఖగోళమున నీ గరుడిరూపము చూచిరి, వర్ణించిరి, గ్రంథములు కూడ వ్రాసిరి. పాశ్చాత్యదేశములో పలుజాతులవారికి ముఖ్యదైవ మైన జ్యూపిటర్ (Jupiter) దేవుని సింహాసనము ప్రక్కనే గరుడు స్థాన మున్నట్లు తెలియుచున్నది. గ్రీసుదేశపు పరిసరములలో పె...

దీవు లున్నవి. అందొకదానికి శాన్ ద్వీపమని పేరు. ఆ ద్వీపము నేలిన మెరాప్పరాజు బహుపుణ్యశీలు డగుటచే దేవదేవుడనుగ్రహించి, గరుడ రూప మిచ్చి అతనిని తన సన్నిధానమున చేర్చుకొనెనట! రోమన్ కవి మెనీలియస్ గరుడమూర్తి నిట్లు వర్ణించెను—గరుడుడు తన కాలివ్రేళ్ళ మధ్య పిడుగులను దాచిపట్టి, మహాధైర్యముతో పై కెగయుచు గొప్ప యెత్తున నెగురుచున్నాడు. దేవదేవునకు దివ్యాయుధములు తెచ్చి యందిచ్చువాడను నేనేకదా యని యతడు సగర్వముగా సాహసించి యుద్దీమ డగుచున్నాడు.

ఋగ్వేదము పలుచోట్ల గరుడుని ప్రశంసించుచున్నది. ఖగోళ స్థలమగు గరుడ, హంస అను పక్షులమెడ పైన విష్ణుపద మున్నదని తెలుపుచు ఋ-I-155-5 మంత్రమును మన మిదివఱకు చదివితిమి. ఋగ్వేదము-I-164-47 మంత్రములో కూడ నీ రాజహంస, గరుడపక్షుల ప్రశంస కలదు.

"కృష్ణం నియానం హరయః సుపర్ణా
అపో వసానా దివ ముత్పతంతి
త ఆవ వృత్రన్త్సదనా దృతస్యాది
ధృతేన పృథివీ వ్యుద్యతే."

స్వర్ణచ్ఛాయతో మెఱయుచు నీ పక్షులు స్వర్గమున కెగిరి అస్తమయవేళ దిగునపుడు కృష్ణవర్ణము కానవైనది. జలసిక్తములై ఆ పక్షులు పరమపదమున కెగిరి దిగినవి. వాని ధర్మమున భూమండలము చెమ్మగిలినది. ఈ మంత్రములో క్షీరోదముతో నీ పక్షులు ఉదయించి అస్తమించు విషయము వర్ణింపబడినది. దిగునట్లు ఈ పక్షులు కనబడినపుడు జీమూతములు పడమటియాకాశము నావరించుటచేత, వీని దిగుబాటు-'నియానము'- కృష్ణవర్ణము కలదని తెలుపబడినది. మూడవది విశ్వమునందలి సమస్తభువనములకు గోపకుడు శ్రీ విష్ణుభగవానుని స్థానము వివరించు సందర్భమునకూడ "యత్రా సువర్ణా అమృతస్యభాగ

మనిమేషం విదథాభిస్వరంతి" (ఋ-I-164-21) ఈ గరుడియు, రాజ హంసయు నెచటనుండి యెన్నడు వాగళ అమృత వాక్కులతో నభి స్వరము చేయుచున్నవో అక్కడే-"ఇనో విశ్వస్య భువనస్య గోపాః" విశ్వమునగల సమస్త భువనరక్షకు డున్నాడు.

సువర్ణుడనగా గరుత్మానుడు; మంచి రెక్కలుగల పక్షి సువర్ణ మగును. మనవారు శ్రవణ మను నక్షత్రములకు వేదములో శ్రోణీ యని నామమున్నది. శ్రోణీ నక్షత్రములు విష్ణుదైవత్యములు. "శ్రోణీ నక్షత్రమ్ విష్ణు ర్దేవతా" అని శ్రుతి. విష్ణునక్షత్రము ఉదయమైన పిమ్మట అ దిగువ తూర్పున గరుడాత్మకమైన శ్రవణ నక్షత్రము ఉద యించునుగావున ఉదయమగు వేళ విష్ణునకు గరుడుడు వాహన మన నొప్పును. అస్తమించునపుడు విష్ణుదేవునిపై గరుడుడు ఉండును. కావున నపుడు గరుడుడు విష్ణుధ్వజమగును. ఆంధ్ర మహాభారతము ఆది. 2-103-104 పద్యములలోని నారాయణ గరుడ సంవాదము ఇచట చదువనగును.

2-103. ఆదిదేవుడగు శ్రీమన్నారాయణునకు నమస్కరించి గరుడుం డిట్లనియె :

2-104 సీ. అమృతాశనంబు సేయకయును దేవనాక
జరామరత్వంబు నందుటయును
నఖిలలోకంబుల కగ్రణివైన
నీయగ్రంబునందు నిన్నధికభక్తి
గొలుచుచు నునికియు గోరితి కరుణతో
దయసేయు ముద్ధతదైత్యభేది
యనవుడు వానికి నభిమతంబులు
ప్రీతుడై యిచ్చి హరియిట్టులనియె "నాకు
ననఘవాహనంబవై మహాధ్వజమవై
యుండు"మనిన బక్షియును బ్రసాద
మనుచు మ్రొక్కి పలికె......

గరుడునకు ఆశ్లేష ప్రతిస్పర్థి. శ్రవణ నక్షత్రము ఉదయమగు నపుడు ఆశ్లేష అస్తమించును. ఆశ్లేష సర్పదైవత్యము. భూగోళ ఖగోళములయందు గరుడ సర్పములు ప్రతిస్పర్థులగుట విచిత్రము. గరుడునికి ఛందస్సులతోను, గాయత్రితోను సంబంధముగలదు. కావున శ్రావణ పున్నమినాడు నూతన యజ్ఞోపవీతధారణ విధింపబడినది.

## ధనిష్ఠ - గోలోకము :

క్రాంతిచక్రములో శ్రవణనక్షత్రము తరువాతిది ధనిష్ఠ. ధనిష్ఠకు పూర్వనామము శ్రవిష్ఠ. శ్రవణ సామీప్యమున చీనావారు నక్షత్ర రూపముగల గోవులను చూచుచుండిరి. క్రీస్తుశకమునకు ఐదు శతాబ్దముల ముందుండిన '*కంగ్ ఫూచే*' (Confucius) అను చీనా పండితుడు వీనిని వృషభములుగా భావించి వానింగూర్చి చిన్నగీతము రచించెను. ఆ గీతార్థమిది :

"ఓజస్సు తేజస్సుగల యీ యెడ్లు భారవాహకములే; కాని మనబండ్లకు పూన్చుకొంద మన్న నవి మన కందుబాటులో లేవు."

చీనా పండితుడు చెప్పకపూర్వము ఋగ్వేదములోనే గోబృంద ప్రశంసకలదని మనము తెలిసికొంటిమి. ఋ I. 154.6 లో "యత్ర గావో భూరిశృంగా అయాసః" అని చదివితిమి. బహుశృంగములు గలిగియు చురుకైన గోబృందము ఏ దేవుని పరమపద సమీపమున గలదో ఆ దేవుడు విష్ణువేనని దీర్ఘతముడు వివరించి తెలిపెను. ఈ గోలోకమే కృష్ణావతారమునాటికి నందగోకులమైనది. ఈ సంగతు లిపుడే తెలిసికొందము. తత్పూర్వము ఋగ్వేదము III. 6.4 మంత్రార్థ మును తెలిసికోవలసియున్నది.

"మహాన్త్సధస్తే ధ్రువ ఆనిషత్తో న
ద్యావామాహి నే హర్యమాణా

అ(స్మే స పత్నే అజరే అమృక్తే
సబర్దుఘే ఉరుగాయస్య ధేనూ ॥

భూగోళ, విశాల ఖగోళములమధ్య దేవతానిలయములో స్థిరుడై, మనకత్యంత ప్రియుడగు విష్ణుభగవానుడున్నాడు. ఎడబాటు లేక, అతనితోడిదే లోకముగా అజరామరములై నిత్యయౌవనము గలిగి దుగ్ధామృతము నొసగుచు త్రివిక్రమదేవుని ధేనువులున్నవి."

పిమ్మట కృష్ణయజుర్వేదమునందలి నక్షత్రేష్టిలో ధనిష్ఠ వసు దేవతాత్మకమని చెప్పబడినది. వసువులు ఎనమండుగురు. సంస్కృత భాషలో 'వసు' శబ్దమునకు ధనము, భాగ్యము నని అర్థము. తొలి యుగములలో ఒక మనుజుని ఐశ్వర్యము వాని గోసంపదనుబట్టి నిర్ణ యింపబడుచుండెను. పశుశబ్దము ధనము అను నర్థములోనే వాడుక యగుచుండెను. పశుశబ్దమునకు లాటిన్ భాషలో 'పెకు' అను రూపము కలదు. దానినుండి పెక్యూనియరీ (pecuniary) అని ఆంగ్లపదము పుట్టినది. ఒకకోర్టువారికి ఎంతవిలువగల ఆస్తి సంబంధమైన దావాలు విచారణచేయ నధికారముకలదో ఆ మేరకు pecuniary jurisdiction అని పేరు. కోర్టులో ప్లీడరులఫీజు, fees సంస్కృత పశుశబ్దజన్యమే. ఇట్లే కోర్టు ఫీజు మెడికల్ ఫీజు మొదలగునవి యని యెఱుగునది. మన తెలుగుదేశములో పశువులను ఇప్పటికిని 'సొమ్ము' లందురు. ఇట్లు బహు యుగముల నుండి వసువులకు పశువులతో నవినాభావ సంబంధము గలదని నిరూపించుట కీ సంగతు లిచట వ్రాయవలసివచ్చినది.

## భీష్ముడు :

అష్ట వసువులలో నొకడు గోచౌర్యమునకు శప్తుడై భీష్ముడై జన్మించెనని మహాభారతము తెలుపుచున్నది. భీష్ముడు మాఘమాస ములో నుత్తరాయణపుణ్యకాలమున దివంగతుడయ్యెను. తత్పూర్వము కొన్ని దినములు అంపశయ్యాపై నుండెను. దేవవ్రతుడగు భీష్ముడు

అధర్మయుద్ధము చేయలేదు. కొంతకాలము స్త్రీయై పిమ్మట పురుషుడైనను శిఖండిపై భీష్ముడు గడ్డిపోచయైన విసరలేదు. భీష్మునితో సక్రమయుద్ధము చేయలేక అర్జునుడు శిఖండిని తన రథముపై కూరుచుండబెట్టుకొని తనవిల్లు శిఖండిచే ముట్టించుచు భీష్మునిపై ఘోరాస్త్రములు ప్రయోగించెను. అపుడు భీష్ముడు "అర్జునస్య ఇమే బాణా నేమే బాణా శిఖండినః కృంతంతి మమగాత్రాణి మాఘమాసే గవామివ" అనెను. మాఘమాసము గోవులకు ప్రాణాంతకరమైన వేదన కలిగించును. భూగోళ ఖగోళములలో గోవులకు మాఘము మిక్కిలి పీడాకరము. మాఘమాసపు చలి ఆవులమందలకు పులి. గోలోకముతో ధనిష్ఠ అపు డస్తమించును. పశువులకు 'గాళ్లు' అను జబ్బులు తగులుటచే పశువు లధికముగా నా నెలలో చనిపోవుచుండును. భీష్ముడెంతో సాభిప్రాయముగా "మాఘమాసే గవామివ" అని యుగ్గడించెను. ఈ వాక్యము నింకొక విధముగా విరిచి, భారత వ్యాఖ్యాతలును, భారత మాంధ్రీకరించిన తిక్కన సోమయాజియు ప్రసవించు కర్కటి వేదనతో భీష్ముని వేదన నుపమించిరని కర్కటక రాశి చర్చ సందర్భమున చదివితిమి. కర్కటి పరముగా చెప్పుటకంటె గోపరముగా నన్వయించుటే సరియైన సమన్వయము. ఈ విషయమును గూర్చి దీర్ఘముగా వేరొక వ్యాసము వ్రాయ నుద్యమించి, ఈ చర్చ యిచట ముగించుచున్నాను. ధనిష్ఠ నక్షత్రములు గోలోకములోనివని నిరూపించుట ఇచట నా యాశయము. శ్రీకృష్ణజన్మాష్టమీదినము ఈ విషయమును తేటతెల్లము గావించును.

## నందగోకులము - శ్రీకృష్ణజన్మాష్టమి :

అష్టవసువులలో ద్రోణుడనువా డొకడు. వాని భార్య ధర. బ్రహ్మ యాజ్ఞానుసారము ఆ దంపతు లిరువురును నరజన్మ మెత్తి నందుడు, యశోదయు ననబరగి గోకుల బృందావనమున నాలమందలతో

నివాసము చేయుచుండిరి. వారలే శ్రీకృష్ణుని పెంచిన తలిదండ్రులు. శ్రీకృష్ణజన్మము శ్రావణ బహుళ అష్టమినాడు. శ్రావణ పూర్ణిమనాడు శ్రవణ నక్షత్రముతో చంద్రుడు సూర్యాస్తమాన వేళకు తూర్పున నుదయించును. మరి వారమురోజులనాడు శ్రావణ బహుళ అష్టమి నాడు సూర్యాస్తమయ సమయమునకు ధనిష్ఠ తూర్పున నుదయించును. ధనిష్ఠ గోలోకము. దేవకీ గర్భజనితుడగు శ్రీకృష్ణుడు యోగమాయ సాయమున గోకులము చేరుకొనెను. అచటనే పెరిగెను. "శోతనసాయ మస్తి దేవాయా అజుష్టమ్" అను శ్రుతి ప్రమాణ ప్రకారము శ్రావణ బహుళ అష్టమినాడు ప్రొద్దుపోగానే తూర్పున గోకుల సూచకమగు ధనిష్ఠ ఉదయించును గాన శ్రీకృష్ణజన్మాష్టమి నాడే యని నిర్ణయింప బైనది.

ఒక్కసారి తలయెత్తి ఖగోళమును కనులార తిలకింపుము. స్వర్ణ రథము నెక్కి సూర్యుడు దుర్నిరీక్ష్య తేజోమూర్తియై ఉదయించి పగలెల్ల నభోరంగమున విహరించి దివసాంతమున నస్తమించుచున్నాడు. పిండి యారబోసినట్లు పండువెన్నెలలు గాయుచు రాత్రులు చంద్రుడు దివమందు సకలజనాహ్లాదకరుడై మెఱయుచు నస్తంగతు డగుచున్నాడు. కుజ, గురు, శుక్ర శనైశ్చరగ్రహ గోళములు దివ్యప్రభలతో వెలుగు చుండును. ముత్యములవలె మిణుకుచు, వజ్రాదిరత్నములవలె దీప్యమాన కాంతులతో తేజరిల్లుచు నక్షత్రములు మహావైభవముతో దివమందు జిగజిగ మెఱయుచున్నవి. వీనితో కూడుకొనిన నభోరంగము రాత్రులందు మహోజ్జ్వల దీప్తులతో ప్రకాశించుచుండును ఇట్లు వెలుగొందు ఖగోళమును జాగ్రతగా పరిశీలనచేయువారి కందరికిని ఒక్కొక్క గోళ మెన్నెన్నో సంగతులు బోధింపగలదు. చడి, చప్పుడు లేకుండ నిశ్శబ్దముగా వినువీథిని సంచరించుచున్నట్లు మనకు తోచ వచ్చును. కాని యవి నిజముగా నిశ్శబ్దముగా నిశాచారము చేయుట లేదు. విశ్వమునందున్న సమస్త భువనములను, గోళములను పుట్టించి

క్రమము తప్పకుండ నడిపించి యేలు నెల్లయేలిక యొక్క మహిమ మును కీర్తించుచు నియమితమార్గముల ననుసరించి సంచారము గావించుచున్నవి. ఆ పరాత్పరు డెప్పు డేమి చేసినను ఎంతో చక్కగా చేయగల మహిమాఢ్యుడని యవి నిరంతరము తెలుపుచున్నవి.

విశ్వచతుర్వివరములు–పునరవలోకనము :

శ్రీవిష్ణు భగవానుని పరమపదము దివమునకు చక్షురింద్రియము వలె ముఖ్యాంగము. విశ్వమున కదే కేంద్రము. విశ్వమనెడి మహా సామ్రాజ్యమునకు రాజధాని అదియే. అది యెక్కడ నే సరిహద్దుల మధ్యనున్నదో తెలిసికొనుట ముఖ్యమని ఒకొక్క ముఖ్యచిహ్నమును, చుట్టుగల సరిహద్దుల వివరములను తెలిసికొంటిమి. పునరవలోకనముచే మనకు తెలియవచ్చిన విజ్ఞాన విషయములు స్థిరపడి మనహృదయ సీమలను దృఢముగా నాటుకోగలవు కావున నొక్కసారి పునశ్చరణ చేయుదము.

ఈ మండలమునకు *పడమటి భాగమున* నెప్పుడును దేవసన్నిభు లగు సప్తఋషులు నుందురు. వారికి దిగువ దక్షిణముగా వాయు దైవత్యమైన స్వాతి నక్షత్రమున్నది. స్వాతీ నక్షత్రస్వరూపుడగు వాయు దేవుడు నిత్యమును విష్ణుదేవుని ప్రక్కనుండి ఆ దేవదేవుని సదా సేవించు చుండును. విష్ణుపార్శ్వవర్తి యగుటచే వాయుదేవుడు విష్ణు ద్వార పాలకుడు. వాయువు ద్వారానే పరమపదప్రాప్తి.

*మీదిభాగమున* శేషుని ఫణములు, ఉత్తర కిరీటము, తేనె పెఱ వంటి గుండ్రగుత్తి చుక్కలగుంపు. అక్షయమధుస్థానము పొడవు మిగి లిన పొందమ్మిపూతెలి మట్టు. చతుర్ముఖ బ్రహ్మ, వీణపాణి సరస్వతి. అభిజిన్నక్షత్రము. విద్యుత్తరంగాళితో విశ్వమున కంతకును శబ్దవ్యాపన స్థానము (Celestial Broadcasting Station.)

చూర్పున రాజహంస, గరుడి, క్షీరోదము. దివిజగంగా ప్రవాహము. దానికావల భూరిశృంగములతో గోబృందము.

*క్రిందిభాగమున శేషుని మడుగుపాన్పు.* ఇందు పెక్కు మడతలతో పాన్పు ఏర్పడినది. పాశ్చాత్యులు **Serpens, Ophiuchus** మండలపు చుక్కలని వేరువేరుగా చూపునట్టి చుక్కలన్నియు శేషశయ్యలో చేరినవి.

ఈ ఖగోళ దృశ్యములమధ్య, దివమునకు నేత్రమై విశ్వరక్షకుడున్నాడు. ఈ సరిహద్దులమధ్య నాతని పరమపదమున్నది. ఋగ్వేదము మానవజాతి కిచ్చు సందేశ మిది. విశ్వమునగల సమస్త భువనములకు గోళములకు, సమస్త చరాచరవస్తు జాతమునకు ప్రాదుర్భవస్థాన మిది. అంత్యమున గమ్యస్థానమిది. విశ్వకేంద్రమిది. విశ్వసామ్రాజ్యమునకు రాజధాని యిది. ఈ సందేశమును విష్ణుపురాణము, భాగవతము ధ్రువపఱుచుచున్నవి. శేషశాయి చిత్రపటములో నడుగున కుడితట్టున నలువురు మహాఋషుల రూపములున్నవి. వారు విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, మేధాతిథి, దీర్ఘతముడు నను వారు. విశ్వసమస్య షాధించిన వైజ్ఞానికోత్తములు శేషశాయి చిత్రమున కడుగున టెలిస్కోపుతో ఖగోళ పరిశోధనచేయుచున్న వ్యక్తి సర్ విలియమ్ హెర్షెల్ దొరగారు 1788 సంవత్సరములో తొలుత నతడు యంత్ర సహాయముతో సూర్యకుటుంబ గమ్యస్థానమునుగూర్చి తెలిపెను. హెర్షెల్ ప్రక్కనున్న వ్యక్తి సైమన్ న్యూకూంబ్ దొరగారు సూర్యుడు వేగా నక్షత్రముచెంత కరుగుచున్నట్లు నిర్ధారణ చేసినాడు.

పాశ్చాత్య వైజ్ఞానికులు సూర్యకుటుంబము మాత్రము ఉత్తర దిశకు విష్ణుని పరమపద సమీపమునకు పోవుచున్నట్లు తెలిసికొనిరి. మన మహాఋషులు సూర్యకుటుంబ మొక్కటేగాక, సప్తమరుత్తులు, అష్టవసువులు, నవబ్రహ్మలు, నేకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు లోనగు దేవకోట్లు, ఈ సమస్త విశ్వమును విష్ణుని పరమపదము

మండిరమే అనించి, తుదకచ్చటకేపోయి చేరువని తెలిపిరి. ఈ సంగతులు విశ్వరూపసందర్శన ప్రకరణములో నీదిగువ వివరముగా చదువుదము. విశ్వోత్పత్తి విషయముమగూర్చి వ్యాకరణశాస్త్ర మేమితెలుపుచున్నదో ముందుగా పరికించి చూతము.

## వ్యాకరణరీత్యా విశ్వోత్పత్తి క్రమము :

శ్రీహరి, వాసుదేవ, నారాయణ పదములు విష్ణుదేవుని ఇతర నామములనుట సుప్రసిద్ధము. డాక్టరు భండార్కరుగారు 'వైష్ణవ మత, శైవమతము' లను గూర్చి గొప్ప గ్రంథమును రచించిరి. ఆ గ్రంథముయొక్క ముప్పదవ పుటలో వారు 'నారాయణ శబ్దము'ను గూర్చి చర్చించుచు, నారాయణశబ్దము 'నాదాయన' శబ్దము వంటిదే వని తెలిపిరి. అందునుగూర్చి పతంజలి మహాభాష్యము IV-1-99 చూడ నగునని కూడ తెలిపియుండిరి. గోత్రనాదాయన రూపముతో నాదా యన నారాయణ శబ్దములను సమన్వయింపనగుననిరి. అంత్య ప్రత్యయ మును బట్టి సమన్వయము ముఖ్యమనియు, నాదము లేక పెక్కు నాదము లేకేంద్రమున చేరుకొనునో, ఆ బిందువు ఆ లక్ష్యస్థానము నే నాదాయన మనదగుననియు వారుగ్గడించిరి. శబ్దవ్యాప్తి పరిభాషలో నానాముఖముల చెదిరిపోవు శబ్దతరంగజాలమంతయు కూడుకొనెడి కేంద్రము (sound focus) కూడలిస్థానమును నాదాయన మందురు. అదేవిధముగా నారాయణ శబ్దముమగూర్చి కూడ తెలియనగును. 'నృ' అనెడి సంస్కృత శబ్దమునకు నరులు, దేవతలు అనికూడ అర్థము వేదములో కలదు. దేవతలకును, నరులకును కూడ తుది కూడలిస్థానము 'నారాయణ' శబ్దవాచ్యము. ఇందునుగూర్చి మనుధర్మశాస్త్రము I-10 యును, దానిపై మేధాతిథి వ్యాఖ్యయు కూడ చూడనగును.

విశేషించి మహాభారతము - శాంతి పర్వము, నారాయణీయ మను నుపపర్వము XII-341 లో శ్రీకృష్ణు డర్జునునితో నరులు మాన

వులందరకును తానే గతియు, గమ్యస్థానమునని చెప్పియున్నాడు. అదియునుం గాక ప్రళయ జలములతో నారాయణునికి సంబంధము కలదు. జలములు నారలు ; నారలు పరాత్పరుని అయనము కావున విష్ణుడు నారాయణు డనబరగెను. సృష్టిలో సమస్తమును అతని పరమపదము నుండి ప్రభవించి తుద కచటకే చేరుకొనుచున్నది. ఆ స్థానము దివమునకు చతుర్వనతగియున్నది. నారాయణ శబ్దార్థ మిది. ఇంకను భాగవతము II-౬-15, 16, 17 శ్లోకము లిట్లు తెలుపుచున్నవి:

15. నారాయణపరా వేదా దేవా నారాయణాంగజాః
నారాయణపరా లోకా నారాయణపరా మఖా.

వేదములన్నియు నారాయణుని గూర్చి తెలుపుచున్నవి. అతని ఓజస్సును తేజస్సును వివరించి తెలుపుచున్నవి. బ్రహ్మ, ఇంద్ర, రుద్రాది దేవత లందరును నారాయణావయవ సంభూతులు. లోకములన్నియు నారాయణునిచే సృజింపబడినవి. పరిపాలింపబడుచున్నవి. రక్షింపబడు చున్నవి. తుద కాతనిలో లీనముకాగలవు. రాజసూయాశ్వమేధాది మహాయజ్ఞములన్నియు భక్తితో నా దేవుని పూజించుటకు సాధనములు.

16. నారాయణపరో యోగో నారాయణపరం తపః
నారాయణపరం జ్ఞానం నారాయణపరా గతిః.

భక్తి జ్ఞాన, కర్మయోగాది యోగసాధనములన్నియు నా దేవుని తెలిసికొని స్తుతించుటకు మార్గములు. అతని యందే దృష్టి నిలిపి, అతనినే ధ్యానించుచు చేయు జపతపాదు లాతని నన్వేషించి తెలిసి కొనుటకు సాధనములు. నీతులు, నియమములు, మ్రొక్కుబడులు, చాంద్రాయణాది వ్రతములు, కుచ్ఛ్రోపవాస నిరాహారదీక్షలు లోనగున వన్నియు నా పూజ్యపాదుని యారాధన విశేషములు.

17. తస్యాపి ద్రష్టు రీశస్య కూటస్థా స్యాఖిలాత్మనః
సృజ్యే సృజామి సృష్టోహ మీక్షయై వాభిచోదితః.

ఎన్నటికిని మార్పులేనివాడు, నిత్యుడు భగవంతు డొక్కడే. అతనిచే సృజింపబడిన యీ సమస్తమును అనిత్యము. అనగా నెప్పుడు నేదో మార్పు చెందుచుండును. శాశ్వతముగా నొకే రీతిని ఉండవు, ఉండజాలవు. సమస్తాంతర్యామి విశ్వాత్ము డీశు డొక్కడే నిత్యుడు.

ఋగ్వేదమునందు విష్ణుప్రభావమును వర్ణించు మంత్రరాజముల మరికొన్నింటిని స్మరించి యీ ప్రకరణమును ముగింతము.

ఋ-I 22 18 "విష్ణు ర్గోపా"

I 154 4 "ఏకో దాధార భువనాని విశ్వా"

I 156 3 "మహాస్తే విష్ణో సుమతిం భజామహే"

III 54 8 "ఏజ ద్ధ్రువం పత్యతే విశ్వ మేకం
చరత్పతత్త్రి విషుణం విజాతం"

III 55 10 "విష్ణు ర్గోపాః పరమం పాతిపాథః
ప్రియా ధామా న్యమృతాదధానః
అగ్నిష్టా విశ్వా భువనాని వేద
మహా ద్దేవానా"

VII 99 2 "న తే విష్ణో జాయమానో న జాతో
దేవ మహిమ్నః పరమం తమాప
ఉది స్తభ్నా నాక మృష్వం బృహంతం
దా ధర్థ ప్రాచీ కకుభం పృథివ్యాః"

ఓ విష్ణు భగవానుడా! పుట్టినవారిలో, పెరిగినవారిలో నీమహత్త్వమును పూర్తిగా తెలిసికొనినవా రొకరైన లేరు. భూలోకము యొక్క తూర్పు అగ్రమును పదిలపఱచి, భూమిపై నాకమును స్థిరముగా నిలిపిన శిల్పివి నీవే!

X 129 7 "యో (అ) స్యాధ్యక్షః పరమే వ్యోమన్"
పరమవ్యోమమున నీ నేత్రమే ఈ విశ్వమును ఏలుచున్నది.

★

శ్రీ

# జ్యోతిర్వేదము

## ఆఱవ ప్రకరణము

"ఏమి నీ ప్రవృత్తి?"

"నేను కాలుడను ; జగత్సంహారకారకుడను !"

సర్ జేమ్సు జీన్సుదొర పేరు ఈ గ్రంథమునందు తఱచుగా వినబడుచున్నది. అతడు గొప్ప గణకుడు; సుప్రసిద్ధ జ్యోతిశ్శాస్త్రవేత్త. పండితపామరరంజకముగా వైజ్ఞానికోపన్యాసము లిచ్చుచు నుద్గ్రంథములు రచించి ఈ మధ్యనే దివంగతుడైనాడు. అతడు రచించిన 'Mysterious Universe'అను గ్రంథము జగత్ప్రసిద్ధము.'మిస్టీరియస్' అను నాంగ్ల పదమునకు నిగూఢము, సమర్మము అని యర్థము. విశ్వమునకు చాలుము·లమేదో, విశ్వరచనోద్దేశమేదో తెలియరాదు. భాగవతములో నారదుడు బ్రహ్మను "నీ కేలాభము రాదలంచి జగముల్ నిర్మించెదవు ?" అని పృచ్ఛించెనని గలదు. ఆదేవిధముగా విశ్వరచనకు హేతువేమి ? సృష్టి ఉద్దేశ మేమి? యని జిజ్ఞాస గలిగి నవీన విజ్ఞాన విశేషములు సాధనముగా గొని యా సమస్య సాధింపదలచి జీన్సుదొర విశ్వమర్మమును గూర్చి యుద్గ్రంథ రచనకు గడగెను. ఆ గ్రంథము యొక్క పదునాల్గవ పుటలో విశ్వమునుగూర్చి అత డీ క్రింది వాక్యములు రచించెను.

'విశ్వపరిమాణముతో సరిచూచినపుడు, ఒక యిసుకరేణువులో ప్రయుతాంశమాత్ర పరిమాణముగల యీ భూగోళముమీద నిల్చి, దేశకాలబద్ధమై దాని నావరించి చుట్టుకొనియున్న యీ విశాలసృష్టి యొక్క స్వభావమెట్టిదో, ఎందు కీసృష్టి కావింపబడెనో యోజించి చూచినపుడు మన మనస్సులు ముందు భయభ్రాంతములగుచున్నవి.

విశ్వము బహుభీతి గొల్పుచున్నది. మనమేల భయభ్రాంతులము కావలెను ? ఏ కారణములచేత విశ్వము భయంకరమై తోచవలెననగా :

1. విశ్వమునందుగల గోళములమధ్య నపారముగా వ్యాపించి యున్న దూరము తలచుకొనినపుడు మతిబోయి భయముపుట్టుచున్నది. 2. కాలగతి యోజింతుమా, దానికిని పార మగపడదు. మానవోత్పత్తి యైనది మొదలు నేటివఱకు గడచిన చారిత్రక యుగములన్నియు కలిపి లెక్కించినను, కాలపురుషుని ఱెప్పపాటు కాలమైన కాజాలదు. అనంత మగు నీ కాలగతిచింతించినను భయోత్పాతము కలుగుచున్నది. 3. మన ఏకాకిత్వము తలచుకొనినను భయము జనించుచున్నది. కష్టసుఖ ములు చెప్పికొందమన్నను మన కిరుగుపొరుగు నెవ్వరునులేరు. భూగోళ మున కతిసమీపముననున్న చంద్రగోళము సకుటు సుమారుగా మనకు రెండు లక్షల నలుబదివేలమైళ్ల దూరమున నున్నది. సూర్యుడు 9 కోట్ల ఇరువదిలక్షల మైళ్లదూరమున నున్నాడు. భూమికంటె ఏకాకులెవరు?* 4. విశ్వములో భూమికి ఊరా ? పేరా ? ఎంతఅల్పము ! ఎంత చులు కన ! ఎంత లాఘవము ! భూగోళముమీదగల సమస్త సముద్రతీరము లందును కల ఇసుకనొకచోట కుప్పవోసి ఆ కుప్పను విశ్వముతో పోల్చితి మేని, అందొక్క యిసుక రేణువునందలి ప్రయుతాంశమైన కాజాలదు ఈ భూమి. విశ్వములో భూమి కీ లెక్కను ఎంతచిన్నతనము? 5. భూమి పైగల ప్రాణికోట్ల జీవములకు ప్రోత్సాహ పోషణములిచ్చి అభి మానముతో ప్రకృతి ఆదరించుజాడలు కానరావు. భావరాగములకు, విజయశీలురకు, మహోత్సాహులకు, కళాప్రవీణులకు, ఉన్నతాదర్శకు లకు ఇట్టివారి కెవరికి నే విధమైన పక్షపాతము కనబఱచుట ప్రకృతి

---

*Crashaw (Age of Tennyson P. 384.) quotes From Tennyson's Marguerite.

"Yes in the sea of life enisled
With echoing straits between us thrown
Dotting the shoreless watery wild
We mortal millions live ALONE.

యుద్దేశ మనజనము. ఉత్తములనిపించుకొను మానవుల విషయమే కాదు. సామాన్యజనులైనను ఉంటే ఉండనిమ్ము, పోయిన పోనిమ్మను నలక్ష్యభావమే సృష్టిక్రమములో విశదమగుచున్నది. 6. అంతేకాదు. అలక్ష్యమనుటకంటె ప్రకృతి ప్రాణికోట్లపై శత్రుత్వము వహించి పని చేయు చున్నదనియే చెప్పలెను. ఏమనగా, గోళమునకు గోళమునకు మధ్య గల ఖాళీప్రదేశము బహు శీతోపేతము. గడ్డకట్టిన మంచులో నున్న నీటు కంటె యీ ఖాళీలో సుమారు నాలుగువందల డిగ్రీలు వేడి తక్కువ, చలి యధికము. అంతటి చలిలో నేప్రాణియు మనజాలదు. పారములేని మహాకాశములో నచ్చటచ్చట చెదరియున్న గోళములలో వ్యక్తమగు వేడిమి బహుదారుణము. ఆ గోళములు మఱుగుచున్న నీటి కంటె వేలు, లక్షలు, కోట్లు రెట్లధికోష్ణమున కాకరములై యున్నవి. అట్టి గోళములలో నేప్రాణియు జీవింపగలుగుట మన యనుభవమును బట్టి అసంభవము. ఇందు కొన్ని గోళముల నుండి వెడలు కిరణము లితర గోళములపై ప్రసరింపజేయు కిరణములు దారుణముగా ప్రాణుల హింసించి చంపునట్టివి. వీటినన్నిటినిబట్టి చూడగా ప్రకృతిలో ప్రాణుల పోషించి పెంచి రక్షించు సాధనముల కంటె ప్రాణులను హతమార్చి, హింసించి, నాశనముచేయగల శక్తు లత్యధికముగా నున్నవనక తప్పదు."

జీన్సుదొరగారు పైన తెలిపిన ప్రతి వాక్యమునందును ఎంతో అర్థమున్నది. పంచ ఖండ పంచ మహాసముద్ర ముద్రితమైన యీ భూగోళ మెంతో పెద్దదని భ్రమపడితిమి. మన యిండ్లు, వాకిండ్లు, చెట్లు, చేమలు, మేడలు మిద్దెలు- పేటలు కోటలు- గ్రామములు, నగరములు, కొండలు, పెండెలు, అడవులు, అఖాతములు, రాష్ట్రములు, దేశములు, ఖండములు- అబ్బో! ఎన్నెన్నో భూమి మీద నున్నవి. చెన్నపురి, కలకత్తా నగరముల మధ్యదూరము సుమారు వేయి మైళ్లు. భూమి చుట్టుకొలత ఇరువదియైదువేల మైళ్లు. చెన్న

పట్టణ, కాశీఘట్టముల మధ్యదూరమున కంటె భూగోళపు చుట్టు కొలతఇరువదియైదు రెట్లు మాత్ర మధికము. గంటకు ముప్పదిమైళ్లు చొప్పున నెక్కడ నాగక పోవు మెయిలుబండి ప్రపంచమును చుట్టివచ్చుటకు 85 రోజులు పట్టవచ్చును. ఆ బండి యదేత్వరతో సూర్యగోళము నొకసారి ప్రదక్షిణించివచ్చుటకు పది సంవత్సరములకు తక్కువకాదు. సూర్యుడు మన భూగోళము కంటె పదమూడు లక్షల రెట్లు పెద్దదైన మహాగ్నిగోళము. అటువంటి సూర్యుడు, అగస్త్య, ఆర్ద్ర, జ్యేష్ఠాది మహాకాయ నక్షత్రముల యెదుట నొక మిణుగురు పురుగైన కాజాలడు-అంతే. సూర్యు డంతమాత్రుడే. సూర్యగోళము నకు సృష్టిలో "ఉప్పును, పత్రియు" కనబడవు. విశ్వములో సూర్యుడు ఊరుం బేరునులేని యనామకు డనవలసివచ్చుచున్నది. సూర్యుని కంటె పదమూడు లక్షల రెట్లు చిన్నదైన మన భూగోళము మాట యేమి? అయ్యో! మనభూమి ఎంతో పెద్దదని మురిసిపోతిమే! విజ్ఞానమభివృద్ధి యైనకొలది మనభూమి కెంత చిన్నతనము ప్రాప్తించినది? తలచుకొనిన జాలియగుచున్నదే! ఒక మట్టియుండ! ఎంతలాఘవము! గొట్టికాయంతైన కాదే! అన్ని సముద్రముల యొడ్డునగల యిసుక రాసులన్నియు విశ్వమనుకొనినచో, అందొక్క రేణువులో ప్రయుతాంశ పరిమాణమైన మనభూమికి లేదని జీన్సు దొరగారు చాటి చెప్పినారు. అట్లు పట్టుకొని గొరగొర యీడ్చినట్లు సూర్యుని సకుటుంబముగా సెకండుకు పండ్రెండు మైళ్ళు, గంటకు నలుబదిమూడువేల మైళ్ళు, దినముకు పదిలక్షల మైళ్ళకు తక్కువగాని గంభీరవేగముతో తనవంకకు లాగుకొను నా విష్ణుదేవుని పరమపదసామర్థ్య మెట్టిదో యోచించి చూడవలదా! ఇట్టి యద్భుతబలవేగములుగలిగి, అతికాయ మహాకాయులట్లు మహా పరిమాణములుగలిగి వెలవుగొల్పు బ్రహ్మాండ జ్యోతిర్గోళములను తలచుకొన్నను, వాని యెదుట మిసపగింజకంటెను కనాకష్టమైన భూగోళము యొక్క అల్పత్వ, అసహాయత్వ, ఏకాకిత్వములం దలంచుకొనినను,

ఆ గోళముపై నివసించు ప్రాణికోట్లను హింసించి రూపుమాపుటకు నలుదెసలనుండి ముట్టడించుచు సంకటకిరణములబంపు శత్రుగోళ వాహిమలం దిలకించినను, మనకు భయోత్పాతము తప్ప వేరేమి కలుగును? ఎన్నిగోళములమధ్య నీ భూగోళగింజ గలదో ?

## విశ్వమునగల గోళబాహుళ్యము :

ఈ గోళబాహుళ్య మెంతకలదో ఊహించుకొనుటకు అలింగ్ హామ్ (**Allingham**) మహాకవి రచించిన పద్యార్థము నిట వ్రాయుచున్నాను. "సముద్రోదకము నేలందాకుచోట భూమిపై నెల్లయెడలం గల యిసుక రేణువులను లెక్కింపుడు; సమస్త సముద్రోదకములంగల నీటి బొట్ల నొకొక్కచే లెక్కవేయుడు; భూమిపైగల ప్రతివృక్షము యొక్క ఆకుల సంఖ్య ఎంతో నిర్ణయింపుడు; ఈ గోళముపై నెగురు పక్షులు, ప్రాకు సరీసృపములు, సంచరించు సమస్తజంతుజీవులు, జలరాసుల నీది బ్రదుకు యావజ్జలచరములు వీని సంఖ్య మొత్తమెంతో తేల్చి చూడుడు. రేణు సంఖ్య, జలబిందు సంఖ్య, చెట్ల ఆకులసంఖ్య, సర్వప్రాణుల సంఖ్య కలిపి కూడి మొత్తము తెలిసికొనుడు. ఆ సంఖ్య కధికముగా సూర్యగోళములు నాకమున తేజరిల్లుచున్నదను నిక్కువము గ్రహింపుడు. ఒకొక్క. సూర్యునిచుట్టూ గ్రహకుటుంబము కలదనియు, ఒకొక్క గ్రహము అఖండత్వరతో నా యా సూర్యుని చుట్టు పరిభ్రమించుచుండునని భావింపుడు. దృశ్యాదృశ్య విశ్వము, భావితము, అభావితము అంతయు నొక లంక. అనంత విశ్వసముద్రములో నొక ద్వీపము.

ఈ భావమునకు ప్రాధాన్యమిచ్చి ఇటీవలి వైజ్ఞానికులు కొందఱు బ్రహ్మాండ పరిమాణయుతములగు చుక్క మబ్బులకు "ద్వీప విశ్వములు" (**Island Universes**) అను నామ మిడిరి.

**అర్జునుడు సందర్శించిన విశ్వరూపము :**

పవిత్రమైన కురుక్షేత్రమునందు పాండవ కౌరవవ్యూహములు ఒండొంటికెదురుగా యుద్ధ సన్నద్ధములై యున్నవి. ఆ సమయమున నర్జునుడు పరమకృపాపరుడై శౌర్య ధైర్యములన్విడిచి యుద్ధవిముఖుడై చతికిలబడెను. భయభ్రాంతుడైన పాండవవీరుడు, అర్జునుని చిత్రము శేషశాయి పటములో విశ్వామిత్రాది ఋషీశ్వరులు నలువురి ప్రక్కన చూడనగును. శ్రీకృష్ణభగవాను డప్పుడాతనికి విశ్వరూపము ప్రదర్శించి కౌరవపక్షమును నిర్మూలించి ధర్మసంస్థాపన చేయుటకు యుద్ధమవశ్యకర్తవ్యమని యుపదేశించెను. విశ్వరూపము సందర్శించి యర్జునుడు మిగుల భయభ్రాంతుడయ్యెను. వైజ్ఞానికదృష్టితో విశ్వరూపమును సందర్శించి జీన్సుదొరగూడ భయభ్రాంతుడయ్యెనని మనము పైన చదివితిమి. చర్మచక్షువుల కసాధ్యమైన విశ్వరూపమును యంత్రసాధనములతో పరిశీలించి, విశ్వము యొక్క యథార్థస్థితి వైజ్ఞానిక దృష్ట్యా తెలిసికొని, జీన్సుదొర భయభ్రాంతుడయ్యెను. శ్రీకృష్ణభగవానుని కటాక్షపాత్రుడై అర్జునుడు విశ్వరూప సందర్శనభాగ్యము నొందగలిగెను. ఏ విధముగా తెలిసికొనినను, సత్యమొక్కటియే. పరమపదస్థుడగు పరాత్పరుడు వేలకొలది సూర్యమండలము లేకమైనట్లు దుర్నిరీక్ష్య తేజోమయుడై వెలుగుచున్నట్లు అర్జునునికి కానవచ్చెను : అతని యొడలు గగుర్పాటుచెందెను. తమ్మిపూవుపై నధిష్ఠించిన చతుర్ముఖుడు బ్రహ్మ, సప్తఋషులాదిగా సమస్త ఋషులు, దివ్యసర్పములు మొదలగునవి పెక్కుదృశ్యము లాపార్థుని కగపడెను. ఇవన్నియు మనమీ వఱకు చర్చించి తెలిసికొనిన ఖగోళదివ్యదృశ్యములే. "త్వ మక్షరం పరమం వేదితవ్యమ్। త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ । త్వ మవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా । సనాతన స్త్వం పురుషో" అను సత్యము అర్జునుని కపుడు బోధపడెను. దేవసంఘములు, చేతులు జోడించి భయ

భక్తులతో నా పురుషోత్తముని చేరవచ్చుచుండుట అర్జునుడు స్పష్టముగా చూచెను. సప్తమరుత్తులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు లోనగు దేవతలు పరమపద ప్రాప్తులగుచుండుటకూడ ఆతని కగపడెను. విశ్వనాథుని భయంకరరూపము చూచి లోకములు తల్లడిల్లుచుండ నర్జునుడు ప్రవ్యథితాత్ముడై భయకంపితగాత్రుడయ్యెను. యుద్ధభూమిలో కనబడుచున్న దేవతాంశ సంభూతులందరును పరాత్పరుని వదన గహ్వరములంజొచ్చి చూర్ణిత గాత్రులగుచుండిరి. పరస్పర స్పర్థచే మహానదులనేకములు సముద్రమును చొచ్చునట్లే దేవతలును, దేవతాంశ సంభూతులును నఖండత్వరతో విష్ణుపదప్రాప్తు లగుట సవ్యసాచి కనులార గాంచెను. అటనుండి వెడలు దేదీప్యమానమైన ప్రభలకు ఆగజాలక, మహోర్వులతో మండిపోవుట కూడ విజయుడు కనుగొనెను. "భగవాన్! ఘోరరూపము దాల్చి సమస్తమును భస్మీభూతము చేయుచున్న నీ వెవరో నేను తెలిసికోలేకున్నాను. నీ వెవరు? ఇట్లు కావించుటలో నీ ఉద్దేశ మేమి?" అని అర్జును డడుగగా "నేను కాలుడను; లోకక్షయకారకుడను. జగత్సంహారమే నా ప్రవృత్తి" అని భగవానుడు ప్రత్యుత్తర మిచ్చెను.

శ్రీకృష్ణపరమాత్మ కటాక్షమువలన విశ్వస్వరూపమును కనుగొనగల్గినాడు, పాండవవీరు డర్జునుడు; కుశలురగు వైజ్ఞానికులు నిర్మించిన యంత్ర సాహాయ్యముచే విశ్వరూపమును సందర్శించినాడు, వైజ్ఞానికుడు జీన్సుదొర. భూగోళ ఖగోళ వ్యాప్తమైన విశ్వముయొక్క యథార్థస్థితి తెలిసికొని ఉభయులును భయభ్రాంతులైనారు. జాలి, కనికరము లేక, ఎవరియందును పక్షపాతములేక, ప్రాణుల హింసించి జగత్సంహారముచేయుటే సృష్టియుద్దేశమని ఉభయులకు తేటతెల్లమైనది. విశ్వమర్మముయొక్క యథార్థస్థితి, నిత్యమైన సత్యము వారుగ్రహింపగలిగిరి. మతదృష్టితోను విజ్ఞానదృష్టితోను తెలిసికోదగినది సత్యము. సత్యము ఒక్కటే. **Hindu Religion is a relentless pursuit**

**after Truth.** నిర్దాక్షిణ్యముగా వెంటాడి సత్యమును గ్రహించునదే హిందూమతమని గాంధీమహాత్ముడు చాటి చెప్పెను. విజ్ఞానమంతయు సత్యాన్వేషణపరము. ఏ విధముగా తెలిసికొనినను శాశ్వతమైన సత్యమొక్కటియేగాని వేరు కాజాలదు. వాఙ్మయముకూడ శుద్ధసత్యమునే విశదము చేయుచున్నది; కాని స్వల్పభేదము గలదు. దానిని గమనించుట ముఖ్యము. వాఙ్మయము పాకముపట్టిన సత్యము. సత్యమయ్యు, నుద్వేగకరముగాక, ప్రియము, హితమునైన సత్యము వాఙ్మయము. తుదకు మత, విజ్ఞాన వాఙ్మయములు సత్యబోధకములే. విజ్ఞానము వలన వ్యక్తమగు సత్యము పొడిదుమ్ములవలె ఆకర్షణీయము గాదు వాఙ్మయము విశదముచేయు సత్యము రసవంతమై, కళాప్రపూర్ణమై ఆకర్షణీయముగా నుండును. ఋజువుకోరని విశ్వాసముతో కూడుకొనిన శుద్ధసత్యము మతసత్యము. బహుకాల పరిశోధనా ఫలితముగా తెలియవచ్చిన సత్యము, చప్పగ ననాకర్షణీయమైన సత్యము విజ్ఞాన సత్యము. హృద్యమై రసవంతమైన సత్యము వాఙ్మయ సత్యము. మూడింటి సారము పరీక్షించిన యెడల తుదకు మూడును ఒక్కటే కాని వేరుకావని స్ఫుటముగా తెలియనగును. వైజ్ఞానికమతము **(Scientific Theory)** ను డాక్టరు డింగిల్ గారిట్లు నిర్వచించిరి—"విశదమైన శుద్ధసత్యమును సచేతనసృష్టి సౌందర్యముతో శృంగారించి కళాశిల్ప ప్రౌఢిమ మెఱయ ప్రదర్శింపబడినపుడది వైజ్ఞానిక మత మననొప్పును". ఇదే మన వేదపురాణ వాఙ్మయ స్వరూపము.

శ్రీ

# జ్యోతిర్వేదము

## ఏడవ ప్రకరణము

**చతుర్వ్యూహములు :**

"చూడు నాయనా! భగవంతు డవలంబించు పద్ధతులలో మనకు తెలిసినది బహుస్వల్పము; అతని మహామహిమము రవంత మాత్రమే, ఏకాంత మట్లూ మన చెవుల పడుచున్నది." —బైబిల్.

రాత్రివేళ ఖగోళమును పరిశీలించునపుడు మన కగపడు జ్యోతిర్విశేషములను మూడు తరగతుల క్రింద విభజింపనగును.

(1) సూర్యకుటుంబమునందలి గ్రహాదులు: చంద్రుడు భూమి చుట్టు తిరుగు నుపగ్రహము. సూర్యకుటుంబములోని బుధ, శుక్ర, కుజ, గురు, శనైశ్చరాది గ్రహములును, కుజ గురుల మధ్య భిన్నమై పోయిన గ్రహ కణములును, ధూమకేతు, ఉల్క, మహోల్కాపాతములును ఇవన్నియు సూర్యకుటుంబములోనివి. ఈ కుటుంబమున చేరినవన్నియు మన యిరుగు పొరుగు వనదగియున్నవి. ఇరుగు పొరుగులకును, భూగోళమునకును మధ్య దూరము లక్షల మైళ్ల సంఖ్యను దాటి కోట్లు, శతకోట్ల మైళ్లలో నుండును. అయినను కొన్ని నక్షత్రములు కోటానకోట్ల సంఖ్యలను మించిన మైళ్లదూరమున నుండుట చేతను, వానికంటె ఇవి బహు సమీపములే యని చెప్పతగియుండుట చేతను, గురు శుక్రాదులు మన భూమి కిరుగుపొరుగు ననుకొనవచ్చును.

(2) సూర్యకుటుంబమున కావల నక్షత్ర రూపమున వెలుగుచు స్పష్టముగా కానవచ్చు తారా సమూహములు: వీనిని ఖగోళవేత్తలు నూటపది గుంపులుగా విభజించిరి. క్రాంతిచక్రమునందలి ఇరువదియేడు

గుంపులును, పన్నెండు రాసులును, సప్తఋషి మండలములోనగు నుత్తరాకాశపు చుక్కలును, దక్షిణాకాశమున మెఱయు పెక్కు తారా సముదాయములును— అన్నియు నిందు చేరియున్నవి యంత్ర సాహాయ్యములేని మానవ నేత్రములకు ఈ చుక్కలు ఎనిమిదివేలకు పైగా కనబడగలవు.

(8) క్షీరోదము, క్షీరవాహిని, పాలవెల్లి, పాలపుంత మొదలగు పేళ్లు గల ధవళ దృశ్యము: తెల్లగా నున్నవి పాలు అనుకొనుట అమాయక లక్షణము. తెలతెల్లగా కనబడుటచేత దీనిని పాలవెల్లి యనిరి కాని నిజముగా నిందు పాలులేవు. నేతిబీరకాయలో నేయి లేదు బంగారపు పిచ్చుకవద్ద బంగారములేదు. పాలసముద్రమునందు పాలును లేవు. ఇందు పెక్కుచుక్క లున్నవి. ఊహింపరానంతదూరమున నవి లెక్కింప తరముగాని యపారసంఖ్యాకములై సాంద్రతర ధవళదృశ్య ముగా నేర్పడి పాలసంద్రమను భ్రమగొల్పుచున్నవి చుక్కలమూకలు దట్టముగా క్రమ్ముకొని పాలమున్నీరట్లు కనబడుచున్నవి. ఇవన్నియు మనకండ్ల కగపడు ఖగోళ విశేషములు.

ఇవిగాక మరొక వర్గములో చేర్చి చెప్పవలసిన చుక్కగుంపు లున్నవి. మామూలుగా కండ్లకగపడు నూటపదిగుంపుల చుక్కలకును, పాలవెల్లికిని మధ్య కోటానకోట్లు చుక్క లున్నవి. క్షీరోదమునందు కంటె ఈవర్గపు చుక్కలసంఖ్య తక్కువ. ఇవి మూకలుగా నేర్పడ జాలవు, ధవళఛాయ స్ఫురింపచేయజాలవు. మామూలుగా కనబడు చుక్కలకంటె అవి చాల దూరమునందున్నవి కనుక వేర్వేరుగా చుక్కలవలె అవి కంటబడజాలవు. పైని పేర్కొనిన నాలుగువర్గముల ఖగోళ దృశ్యములును క్షీరోద మావరించుకొని యున్నది. ఇవి యెల్ల నందు చేరినవే. ఈవర్గము అన్నిటితో కూడుకొని చక్రాకారము కలిగి యున్న మండలమునకంతకును పడమటివారు **Galactic Wheel** అని పేరిడిరి. క్షీరోదచక్రమని వ్యవహరింతము. నేమి యనబడు

ళ్ళకమ్మి మాదిరిగా క్షీరోదము ఈ చక్రమును చుట్టియున్నది. ఈ చక్రము నిశ్చలమై పాతుకొనియుండలేదు. దీనికి చలనము కలదు. ఏబదికోట్ల సంవత్సరముల కొకసారి తనలో తానిది తిరుగుకొనును. మామూలుగా మనము చూచు బండి చక్రమువలె నిది దేనిమీద నుండియో దొరలిపోవునట్టిదికాదు. దీని యంతర్భాగములు కూడ చలనశీలములు. బండిచక్రమునకు మధ్య కుంచమువంటి రూపముగల గుండ్రపు పడి యున్నట్లే క్షీరోదచక్రమునకును మధ్య హబ్ (hub) అనబడు కుంచముకలదు. దీనికి సమీపముననున్న చక్రభాగములు ఎక్కువ త్వరగాను, దూరముగా అంచు సమీపముననున్న భాగములు మందముగాను కదలుచుండును. ఇట్టి గమనమువలన ముఖ్య ఫలితములు ప్రాప్తమగుచున్నవి. చంద్రుడు భూమ్యాకర్షణమునకు లోబడినను భూమిమీద పడిపోక, స్వకీయ గమనమునుబట్టి క్షేమముగా భూమి చుట్టు తిరిగి వచ్చుచున్నాడు. అందువలన భూగోళ చంద్రగోళములు రెండును ఢీకొనవు; సంఘట్టన ప్రమాదమునకు దూరములై రెండు గోళములు క్షేమముగా నున్నవి. అట్లే భూమి సూర్యుని యాకర్షణమునకు లోనైనను, సూర్యగోళముపై పడిపోక తొమ్మిది కోట్ల మైళ్ల దూరమునుండియే సూర్యునిచుట్టు ప్రదక్షిణము చేయుచున్నది. అదేవిధముగా క్షీరోదపు చివర నంచుకమ్మి కడ నక్షత్రాదులును స్వకీయగమనము కలవై క్షీరోదపు కుంచము మీద పడిపోక నిలువగల్గుచున్నవి.

క్షీరోదచక్రమును గూర్చి బహుకాలము పలువురు జ్యోతిశ్శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన ఫలితముగా తేలిన ముఖ్యాంశ మేమనగా: ధనుస్సు రాశికిని, శేషాహి మండలమునకును మధ్య సాంద్ర మేఘచ్ఛన్నమైనట్లు తోచు పట్టున నీ క్షీరోదపు కుంచమనదగు నాభిస్థానము దాగియున్నది. జీన్సుదొర రచించిన 'నక్షత్ర గతు'లను పుస్తకములోని 83-84 చిత్రపటములలోను, 'విశ్వరూపము' 115 పుటలో వ్రాసిన విషయములలోను ఈ యంశము సిద్ధాంతముచేయబడినది.

సూర్యునితోపాటు మనమీపట్టున ముఖ్యముగా మూడు తారా సముదయములను గూర్చియు వాని పరస్పర సంబంధములను గూర్చియు చర్చించి తెలిసికొనుట మిక్కిలి యావశ్యకమైనది.

1. సూర్యుడు 2. ధ్వనియనెడు ధనుస్సురాశి 3. శేషాహిమండలము 4. విష్ణు వీణామండలములు.

ఇందు విష్ణుభగవానుడు క్షీరాబ్ధిశాయి; అనంతపద్మనాభుడు; ఆ దేవోత్తముని నాభికమల సంజాతుడు—పద్మాసనుడు, చతుర్ముఖుడు. వీణపాణి, వాణి అతనిరాణి.

శేషాహిమండలము విష్ణునిశయ్య ; మడుగుపాన్పు.

ధన్వియనగా మన్మథుడు; బ్రహ్మ, మన్మథులువిష్ణుదేవుని కుమాళ్లు. విష్ణుభగవానుడే యాదవకులేశుడై శ్రీకృష్ణుడై జన్మించెను. విష్ణుదేవుని అవతారములలో శ్రీకృష్ణావతారము చాల ముఖ్యమైనది.

"సఏషభగవాన్విష్ణుః కృష్ణేతి పరికీర్త్యతే
అనాద్యంత మజం దేవం ప్రభుం లోకనమస్కృతః"

మహాభారతము. అరణ్య 271—72

విష్ణువు కృష్ణుడై యవతరించినపుడు, అతని కుమారుడు మన్మథుడు ప్రద్యుమ్నుడై జన్మించెను. ప్రద్యుమ్నుని పుత్రుడు అనిరుద్ధుడు. అనిరుద్ధుడు బాణాసురుని పుత్రిక ఉషను ప్రేమించి ఆమె యంతఃపురమున నుండుటచే కృష్ణునికి, బాణాసురునికి, ఘోరయుద్ధమయ్యెను. బాణు డీశ్వరభక్తుడగుటచే, శ్రీకృష్ణుడు పార్వతీపతితో పోరాడెను. ఈ యంశములు భాగవతమున దివ్యముగా రచింపబడినవి.

మనసూర్యుడు ఉషస్సును ప్రేమించి ఆమె వెంటబడుటను విషయము వేదములో పెక్కుచోట్ల వర్ణితము. సూర్యు డనిరుద్ధుడై బాణాసురతనుజ ఉషాకన్యను ప్రేమించినట్లు పురాణవర్ణన.

సూర్యుడు - ఉషస్సు అనిరుద్ధుని తండ్రి ప్రద్యుమ్నుడు - మన్మథుడు
అనిరుద్ధుడు - ఉషాకన్య మన్మథుడు - ధన్వి : ధనుస్సురాశి.

ధమస్సు శేషాహిమండలమధ్య క్షీరోదవారి స్థానము కలదు. శేషుడు సంకర్షణుడు. విష్ణుదేవుడు రాముడైనపుడు సంకర్షణుడు లక్ష్మణుడయ్యెను; కృష్ణావతారమున బలరాముడయ్యెను. కాబట్టి అనిరుద్ధ, ప్రద్యుమ్న, సంకర్షణ, వాసుదేవులకు క్రమముగా, జ్యోతిశ్శాస్త్ర సూర్య, ధన్వి, శేషమండల, విష్ణుమండలములతో సంబంధము కలిగియున్నదని స్పష్టమయినది. వాసుదేవుడను నామము శ్రీవిష్ణునామ సహస్రములలో నొకటి. వసుదేవసుతుడుగాన కృష్ణుడు వాసుదేవుడు జ్యోతిశ్శాస్త్రరీత్యా సూర్యుడు ధన్వితో సంకర్షణు నాశ్రయించి పరమపదమును చేరుకొనుట సత్యము. ఈ సత్యమును చతుర్వ్యూహ భావన విశదముచేయుచున్నది. చూ. భాగ. XII. 11-22

"వాసుదేవ స్సంకర్షణః
ప్రద్యుమ్నః పురుషస్స్వయమ్
అనిరుద్ధ ఇతిబ్రహ్మన్ మూర్తి
ర్వ్యూహో (అ) భిధీయతే.

ఈ శ్లోకములో సూర్యునికి, ప్రద్యుమ్న, సంకర్షణ, వాసుదేవులతో కల సంబంధమును, జ్యోతిశ్శాస్త్ర దృష్టిలో చతుర్వ్యూహ సరణియు విశదముచేయబడినవి. ఈ సంబంధమును సువ్యక్తముచేయ గల వాక్యములు కొన్ని మహాభారత శాంతిపర్వము, నారాయణ సంహిత 344 అధ్యాయమునుండి వ్రాయుచున్నాను—

మరణానంతరము జీవులు ముందు సూర్యలోకమును చేరు చున్నవి. సూర్యుడు ఊర్ధ్వలోక ద్వారమున నున్నాడు. అచట పాపము లన్నియు భస్మము చేయబడును. ఇట్లు పాప విముక్తులై పరమాణు రూపమున నట కొంతకాలముండి, పిమ్మట వెలువడి అనిరుద్ధులై జరత్వము వీడి, స్థూల ద్రవ్యసంబంధము విసర్జించి ఆధ్యాత్మికశక్తితో ప్రద్యుమ్నుని చేరుకొనును. అనంతరము సంకర్షణు నాశ్రయించి ఉత్తమజీవులై, గుణత్రయ విముక్తులై పరమపదప్రాప్తు లగుదురు."

*డాక్టరు భండార్కర్ గారు చేసిన వాసుదేవశబ్ద నిర్వచనము—*
"వేదప్రసిద్ధుడు విష్ణుమూర్తి; విశ్వాత్ముడు, తత్త్వఘనుడు, నారాయణుడు; వాసుదేవుడు చారిత్రాత్మకముగా వృష్ణివంశ సంభవుడు. హరికులేశుడు; వసుదేవసుతుడు, శ్రీకృష్ణుడు. పిమ్మట వైష్ణవమత చరిత్రలో వీరందరు నొక్కటిగానే భావింపబడుచున్నారు. పాణిని వ్యాకరణమునకు మహాభాష్యము వ్రాసిన పతంజలి IV-2-98 సంఖ్య గల సూత్రభాష్యములో నిట్లు వివరించెను. "ఈ సూత్రములో తెలుపబడిన వాసుదేవుడు పూజ్యపాదుడు, పరాత్పరుడు" అని స్పష్టముగా తెలిపెను. పాణినికి ముందునుండి మనదేశములో వాసుదేవుని ఆరాధించుచున్నారు. పాణిని వ్యాకరణమునందేగాక, ఇంక నవేక శిలాశాసనాదులలో వాసుదేవ ప్రశంస అగపడుచున్నది. మతదృష్టిలోను, చరిత్ర దృష్టిలోనేగాక, వైజ్ఞానికముగా కూడ వాని కమిత ప్రాముఖ్యము కలదు.

1. రాజపుత్రస్థానమున గల ఘోసుంది శాసనములలో లూథర్ దొర సంగ్రహించినవానిలో నెం 61 రు సంఖ్యగల శాసనము వాసుదేవ సంకర్షణ వ్యూహములచుట్టు గోడ కట్టబడినట్లు తెలుపుచున్నది. ఈ శాసనము క్రీస్తు పూర్వము రెండువందల యేండ్ల నాటిది.

2. పై శాసన సంగ్రహములోనే 669 వ సంఖ్యగలది బెస్నగరు శాసనములో దేవదేవుడగు వాసుదేవునికి గరుడ ధ్వజప్రతిష్ఠను గూర్చి ప్రశంస కలదు. ఇది క్రీస్తుపూర్వము రెండవశతాబ్ది నాటిది. ఆ కాలమున నీ దేశములో వాసుదేవపూజకు మంచి వ్యాప్తి కలదు.

3. పై శాసన సంగ్రహములోనిదే నెం 1112 రు సంఖ్యగల శాసనము. ఇది క్రీస్తు పూర్వము మొదటి శతాబ్దిలో నానాఘాట్ సమీప గుహలలో నున్న శిలాశాసనము. ఇందు సంకర్షణ వాసుదేవులు ద్వంద్వసమాసములో పేర్కొనబడిరి. వృష్ణివంశోద్భవుడైన వాసుదేవుడే పాణిని వ్యాకరణములోను, పతంజలి మహాభాష్యములోను

కూడ పేర్కొనబడినాడు. సంశయములేదని భండార్కరుగారు వ్రాయు చున్నారు. ఏమనగా ఇందు వాసుదేవ బలదేవ శబ్దములు అవ్యవధాన ముగా కూర్చబడినవి. బలదేవ వాసుదేవులు అన్నదమ్ములు. వసుదేవుని పుత్రులు. కాబట్టి విష్ణు, నారాయణ, వాసుదేవ శబ్దము లొక్క దేవుని నామములే కాని వేరుకాదని భండార్కరుగారు సిద్ధాంతము చేసినారు. కృష్ణుడు క్రీస్తు తరువాత నేడవ శతాబ్దములోని వాడని వ్రాయుట ఎంత యసందర్భమో పై శాసనాదులు తెలుపుచున్నవి.

## దేవతానృత్యము :

రాసక్రీడ - క్షీరోద చక్రభ్రమణ చిహ్నము

"పశ్యామ స్త్వాం పరమాకాశమధ్యే
నృత్యంతంతే మహిమానం స్మరామః
సర్వాత్మానం బహుధా సన్నివిష్టం
బ్రహ్మానంద మనుభూయానుభూయ
యోగాత్మనాం నృత్యన్తం దివ్యనృత్యం."

"ఓ దేవా ! పరమాకాశ మధ్యమున నీవు దివ్యనృత్యము గావించుట కనులార చూచితిమి. సర్వాంతరాత్ముడవై యనేకవిధముల నీ దృశ్యప్రపంచమున గోచరించు నిన్ను స్మరించుచున్నాము. బ్రహ్మా నందామభూతిగల నిన్ను సేవించుచున్నాము" అని నటరాజమూర్తిని గూర్చి ఒక భక్తుడు స్తవము చేసెను.

భాగవతములో రాసక్రీడ అభివర్ణింపబడినది. పదునారువేల మంది గోపికలతో కూడి కృష్ణభగవానుడీ రాసకేళి సల్పెనట! ఇద్దరు గోపికల మధ్య కృష్ణుడు ఇద్దరు కృష్ణుల మధ్య నొక గోపిక ఈ విధ ముగా చక్రాకారముగా నిల్చి వాద్యగతములో నృత్యము చేసిరట!

జాతక మీమాంసము గూర్చి పెద్దగ్రంథమును రచించిన అలెన్ లియో (Alan Leo) దొరగారు ఆ గ్రంథముయొక్క 244 వ పుటలో

రాసలీలను గూర్చి యిట్లు వ్రాసియున్నారు. "ఈనాటికిని ముఖ్యముగా రాజస్థానములో ఏటేట రాసలీలామహోత్సవము జరుగుచుండును. జ్యోతిశ్శాస్త్ర దృష్టిలో కృష్ణుడను సూర్యునిచుట్టు గ్రహనక్షత్రాది జ్యోతిర్గోళము లనెడి గోపికలు పరిభ్రమించుచుండుట కిది యొక చిహ్నము. ఇట్లునృత్యగీతములతో మండల పరిభ్రమణములు గావించుట ఇతర దేశములలో కూడ గలవు. ఎమెజాను (Amazons) లను స్త్రీలు ముఖ్యదేవతా ప్రతిమచుట్టు నృత్యగీతములతో నిట్లు తిరుగుదురు. షిల్లో పుత్రికలు కావించినట్లు బైబిలు Judges అధ్యాయములో చెప్పబడిన పరిమండల నృత్యముకూడ ఇట్టిదే. మఱియు 'డేవిడ్' నామకు డగు రాజు Ark అనబడు పెద్ద యోడచుట్టు ప్రదక్షిణము చేసిన వృత్తాంతము Iris unveiled అను గ్రంథము యొక్క రెండవ సంపుటము 45, 881. 882 పుటలలో కలదు. అదియు నిట్టిదే.

లియో దొరగారికి కొక నమస్కారము. రాసక్రీడకు జ్యోతి శ్శాస్త్రార్థమున్నదని వారు వ్రాసినారు. సంతోషము. కాని కృష్ణు డను సూర్యుని చుట్టు తిరుగు గ్రహ నక్షత్రాదులనెడి గోపికలు పరిభ్ర మించుట కిది చిహ్నమను వాక్యముతో మే మేకీభవింపజాలము. అసలు సూర్యుని చుట్టు గ్రహములు తిరుగుచున్నవనుట యుక్తమే కాని అశ్వి న్యాది నక్షత్రములును, ద్వాదశ రాసులును సూర్యునిచుట్టు పరిభ్ర మించుచున్నవనుట నిజముకాదు. సృష్టిలో సూర్యుడొక మిణుగురు పురుగని ప్రాచీన వేదఋషులు కంఠోక్తిగా తెలిపిరి. నవీన వైజ్ఞానికు లా సత్యమును ధ్రువపరచినారు. కుంజర యూథము దోమ కుత్తుక జొచ్చె నన్నట్లున్నది సూర్యుని చుట్టు నక్షత్రగోళములు పరిభ్రమించు చున్నదని దొరగారు వ్రాసిన వాక్యము. బ్రహ్మాండ పరిమాణయుతము లైన ఆర్ద్రా, జ్యేష్ఠాది మహాకాయ గోళములు ఈ మిణుగురు పురుగు చుట్టు తిరుగుచున్నవా? తిరుగుచున్నవనుట సబబుకాదు- నిజముకాదు. ఆ వ్రాతకు నా యసమ్మతి తెలిపి గట్టిగా ఖండించుచున్నాను.

రాసక్రీడ యొక్క అంతరార్థము లియో దొరగారు చెప్పినది కావేరదు. దానిం గ్రహించుటకు మనము క్షీరోద జిజ్ఞాసచేయవలసి యున్నది. రాసక్రీడ గోకుల బృందావనమున జరిగినది. అందు శావలసి నన్ని పాలు; ఆ సీమయంతయు నత్యంత మాధుర్యముతో కూడుకొని యున్నది. రాసక్రీడ సల్పినవారు శ్రీకృష్ణుడు, గోపికలు; విశ్వములో సమస్త భువనములకు గోపుడు శ్రీకృష్ణుడు. ఆ గోపునిచే సంరక్షింప బడుచున్న జ్యోతిర్గోళములు గోపికలు. క్షీరోదచక్రస్థములగు గోళము లన్నియు గోపికలనెడి సంజ్ఞచే సూచింపబడినవి. ప్రతి గోళమును మధుర గీతము లాలాపించుచు భ్రమ పరిభ్రమణాదుల నొందుచున్నది. ఆ గోళ గీత విశేషములు పుణ్యాత్ములకేగాని చెనటిచెవులకు వినపడవు. క్షీరోద పరివేష్టితములైన గోళములు గోపికలు; గోపికల మధ్య గోపుడు శ్రీకృష్ణుడు. ఏబదికోట్ల సంవత్సరముల కొకసారి పూర్తిగా తిరుగు క్షీరోద చక్రగతికి రాసక్రీడ ఒక చిహ్నము, ఒక సంజ్ఞ. ఈ మండల పరిభ్రమణములో నొకొక్కప్పుడు ఒకొక్క ప్రదేశమున నుండి యొక్కొక్క విధమున కానవచ్చుచుండును. ఆ యా సమయములందా యా గోళముల తీరు, అవి ప్రదర్శించు వైఖరి మొదలగునవి పట్టి చూడగా, ఒక్కొక్క గోళమనెడి గోపిక పెక్కు విధముల నభినయించుచు, అనింద్య శృంగార భావమును ప్రదర్శించు విశ్వగోపుని ప్రేమ చూరగొను భాగ్యము బడసినదన నొప్పుచుండును. ఈ జ్యోతిర్గోళ గోపికల సౌందర్యము అభినయ శృంగారము లోనగు విశేషము లన్నియు నీ క్రింది శ్లోకమున బహు హృద్యముగా వర్ణింపబడినది.

శ్లో. అంగప్రత్యంగ గౌణస్ఫుట సమ
విషయవ్యంజకవ్యక్తి సిద్ధైః
శృంగారాద్యై రనింద్యై రధిక
మభినయం వ్యంజయంత్యో యువత్యః

రాసక్రీడా విలాసై ర్వసభువి
నితరాం మాధవం తోషయంత్యః
తుష్టాః స్వైరా రమన్తే చిర
మహిగురుణా శ్రీధరేణా ప్తకామాః॥

చంద్రుడొక్కొక్కనా డొకొక్కకళ ప్రదర్శించు కాలగతిచే కలుగు స్థానభేదముచే కళలు భేదించును. అట్లే ఒకానొక సమయమున నొక జ్యోతిర్గోళముయొక్క దర్శనీయాకృతి ఒకొక్క గోపికయొక్క అభినవ వైఖరిగా భావించి, గానముతోకూడిన చలనము నృత్యమను కొని జ్యోతిర్గోళ సహితమగు క్షీరోదమును, ఆమధ్య వెలయు పరాత్ప రుని సందర్శించుచు పై శ్లోక మన్వయించుకొనినపుడే రాసక్రీడయొక్క జ్యోతిశ్శాస్త్రార్థము గ్రహింపగలము. యంత్రములో చూడనక్కర లేక నే ఎనిమిదివేల నక్షత్రములను మన కనులతో మామూలుగా చూచి లెక్కింపవచ్చును. కనబడినవి ఎనిమిదివేలు, కనబడనివి మరొక ఎనిమిది వేలుండునను భావముతో పదారువేలమంది గోపికలని రాసక్రీడలో గోపికలసంఖ్య చెప్పబడెనేమో!

బృందావనము, క్షీరోదము, రాసక్రీడ, వీనినిగూర్చిన యీ క్రింది శ్లోక పాదములు, శ్లోకములు, పద్యములు చదువతగినవి :

శ్లో. అయం క్షీరాంభోధేః
పతిరితి గవాం పాలక ఇతి...

శ్లో. చాపల్యసీమ చపలానుభవైకసీమ
చాతుర్యసీమ చతురాననశిల్పసీమ
సౌరభ్యసీమ సకలాద్భుతకేళిసీమ
సౌభాగ్యసీమ త దిదం వ్రజభాగ్యసీమ.

శ్లో. అంగనామంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాన్తరేణాంగనా

ఇత్థమాకల్పితే మణ్డలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః.

గీ. గోపజనములందు గోపికలందును
సకల జంతులందు సంచరించు
నా మహాత్మునకు పరాంగనలెవ్వరు
సర్వమయుడు లీల సలిపెగాక.

ఉ. బాలికులైన గోపకులు బంధులు పాళెము గొల్లపల్లె ము
త్యాల సరాలు దామెనలు తారలు గోపిక లంగరాగమున్
శైల విటంక ధాతువులు చారువిభూషలు పింఛదామముల్
పోలినవైన విష్ణుడను బుద్ధి నెఱుంగరు రెల్ల పెద్దలున్.

★

శ్రీ

# జ్యోతిర్వేదము

## ఎనిమిదవ ప్రకరణము

"అహోరాత్రే పార్శ్వే నక్షత్రాణి రూపమ్."

విశ్వప్రభుని శాహ్యారూపము నక్షత్రస్వరూపమా? సూదిమొనల వలె, ఆవగింజలవలె మిక్కిలి చిన్నవైన చుక్కలు దేవత లగునా? చుక్క లెక్కడ, దేవత లెక్కడ? అని విమర్శకులు నా యుపన్యాసములు వినిన తరువాత నన్ను ప్రశ్నించుట యీ తెనుగుదేశములో పరిపాటియైనది. ఈ ప్రకరణములో దేవత లెవరు? అనుసంశయమును నివృత్తిచేయుటకు శృత్యాదిప్రమాణము లిచ్చి ప్రయత్నింతును.

దేవ శబ్దము 'దివ్' అను సంస్కృత మూలమునుండి యేర్పడిన రూపము. 'దివ్' అనగా మెఱయుట, ప్రకాశించుట. దివ-దివ్య శబ్దము లను గూర్చి **Macdonell** దొర సంస్కృత నిఘంటువులో నిట్లు వ్రాసెను. చూ. 119-20 పుటలు—తేజస్సును వెలువరించుట, ప్రకాశించుట, స్వర్గము, ప్రభ, ఉజ్జ్వలమైన కాంతి; దివ్య మనగా దేవతా సంబంధముగలది, నాక సంబంధమైనది. మహనీయమైనది దేవ-స్వర్గ సంబంధము, దైవసంబంధముగల, నాకలోకమునకు చెందిన, దేవత, దైవము, దేవత్వము.

మఱియును శ్రీ శ్యామశాస్త్రిగారు **Vedic Iconography** ని గూర్చి, **Oriental Art Journal, X** వ సంపుటములో దేవశబ్దమునకు తేజోవంతమై ప్రకాశించునది యని యర్థము వ్రాసిరి. నక్షత్రము, మెఱయునది, వెలుగు, పున్నమనాడు పూర్తిగా వెలిగి అమావాస్యనాడగపడక మధ్యదివములలో మధ్యతేజస్సుతో వెలుగు చంద్రునివల్లే

ఆకాశమున మెఱయుచు, నొకప్పుడు కనబడకపోవుచు నభోరంగమున సంచరించునది అని కూడ దేవశబ్దమునకు వా రర్థములు వ్రాసిరి. నక్షత్రము లాకాశమున మెఱయుచుండును. చూచుటకు చిన్నవై నట్లు కనబడినను అవి బ్రహ్మాండ పరిమాణముగల మహాగోళములని మన మీ గ్రంథములో పలుసార్లు చదివితిమి. మన సూర్యు డొక చిన్న చుక్క. నక్షత్రములు గొప్ప సూర్యగోళములు. మన సూర్యునిగూర్చి మన కేమి తెలియును? వైజ్ఞానికదృష్టితో పరిశీలించి చూడవలయును. మన సూర్యుడు ఎనిమిదిలక్షల అరువదినాలుగు వేల మైళ్ల వ్యాసమును, ఇరువదియైదులక్షల మైళ్ల కైవారమునుగల గొప్ప గోళము. మహాగ్ని మయము. తీవ్రార్చులతో మండు వాయుపదార్థములు. ధాతుసంబంధ మైన ఆవిరులు మొదలగువానితో కూడుకొనియున్నది. సూర్యగోళము భూగోళము కంటె పరిమాణమున పదమూడు లక్షల రెట్లు పెద్దది. సూర్యు డిచ్చు తేజోష్ణవిద్యుత్కాంతశక్తుల మూలముగా భూమిమీద సమస్త ప్రాణులు జీవింపగలుగుచున్నవి. వెనుక సూర్యకాంతి ప్రసరించుటచే జీవింపగల్గిన వృక్షజీవుల దారువులలో సూర్యుడు ప్రసాదించిన శక్తులు ఇమిడి దాగియున్నవి. అట్టి వృక్ష సమూహములు నేలలో పూడియుండి యుండి రాక్షసిబొగ్గు క్రింద మారును. నేడు మానవు లీ కట్టెలను బొగ్గును కాల్చి ఆహార పదార్థములను పచనముచేసి తినుచు యంత్రములు నడుపుకొని, వానిచేత కావలసిన పనులను చేయించుకొని సౌఖ్యపడుచున్నారు. ఈ పనులన్నియు జరుగుటకు కావలసిన శక్తి, క్రియానిర్వహణసామర్థ్యము. వెనుకటి కాలములలో సూర్యకిరణము లీ భూమిపై ప్రసరించుటచేత వృక్షజీవులు సంగ్రహించి భద్రపఱచి యుంచినవి. మన కిపుడు వాని ద్వారా లభించుచున్నది. ఆనాడు వృక్షజీవులు సంగ్రహించి, నిలువచేసి దాచిపెట్టిన శక్తులను ఈనాడు మనము నిత్యావసరముల కొఱకు వినియోగించుకొనుచున్నాము. వృక్షజీవుల పైని ఓషధుల పైని సూర్యరశ్మి ప్రకాశించుటచేత నే

సమస్త జంతువుల ప్రాణధారణకును, మానవకోట్ల ప్రాణధారణకును ఆవశ్యమైన ఆహారమంతయు లభించుచున్నది. ప్రొద్దున సూర్యునితో మానవులును లేచుచున్నారు; సూర్యుడస్తమించుటతో మానవులును పనులు చాలించుకొని విశ్రాంతికరుగుచున్నారు. ప్రత్యక్షముగానో, పరోక్షముగానో మన జీవితములో ప్రతిక్షణమును సూర్యునిపై నాధారపడియున్నది. ఇట్టి వనేక విషయములు యోజించి చక్కగా తెలిసికొని మనవారు "సూర్యాత్మః జగతః" అనిరి.

ఇది సృష్టిలో నొక సూర్యుని విషయము ఇటువంటి సూర్య గోళములు విశ్వములో ననంఖ్యాకములున్నవి. "నస్తదిశో నానా సూర్యాః" అని బ్రహ్మాండ పరిమాణము గల సూర్య గోళములను గూర్చియు అవి నక్షత్రరూపములగుటను గూర్చియు వేదఋషు లెన్నో పరిశోధనలు చేసి తెలిసికొనిరి. ఏ ఋతువులో ఏ నక్షత్రము ఉదయించు వేళకు భూమి మీద నెట్టి పరిస్థితు లేర్పడుచున్నవో ఆ వివరములను చక్కగా తెలిసికొని, ఆయా నక్షత్రముల కా యా దేవతలతో నవినా భావ సంబంధము కలిగియుండుట భావించి కృషి కార్యక్రతు విధానములు నా మహనీయు లేర్పాటుచేసిరి. తైత్తిరీయ సంహితలో గల నక్షత్ర ఇష్టి నుండి మంత్రములను తఱుచుగా గైకొని, ఏ నక్షత్రమునకు ఎవ్వ రధిదేవతయో నిశ్చయించుకొనుచుండిరి. ఏ విధముచేత చూచి నను నక్షత్రములుదేవతలమటలో నాశ్చర్యపడవలసినపని లేదు. ఇదివఱకు కొన్ని విషయములను చర్చించితిమి. మరికొన్ని వివరముల నీ క్రింద తెలిసికోగలము.

1. తైత్తిరీయ ఆరణ్యకము. బ్రహ్మమేధము. పురుషసూక్తములో, ఆ పరమ పురుషునకు అహోరాత్రములు పార్శ్వములు. రూపము నక్షత్రములు "అహోరాత్రే పార్శ్వే నక్షత్రాణి రూపమ్" అని స్పష్టముగా కలదు.

2. విష్ణుపురాణము. II. 98. విష్ణుపద మిట్లు నిరూపింపబడినది.

ఊర్ధ్వోత్తరాం ఋషిభ్యస్తు
ధ్రువోయత్రాస్తి వై స్మృతమ్
పత ద్విష్ణుపదం దివ్యం......

ధ్రువమండలమునకు పైగా, సప్తఋషిమండలమునకు ఉత్తరముగా ఎగువ విష్ణుపదమున్నది.

3. శ్రీమద్భాగవతమునకు శ్రీధరాచార్యులవారు వ్రాసిన వ్యాఖ్యలో V 28. "తథాతై ర్నక్షత్రరూపైః" అను వాక్యరత్నము ఉన్నది. ధ్రువు డొక నక్షత్రము. సప్తఋషులు నక్షత్రములు; అగస్త్యుడు నక్షత్రము. రుద్రదైవత్యమైన ఆర్ద్ర నక్షత్రము. కార్తీకసోమవారము సాయంకాల మీ రుద్రదర్శనము చేసి కాని ఆస్తికులగు శివభక్తులు భోజనములు చేయరు. ఇంద్రుడు జ్యేష్ఠనక్షత్రము. ఇట్టి దేవసన్నిభులు దేవతలు, వీరందరు నక్షత్రస్వరూపులు కాగా విష్ణుపుమాత్ర మేల నక్షత్ర స్వరూపుడు కాకూడదు ?

4. విష్ణు సహస్రనామ స్తోత్రములో విష్ణుదేవునకు 'నక్షత్రనేమీ' అనియు, 'నక్షత్ర' అనియు రెండు నామము లగపడుచున్నవి.(చూ. 60వ శ్లోకము) ఈ పదములనుగూర్చి స్వాధ్యాయ బ్రాహ్మణమున నిట్లు వ్యాఖ్యానము గలదు :

"జ్యోతిషాంచక్రభ్రామయన్, తారామయస్య శింశుమారస్య పుచ్ఛదేశే వ్యవస్థితో ధ్రువః తస్య శింశుమారస్యహృదయే జ్యోతిశ్చక్ర నేమి వర్ణ నేవత్ ప్రవర్తకస్థితో విష్ణురితి నక్షత్రనేమీ శింశుమారస్య హృదయ విష్ణుర్హృదయమ్" ఇతి స్వాధ్యాయ బ్రాహ్మణే శ్రూయతే॥

ఈ భావము భాగవతము పంచమస్కంధములో శింశుమార చక్రవర్ణనమునందు విపులీకరింపబడినది. శ్రీనాథమహాకవి శృంగార నైషధములో (చూ. VII-18)

"శింశుమారాకారంబువం దారకామూర్తియై పవ్వళించిన పాంచజన్యధరుని చరణ పల్లవంబు ప్రక్షాళించుచు" అని స్పష్టముగా వ్రాసియున్నారు.

విష్ణుపదము ఖగోళమున నుత్తరాకాశమున నున్నట్లు మరి రెండు ప్రమాణములలో మాత్రము చూపి, యీ చర్చ ముగింతును.

భస్మాసురవరము: భస్మాసురుడను రాక్షసుడు శివునిగూర్చి గొప్ప తపస్సుచేసెను. శివుడు ప్రత్యక్షమై వరము కోరుకోమనగా "ఎవని శిరస్సుపైనాచేయిపెట్టినను, ఆశిరస్సుతో నావ్యక్తి భస్మముకావలెను" అని వరమర్థించెను. 'ఇచ్చితిని'అని శివుడు వరమిచ్చెను. "వరమునిజమో! కాదో! దాఖలా చూడవలెను" అనుచు నా రాక్షసుడు వరప్రదాత శిరముపైనే తన చేయిపెట్ట బూనెను. హడిలిపోయి పోయి శివుడు ఉత్తరదిక్కునకు పరువెత్తెను. అసురుడు వెంటదగిలెను. పరమపదము చేరి అందొక పొట్లకాయలో దూరి శివు డదృశ్యమయ్యెను. అతని దురవస్థకు జాలిపడి, విష్ణువు మాయమాటలాడి భస్మాసురుడు తన హస్తము తన శిరస్సుపైనే పెట్టుకొనునట్లు చేసెను. దానితో భస్మాసురుడు భస్మమయ్యెను. భస్మాసురుడు వెనుదగిలినపుడు ఈశ్వరుడుత్తరదిక్కునకు పరువెత్తినట్లు తెలుపు శ్లోకము లీ దిగువ వ్రాయుచున్నాను.

భాగ-X-88-24 తేనోపసృష్టః సంత్రస్తః పరాధావన్ స వేపథుః
యావదన్తం దివో భూమేః కాష్ఠానా ముదగాదుదక్.
25 అజానన్తః ప్రతివిధిం తూష్ణీమాసన్ సురేశ్వరాః
తతో వైకుణ్ఠ మగమద్ భాస్వరం తమసః పరమ్.

భస్మాసురునికి వెఱచి శివుడు దాగొనిన పొట్లకాయజాతికి లింగ పొట్లకాయలను పేరు నేటికిని కలదు. రెండవది మార్కండేయోపాఖ్యానము. మార్కండేయుడు ప్రళయజలములపై బహుయుగములు చరించి తుదకు తూర్పు-ఉత్తర దిక్కున వటపత్రశాయియైన

విష్ణుభగవానుని సందర్శించెను. ఈశాన్యదిశ ఉత్తరమునకు-తూర్పునకు మధ్య మున్నది.

భాగ-XII-౯-20 న కదాచిత్ భ్రమంస్తస్మిన్ పృథివ్యాః కకుది ద్విజః
న్యగ్రోధ పోతం దదృశే ఫలపల్లవ శోభితమ్.

21 ప్రాగుత్తరస్యాం శాఖాయాం
తస్యాపి దదృశే శిశుమ్
శయానం పర్ణపుటకే
గ్రసన్తం ప్రభయా తమః.

ఈ ప్రమాణముల వన్నిటిని జాగ్రత్తగా పరిశీలించితిమేని విష్ణు భగవానుడు ఖగోళమున నుత్తరాకాశమున నక్షత్రరూపియై వెలుగొందుచున్నట్లు స్పష్టము కాగలదు.

ఈ విషయము నింకను బలవత్తరముగా ఋజువుచేయుటకు మరికొన్ని మంచిసాధనము లున్నవి. సంవత్సరము పొడుగునను విష్ణు దేవునికి ప్రీతికరముగా చేయబడు ఆరాధనలు, పండుగలు, పర్వములు, ఉత్సవములు, నిరాహార దీక్షలు, విందులు, సంతర్పణలు లోనగున వన్నియు ఈ విష్ణు నక్షత్రముల గమనరీతులం బట్టి ఏర్పడినవని తృప్తిగా ఋజువు చూపగలిగితిమేని ఈ విషయమును గూర్చి మరి యెవ్వరికిని ఎట్టి సంశయములు కలుగవవసరమే ఉండబోదు. కావున నా విషయ నిరూపణ ప్రారంభింతము.

## ఏకాదశులు :

ఒక మాసములో పున్నమనుండిగాని అమావాస్యమండిగాని లెక్కించగా వచ్చు పదునొకండవ దినము ఏకాదశి యనంబడుచున్నది. ఏకాదశి విష్ణువునకు ప్రీతికరమైనది కావున దానిని హరివాసర మందురు. ఏకాదశు లన్నియు విష్ణునక్షత్రముల గమనప్రకారముతో సంబంధము గలిగియున్నవి. మన శేషశాయి చిత్రపటములో స్వాతి

మొదలుగా శ్రవణము వఱకు గల నక్షత్ర సమూహము విష్ణుని రూప ములో చేరినదే. ప్రతి ఏకాదశియు శిష్టులకు ఉపవాస దినము. విష్ణు భక్తిగల ఆస్తికులందరు నాడు నిరాహారదీక్షలో నుందురు. మరునాడు ద్వాదశినాడు పారణచేయవలెను. బంధుమిత్రులతో విందారగించు చుందురు. సమర్థులగువారు సంతర్పణలను చేయుచుందురు. విష్ణునకు ప్రీతికరములైన ఏకాదశులలో ముఖ్యమగు కొన్నింటిని ఈ దిగువ విమర్శింతము. మఱియు నా దేవుని పరివారములో ముఖ్యులగు కొందరు దేవతలకు జరుగు పండగలనుగూర్చి కూడ అవకాశము చొప్పున మధ్య మధ్య ప్రసంగింతము.

1. ఆషాఢశుక్ల ఏకాదశి : ఈ ఏకాదశికి శయన యేకాదశి యని కూడ పేరు గలదు. శయనమనగా పండుకొనుట. ఈ యేకాదశి నాటి సాయంకాలము సూర్యాస్తమానము కాగానే, ఉత్తరాకాశమున శేషశాయి చిత్రములో చూపినట్లు విష్ణుమూర్తి పండుకొనియున్నాడని చెప్పనగును. నాటినుండి నాలుగు నెలలవఱకు విష్ణు భగవానుడు నిద్రలో నున్నాడని భావన. అప్పటినుండి చాతుర్మాస్యవ్రతము లారంభ మగును. వానకాలమగుటచేత ప్రయాణములు సాగుటకష్టము. ఊరూరు తిరుగు సన్యాసులు ఆనా డున్నచోటనే నాలుగు నెలలు ఉండిపోదురు. ఆ నాలుగు నెలలు పిమ్మట వర్షము లుండవుకావున నెప్పటివలె దేశసంచారమున కుపక్రమింతురు. ఆహారవిషయమున గృహస్థులు చాతుర్మాస్య వ్రతము నారంభింతురు. తొలివాన కురిసినపిమ్మట నెక్కడ చూచినను పచ్చని మొక్కలు, పాదులు మొలచును. వీని నాశ్రయించియున్న క్రిమికోట్లు దేహారోగ్యమునకు భంగము కలిగిం చును కావున నారోగ్య రక్షణమునకుగాను నాటినుండి యొక నెల రోజులు శాకపాకములను విసర్జింతురు. ఈ దినములలోనే సూర్యుడు దక్షిణాయనగతుడై కానవచ్చును. ఏటి కెదురీదినట్లు ఈ దక్షిణా యనము కష్టతరము. అనేక కార్యములకు అప్రశస్తము. విశ్వరక్షకుని నిద్రావస్థలో జగత్తు తారుమారయినట్లు తోపగలదు.

2. భాద్రపదశుక్ల ఏకాదశి : ఈ యేకాదశికి పరివర్తన ఏకాదశి యని కూడ పేరు గలదు. సంస్కృతభాషలో పరివర్తన యనగా తిరుగుట. విష్ణుభగవానుడు రెండు నెల లొక ప్రక్క పండుకొని పిమ్మట నొత్తిగిలి రెండవప్రక్కకు తిరిగి పండుకొనునని కొందరందురు. జ్యోతిశ్శాస్త్రరీత్యా, అంతవఱకు సూర్యాస్తమానము కాగానే పడమట వ్రాలియున్న విష్ణునక్షత్రము అప్పటినుండి పడమట నస్తమించి పిమ్మట కార్తికములో తూర్పున నుదయమగుటకు సిద్ధమగుచుండును. ఇట్లు పడమట నుండి విష్ణునక్షత్రములు తూర్పునకు మరలుటలో కలుగు మార్పు పరివర్తన యనబడుచున్నది. స్వాతి మొదలు శ్రవణమువఱకు విష్ణునక్షత్రములే యని మనము మరువరాదు.

**అనంతపద్మనాభ చతుర్దశి :**

పరివర్తన ప్రారంభమగు నేకాదశికి మూడు రోజుల తరువాత వచ్చు చతుర్దశి అనంతచతుర్దశి యనబడుచున్నది. అనంతశక్తిసంపన్నుడు, సర్వవ్యాపి, అపారకాలస్వరూపుడు నగు ననంతపద్మనాభదేవుని విష్ణుభక్తు లనేకు లానాడు పూజింతురు "దేవా! మాకు మేలుదలంచి శుభము లొసగి త్వరలో పునర్దర్శనలాభ మనుగ్రహింపు "మన్నట్లు భక్తు లానాడు అనంత పద్మనాభదేవుని పూజించి, అనంతవ్రత మాచరింతురు. ఆ దేవునికి ప్రీతిగా పొడి పట్టు దారముతో తయారుచేయబడిన పట్టు తోరములను ధరింతురు. పొడి పట్టుతోరము ధరించినచో మన శారీరక విద్యుచ్ఛక్తులు వెలికిపోయి వమ్ముగావు. మన శరీరము నంటియుండి మనకెంతో మేలుచేయును. విద్యుత్‌శక్తిని గూర్చి చదువుకొనినవారికి పొడి పట్టుదారము (Insulator విద్యుద్రక్షక)మని తెలిసియుండును. తత్పూర్వమొక సంవత్సరము ధరించుటచేత చివికి వానకారున జీర్ణమైన పాతతోరములను విసర్జించి, ఆనాడు క్రొత్త పట్టుతోరములు ధరించుట కర్తవ్యము.

### కార్తీక శుక్ల చతుర్థి :

ఈ చవుతికి నాగుల చవితి యని పేరు. ఆనాడు ఇంటింట నాగ పూజలు జరుగును. నాగేంద్రునికి 'నాగుల గావంచా' అనబడు నెట్టిగళ్ళ వస్త్రమిచ్చి, చలిమిడి చిమ్మిలి నైవేద్యముచేసి, కొందరు భక్తు లుపవాసము కూడ చేయుదురు. ఖగోళ దృష్టిలో ఈనాటి సూర్యోదయాత్పూర్వము శేషనాగుని ఫణములని చెప్పబడు నక్షత్రములు తూర్పున తొలుత పొడుచు దినము. 'ప్రాతారావ్యా నాగా ప్రథమా యజధ్వ' మను శ్రుతిప్రమాణము ననుసరించి యానాడు నాగపూజ విధింపబడినది. నేటికిని మనవారు ఇంటింట నీపూజ నీనాడు చేయుచున్నారు.

### కార్తీక శుక్ల ఏకాదశి :

శేషనాగుని ఫణుల సందర్శించిన యొక్క వారమునాటికే కార్తీక శుక్ల ఏకాదశినాడు శ్రీ విష్ణుభగవానుని శిరో నక్షత్రములు సూర్యోదయాత్పూర్వము తొలుత పొడుచును. దీనిని బట్టియే విష్ణు భగవానుడు నిద్రనుండి మేల్కాంచు దిన మిదియని నిర్ణయింపనైనది. ఈ విషయమును గూర్చి శేషధర్మమను గ్రంథ మిట్లు తెలుపుచున్నది :

శ్లో. ప్రసన్నమూర్తి ర్భగవాన్ కార్తిక్యాం భవతి ప్రభుః
తస్యాప్రసన్న దివసం ఉత్థానాఖ్యం విదు ర్బుధం
ఉత్థితే దేవదేవేశ శేషపర్యంకశాయినే
పూజయే త్తం ప్రయత్నేన పూజాభి స్తత్పదం ప్రవిశేత్ ॥

### మార్గశిరశుక్ల ఏకాదశి :

ఉత్థాన ఏకాదశి తరువాత సరిగా నొక నెలకు మార్గశిరశుక్ల ఏకాదశి రాగలదు. ఆ నాటి సూర్యోదయాత్పూర్వము తూర్పుటాకాశ

మున విష్ణుదేవుని నక్షత్ర శరీరములో కటిప్రదేశము వఱకు ఊర్ధ్వ దేహము కానవచ్చును. ఈ శుభదినమున నే శ్రీకృష్ణభగవానుడు అర్జును నకు భగవద్గీతోపదేశము చేసెను. కావున నీ యేకాదశికి భగవద్గీత ఏకాదశియనికూడ పేరున్నది.

భగవద్గీత విభూతియోగమునందలి ముప్పదియైదవ శ్లోకములో భగవానుడు "మాసానాం మార్గశీర్షోహమ్"—"మాసములు పండ్రెం డింటిలో మార్గశిరమాసము నేనునుమా" అని ఢంకామీద దెబ్బగొట్టి నట్లు చాటి చెప్పినాడు. ఎంత సాభిప్రాయముగా భగవాను డీ వాక్య రత్నమును ప్రకటించినాడు! పార్థుని సారథిగా నర్జునుని రథముపై గూరుచుండి గీతామృతము నుపదేశముచేయుచు శ్రీకృష్ణుడనినమాట యిది! సారథి దేహములో కటిప్రదేశమువఱకుగల నూర్ధ్వభాగమే ముఖ్యముగా కనబడును. సూర్యరథచోదకుడగు వనూరునికి తొడలు, పిక్కలు, పాదములుగల అధోభాగ మేర్పడనేలేదు. రథమునడుపు వానికి అధోభాగము లేకున్నను బాధలేదు. ఉన్నను సరిగా కనపడదు. మార్గశిరశుక్ల ఏకాదశినాటి యుదయమునకు ఖగోళమున పార్థసారథి కటిప్రదేశమువఱకు మాత్రమే కనబడును. అట్లు కనబడు దినముననే నర్జునునికి కృష్ణసారథిచే భగవద్గీత ఉపదేశింపబడుట గొప్ప ఖగోళ విశే షము. ఈ దృష్టితో నీ శ్లోకము నన్వయించుకొనుటలో సార్థకమైన విశిష్టతకలదని నా విన్నపము. లోకమాన్య బాలగంగాధరతిలక్ మహా శయుడు ఈ వాక్యము నాధారముచేసికొని నాలుగు సంవత్సరములు మిగుల పరిశ్రమచేసి వేదకాల నిర్ణయమునుగూర్చి ఓరైయాన్ (Orion) అను గొప్పగ్రంథము వ్రాసెను. ఆయన మహానుభావుడు. ఆయనకు భక్తితో నమస్కారము చేయుదును. ఆయన ప్రాతర్యావాణా ప్రథమా యజధ్వ మనెడు శ్రుతివాక్యముతో ఖగోళదృష్ట్యా ఈ వాక్యమన్వ యింపలేదు. ఖగోళదృష్టితో నీ వాక్యము నన్వయించుట అత్యవసరమని నా విన్నపము.

## వైకుంఠ యేకాదశి - పుష్య శుద్ధ ఏకాదశి :

మార్గశిర శుక్ల ఏకాదశినాటికి ఊరు పర్యంతము మాత్రము కనబడు విష్ణునక్షత్రరూపము, మరొక మాసము నాటికి అనగా పుష్య శుక్ల ఏకాదశినాటికి ఆపాదమస్తకము, నఖశిఖపర్యంతము పూర్తిగా తొలిసారి సూర్యోదయాత్పూర్వము ఖగోళమున చూడనగును. ఆ పుణ్యదివసమున గ్రామగ్రామములలో, పేటపేటలలో గల వైష్ణ వాలయము లన్నింటిలో గొప్ప పూజలు, ఉత్సవములతో ఊరేగింపులు జరుగును. శ్రీరంగము, పండరీపురము లోనగు వైష్ణవ మహాక్షేత్రము లలో నాడు జరుగు భజనలు, ఉత్సవములు వర్ణనాతీతములై యుండును.

## భీష్మఏకాదశి :

పుష్య శుద్ధ ఏకాదశి పిమ్మట నొక నెలకు మాఘ శుక్ల ఏకాదశి రాగలదు. విష్ణుభక్తులలో ముఖ్యుడును, ధనిష్టనక్షత్ర దేవతలైన అష్ట వసువులలో నొకడును నగు భీష్ముడు పరమపదము నొందిన పుణ్యదివస మిది. భీష్ముడు కౌరవపాండవుల కిరువురకును పితామహుడు మధ్య వచ్చిన పురుషత్వముగల శిఖండిచే స్పృశింపించి యర్జునుడు ఘోరాస్త్ర ముల ప్రయోగించి యీ దేవవ్రతుని పడవైచెను ఉత్తరాయణ పుణ్య కాలము వచ్చువఱకు నా మహానుభావుడు అంపశయ్యపై నుండి పిమ్మట దేహము చాలించెను. ఆ దేవవ్రతుడు పరమపదము చేరిన పుణ్యదివస మీ యేకాదశి.

## ఫాల్గుణ శుక్ల ఏకాదశి, చైత్ర శుక్ల ఏకాదశి :

ఫాల్గుణ శుక్ల ఏకాదశినాటికి అర్ధరాత్రమునకే శ్రీ విష్ణు నక్షత్రములు ఉదయింపగలవు. విష్ణుమూర్తి పుట్టి పెద్దవాడైనాడు ; వివాహయోగ్య వయస్సు వచ్చినదని పండితపామరులు అనేక దేవాల యములలో దేవునికి కల్యాణమహోత్సవము గావింతురు. శ్రీ కూర్మము,

వాడపల్లి, ఉపమాక మొదలగు ననేక పుణ్యక్షేత్రములలో స్వామి కల్యాణము శ్రీ ఫాల్గుణ శుక్ల ఏకాదశినాడు చేయుదురు.

మరొక మాసము గడచి చైత్రమాసము వచ్చునంతలో చైత్ర శుక్ల నవమి శ్రీరామనవమి; ఏకాదశినా డనేక స్థలములలో సీతా కల్యాణమహోత్సవము జరిపింతురు.

## వైశాఖము, మాధవమాసము :

మాధవు డనగా లక్ష్మీపతి. విష్ణుదేవుడు శ్రీ మహాలక్ష్మికి భర్త గావున మాధవు డనబడుచున్నాడు. ఈ మాసములో సూర్యాస్తమాన మైనది మొదలు, సూర్యోదయ మగువరకు రాత్రియెల్ల శ్రీ మహా విష్ణు సందర్శనము లభించుటచేత నిది మాధవమాసమన నొప్పుచున్నది.

## రాధే విశాఖే :

మఱియు విశాఖా నక్షత్రమునకు రాధ యను పేరుకూడ కలదు. రాధా నక్షత్రముతో కూడిన పున్నమ కలదగుటచేత వైశాఖమునకు రాధామాసమని కూడ నామము కలదు. శ్రీకృష్ణ పరమాత్మ రాత్రి యెల్ల రాధతో గడపు మాస మిది. రాధ జీవాత్మ; శ్రీకృష్ణుడు పరమాత్మ. రాధాకృష్ణుల ప్రణయము జీవాత్మ పరమాత్మల సంయోగ మని భావించు భక్తులు కొంద రున్నారు. వైశాఖమునకు ఆరు మాసముల వాడు కార్తికమాస మగును; ఆ మాసములో సూర్యోదయా త్పూర్వము విష్ణునక్షత్రము ఉదయించుటకు ముందే విశాఖా నక్షత్రము ఉదయమగును. సూర్యోదయ వేళకు విష్ణుమూర్తి రాధా నక్షత్రముతో కూడియుండును గాన భక్తులు కార్తికములో రాధా సమేత కార్తిక దామోదరుని ధ్యానించి, అర్ఘ్యపాద్యము లిచ్చి పూజలుచేయుదురు.

## వైశాఖ శుక్ల తృతీయ - అక్షయ తృతీయ :

ఈ మాసారంభము నుండి సూర్యాస్తమయమైన పిదప తొలి జాములోపలనే తూర్పున విష్ణుభగవానుడు ఉదయించుటయు, పడమట ద్రుఘణమని వేదములో పేర్కొనబడిన దుడ్డువంటి గదాధారి యగు రక్కసు డొకడు అస్తమించుటయు ఖగోళమున చూడనగును. ద్రుఘణధారి వృత్రుడని వేదము తెలుపుచున్నది. పిమ్మటి పురాణములలో నీ రక్కసుడు హిరణ్యాక్షుడనియు, గదాయుద్ధమున విష్ణుని పార్శ్వము పగిల్చెననియు గలదు. సింహాచల యజ్ఞ వరాహ నృసింహ మూర్తి పార్శ్వమున నిప్పటికిని నాటి గదాఘాత ఫలితముగా రక్తము స్రవించుచున్నదనియు, రక్త స్రావ మాపుటకు చందనము ప్రతిదినము లేపనముచేయుదురనియు స్థలపురాణమున్నది. ఇట్లొక సంవత్సరము పోగుపడిన చందనమును ఈ తృతీయ దినమున త్రవ్వి ఏటేట గొప్ప ఉత్సవము చేయుదురు. ఆ సాయంకాలము ద్రుఘణధారి అస్తమించుటయు, విష్ణుభగవానుని అక్షయబల సామర్థ్యములు లోకమున ప్రదర్శితము లగుచుండ విష్ణు నక్షత్రములు జయప్రదముగా తూర్పు టాకాశమున నుదయమై మెఱయుటయు చూడనగును

## వైశాఖ శుక్ల సప్తమి - గంగావతరణము :

అక్షయ తృతీయతరువాత నాలుగు రోజులనాడు ప్రొద్దుగ్రుంకిన తరువాత తొలి జాములో విష్ణుపాదము నుండి ఆకాశగంగ ప్రభవించి, ధనురాకారమున పైకి లేచి పడమటకు వ్రాలునట్లు కనబడు నభోరంగమంతట ప్రవహించి, తుదకు పడమటకు వ్రాలిన రుద్రదైవత్యమైన ఆర్ద్రా నక్షత్రముపై నిలుచుట చూడనగును. గంగావతరణ కథలో ముఖ్యాంశములు రెండు. అందొకటి విష్ణుపాదమున జనించుట, రెండవది శివ జటాజూటమున నిలుచుట. ఈ రెండు విశేషములను ఒకేసారి మనము ఖగోళమున తిలకింపగలుగుట నీ సప్తమీదినమున సంభవించును.

"*అంబరగంగా మండితపాదు*"డగు శ్రీవిష్ణుభగవానుని పాదసముద్భవమై 'ఫేనోద్గమరుచులతో మింటఁబ్రవహించి, దివిజగంగ శివజటాజూటాగ్ర సీమ నిలచు దివ్యదృశ్యము ఈనాడే చూడనగును. అంతకుముందు దినములలో నీవేళకు విష్ణుపాద ముదయముగాదు; తరువాత దినము లలో ఆర్ద్ర అస్తమించును కావుననే ముఖ్యముగా నీసప్తమి గంగో త్పత్తి దినమగుచున్నది.

## జ్యేష్ఠశుక్ల ఏకాదశి :

జ్యేష్ఠమాసమున విష్ణుమూర్తి త్రివిక్రమునుగా పూజింపబడు చున్నాడు. "ఇదం విష్ణు ర్విచక్రమే । త్రేధా నిదధే పదం" అను వేద మంత్రార్థము స్పష్టమగునట్లు భగోళమున విష్ణుదర్శనమగు మాస మిది.

"ఏవం ప్రవర్తితం చక్రమ్" ఈ విధముగా ఈ చక్ర మిట్లు నడచుచుండును. ఈ తర్వాతవచ్చు నాషాఢశుక్ల యేకాదశి మరల శయన ఏకాదశి యగుచుండును. కాబట్టి ఈ చక్ర మనంతము.

## విష్ణుదేవుని స్తుతించు పద్యములు, శ్లోకములు :

శ్లో. సర్వత్ర సంస్థితం దేవం తం వందే పురుషోత్తమమ్.

శ్లో. జ్యోతీంషి విష్ణు ర్భువనాని విష్ణు ర్వనాని విష్ణుర్గిరయోదిశశ్చ ।
నద్యా స్సముద్రశ్చ స ఏవ సర్వం యదస్తి యన్నాస్తిచ విప్రవర్య॥

శా. ఉర్విన్విష్ణువు నీట విష్ణు వనిలవ్యోమాగ్నుల న్విష్ణువు న్,
దుర్వారుండగు నీ చరాచరములెందు న్విష్ణురూపంబులై
పర్వున్ మాటలు వేయునేల మదిలో భావించి వీక్షించినన్
సర్వం విష్ణుమయం జగత్తనుటయే సత్యంబు సుజ్ఞానికిన్.

శ్లో. వేదాశ్చోపనిషద్గణాశ్చ సతతాః సాంగాః పురాణాన్వితా
వేదాంతా అపి మంత్రతంత్ర సహితాః తర్కాస్స్మృతీనాం గణాః

కావ్యాలంకృతి గీతినాటకయుతా శ్శాస్త్రాశ్చ నానాగుణాః
శ్రీవిష్ణోర్గుణరాశికీర్తనపరా కుర్వంతు మే మంగళమ్.

శ్లో. విష్ణోరత్యుత్తమత్వా దఖిలగుణగణై స్తత్ర శక్తిం గరిష్ఠాం
సంశ్లిష్టే శ్రీధరాఖ్యామముమథ పరివారాత్మనా సేవకేషు
యస్సంధత్తే విరించి శ్వసన విహగపానంత రుద్రేంద్ర పూర్వే
స్వావధ్యాయం తారతమ్యం స్ఫుట మవతి సదా వాయుర
స్మద్గురుస్త్వం.

పరిసమాప్త వాక్యములు :

"మట్టిలో బుట్టి, మట్టిలో పెరిగి, మట్టిలోనగు మానవమాత్రుడా! ఏదీ? చూతము! ఒక్కసారి తలయెత్తి, జ్యోతిర్గోళ విరాజమానమైన విశాలాకాశమును తిలకింపుము! అన్వేషించి, నాక సామ్రాజ్యవైభవమును తెలిసికొనుము! జాగ్రతగా తేరిచూచి ఆనందించి ఆశ్చర్యపడుము! ఆ దివ్యదృశ్యము నారాధింపుము. ఏ విధముచేత చూచినను ఈ విశాల విశ్వనిర్మాత సర్వశక్తుడనిపించలేదా? జ్యోతిర్గోళ రూపములగు జ్వాలాక్షరములతో సర్వేశ్వరుని నామమంతటను తేజరిల్లుచున్నది! కనుగొంటివా?"— అని హేమన్నుసతి వ్రాసినది.

"భూమిపై పాదములానించి, తలయెత్తి నిర్మలము, నిశ్శబ్దము నతిగభీరమునగు నాకాశరంగమును పరిశీలించునపుడు మనల నా నభోరంగము మనోరంజకముగా నాకర్షించుకొనగలుగుచున్నది. ఆ యాకర్షణముతోపాటు మన మనస్సులందు భయభక్తులు చెలరేగి, అనితరసాధ్యమగు సంభ్రమముగూడ జనించుచున్నది. అనంతవైశాల్యశీలమైన విశ్వము స్వకీయమహత్త్వౌన్నత్యములతో దర్శనమిచ్చి మనల నద్భుతరసమగ్నులం జేయుచున్నది. పరమపదమును చేరుకొని, పరాత్పరుని సమ్ముఖమున నిలిచి, స్వహస్తములతో లిఖించి యాతడు

రచించి యుంచిన జ్యోతిర్వేద సంపుటము సమగ్రహస్తముతో విప్పి, ఒక్కొక్కటె మనకు చూపి అందిచ్చుచున్నట్లు భావింపనగుచున్నది. ఆ పరమపదమున నద్భుతతేజముతో వ్రాలు నా దేవదేవుని సన్నిధానము మనకు లభించునట్లు మహదానందభరితుల మగుచున్నాము" అని మాండరుదొర ఉగ్గడించెను.

"అతడు ప్రభువు; సర్వవ్యాపి; సర్వశక్తుడు; సర్వాంతర్యామి; సమస్తము నెఱిగిన ప్రోడ. గతము, ఆగతము కూడ ననంతములే యైనను, అతని మహాద్భుతదృష్టిలో నవి వర్తమానకాలముతో పాటు నిత్యము నతని యెట్టయెదుట చూపట్టుచున్నవి. అల్పమో, స్వల్పమో, పరమాణు ప్రయుతలేశమో! ముఖ్యమో! అముఖ్యమో! ఏమైనను ప్రతివిషయము యొక్క సంపూర్ణచరిత్రయు నా మహామహుని కెప్పుడును దృగ్గోచరమే! మఱియు ననంత మహిమాఢ్యమై, అపారశక్తి సంపన్నమగు నాతని మహాద్భుత చైతన్యము పరిపూర్ణమై, భూత భవిష్యద్వర్తమాన త్రికాలములందును ఉండియుండగల సమస్తమునకు వేదికయై యొప్పుచున్నది. ఆ సర్వాధికారి యాజ్ఞావశమై, అనంత మనంత గుణితమై శాశ్వతమై యలరుమగాక! ఇంతకంటె వ్రాయుటకు భాష చాలదు. నాకు శక్తియు చాలదు." నమోస్త్వనంతాయ అని నమస్కరించుచు సెలవు గైకొనుచున్నాను.

*

# పదానుక్రమణిక


అకేడియన్ 75
అగ్ని 60
అగ్ని దైవత్యము 40
అజరాశి 81-82
అజైకపాది 60
అత్రి 19
అదితి 60, 105
అధికమాసము 17, 18
అనంతపద్మనాభ చతుర్థి 202
అనూరాధ 60
అపభరణి 60
అపోలోనియస్ రోడ్సు 180
అభేదానందులు 102
అమావాస్య 59
అయాస్య ఋషి 18
అరిస్టాటిల్ 9
అర్జునుడు సందర్శించిన
విశ్వరూపము 181-188
అర్జుని 78
అల్లసాని పెద్దన 156
అలెన్‌బిరూ 190, 191
అవ్యక్తసంకులక్ష్మి 27
అర్యముడు 60
అశ్వయుజ మాసము 87
అశ్విని 87, 60
అశ్విని దేవతలు 47, 60
అస్సీరియన్ 75
అహిర్‌బుధ్న్య 60
అక్షయ తృతీయ 207
ఆకాశగంగ 22, 29
ఆకాశము 14
అవజలదైవత్యము 60
అర్క్యచూడని 60
అరియడ్న 180
ఆరుద్ర 25, 49-52, 60
అరెటస్ 110
అల్‌ఫెర్కా 180
అల్ఫాటిరియన్ 60
అల్ఫాటిరియన్ 60
అల్ఫాబూటిస్ 60
అలింగ్‌హాక్స్ 180
అరిశర్ 60
ఆశ్లేష 60
ఆషాఢమాసము 87
ఆషాఢశుక్ల ఏకాదశి 201
ఆషాఢా 87, 42
అంటారిస్ 60
ఇండియన్ ఎఫిమెరిస్ 96
ఇంద్రాగ్నులు 60
ఇంద్రుడు 21, 42, 60
ఈన్ 2
ఉత్తర ఖగోళ ప్రాముఖ్యము 15
ఉత్తరఫల్గుని 60
ఉత్తరాషాఢ 60

ఉప్పెన 42
ఋగ్వేదము 10, 25, 29
ఎక్రానికల్ రైజింగ్ 89
ఎక్లిప్టిక్ 85
ఎప్సిలాన్ లైరా 186
ఎస్సెలి 66
ఎంటేరిస్ 78
ఏకాదశలు 200
ఏడమ్ 2
ఏరిస్ 60
ఏంటెన్నా 157
ఐతరేయ బ్రాహ్మణ 105
ఓరియన్‌లోని లాంబ్డా 60
ఓరైయన్ 49
ఓవిడ్ 22
కన్యారాశి 60, 70-74
కర్కాటకము 87, 66-69
కర్కాటకమానము 28
క్రమ పరిణామ ఫలితము 4
కాప్రికారన్ 70
కార్ల్ జాన్ స్కై 157
కార్తికము 87
కార్తికశుక్ల చతుర్థి 208
కార్తికశుక్ల ఏకాదశి 208
కార్తె 88
కార్లైల్ 6
కాశీదాసు 24, 44
కాంతిచక్రము 14, 58, 76
కాంతివృత్తము 85
కిరీటమండలము 115
కుంకుమారుణము 50
కుంభరాశి 60, 82-84
కృత్తిక 87, 40, 60
కృశానుడు 48
కేన్సర్ రాశి 60
కేస్టరా 60
కోరోనాబోరియాలిస్ 129
కొలతలు 17
ఖగోళ ప్రదర్శనము 110
ఖగోళ విశిష్టత 6
ఖగోళ వేధ - తురీయము 18
ఖగోళ వేధ - వేదకాలము
ఖగోళ సంచారులు 8
గణితశాస్త్రాభివృద్ధి 16
గరుడి మండలము 115
గరుడి 109, 164-167
గరుత్మానుడు 166
గ్రహణములు 18
గంగావతరణము 26, 207
గంగోత్పత్తి 26
గుడ్లగూబ రూపము 28
గుంద్ర గుత్తులు 88
గ్రిఫిత్ 10
గ్రిమార్డి 98
గ్రీకులు 59
గెటి 168
గోబ్యంద మండలము 115
గోలోకము 167

ఘటి 82
చక్రము 16
చక్రాకృతి 28
చతుర్ముఖబ్రహ్మ 187
చతుర్వ్యూహములు 184
చాపము 16
చాల్డియనులు 59
చాంబర్సు జి. ఎఫ్ 189
చాంద్రమానము 17
చిత్ర 87, 60
చుక్కమబ్బులు 88
చుక్కల తళుకు 20
చైత్రమానము 87
చైత్రశుక్ల ఏకాదశి 205
జలప్రదాత వర్షుడు 82
జాతక మీమాంస 190
జాటాపిన్కమ్ 60
జెనిసిస్ 2
జేమ్సుగాలీ 125
జేమ్సు-జీన్సు, సర్ 3, 127, 176
జేమ్సు జెయిక్ 128
జ్యూపిటర్ 164
జ్యేష్ఠ 60
జ్యేష్ఠనక్షత్రము 21, 37, 42
జ్యేష్ఠమానము 37
జ్యేష్ఠ శుక్లఏకాదశి 208
జ్యోతిర్గోళము 24
జ్యోతిర్లోకము 32
జ్యోతిశ్చక్రము 95
జ్యోతిశ్శాస్త్రాభివృద్ధి 8
టారస్ 60
డింగిల్, డాక్టరు 188
డెనిబాలా 60
డెల్ఫినస్ 60
తమ్మిపూవెలిమబ్బు 188-186
త్వష్ట 60
తారాసముదయములు 84
తిలక్, బాలగంగాధర 40
తాన్‌వో 22
తురీయము 16, 18, 19
తురీయ యంత్రము 18
తులరాశి 59, 60, 74-77
తొలిపొడుపు 87, 88, 45
తైత్తిరీయ బ్రాహ్మణము 40
ద్వాదశరాశులు 61, 67
దినవారములు 57
డిన్ 195
దివిజగంగా ప్రవాహము 88
దీర్ఘతముడు 14, 15, 16
దేవ 195
దేవతల వాహనములు 52
దేవతా నృత్యము 190
ధ్వజములు 52
ధనుస్సురాశి 48, 80-81
ధనిష్ఠ 60, 167
ధనిష్ఠాత్మకము 115
ధూమధ్వజుడు 58
నన్నయ భట్టారకుడు 161

నభోరంగము 12
నక్షత్ర కథనగ్రంథము 189
నక్షత్ర గణములు 47
నక్షత్ర పరిణామములు 20
నక్షత్రములు 47
నక్షత్రములు పెద్ద
సూర్యగోళములు 20
నక్షత్రరూపనిర్ణయము 92-96
నక్షత్రోత్పత్తి 27
నందగోకులము 178
నాధాయనము 178
నానాఘాట్ శాసనము 189
నారాయణీయము 178-174
నీహారప్రాకృతతారలు 27
నీహారసదృశావస్థ 27
పరాశరుడు 14
పరివృత్తి 85
పంచాంగకర్తలు 4
పంచాంగములు 11
ప్లంకెట్ 11, 46, 55
ప్రజాపతి 60
ప్రతిస్పర్థులు 48
ప్రస్కణ్వఋషి 14
పాలవెల్లి 22, 26
పాలసముద్రము 28
ప్రాచీన పంచాంగములు -
నక్షత్రసముదాయములు 11, 46
ప్లాస్కెట్ 184
పిడపర్తివారు 18
పితరులు 60
పిత్రులు - నైఋతి 60
పునర్వసు 60
పుష్యమాసము 87
పుష్యమి 87, 60
పుష్యశుద్ధ ఏకాదశి 205
పూర్వశాసనము 85
పూర్వాభాద్ర 60
పూర్వాషాఢా 60
పూషుడ్ 60
పెరియుడ్స్ 60
పెగసెస్ 85, 60
పేద్వభూశ్యము 85, 84-85
ప్రోశ్యాన్ 85, 60
పోలక్సు 60
పావమానం 78
ఫల్గునీ 87
ఫాల్గునము 87
ఫాల్గున శుక్ల ఏకాదశి 205
పై నామినా 110
బమ్మెరపోతరాజు 167
బలిచక్రవర్తి 105
బందరు ఉప్పెన 62
బాదరాయణులు 87
బిలాట్రిక్సు 60
బీటల్జూ 60
బూటీస్ 85
బృహజ్జాతకము 82
బృహత్‌వృక్షము 115

బృహస్పతి 60
బృందావనము 198
బెన్నగరు శావనము 189
బెంట్లాదార 75
బేల్ దార 111
బైబిల్ 2
బైబిల్ ప్రమాణము - భూమివయస్సు 8
బైరన్ 9
బ్రౌనుదొర 111
భరణి - అపభరణి 60
భండార్కరు, డాక్టర్ 189
భాద్రపద 87
భాద్రపదమాసము 87
భాస్కరాచార్యులు 16, 18
భీష్మఏకాదశి 205
భీష్ముడు 116
భూకేశ మండలము 115
భూకేశుడు 85
భూమి ఏనాటిది 1-5
భూమి వయస్సు - బైబిలు 8
భోగి కంకణుడు 25
మకర రాశి 81-82
మకుటము 129
మఘ 87, 60, 78
మధుమతీక మండలము 115
మన భూమి పుట్టుపూర్వోత్తరాదులు 80
మన్మథుడు 42
మహోబలుడు 41
మాక్సుముల్లర్ 10, 59
మాఘమాసము 87
మాధవమాసము 200
మాయామృగము 21
మార్గశిరము 88
మార్గశిర శుక్ల ఏకాదశి 208
మారుతస్య వేధనః 116
మాండరు 59, 125, 210
మిథునము 87, 65
మిథునరాశి 58
మిస్టీరియస్ యూనివర్సు 176
మింటిరత్నములు 5-6
మింటిరోడ 157
మీనరాశి 85-86
మూన్ 17
మూలం 42, 60
మృగశిర 87, 42, 44, 60
మృగశిరస్కుడు 21
మెక్డోనాల్డు 195
మెస్సయ్యర్ 115
మేక్మిలన్ 80, 141
మేఘసందేశము 44
మేధాతిథి 20
మేషము 87, 61
మేషాదిరాసులు 11, 64
మేషారూఢుడు 58
యూడోక్సస్ 110
రవీంద్రకవిచంద్రుడు 168

రాజధాని 96-98
రాజహంస మండలము 115, 159-164
రాధే విశాఖే 206
రామకృష్ణ, ఎమ్. వి. 167
రాస్ 188
రాసలీల 191-194
రాశిచక్ర ప్రశంస 11
రాశివిజ్ఞానము 55
రుద్ర 60
రేఖాగణితము 16
రేవతి 60
రేవెలుగు 6
రోహిణి 60
రైరా 75, 77, 111
వరాహమిహిరుడు 82
వరుణపాశము 87
వరుణుడు 60
వర్జిల్ 75
వసువులు 60
వసుశిశువు 114
వామనుడు 105
వాయుదైవత్యము 41
వాసుదేవ శబ్దము 189
వినాయక చతుర్థి 90-93
విల్సన్ పర్వతాగ్రముపై టెలిస్కోపు 51
విలియమ్ జోన్సు 55
విలియమ్ హెరి 84
విశ్వచతుర్వివరములు 171
విశ్వదేవతలు 60
విశ్వమున గల గోళబాహుళ్యము 180
విశ్వశబ్ద వ్యాపనస్థానము 159, 171
విశ్వోత్పత్తి 140
విశ్వోత్పత్తి విజ్ఞాన 101
విశ్వోత్పత్తి - వ్యాకరణశిక్షా 178
విష్ణు 60
విష్ణుదేవతాకము 107-109
విష్ణునిగూర్చి ఋగ్వేదభావన 104
విష్ణు ప్రభావము 175
వీణాపాణి - సరస్వతి 144-149
వాణీమండలము 28, 115, 182
వుడ్‌వర్డుదార 187
వృశ్చికము 60
వృశ్చికరాశి 78-80
వృషభము 87
వృషభరాశి 54, 63-65
వేగా 158
వేదఋషుల అద్భుతశక్తులు 12
వేదఋషులు - మంత్రద్రష్టలు 12
వేదఋషులు - వైజ్ఞానికప్రతిభ 19
వేములవాడ భీమకవి 51
వేవెలుగు 5
వైకుంఠ ఏకాదశి 205
వైశాఖము 206
వైశాఖ శుక్ల తృతీయ 207
వైశాఖ శుక్ల సప్తమి 207

శతభిషమ్ 60
శ్రవణము 87, 60
శంఖాకృతి 28
శాకుంతలము 168
శ్యామశాస్త్రి 195
శ్రావణమాసము 87
శాస్త్రవిజ్ఞానము - కొలతలు 17
శ్రీకృష్ణ జన్మాష్టమి 169-171
శ్రీకృష్ణదేవరాయలు 156
శ్రీనాథ కవిసార్వభౌముడు 145
శ్రీపాదవారు 18
శుక్రగ్రహము 58
శునఃశ్శేపుడు 18
శేషమండలము 115, 121-124
సప్తఋషులు 89-90
సప్తపథి 106
సబ్బాతే 2
సరస్వతి 144-149
సర్ప 60
సర్పధారిమండలము 115, 125-126
సరికోణము 16
సాని 57
స్థాలీపులాకన్యాయము 18
సాయణవిద్యారణ్యులు 18
స్వాతి 41, 78
స్వామి కన్నుపిళ్ళై, యల్. డి. 96
సాంకేతికార్థము 19
సిగ్నల్ 24
సింహారాశి 69-70
సూర్య కుటుంబము 38, 149
సూర్య గోళములు 195-200
సూర్యనక్షత్ర సంగమము, కార్తె 88
స్టూతే 158
సోమ 60
సోలి 110
సైమన్ న్యూకూంచ్ 158
సౌరమానము 4
సౌర సంవత్సరము 17
హారికులేశుడు 85, 118
హస్త 60
హాంగ్స 24
హాంస 24, 109
హాంసక్షీరన్యాయము 24
హిమస్సుసతి 82
హెర్షల్, సర్ విలియమ్ 108
హెర్క్యులీస్ 85, 67, 112-114
హైయేడ్సు 60
క్షీరోదము 22, 28, 185-186, 198